

# మనిషి మార్క్సిజం

కె. బాలగోపాల్

PERSPECTIVES

# మనిషి మార్క్సిజం

కె. బాలగోపాల్

పర్‌స్పెక్టివ్స్

“శాశ్వతమయిన ‘మానవ ప్రవృత్తి’ అంటూ ఏదీ లేదని మార్క్సిస్టులు తరచుగా అంటూంటారు. ఈనాటి మార్క్సిస్టులే కాదు, మార్క్స్ కూడా స్వయంగా అన్నాడు. చాలా విషయాలలో భిన్నంగా కాకున్నా స్వంతంగా ఆలోచించిన ఆంటోనియో గ్రామ్‌సీ కూడా అన్నాడు. చారిత్రక క్రమంలో మానవ ప్రవృత్తిలో మార్పులు లేకుండా పోలేదు గానీ అంతమాత్రం చేత ‘మానవ ప్రవృత్తి’ అనేది ఆలోచించకుండా కొట్టి పారేయగల విషయం కాదు. భావవాద ఆలోచన నుండి పుట్టిన భ్రమ కాదు. శాశ్వతమయిన మానవ ప్రవృత్తి అనేదేదీ లేకపోయినా మానవ ప్రవృత్తిలో అన్ని సమాజాలలో అన్ని కాలాలలో బలంగా ఉండే కొన్ని లక్షణాలున్నాయి. అదట్లా ఉంచి మారుతున్న ఈ మానవ ప్రవృత్తికీ బయటి ప్రపంచంలో వచ్చే మార్పులకూ మధ్యనున్న సంబంధం సరళమయింది కాదు. సామాజిక వ్యవస్థలో మౌలికమయిన మార్పు వచ్చినప్పుడు దానికి తగినట్టు మానవ ప్రవృత్తి కూడా మారిపోతుందని భావించి, ఆ ప్రవృత్తి గురించి ఆలోచించనవసరం లేదని చారిత్రక భౌతికవాద సిద్ధాంతం ఇప్పటిదాకా చెప్తూ ఉంది. మార్క్సిస్టులందరికీ కాకున్నా కనీసం మార్క్సిస్టు సాహిత్యకారులకు ఇది నిజం కాదని తెలియదంటే నమ్మడం కష్టం. ఈ తాత్విక దృష్టిలోపం కారణంగా మార్క్సిజం చాలా నష్టపోయింది.”

“ఏ లక్ష్య సాధనకయినా క్రమశిక్షణ అవసరమే కానీ, తాము ఈ ప్రపంచాన్ని వివరించడానికి గీచిన నాలుగు గీతల మధ్య ఇమడని కొత్త విషయాలు ఎదురయినప్పుడు సిద్ధాంతవేత్తల మనసులను ఇబ్బంది పెట్టే అభద్రతా భావం నుండి పుట్టే అసహనాన్ని క్రమశిక్షణ పేరిట సమర్థించుకోవడం జరుగుతున్నదేమో గమనించకుండా ఆ వాదనకు ఆమోదం ఇవ్వడం పొరబాటు అవుతుంది.”

**- కె. బాలగోపాల్**

ప్రజాస్వామిక హక్కుల రంగంలో ఎనలేని కృషి చేసిన బాలగోపాల్, తత్వశాస్త్రం సాహిత్య రంగాలలో కూడా తన విశ్లేషణని మనకందించాడు. పాత ప్రశ్నలకు కొత్త జవాబులతో పాటు, కొత్త ప్రశ్నలు కూడా వేశాడు. ఒక మూసకి అలవాటు పడిన సమాజం ఆ ప్రశ్నలని, విశ్లేషణని తగిన స్ఫూర్తితో అందుకుని చర్చించలేకపోయింది. స్త్రీవాదం, దళితవాదం, మైనార్టీవాదం, విప్లవోద్యమం, మార్క్సిస్ట్ తత్వశాస్త్రం - ఇలా ఏ రంగం మీద ఆయన కొత్త వెలుగు ప్రసరించినా, ఆయా రంగాలలో ఆయన లేవనెత్తిన కొన్ని మౌలికమైన ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. నిత్య జీవితంలో, సామాజిక రంగంలో నిజాయితీ - నిబద్ధతలతో కూడిన ఆయన సామాన్య జీవితాన్ని ప్రశంసించినంతగా, బౌద్ధిక రంగంలో ఆయన కృషిపైన తగినంత చర్చ జరగకపోవడం తెలుగు సమాజపు వైఫల్యంగానే భావించాలేమో.

‘మనిషి-మార్క్సిజం’ మార్క్సిస్టు సిద్ధాంతంపై బాలగోపాల్ రాసిన వ్యాసాల సంకలనం. చర్చలలో భాగంగానో, ఎవరికో సమాధానంగానో రాసిన కొన్నిటిని మాత్రం ఇందులో చేర్చలేదు. ఆసక్తి ఉన్నవారు వాటిని బాలగోపాల్ వెబ్‌సైట్‌లో చదువుకోవచ్చు. మార్క్సిస్టు-లెనినిస్టు ఉద్యమ ఆచరణలోని మంచి చెడుల గురించి ఆయన రాసిన వ్యాసాలు మరో సంకలనంగా త్వరలో రానున్నాయి.

**ఆర్ కె**

**ప ర్ స్పె క్టి వ్స్**

*బాలగోపాల్ జననం - బళ్ళారి (కర్ణాటక)లో. తల్లి నాగమణి. తండ్రి కందాళ పార్థనాథశర్మ. జర్నలిస్ట్ వేమన వసంతలక్ష్మి జీవన సహచరి. చదివింది గణితశాస్త్రంలో ఎమ్.ఎస్‌సి, పిహెచ్.డి (ఆర్.ఇ.సి. వరంగల్), ఆ తరువాత 'లా'. నాలుగేళ్ళు కాకతీయ యూనివర్సిటీలో గణితశాస్త్ర అధ్యాపకుడుగా (1981-1985) ఉద్యోగం. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలోనూ (1981-1998), ఆ తర్వాత మానవ హక్కుల వేదికలోనూ (1998-2009) దాదాపు మూడు దశాబ్దాల క్రియాశీల కృషి. చాలాకాలం విరసం సభ్యుడు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో లాయర్‌గా పదకొండేళ్ళ ప్రాక్టీస్. అనేక స్వతంత్ర రచనలతో పాటు తెలుగు పత్రికలలో కాలమ్స్‌గా కూడా చాలా రాశారు. ఇంగ్లిషులో ఈ.పి.డబ్ల్యు, ఇంకా ఇతర మాగజైన్ల లోనూ వందలాది వ్యాసాలు రాశారు. బాలగోపాల్ పర్‌స్పెక్టివ్స్*

బాలగోపాల్ జననం: 10.06.1952 మరణం: 08.10.2009

బాలగోపాల్ రచనల కోసం : www.balagopal.org

# మనిషి మార్క్సిజం



కె. బాలగోపాల్

పర్‌స్పెక్టివ్స్
సామాజిక శాస్త్రం / సాహిత్యం
హైదరాబాద్
2012

ISBN-978-93-81172-02-5

ప్రచురణ సంఖ్య : **45**

ప్రథమ ముద్రణ : అక్టోబరు, 2012

ద్వితీయ ముద్రణ: డిసెంబరు, 2012

**మనిషి మార్క్సిజం**

(వ్యాసాలు)

**కె. బాలగోపాల్**

సోల్ డిస్ట్రిబ్యూటర్స్ :

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**

విజ్ఞాన్‌భవన్ - బ్యాంక్‌స్ట్రీట్,

హైదరాబాద్ - 500 001

ఫోన్ నెం. 040-24744580

పబ్లిషర్స్ :

**ప ర్ స్పె క్టి వ్స్**

సామాజిక శాస్త్రం / సాహిత్యం

ప్లాట్ నెం 305


ఇ.నెం. 2-2-647/182/ఎ3

హిమశివ అపార్ట్‌మెంట్స్

బాగ్ అంబర్‌పేట్

హైద్రాబాద్ - 500 013

**₹: 100/-**



ప్రింట్ సపోర్ట్ :

వేమన వసంతలక్ష్మి

మన్నం బ్రహ్మయ్య

కవర్ డిజైన్ :

చరిత

హైదరాబాద్

కంపోజింగ్ :

శ్రీశ్రీ గ్రాఫిక్స్

హైదరాబాద్

ముద్రణ :

చరిత ఇంప్రెషన్స్

ఆజామాబాద్,

హైదరాబాద్ - 500 020

# ప్రతిపాదన క్రమం


| | | |
|---|---|---|
| 1. | చైతన్యం లేని ప్రగతి సోషలిజానికి చేటు | *9* |
| 2. | చరిత్ర, మనిషి, మార్క్సిజం | *16* |
| 3. | మరణానంతర ఊహ | *29* |
| 4. | రాజ్యహింస గురించి ఇంకొంచెం ఆలోచిద్దాం | *40* |
| 5. | తాత్విక మానవతావాదం లేని మార్క్సిజం అపరిపూర్ణం | *56* |
| 6. | ముస్లిం ఐడెంటిటి - అభ్యుదయ రాజకీయాలు | *73* |
| 7. | ఆధునికాంతర వాదం నుంచి నేర్చుకోవలసింది ఆత్మవిమర్శ | *86* |
| 8. | కమ్యూనిస్టు మానిఫెస్టో : ఒక పునఃపరిశీలన | *98* |
| 9. | కొత్త ఉద్యమాలు - పాత సిద్ధాంతాలు | *118* |
| 10. | 'జన చైనా' స్వర్ణ ప్రస్థానం | *135* |
| 11. | పోస్ట్ మోడర్నిజం-వామపక్ష చైతన్యం | *140* |
| 12. | సమస్యల్లో పుట్టి...సందేహాల్లో మిగిలి | *148* |
| 13. | ఎరిక్ ఫ్రామ్ : మనిషిని మనిషిగా స్వీకరించే సోషలిజం | *154* |
| 14. | ప్రజాస్వామ్య పునాదులపైనే సోషలిజం! | *160* |
| 15. | ఫ్రాయిడ్ | *164* |


**అనుబంధం**


| | | |
|---|---|---|
| * | కె.వి. రమణారెడ్డి లేఖ | *166* |
| * | బాలగోపాల్ స్పందన | *168* |

# చైతన్యంలేని ప్రగతి సోషలిజానికి చేటు

తూర్పు యూరప్‌లోనూ సోవియట్ రష్యాలోనూ ఇటీవల వచ్చిన మార్పులను తేలికగా తీసిపారేయడం సులభమే; వాటిని అర్థం చేసుకుని గుణపాఠాలు తీసుకోవడమే కష్టం. సోషలిజం విఫలం అయిపోయిందని అంటున్న వాళ్ళకు ఆ అవసరం లేదు. వాళ్ళు సోషలిజం సాధ్యమని ఏనాడూ నమ్మలేదు. ఇప్పుడది విఫలం అయిందని వాళ్లు ప్రకటిస్తే దానిని ఒక కొత్త అభిప్రాయంగా భావించనవసరమూ లేదు. అయినా, సోషలిజం విఫలం అయిందని బాధపడే వాళ్ళ విమర్శను మార్క్సిస్టులు పట్టించుకోవాలిగానీ సంతోషించే వాళ్ళ అభిప్రాయాలతో మార్క్సిస్టులకేం పని?

బాధపడవలసిన అవసరం ఏమిటంటే, సోషలిజం విఫలం అయితే ఇక ప్రపంచంలో మిగిలింది పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక్కటే. ఇవి రెండూ కాక వేరే వ్యవస్థలు గతంలో ఉన్నాయి గానీ వాటికి కాలం చెల్లిపోయింది. ఇప్పుడు ఈ రెండింటిలో ఒకటి తప్ప వేరే ఏదీ సాధ్యం కాదు. కాబట్టి, సోషలిజం విఫలమయిందని అనేవాళ్ళు, ఇకపైన మనం ఎల్లకాలం పెట్టుబడిదారీ వ్యవస్థలో బతకడానికి సిద్ధంగా వున్నామా అన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలి. మనుషుల శ్రమను వ్యాపార సరుకుగా మార్చి ఆ సరుకుకు గిరాకీ తక్కువయినప్పుడల్లా కోట్లాది జనాన్ని నిరుద్యోగంలో పడేసే వ్యవస్థలో ఎల్లకాలం బతకడానికి సిద్ధంగా వున్నామా? మనుషుల శ్రమనే కాక, సకల జీవిత

అవసరాలనూ వ్యాపార సరుకులుగా మార్చి డబ్బున్నవాళ్ళ అవసరాలను మాత్రం తీర్చే వ్యవస్థలో కలకాలం బతకడానికి సిద్ధంగా వున్నామా? తన లాభార్జన కోసం మనకు లేని అవసరాలనూ అక్కరలేని కోరికలనూ కల్పించి మనిషిలోని అల్పత్వాన్ని అంతా బజార్లో పెట్టి దానిని సంతృప్తిపరచడం కోసం ప్రకృతిని ధ్వంసం చేసి మనకు ఆరోగ్యమూ మనశ్శాంతీ లేకుండా చేసే వ్యవస్థలో ఇక శాశ్వతంగా బతకదల్చుకున్నామా? స్వార్థాన్నీ అవినీతినీ అబద్ధాన్నీ ప్రకృతి సహజమయిన విషయాలుగా భావించి 'ఇది మానవనైజం' అనే నైరాశ్య తత్వాన్ని బోధించే వ్యవస్థలో ఎల్లకాలం బతకడానికి సిద్ధంగా వున్నామా? చివరికి కళను సహితం వ్యాపార సరుకుగా మార్చి మనుషుల బలహీనతలను రెచ్చగొట్టి డబ్బులు చేసుకునే సంస్కృతిని కలకాలం భరించడానికి సిద్ధంగా వున్నామా? స్త్రీలకూ పురుషులకూ, కూలివాళ్ళకూ మేధావులకూ, పట్టణాలకూ గ్రామాలకూ, మధ్య తరతరాలుగా వుంటూ వున్న అసమానతలను పోగొట్టే బదులు తన లాభార్జన కోసం కొత్త రూపాలలో పునరావృతం చేసే వ్యవస్థలో శాశ్వతంగా బతకదల్చుకున్నామా? అన్ని వస్తువులూ వ్యాపార సరుకులయిపోయిన వ్యవస్థలో మనుషులకు ఒంటరితనమూ ఆ ఒంటరితనానికీ మత్తుపదార్థాలూ మాదకద్రవ్యాలూ తప్ప వేరే పరిష్కారం చూపించలేని సమాజానిన ఎల్లకాలం భరించడానికి సిద్ధంగా వున్నామా?

ఈ ప్రశ్నలు ప్రతీ ఒక్కరూ తమకు తాము వేసుకొని సమాధానం చెప్పుకోవాలి. ఇట్లా బ్రతకడానికి సిద్ధంగా లేమని సమాధానం చెప్పుకునేటట్టయితే సోషలిజం విఫలం అయిందని కేరింతలు కొట్టడం మానేసి, అది ఎందుకు విఫలం అయిందో ఆలోచించి, తిరిగి సోషలిజాన్ని నిర్మించే ప్రయత్నం విజయవంతంగా చేయాలంటే ఏం చేయాలో ఆలోచించాలి. బోల్షివిక్ విప్లవం జరిగి 70 ఏళ్ళు దాటింది. తూర్పు యూరప్‌లోనూ చైనాలోనూ సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడి 40 ఏళ్లు దాటింది. ఈ ప్రభుత్వాలేవీ సోషలిజానికి ద్రోహం చేయాలనే లక్ష్యంతో ఏర్పడలేదు. సోషలిజం సాధించాలనే లక్ష్యంతోనే ఏర్పడ్డాయి. అయినా చివరికి అన్నీ విఫలం అయి పెట్టుబడిదారీ మార్కెట్ ఆధిపత్యానికీ రాజకీయ ఆధిపత్యానికీ దాసోహం అనే స్థితికి దిగజారాయి. గోర్బచెవ్ ఈ పతనాన్ని సిద్ధాంతీకరిస్తున్నాడు. ఈ చరిత్రను సమీక్షించుకొని ఎక్కడ తప్పు జరిగిందో గుర్తించాలి.

సమగ్రమయిన సమీక్ష చేయడానికి ఒక్క వ్యాసం సరిపోదు గానీ, రెండు ముఖ్యమయిన విషయాలు చెప్పాలి. మొదటిది ఆర్థిక వ్యూహానికి సంబంధించినది. రెండవది రాజకీయ నిర్మాణానికి సంబంధించినది. బోల్షివిక్ విప్లవం జరిగిన నాటికీ

రష్యా పారిశ్రామికంగా చాలా వెనకబడ్డ దేశం. ఆ దేశంలో వేగంగా పారిశ్రామిక ప్రగతిని సాధించడం అవసరం అని సోవియట్ కమ్యూనిస్టులు భావించారు. జల భౌతిక జీవితాన్ని ఆధునిక సాంకేతిక ప్రక్రియల ప్రాతిపదిక మీద పునర్నిర్మించాలని భావించారు. జోగీ జోగీ రాసుకుంటే రాలేది బూడిదేననీ, గరీబుగాళ్ళ సమానత్వం నిజమయిన సోషలిజం కాదనీ, సుఖవంతమయిన జీవితం గడపడానికి అవసరమైన ఆర్థిక ప్రగతిని సాధించాలనీ అనుకున్నారు. ఈ ఆర్థిక ప్రగతిని సాధించడానికి దేశంలోని భారీ పారిశ్రామికరంగాన్ని చాలా వేగంగా అభివృద్ధి చేశారు. అసాధారణమైన టోకు ఉత్పత్తి పెరుగుదల రేటును సాధించారు. వాడకపు వస్తువుల ఉత్పత్తిని తగ్గించి (తిండి, బట్టలు, ఇళ్ళు, గృహ పరికరాలు, రవాణా సాధనాలు వగైరా), భారీ యంత్రాల ఉత్పత్తి మీద కేంద్రీకరించారు. తూర్పు యూరప్ దేశాలలోనూ సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడిన తరువాత ఇదే జరిగింది. గనులు, ఇనుము, ఉక్కు కర్మాగారాలు, విద్యుదుత్పత్తి కేంద్రాలు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులను పెద్దఎత్తున నిర్మించారు. తూర్పు యూరప్ దేశాలలో యంత్రసామగ్రి ఉత్పత్తి 1950-60 దశాబ్దంలో సగటున 500 శాతం పెరిగింది. జాతీయ ఆదాయంలో పారిశ్రామిక రంగం వాటా 1950 నాటికి 50 శాతం లోపు ఉండింది. 1980 నాటికి ఇది కొన్నిదేశాలలో 80 శాతానికి, జెకస్లోవేకియా, తూర్పు జర్మనీ, పోలండ్ దేశాలలోనయితే 90 శాతానికి పెరిగింది.

ఇదంతా అవసరమే, ఎవరూ కాదనలేరు. అయితే క్రమంగా ఈ అవసరమే సోషలిజం లక్ష్యం అయికూర్చుంది. నూతన సమాజాన్నీ సామాజిక సమానత్వాన్నీ, ప్రజలు తమ జీవితాలను తామే శాసించుకునే సామాజిక వ్యవస్థను నిర్మించే ప్రయత్నం ప్రక్కకు పోయి, ఇంకింత వేగంగా మరింత వేగంగా ఉత్పత్తి రంగాన్ని ముందుకు తీసుకుపోవడమనేది ప్రధాన లక్ష్యం అయింది. అట్లంటే సమానత్వ సాధన కోసం ఏమీ చేయలేదని కాదు. అందరికీ చదువు చెప్పారు, వైద్య సదుపాయాలు కల్పించారు, స్త్రీలకు ఇంటి బయట ఉద్యోగాలు చేసే అవకాశాలు కల్పించారు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించారు సంస్కృతిలో మానవీయమయిన విలువలను ప్రోత్సహించారు.

అయినప్పటికీ, నూతన సమాజ నిర్మాణాన్ని ఆర్థిక పురోగమనంలో అంతర్భాగమయిన విషయంగా చూడకుండా, సుదూర భవిష్యత్తులో జరిగే ప్రయత్నంగానే భావిస్తూ, ప్రస్తుతానికి అమెరికా, జపాన్ వంటి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలను ఆర్థిక సాంకేతిక ప్రగతిలో అందుకోవడమే ముఖ్య లక్ష్యంగా

ప్రజల ముందు నిలబెట్టారు. ఇంక 15 ఏళ్ళలోనో, 20 ఏళ్ళలోనో అమెరికాను అందుకుంటాం అనేది ఈ ప్రభుత్వాలు ప్రజలకు ఇస్తూ వచ్చిన ముఖ్యమయిన వాగ్దానం. ఇప్పుడు పెరిస్త్రోయికా పేరుతో గోర్బచెవ్ ప్రవేశపెడుతున్న మార్పులలో భాగంగా ఈ తప్పుడు వైఖరి మరింత ప్రబలం అవుతూ వుంది. అమెరికాలో తలసరి ఎన్ని కార్లు వున్నాయి, ఎన్ని కంప్యూటర్లు ఉన్నాయి, రోజుకు ఎన్ని లీటర్ల పెట్రోలు తగలేస్తారు - మనం ఆ స్థాయిని ఎప్పుడు అందుకుంటాం అనేది ఈ దేశాలలో సోషలిజం విజయానికి గీటురాయి అయింది. సోషలిజం అంటే ఏమిటి అంటే అన్ని వ్యవస్థల కంటే వేగంగా ఆర్థిక అభివృద్ధిని సాధించే వ్యవస్థ అనే తప్పుడు నిర్వచనం ఇస్తూ వచ్చారు ఈ దేశాల పాలకులు.

ఈ లక్ష్యాన్ని సాధించడానికి కేంద్రీకృతంగా ప్రణాళికలు రచించి మూఢంగా అమలు చేశారు. ఏం ఉత్పత్తి చేయాలి, ఎంత ఉత్పత్తి చేయాలి, ఎక్కడ ఉత్పత్తి చేయాలి అనేది ప్రభుత్వం నిర్ణయిస్తుంది. కార్మికులూ రైతులూ కిమ్మనకుండా ఉత్పత్తి చేయాలి, సమ్మెలు చేయడానికి వీలులేదు, ఆందోళనలు చేపట్టడానికి వీలులేదు. నిరసన సహితం వ్యక్తం చేయడానికి వీలులేదు. ఇదంతా మీ మంచి కోసమే కాబట్టి నిర్బంధాన్ని నోరుమూసుకుని సహించండి అన్నారు. ఈ స్వేచ్ఛ మాత్రమే కాదు, తగుమాత్రం తిండి, బట్ట, ఇతర జీవిత అవసరాలు కూడా సరిగ్గా ఇవ్వకుండా పెట్టుబడిని విపరీతంగా భారీ పరిశ్రమలలో కేంద్రీకరించారు.

ఈ వైఖరిని మొదటి నుండీ విమర్శించిన కమ్యూనిస్టు నాయకుడు మావో ఉత్పత్తి సాధనాలనూ పరికరాలనూ మెరుగుపరచుకుంటూ పోవడమే ఆర్థిక ప్రగతికి మార్గం అనేది తప్పుడు సిద్ధాంతం అని మావో విమర్శించాడు. దానిని ఆయన 'ఉత్పత్తిశక్తుల సిద్ధాంతం' అన్నాడు. కార్మికుల చైతన్యాన్ని పెంచడం, సమానత్వాన్నీ స్వావలంబననూ పెంపొందించడం, ఉత్పత్తిక్రమంగా మీదా పునరుత్పత్తిక్రమం మీదా శ్రామికుల ఆధిపత్యాన్ని నెలకొల్పే ప్రయత్నాన్ని చేపట్టడం - ఈ చర్యలను ఆర్థిక ప్రగతికి కీలకంగా తీసుకోవాలని మావో భావించాడు. ఇవ్వాళ చైనాలోనే ఆ సిద్ధాంతాన్ని తిరస్కరించారు. తూర్పు యూరప్‌లోనూ సోవియట్ రష్యాలోనూ ఆ అవగాహన ఏ రోజూ లేదు. స్టాలిన్ కాలం నుండి ఈ రోజుదాకా ఆ దేశాలలో 'ఉత్పత్తి శక్తుల సిద్ధాంత'మే రాజ్యం చేస్తోంది.

ప్రజలలో చైతన్యాన్ని పెంచకుండా, సోషలిజం నిర్మిస్తున్నామనే భావన పెంపొందించకుండా ఆర్థిక ప్రగతిని వేగంగా సాధించాలని ప్రయత్నం చేయడం చాలా సమస్యలకు దారితీసింది. ప్రజలు తమ జీవితాలను తామే శాసించుకునే వ్యవస్థలో తమ అందరి భవిష్యత్తు కోసం, తమ సమాజం కోసం శ్రమ చేస్తారు.

త్యాగాలూ చేస్తారు. అది లేనప్పుడు ఎవరికి వారు స్వలాభం కోసమయినా పని చేయాలి, లేదా ఉద్యోగం పోతుందన్న భయంతోనయినా పని చేయాలి. పెట్టుబడిదారీ దేశాలలో చిన్న ఉత్పత్తిదారులు స్వలాభం కోసం శ్రమ చేస్తారు. కూలివాళ్ళూ కార్మికులూ పనిలోనుండి తీసేస్తారన్న భయంతో పనిచేస్తారు. సోషలిస్టు దేశాలలో ఉద్యోగ భద్రత కల్పించారు కాబట్టి భయం లేదు. (కూలివాళ్ళకు భయం లేకుండా పోయింది కాబట్టి ఉద్యోగ భద్రత ఇంతగా ఉండడానికి వీలు లేదనేది 'పెరిస్త్రోయికా' ప్రతిపాదనలలో ఒకటి!) స్వంత ఆస్తి ఎక్కువగా వుండదు కాబట్టి స్వలాభానికి అవకాశం తక్కువ. అందువల్లే సోషలిజంలో ప్రజల చైతన్యాన్ని పెంచడానికి కృషి చాలా అవసరం. నూతన సమాజ నిర్మాణాన్ని భవిష్యత్తుకు వాయిదా వేయకుండా మొదటి నుంచీ చేపట్టడం అవసరం. నూతన సమాజాన్ని నిర్మించే క్రమంలో విముక్తమయ్యే అపారమయిన చొరవ, ఉత్సాహం సోషలిస్టు ఉత్పత్తికి ప్రాతిపదిక కావాలి. అది జరగకపోతే ఉత్పత్తిలో అసమర్థత, వనరుల వ్యర్థ ప్రయోగం, నిపుణతలోనూ నాణ్యతలోనూ లోటు పెరిగిపోతాయి. తూర్పు యూరప్ దేశాలలోనూ సోవియట్ రష్యాలోనూ ఇదే జరిగింది. ఒక వస్తువును ఉత్పత్తి చేయడానికి పాశ్చాత్య దేశాలలో ఖర్చు అయ్యే పెట్టుబడి కంటే 50 శాతం ఎక్కువ సోవియట్ రష్యాలో ఖర్చు అవుతుందని అంచనా. పెట్టుబడి ఈ విధంగా చాలా వృథా కాసాగింది. గత 30 సంవత్సరాలుగా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ ఆధారంగా చాలా వేగంగా పురోగమిస్తూ వున్న పాశ్చాత్య పెట్టుబడిదారీ పారిశ్రామిక రంగాన్ని అందుకోవడం సోవియట్ రష్యాకూ తూర్పు యూరప్ దేశాలకూ చాలా కష్టం అయింది. ఈ సంక్షోభం నుండి బయటపడడానికి ఈ దేశాలు పెట్టుబడిదారీ పద్ధతులను అనుసరించడం మొదలుపెట్టాయి. స్వలాభాన్నీ ఆర్థిక ప్రోత్సాహాలనూ ఎరగా చూపించి కార్మికుల సామర్థ్యాన్నీ నిర్వహణా నైపుణ్యాన్నీ పెంచాలని చూశారు. భూమిని రైతులకు 'లీజుకు' ఇవ్వడం మొదలుపెట్టారు. పెట్టుబడిదారీ దేశాలలో దొరికే రకరకాల విలాస వస్తువులను తమ దేశాలలోనూ తయారు చేయడమో లేక దిగుమతి చేసుకొని అమ్మడమో మొదలుపెట్టారు. ఇవన్నీ 1965 తరువాత బాగా పెరిగాయి. 1970 తర్వాత పాశ్చాత్య దేశాలనుండి 'ఆధునీకరణ' పేరిట పెద్దఎత్తున పెట్టుబడినీ సాంకేతిక ప్రక్రియలనూ దిగుమతి చేసుకోవడం మొదలుపెట్టారు. తీవ్రంగా అప్పులలో పడ్డారు.

అయినప్పటికీ ఈ ప్రభుత్వాలు రాజకీయంగా ప్రజలతో సత్సంబంధాలు పెట్టుకొనివుంటే సమస్యను గట్టెక్కించేవేమో, అయితే ఆ పరిస్థితి మొదటినుండి

కూడా లేదు. క్రమంగా ప్రజాపునాదిని కోల్పోయారు. ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితిని గురించి ప్రజలకు ఎన్నడూ నిజం చెప్పలేదు. అప్పు ఎంతగా పెరిగిపోయిందీ చెప్పలేదు. సాంకేతిక పురోగతిని సాధించలేకపోతున్నాం అని ప్రజలముందు ఒప్పుకోలేదు. తాము శాస్త్రీయ సోషలిజాన్ని అమలు చేస్తున్నాం అని బింకంగా ఆత్మస్తుతి చేసుకోవడం మానలేదు. ప్రజలు చేతకానితనాన్నీ వైఫల్యాన్నీ క్షమిస్తారేమోగానీ అబద్ధాలనూ బూటకపు ప్రగల్భాలనూ క్షమించరు. దాంతో సోవియట్ రష్యా, తూర్పు యూరప్ ప్రభుత్వాలు తమ విశ్వసనీయతను పూర్తిగా పోగొట్టుకున్నాయి.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రభుత్వాలు సమస్యల పరిష్కారానికి రకరకాల తాయిలాలు ఇవ్వాలని చూశాయి. ఉన్నతమైన సోషలిస్టు చైతన్యం ద్వారా, నూతన సమాజాన్ని నిర్మించే క్రమంలో పెల్లుబికే ఉత్సాహం ద్వారా పరిష్కారం కావలసిన సమస్యలను ఆర్థిక ప్రోత్సాహకాలతో పరిష్కారం చేయాలని ప్రయత్నించారు. దీనివల్ల సోషలిస్టు చైతన్యం మరింత దెబ్బతిన్నది. మీ స్వార్థం కోసం తప్ప మీరు పనిచేయరు కాబట్టి మీకు డబ్బులిచ్చి పని చేయించుకుంటామని ఒకవైపు చెప్తూ, మళ్ళీ అంతలో సోషలిజం కోసం త్యాగం చెయ్యండి అని ప్రజలను అడగడంలోగల ఔచిత్యం ఏమిటో ఈ 'సోషలిస్టుల'కే తెలియాలి. ఒకనాడు సోవియట్ రష్యాలోనూ చైనాలోనూ నూతన సమాజాన్ని నిర్మించే ఉత్సాహంలో జనం రోజుకు ఒకపూట తిండి తిని లక్షల ఎకరాల బంజర్లను సాగులోకి తెచ్చారు. వేలాది చిన్న పరిశ్రమలను నిర్మించి ఇనుము, ఉక్కు తయారుచేసి చేతులు కాల్చుకున్నారు. రాత్రిళ్ళు స్కూళ్ళు నడిపి అందరినీ అక్షరాస్యుల్ని చేశారు. వైద్యులు మారుమూల గ్రామాలు తిరిగి వైద్య సౌకర్యాలు కల్పించారు. ఆ చైతన్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి స్వార్థానికీ స్వప్రయోజనానికీ పట్టంగట్టి 'అమెరికాను పదేళ్ళలో అందుకోవాలి' అనే మతిలేని ఆదర్శాన్ని సోషలిజం లక్ష్యంగా సిద్ధాంతీకరించి, ఇప్పుడు త్యాగం చేయండి అంటే జనం ఎందుకు సిద్ధపడతారు? విదేశీ అప్పులు తీర్చడం కోసం పోలండ్, రుమేనియా, హంగేరీ లాంటి దేశాలలో రొట్టె, మాంసం మొదలయిన నిత్యజీవిత అవసరాలను సహితం ఎగుమతి చేయడం మొదలుపెట్టారు. దానితో జనం తిరగబడ్డారు. ఆ త్యాగాన్ని పాలకులు కూడా పంచుకుంటే జనం కొంత ఊరట చెందేవారేమోగానీ ఈ దేశాల 'సోషలిస్టు' నేతలు చాలా సుఖాలకూ సౌకర్యాలకూ విలాసాలకూ అలవాటు పడ్డారు.

ఈ ప్రభుత్వాలన్నీ ప్రజలకు చాలా దూరం అయ్యాయన్నాము. 'ప్రజా స్వామ్యాన్ని' గురించి జరుగుతున్న చర్చలో ఇది చాలా ముఖ్యమయిన అంశం.

పాశ్చాత్య దేశాలలో నడుస్తున్న రాజకీయ వ్యవస్థే ఏకైక ప్రజాస్వామ్య రూపం అనే తప్పుడు ప్రచారం విస్తృతంగా జరుగుతూ వుంది. గోర్బచెవ్ దీనికి చాలా దోహదం చేస్తున్నాడు. కాని నిజానికి సోషలిస్టు నిర్మాణానికి అనుగుణ్యమైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఏ విధంగా వుండాలనే చర్చ ఇంకా కొనసాగించవలసి వుంది. ప్రజలు ఆ వ్యవస్థను తమదిగా భావించగలగాలి. దానితో 'మమేకం' కావాలి. నూతన సమాజాన్ని నిర్మించే చైతన్యాన్నే కాక స్వేచ్ఛను కూడా ఆ వ్యవస్థ ప్రజలకు కల్పించాలి. ప్రజల అభీష్టాలకు స్పందించాలి. ఆ అభీష్టాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రజలకు ఉండాలి. అదే సమయంలో వ్యవస్థ తిరోగామిశక్తుల మీద రాజీలేని పోరాటం చేయాలి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఈ లక్షణాలున్నాయని ఎవరు భ్రమించినా భారతదేశంలో బ్రతుకుతూ వున్నవాళ్ళం భ్రమించలేము. అయితే ఈ సోషలిస్టు రాజకీయ వ్యవస్థను ఆవిష్కరించే ప్రయత్నం చేయకుండా కమ్యూనిస్టు పార్టీ ఆధిపత్యమే ప్రజారాజ్యం అని సిద్ధాంతీకరించడం అన్ని సోషలిస్టు దేశాలలోనూ జరిగిన పొరపాటు. దానికి స్టాలిన్ కూడా దోహదం చేశాడని ఒప్పుకోవాలి.

ఈ నియంతృత్వం ఫలితంగా ప్రజలలో విపరీతమయిన నిరసన పేరుకు పోయింది. దానిని ఆసరా చేసుకుని గోర్బచెవ్ లాంటివాళ్ళు 'ప్రజాస్వామ్యం' పేరిట జనాన్ని ఆకట్టుకుంటున్నారు. సోషలిస్టు రాజకీయ వ్యవస్థకు అనుగుణ్యమయిన ఈ ప్రజాస్వామ్య రూపం ఏదన్న చర్చను పక్కకుపెట్టి పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే ఏకైక ప్రజాస్వామ్య రూపం అని ప్రచారం చేస్తున్నారు. ఆ ముసుగు కింద మౌలిక మయిన సోషలిస్టు సిద్ధాంతాలనే కాదంటున్నారు.

సోషలిజాన్ని నిర్మించే ప్రయత్నం మరొక అక్టోబర్ విప్లవంతో తిరిగి ప్రారంభం కావాలి. అయితే ఈ లోపల గత 70 సంవత్సరాల చరిత్రను మార్క్సిస్టులు నిజాయితీగా పునఃపరిశీలించాలి. ఆత్మవిమర్శ చేసుకోవాలి. అపరిష్కృతంగా ఉండి పోయిన సిద్ధాంత సమస్యలనూ నిర్మాణ సమస్యలనూ పరిష్కరించుకొని ముందుకు సాగాలి. ఇన్నాళ్ళూ చెప్పిన అనేక అబద్ధాలు ఇకనైనా చెప్పడం మానేయాలి. నిజం చెప్తే శత్రువుకు ఉపయోగపడుతుందేమోనని భయపడడం మానేసి నిజం చెప్పలేని సోషలిజం శాస్త్రీయ సోషలిజం కాజాలదని గుర్తించాలి.

ఉదయం దినపత్రిక
26, 27 జనవరి 1990

V

# చరిత్ర, మనిషి, మార్క్సిజం

కథా సాహిత్యానికి వస్తువెప్పుడూ 'మనిషే'. ఒక యుద్ధాన్ని గురించి, ఒక విద్యాలయాన్ని గురించి, ఒక ఆస్పత్రి గురించి రాసిన కథలూ, నవలలూ లేకపోలేదు. కానీ వాటంతటవి సాహిత్యం కాజాలవు. యుద్ధంలో మనుషుల గురించి, విద్యాలయంలో మనుషుల గురించి, ఆస్పత్రిలో మనుషుల గురించి సమర్థ వంతంగా రాసిందే సాహిత్యం కాగలదు. ఆ నేపథ్యం ఏదో ఒక నేపథ్యం కాక సామాజిక పరిణామంలో కీలక స్థానంలో ఉన్న చారిత్రక సందర్భం అయినప్పుడు అది నిలిచిపోయే సాహిత్యం కాగలదు.

ఆ నేపథ్యంలో అభ్యుదయం వైపు నిలబడేదే గొప్ప సాహిత్యంగా నిలిచి పోతుందని కూడా చెప్పగలిగితే బాగుండును. కానీ అది నిజం కాదు. లోతయిన ఏ చారిత్రక పరిణామమయినా అనేక ఆశలనూ ఆకాంక్షలనూ భయాలనూ మేల్కొలుపుతుంది. అప్పటివరకు పట్టించుకోని జీవిత విశేషాలపట్ల కుతూహలాన్ని మేల్కొలుపుతుంది. జీవితంపైన ఒక బలమైన సెర్చిలైట్ వేస్తుంది. ఆ మేల్కొలుపులో ఆశ కంటే భయమే ప్రధానమయినా - రెండింటి కంటె నిర్లిప్తమయిన కుతూహలమే ప్రధానమయినా - అది చీకటి కోణాలలో దాగి వున్న మానవ జీవిత విశేషాలపైన 'భళ్ళున' ఉదయించే ప్రభాత ప్రసారమే. నిస్తేజమయిన బతుకు చీకట్లలో చూడటానికి ఏమీ లేదనుకున్న కళ్ళకు అనేక కొత్త విషయాలను -

అవి నిజానికి పాతవే కావచ్చు - అది దివ్వెతో వెలిగించినట్టు చూపిస్తుంది. ఆ కొత్త వెలుగులో కనిపించే కొత్త భయాలు, కొత్త ఆశలు, కొత్త విషయాలు, కొత్తగా కనుగొన్న పాత విషయాలు గొప్ప సాహిత్యానికి కథావస్తువు.

'రవి అస్తమించని సామ్రాజ్యం'లో రవితేజం వెలిగించిన ప్రతీ అణువునూ తన స్వంత ఆస్తిగా పారవశ్యంతో వర్ణించిన కిప్లింగ్‌ను వలసదేశస్థులమయిన మనం ఒక వలసవాదిగా గుర్తించగలం. కొందరు ఆయనను శ్వేతజాతి దురహంకారి అని కూడా అన్నారు. కానీ ఆయన పారవశ్యంతో వెలిగించిన జీవిత విశేషాలను గొప్ప సాహిత్యం కాదనలేము. అటువంటి పారవశ్యానికి మనదయిన భౌతిక పునాది లోపించిన మనం వాటిని చూడలేకపోయామనీ, చూసినా పరవశించలేకపోయామనీ గుర్తించకుండా ఉండలేము.

పాశ్చాత్య దేశాల ప్రజాతంత్ర విప్లవం చరిత్రలోకి తీసుకొచ్చిన శాస్త్రీయ దృష్టికీ ప్రజాస్వామ్య రాజకీయాలకూ భయపడిన కలాలు గాభరాగా మేల్కొని జీవితంలోని సకల కోణాలనూ తమ భయానికి ఆలంబనగా పరికించి చూసి గొప్ప సాహిత్యాన్ని సృష్టించాయి. మార్క్స్ మెచ్చుకొన్న బాల్జాక్ నుండి, మానవ స్వభావంలో అభ్యుదయ కాముకులు గుర్తించడానికి భయపడే అగాధాలను అసాధారణ ప్రతిభతో - ప్రగతివాదుల పట్ల కచ్చతో - వెలికి తీసి వర్ణించిన డాస్తయెవ్‌స్కీ దాకా ఈ కోవకు చెందిన అగ్రగామి రచయితలు పాశ్చాత్య సాహిత్యంలో చాలామంది వున్నారు. సోమర్సెట్ మామ్‌కు స్త్రీల పట్ల చులకనభావం ఉందని తెలిసినప్పటికీ అతని రచనలను చదివి ఆనందించడానికి అదెందుకో ఆటంకం కాలేదని స్త్రీవాద అభిమాని అయిన రచయిత్రి ఒకరు ఈమధ్య అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజకీయ ఆర్థిక ప్రగతి పెరిగేకొద్దీ మనుషులలో పెరుగుతున్న యాంత్రికతనూ, ఒంటరితనాన్నీ మామ్ తన రచనలలో వర్ణించడమే కాదు, ఆయన రచనా శైలి ఆ లక్షణాలను ప్రత్యక్షంగా ప్రతిఫలిస్తుంది.

చరిత్ర ప్రవంతిలో మనిషి, మనిషి వ్యక్తిత్వంలో చరిత్ర, చరిత్రకు వ్యతిరేకంగా మనిషి, చరిత్రను నడుపుతున్న మనిషి, తన స్వంత ప్రయాణంలో చరిత్రనొక మజిలీ చేసుకున్న మనిషి, నిత్యం రగిలే తన కొలిమికి మనిషిని ఒక సమిధ చేసుకున్న చరిత్ర - ఇదీ కథా సాహిత్యానికీ నవలా సాహిత్యానికీ వస్తువు. దీనిని నిజాయితీగా స్వీకరిస్తే తప్ప గొప్ప సాహిత్యం సాధ్యం కాదు. నిజాయితీగా

స్వీకరించాలంటే చారిత్రక వాస్తవాలను వాస్తవాలుగా చూసే ధైర్యం అవసరం. ఆ వాస్తవాలలో మన మానసిక భద్రతనూ భౌతిక సుఖాన్నీ భంగపరచేవి తప్పక ఉంటాయి. కాబట్టి ఆ ధైర్యం మనిషికి సులభంగా అబ్బదు. అయితే దానితోబాటు మనిషిలోని చీకటి కోణాలనూ, మనిషికీ చరిత్రకూ మధ్యనున్న సంబంధంలోని ఎగుడు దిగుళ్ళనూ నిర్భయంగా స్వీకరించే ధైర్యమూ అవసరం. వీటిని స్వీకరిస్తే అభ్యుదయ రాజకీయ సంస్కృతిలోని అచారిత్రకమైన ఆశావాదం దెబ్బతింటుంది కాబట్టి ఈ ధైర్యం అబ్బడమూ కష్టమే. కొందరిలో అది లేక, కొందరిలో ఇది లేక తెలుగులో గొప్పదని చెప్పగల కాల్పనిక సాహిత్యం - ముఖ్యంగా నవలా సాహిత్యం - స్వల్పంగానే ఉండిపోయింది. ఇందులో మొదటి అవసరాన్నే తప్ప రెండవ అవసరాన్ని మార్క్సిస్టు సాహిత్య విమర్శ గుర్తించినట్టు కనిపించదు.

ఇది కేవలం సాహిత్య సృజనకూ, సాహిత్య విమర్శకూ సంబంధించిన లోపం అని భావించగల రోజులు బహుశా గడిచిపోయాయేమో. సోషలిజం, సమసమాజం అనే ఆదర్శాలే ఈ రోజు సంక్షోభంలో ఉన్నాయి. సోవియట్ రష్యా, చైనా తదితర దేశాలలో వచ్చిన రాజకీయ మార్పులకు పాక్షికమైన జవాబులు చెప్పి ఊరుకోకుండా సంక్షోభాన్ని సంక్షోభంగా స్వీకరించి చర్చిస్తే మార్క్సిస్టు అవగాహనలో ఉన్న కొన్ని ఖాళీలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. వీటిలో ప్రధానమయినవి మానవ ప్రవృత్తికీ సమసమాజ ఆదర్శానికీ మధ్యనున్న జవాబు దొరకని ప్రశ్నలు. మనిషిని చరిత్ర నిర్మాతగా మార్క్సిజం గుర్తించింది గానీ ఆ చరిత్రకూ దాని నిర్మాతకూ మధ్యనున్న సంబంధాన్ని వివరంగా ప్రతిపాదించలేదు. దానిలోని ఎగుడు దిగుళ్ళను గుర్తించలేదు. ఆ సంబంధం 'గతితార్కికం' అని ముందుజాగ్రత్తగా ప్రకటించి ఊరుకుంది. మనిషికీ బయటి ప్రపంచానికీ మధ్యనున్న ఏ సంబంధమయితే ప్రపంచవ్యాప్తంగా గొప్ప కాల్పనిక సాహిత్య వస్తువుకు మూలంగా ఉంటూ ఉందో ఆ సంబంధానికి చారిత్రక భౌతికవాద సిద్ధాంతంలో స్పష్టమయిన చోటు లేదు. క్రిస్టఫర్ కాడ్వెల్ రాసిన కాల్పనిక సాహిత్య విమర్శలో ఈ లోపం ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన మేధో సంపత్తి గురించి, కమ్యూనిస్టు ఆదర్శంపట్ల ఆయనకున్న నిబద్ధత గురించి, ఆచరణాత్మకమైన త్యాగశీలాన్ని గురించి అనుమానానికి ఆస్కారం లేదు. ఇన్ని ఉన్నా ఆయన సాహిత్య విమర్శ కొంత దూరం ముందుకు సాగి అగాధం అడ్డం వచ్చినట్టు ఆగిపోతుంది. అవతలికి అందుకోలేదు.

శాశ్వతమయిన 'మానవ ప్రవృత్తి' అంటూ ఏదీ లేదని మార్క్సిస్టులు తరచుగా అంటూంటారు. ఈనాటి మార్క్సిస్టులే కాదు, మార్క్స్ కూడా స్వయంగా అన్నాడు. చాలా విషయాలలో భిన్నంగా కాకున్నా స్వంతంగా ఆలోచించిన ఆంటోనియో గ్రామ్‌సీ కూడా అన్నాడు. చారిత్రక క్రమంలో మానవ ప్రవృత్తిలో మార్పులు లేకుండా పోలేదు గానీ అంతమాత్రం చేత 'మానవ ప్రవృత్తి' అనేది ఆలోచించకుండా కొట్టి పారేయగల విషయం కాదు. భావవాద ఆలోచన నుండి పుట్టిన భ్రమ కాదు. శాశ్వతమయిన మానవ ప్రవృత్తి అనేదేదీ లేకపోయినా మానవ ప్రవృత్తిలో అన్ని సమాజాలలో అన్ని కాలాలలో బలంగా ఉండే కొన్ని లక్షణాలున్నాయి. అదట్లా ఉంచి మారుతున్న ఈ మానవ ప్రవృత్తికీ బయటి ప్రపంచంలో వచ్చే మార్పులకూ మధ్యనున్న సంబంధం సరళమయింది కాదు. సామాజిక వ్యవస్థలో మౌలికమయిన మార్పు వచ్చినప్పుడు దానికి తగినట్టు మానవ ప్రవృత్తి కూడా మారిపోతుందని భావించి, ఆ ప్రవృత్తి గురించి ఆలోచించనవసరం లేదని చారిత్రక భౌతికవాద సిద్ధాంతం ఇప్పటిదాకా చెప్తూ ఉంది. మార్క్సిస్టులందరికీ కాకున్నా కనీసం మార్క్సిస్టు సాహిత్యకారులకు ఇది నిజం కాదని తెలియదంటే నమ్మడం కష్టం.

ఈ తాత్విక దృష్టిలోపం కారణంగా మార్క్సిజం చాలా నష్టపోయింది. ఉదాహరణకు మార్క్సిస్టులు సిగ్మండ్ ఫ్రాయిడ్‌ను అర్థం చేసుకోక ఆయన్ని మానవ అవసరాలలో సెక్స్‌కు అనవసరమైన ప్రాముఖ్యం ఇచ్చిన వ్యక్తిగా హేళన చేయడం నేర్చుకున్నారు. ప్రత్యక్ష పరిచయం అవసరం లేకుండా వినికిడి పాండిత్యం మీద కాలక్షేపం చేసే తెలుగుజాతి మేధావి వర్గం ఫ్రాయిడ్‌కు చాలా అన్యాయం చేసింది. వారిలోని మార్క్సిస్టులు తమ అవగాహనకు చాలా మేలు చేయగల ఫ్రాయిడ్ ఆలోచనలను తృణీకరించి తాము చాలా నష్టపోయారు. మానవ ప్రవృత్తికీ బయటి ప్రపంచానికీ మధ్యనున్న ఘర్షణకు ఫ్రాయిడ్ మనస్తత్వ శాస్త్ర సిద్ధాంతాలలో కేంద్ర స్థానం ఉంది. మనిషి వ్యక్తిత్వ వికాసానికీ వైఫల్యానికీ ఈ ఘర్షణే మూలం అని ఆయన నమ్మాడు. మానవ ప్రవృత్తిలోని మౌలిక అంశాలుగా ఆయన గుర్తించినవి తప్పు కావచ్చు. 'బయటి ప్రపంచం' అనే దానిని ఒక సామాజిక వ్యవస్థగా అర్థం చేసుకోలేకపోవడం ఆయనలోని లోపం కావచ్చు. కానీ ఆ రెండింటికీ మధ్యనున్న ఘర్షణకు ఆయన తన విశ్లేషణలో ఇచ్చిన కేంద్రస్థానం చారిత్రక భౌతికవాద దృక్పథానికి చాలా సన్నిహితమయినది. 'మనిషి'కీ చరిత్రకూ మధ్యనున్న సంకీర్ణమయిన సంబంధాన్ని వెలికి తీయడం, సూత్రీకరించడం ఈనాడు అవసరం.

ఆ సంబంధం 'గతితార్కికం' అని వివరణ లేకుండా ప్రకటించి ఊరుకుంటే సరిపోయే రోజులు గడిచిపోయాయి. ఈ అవసరాన్ని తీర్చడంలో మంచి సాహిత్యం - ముఖ్యంగా నవలా సాహిత్యం - గణనీయమయిన పాత్ర నిర్వహించగలదు.

'రాగో' నవలలోని తుపాకులనూ మందు పాతరలనూ పక్కన పెడితే, ఆదివాసీ స్త్రీల జీవన స్థితిగతుల గురించి చెప్పిన ఆసక్తికరమయిన విషయాలు ప్రధానంగా దృష్టిని ఆకర్షిస్తాయి. ఈనాటికీ 'ఆదిమ కమ్యూనిస్టు సమాజాన్ని' ఒక ఆదర్శవంతమయిన సమసమాజంగా వర్ణించేవారు, ఆదివాసీల జీవితాన్ని దానికి నమూనాగా భావించేవారు మార్క్సిస్టులలో చాలామందే ఉన్నారు కాబట్టి వాళ్ళంతా ఈ నవలను చదివితే మంచిది. అన్ని అనర్థాలూ స్వంత ఆస్తితోనే పుట్టాయని చాలామంది మార్క్సిస్టులు నమ్మే సూత్రీకరణను స్త్రీవాదులు కొంత కాలంగా సవాలు చేస్తున్నారు. స్త్రీపైన పురుషుడి పెత్తనం - స్త్రీ లైంగికత్వంపైన సమాజం పెత్తనం - స్వంత ఆస్తికంటే ముందే పుట్టిందనీ, దానికి మార్క్సిజం చెప్పగల జవాబేమీ లేదనీ స్త్రీవాదులు సోదాహరణంగా సవాలు చేస్తున్నారు. నిజానికి అన్ని అనర్థాలూ స్వంత ఆస్తితో పుట్టాయనేది చారిత్రక భౌతికవాదంలోని సూత్రం కాదు. కాలక్రమంలో దానిలోకి వచ్చి చేరిన అనేక వింత సంగతులలో అదొకటి. (స్వప్రయోజనం లేకుండ మనుషులు ఏ పనీ చేయరనీ, పాలకవర్గాలకు చెందిన వాళ్ళంతా చెడ్డవాళ్ళనీ చాలామంది మార్క్సిజం పేరుమీద నమ్ముతుంటారు). సమాజంలో ఏ ఆచారం ఎప్పుడు పుట్టినా, దానిలో గణనీయమైన మార్పు రావడం అంటూ జరిగితే అది ఉత్పత్తి వ్యవస్థలోని మార్పును ఆశ్రయించి వచ్చిందే తప్ప విడిగా రాలేదనేది మట్టుకు చారిత్రక భౌతికవాద సూత్రమే. చారిత్రక భౌతికవాదం సామాజిక జీవితంలోని మార్పుకు, పరిణామానికి, చరిత్రకు సంబంధించిన సిద్ధాంతం. దీనిని అభావం చేయగల ఉదాహరణలు చరిత్రలో ఉంటే అది మార్క్సిజానికి నిజమైన సవాలు అవుతుంది. అయినా మార్క్సిజం కాని మార్క్సిజాన్ని నమ్మేవాళ్ళు చాలామందే మనలో ఉన్నారు. కాబట్టి ఆదివాసీ స్త్రీల శరీరాలపైన, లైంగికత్వంపైన మగవాళ్ళకూ ఆదివాసీ సమాజానికీ ఉండే కఠోరమైన పెత్తనాన్ని కదిలించేటట్టు వర్ణించే ఈ నవల ఆ కారణంగా ఆహ్వానించదగ్గది.

కానీ మార్క్సిజం ప్రస్తుతం ఎదుర్కొంటూ ఉన్న సంక్షోభాన్ని గురించి కలత చెందే వారికి నవల అంతా చదివిన తరువాత ఒక ప్రశ్న మిగిలిపోతుంది. స్త్రీ

వ్యక్తిత్వంపైన ఆదివాసీ సమాజానికి ఉన్న పెత్తనం పట్ల నిరసనతో ఉద్యమంలోకి వచ్చి చేరిన రాగో చివరికి ఏమవుతుంది? ఇప్పటికే అనేక ప్రజా ఉద్యమాలలోకి వచ్చి చేరిన రాగోలంతా ఎక్కడున్నారు? రాగో ఉద్యమంలోకి రావడానికీ ఆ ఉద్యమం అంతిమ లక్ష్యాలకూ మధ్య ఏ మాత్రం సంబంధం ఉంది? ఈనాటి రాగో రేపటి రాగో కాదు. రేపటి రాగో మర్నాటి రాగో కాదు. చివరికి ఏ రాగో అంతిమ సామాజిక పరిణామానికి నాయకురాలవుతుంది? లేకపోతే అంతిమ సామాజిక పరిణామం అంటూ ఏదీ లేదా? ఒకరి తరువాత ఒకరు రాగోలు పుట్టి ఎదిగి నశించడం, ఆ క్రమంలో సమాజం మార్పు చెందుతూ అనంతంగా ముందుకు పోవడం...ఇదే చరిత్రా?

సోవియట్ రష్యా తదితర దేశాలలో కమ్యూనిస్టు పార్టీ అధికారానికి వచ్చిన తరువాత, సోషలిస్టు వ్యవస్థ చెక్కు చెదరకుండా ఉండడానికి ఒక వ్యూహం చేశారు. కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథం ఉన్న కమ్యూనిస్టు పార్టీ తప్ప వేరే పార్టీ ఏదీ దేశంలో లేకుండా చేశారు. ఆ పార్టీలోను, దేశ అధికార యంత్రాంగంలోను, విద్యా వైజ్ఞాన రంగాలలోను పైకి వచ్చి ఉన్నతస్థాయిని అలంకరించే అవకాశం కార్మిక రైతాంగ కుటుంబాలలో పుట్టిన వారికే ప్రధానంగా కల్పించారు. పాత బూర్జువా భూస్వామ్య కుటుంబాలలో పుట్టిన వారికి ఆ అవకాశం కష్టతరం చేశారు. పాలకపార్టీ కార్మికవర్గ పార్టీ అయి వుండి, పార్టీ యంత్రాంగం, మేధావి వర్గం, అధికార యంత్రాంగం కార్మిక రైతాంగ వర్గాలలో పుట్టిన వారితో నిండి ఉంటే, ఇంక సోషలిజానికి ఢోకా లేదనుకున్నారు. కానీ ఏం జరిగింది? పార్టీలోనూ అధికార యంత్రాంగంలోనూ విద్యా వైజ్ఞానిక రంగాలలోనూ పైకి ఎగబ్రాకిన కార్మిక రైతాంగ వర్గాల బిడ్డలు నియంతలయి దేశాన్ని కర్కశంగా పరిపాలించారు. చివరికి వాళ్ళు, వాళ్ళ బిడ్డలు సోషలిజం కంటె పెట్టుబడిదారీ విధానమే బాగుందని తిరోగమించారు. రివిజనిజమని పేరు పెట్టినా, సరళీకరణ అని మర్యాదగా పిలిచినా సోవియట్ రష్యా, చైనాలలో ఆ మార్పుకు పాల్పడింది పాత బూర్జువా భూస్వామ్య వర్గాల సంతతి కాదు; కార్మిక రైతాంగవర్గం సంతతే. ఎటొచ్చీ తిరోగమనానికి పాల్పడే నాటికి వాళ్ళు కార్మిక రైతాంగ వర్గంలో లేరు. విప్లవం పేరుమీద పైకి ఎగబ్రాకి దేశ పాలకులయ్యారు.

## మరి రాగో సంగతి

ఈ ప్రశ్న రాగో అనే వ్యక్తి గురించి కాదు. ఒక వ్యక్తి గురించి సూత్రీకరణ చేయడం అసాధ్యం, అనవసరం. జీవితాంతం కమ్యూనిస్టు ఆశయానికి కట్టుబడిన వ్యక్తులు అనేకులున్నారు. ఇంకా ఉండబోతారు. కానీ ఈ ప్రశ్న ప్రజాసమూహాల గురించి, సామాజిక వర్గాల గురించి, 'మనిషి' గురించి. ఒక ప్రజాసమూహం (సౌలభ్యం కోసం వర్గం అందాము) ఒక ఉద్యమంలోకి ఎందుకు వస్తుంది? ఏం కోరి వస్తుంది? తమలో అజ్ఞాతంగా ఉన్న ఆకాంక్షలను ఏ ఉద్యమం మేల్కొలిపితే ఆ ఉద్యమంలోకి పీడిత వర్గాలు పోతుంటాయి. అయితే ఆ ఉద్యమం లక్ష్యాలకూ, తమ కోర్కెలకూ ఏ మాత్రం సంబంధం ఉందో ఆ వర్గాలు ఆలోచించినట్టు కనిపించదు. నిజానికి తేడా ఉందని తొలిదశలో గమనించినట్టు కూడ కనిపించదు. స్త్రీలుగా తమ వ్యక్తిత్వాన్ని కించపరిచే గణ ఆచారాల పట్ల నిరసనతో రాగోవంటి ఆదివాసీ స్త్రీలు తమకు అందుబాట్లో ఉన్న ఏకైక తిరుగుబాటులో భాగమవుతారు. అంతకు మించి ఆ తిరుగుబాటు అంతిమ లక్ష్యాలతో వాళ్ళకు నిమిత్తం ఉందని అనాలోచితంగా అనుకోవడం భ్రమ కాదా? కానీ మనుషులలో పీడన పట్ల ఉండే పరిమితమైన నిరసన కూడా అపరిమితమైన ఆదర్శాలకు 'జనరలైజ్' అయినట్టు అనిపిస్తుంది. మానవ ప్రవృత్తిలోని సార్వజనీన లక్షణాలలో ఇదొకటి. ఇది ఆ భ్రమను రెండువైపులా కొన్నాళ్ళు సజీవంగా ఉంచుతుంది. తాము సమస్యగా గుర్తించి ఆందోళన చెందుతున్న విషయం పరిమితమైనదనీ, తాము భాగస్వాములయిన ఉద్యమం లక్ష్యాలు అపరిమితమైనవనీ ఆ స్త్రీలు వెంటనే గుర్తించరు. ఉద్యమం పురోగమన క్రమంలో ఆదివాసీ జీవితంలో కొంత మార్పు వచ్చి వికారమయిన కట్టుబాట్లు కొంత సరళమయిన తరువాత ఈ తేడా ప్రస్ఫుటం అవుతుంది. ఆ తరువాత రాగో అక్క చెల్లెళ్ళు ఎక్కడుంటారు?

అప్పటికి వారిలో కొంతమంది వ్యక్తులకు కమ్యూనిస్టు ఆదర్శం పట్ల విశ్వాసం బలపడి ఉద్యమంతోనే ఉండిపోవచ్చు. కానీ మనం వ్యక్తుల గురించి ఈ ప్రశ్న వేసుకోవడం లేదు. ప్రజాసమూహాల గురించి వేసుకుంటున్నాం. ఒక ప్రజా సమూహంగా రాగో అక్కచెల్లెళ్ళు ఎక్కడుంటారు? ఒకప్పుడు కమ్యూనిస్టు ఉద్యమం, సంఘ సంస్కరణ ఉద్యమం, కాంగ్రెస్ వారి జాతీయోద్యమం బలంగా ఉండిన కోస్తా ఆంధ్ర జిల్లాలలో ఈ రోజు రౌడీయిజం, కులతత్వం, బాబా భక్తి, అశ్లీల సంస్కృతి రాజ్యం చేస్తున్నాయని విమర్శిస్తుంటాం. దీనిని ఆ ఉద్యమాల వైఫల్యంగా

గుర్తిస్తున్నాం. ఇది వైఫల్యమే కానీ ఆ వైఫల్యం ఎక్కడుందో సరిగ్గా గుర్తిస్తున్నామా? ఒకనాడు తమ గొడుగు కిందికి వచ్చిన ప్రజానీకాన్ని శాశ్వతంగా ఆ గొడుగు కింద ఉంచుకోలేకపోవడాన్ని వైఫల్యం అంటున్నామా? ఇది వాస్తవికమైన విమర్శేనా? ఆనాడు ఆ ప్రజానీకం ఏం కోరి ఆ ఉద్యమాలలోకి వచ్చారో, ఏ మేల్కొలుపు, ఏ వ్యక్తిత్వ వికాసం, ఏ ఆకాంక్ష వాళ్ళను ఆ ఉద్యమాలలోకి తీసుకువెళ్ళిందో. ఆ మేల్కొలుపుకూ ఆ మేల్కొలుపు కల్గించిన ఉద్యమ అంతిమ లక్ష్యాలకూ ఉన్న సంబంధం ఏపాటిదో - ఈ విషయాలు ఆలోచించలేకపోవడాన్ని వైఫల్యం అంటున్నామా? అయితే ఆ వైఫల్యం ఈనాటికీ కొనసాగడం లేదా? మొదట కమ్యూనిస్టు ఉద్యమంవైపు ఆకర్షితులయింది మధ్యతరగతి శూద్ర అగ్రకుల రైతాంగం అనీ, వారికి కమ్యూనిజంతో ఉన్న అవసరం పరిమితమేననీ గుర్తించి, ఆ వర్గాన్ని అధిగమించి అట్టడుగు వర్గాలలోకి కమ్యూనిస్టు పార్టీ పురోగమించలేక పోవడం కమ్యూనిస్టు ఉద్యమ వైఫల్యం అనుకుంటే - ఆ అట్టడుగు వర్గాలలో కూడ కూలిరేట్లు పెరిగి, కొందరికి కొంత భూమి దొరికి, అంటరానితనం పోయి, కొందరికి ఉద్యోగాలు దొరికిన తరువాత కనీసం ఆ వర్గంలోని అగ్రగామి విభాగమైనా కమ్యూనిస్టులను కాదని కాంగ్రెస్ వైపు, బాబాల వైపు, సినిమాల వైపు ఆకర్షితులు కారని నమ్మడానికి ఆధారాలున్నాయా? కోస్తా ఆంధ్ర జిల్లాలలో ఆనాడు కమ్యూనిస్టు పార్టీకి అట్టడుగు వర్గాలలో పునాది ఉన్నచోట ఇదే జరగలేదా? దీనిని కమ్యూనిస్టు వైఫల్యంగా గానీ ఆ వర్గాల స్వార్థంగా గానీ అర్థం చేసుకోవలసిన అవసరం లేదు. చరిత్ర పరిణామక్రమంలో సహజమైన విషయంగా అర్థం చేసుకోవడం సబబుగా ఉంటుంది. సామాజిక మానవ ప్రవృత్తికీ చరిత్రకూ మధ్యనున్న సంబంధం గురించి మనం లోతయిన అవగాహన పెంపొందించుకోనంత కాలం - అసలు ఆ విషయాన్ని గురించి అవగాహన అవసరం అని గుర్తించనంత కాలం - ఈ విషయం మనకు అర్థం కాదు. 'మనిషి'ని గురించి కొన్ని పడికట్టు సూత్రాలు జేబులో పెట్టుకొని ఎదురయిన ప్రతీ ప్రశ్నకూ రెడీమేడ్ జవాబులు చెప్తూ ఉంటాం.

తమకు కొన్ని కనీస హక్కులు కావాలనీ తక్షణ పీడన తొలగిపోవాలనీ కోరుకోవడం మానవ సహజమైన లక్షణం. అయితే మొత్తంగా సమాజాన్ని విముక్తం చేయకుండ తనమీద ఉన్న పీడనను కొంతయినా సరళతరం చేసుకోలేని వర్గం సమాజంలో ఏదీ లేదు. సమాజాన్ని మొత్తంగా విముక్తం చేయాలనే రాజకీయ విలువకు మట్టుకు సామాజిక చైతన్యంలో కొంత స్థానం ఉంటుంది. వ్యక్తులు ఒక్కొక్కమేరకు దీనిని విశ్వసిస్తారు. ఈ విశ్వాసాన్ని - చైతన్యవంతమైన ఆకాంక్షను

- ఉద్యమాలూ పోరాటాలూ పెంచుతాయి. ఆ చైతన్యం సమాజంలో బలమైన స్థాయికి చేరుకున్నప్పుడు విముక్తి సాధ్యం అవుతుంది. ఏదో ఒక సామాజిక వర్గానికి చైతన్యం స్వాభావికంగా ఉంటుందనుకోవడం వట్టి భ్రమ. మానవ ప్రవృత్తిలోని పరిమితులను (అల్పత్వమనండి, అల్పసంతోషమనండి) అధిగమించే మానవ వర్గాల 'ప్రవృత్తి' ఒకటి ఉందనుకోవడం భ్రమ. సమసమాజాన్ని భౌతిక జీవిత శక్తుల పరిణతితో చారిత్రకంగా ముడిపడి ఉన్న చైతన్యవంతమైన ఆకాంక్షగా కాక భౌతిక పరిస్థితుల నుండి కొన్ని వర్గాలలో అనివార్యంగా పుట్టే అసంకల్పితమయిన ఆకాంక్షగా అర్థం చేసుకోవడం మార్క్సిజం కాలక్రమంలో మొరటు బారడానికి గల అనేక కారణాలలో ఒకటి.

కార్మికవర్గం శ్రమ దోపిడీ నుండి పూర్తి విముక్తి సాధించాలంటే మొత్తంగా సమాజాన్ని విముక్తి చేయాలని మార్క్స్ భావించాడు. కానీ మొత్తంగా శ్రమ దోపిడీ నుండి విముక్తమయ్యేంత వరకు కమ్యూనిస్టు ఉద్యమాన్ని కార్మికవర్గం అంటి పెట్టుకొని ఉండడం లేదు. దోపిడీ 'భరించదగ్గ' స్థాయికి చేరుకున్నాక కార్మికవర్గం లోని ఒక్కొక్క విభాగం దూరమవుతూ ఉంది. కొందరు వ్యక్తులు మట్టుకే మిగులు తున్నారు. కొంచెం కూడ భరించదగ్గ స్థాయికి దోపిడీని సరళతరం చేయలేని దుస్థితిలో పెట్టుబడిదారీ వ్యవస్థ శాశ్వతంగా ఉండదు. సంక్షుభిత సమయాలలో మట్టుకే వుంటుంది. కార్మిక శ్రమదోపిడీకే కాదు. ఇది అన్ని రకాల అణచివేతకూ వర్తిస్తుంది. రాగో వంటి ఆదివాసీ స్త్రీలు, రాగో తండ్రి వంటి ఆదివాసీ రైతులు తమ జీవితాలను కొంత 'భరించదగ్గ' స్థాయికి మెరుగుపరచుకోవడానికి మొత్తంగా సమాజాన్ని అన్ని రకాల అణచివేత నుండి విముక్తం చేయవలసిన అవసరమేమీ లేదు. 'భరించదగ్గ' స్థాయిలో అంతో ఇంతో సంతృప్తి చెందకుండా పూర్తి సమసమాజ స్థాపన కోసం తపనపడే ప్రజాసమూహం - వ్యక్తులు వేరే సంగతి - సమాజంలో ఏదీ లేదు.

సమాజం పొరలలో క్రిందికి పోయేకొద్దీ సంపూర్ణ సమసమాజ ధ్యేయం కోసం తన భౌతిక జీవిత పరిస్థితుల వల్ల చివరిదాకా తప్పనిసరిగా పోరాడే ప్రజా సమూహం - వర్గం గానీ కులం గానీ మరొకటి గానీ - ఉందనే ఆలోచన విడిచిపెట్టి సమసమాజ స్థాపన గురించి కొత్తగా ఆలోచించాలి. సమసమాజ ధ్యేయం మనుషులు చైతన్యవంతంగా ఎంచుకునే రాజకీయ లక్ష్యమే తప్ప అణచివేత నుండి అనివార్యంగా పుట్టే కాంక్ష కాదు. అణచివేతకు గురయ్యేవారు తమకు

సమానత్వం కావాలని కోరుకుంటారు. కానీ అందరికీ సమానత్వం కావాలని కోరుకుంటారన్న నమ్మకమేమీ లేదు. తాము అసమానత ఫలితాన్ని అనుభవిస్తున్నారు కాబట్టి ఇతరుల సమానత్వ ఆకాంక్షను కొంచెం సులభంగా అర్థం చేసుకుంటారని ఆశించవచ్చు. అంతవరకు తప్పులేదు. కానీ దానిలో అనివార్యత ఏమీ లేదు. 'బానిస సంకెళ్ళు తప్ప' వేరే ఏమీ లేనివాళ్ళు తమకు ఆ సంకెళ్ళ నుండి విముక్తి కావాలని కోరుకుంటారు గానీ అందరికీ అన్ని సంకెళ్ళ నుండీ విముక్తి కావాలని కోరుకుంటారన్న నమ్మకం లేదు. అది చైతన్యవంతంగా ఎంచుకునే రాజకీయ విలువే తప్ప ఒకరి 'వర్గ స్వభావం' కాదు. పేద మగవాళ్ళు కూడ భార్యలను హింసిస్తారనీ, కార్మికులు కూడ హిందూ ముస్లిం ఘర్షణలలో పాల్గొంటారనీ, ఆదివాసులు కూడ మాల మాదిగలను అంటరానివారిగా చూస్తారనీ, దళితులు కూడా బాబ్రీ మసీదు విధ్వంసానికి అయోధ్య వెళ్ళారనీ తెలిసినప్పుడు మనం ఆశ్చర్యపోనవసరం లేదు.

ఒకవేళ అణచివేతకు గురయ్యే ప్రజలలో అన్ని రకాల అణచివేత పట్ల వ్యతిరేకత సహజంగానే పుడుతుందని నమ్మినా - అటువంటి ఒక ప్రజా సమూహాన్ని సమాజంలో వెతికి గుర్తించగలిగినా - అదే సమసమాజ లక్ష్యానికి దారితీస్తుందన్న నమ్మకం లేదు. దానికిది తార్కిక ఫలితం కాదు! సమసమాజం అంటే అణచివేత లేని సమాజం మట్టుకే కాదు. సమష్టి సహజీవనం ప్రాతిపదిక మీద నడిచే సమాజం. అణచివేత పట్ల సంపూర్ణమైన వ్యతిరేకత ఏదో ఒక వర్గానికి తన భౌతిక జీవిత పరిస్థితుల కారణంగా అనివార్యంగా కలుగుతుందనుకున్నా, సమష్టి సహజీవనం అనే విలువ అటువంటిది కాదు. అది ప్రయత్నపూర్వకంగా ఏర్పరచుకునే రాజకీయ విలువ. దానికి పీడిత ప్రజలు పీడకులపైన పోరాటాలు చేస్తే సరిపోదు. ప్రతి ఒక్క వ్యక్తి తన మీద తాను చాలా పోరాటం చేయవలసి ఉంటుంది. ఇప్పటివరకు అటువంటిదొకటి ఉందని కూడ మార్క్సిస్టులు ఒప్పుకోని 'మానవ ప్రవృత్తి'పైన చాలా పోరాటం చేయవలసి ఉంటుంది.

కార్మికులు సమసమాజాన్ని స్వాభావికంగానే కోరుకుంటారని మార్క్స్ నిజంగా నమ్మాడా అన్న ప్రశ్న వేయవచ్చు. 'పేదవాళ్ళంతా మంచి వాళ్ళు - డబ్బున్నవాళ్ళే దుర్మార్గులు' అనే సెంటిమెంటల్ భావన ఆ రోజులలో యూరప్‌లోని సామ్యవాదులలో బలంగా ఉండేది. మార్క్స్‌కు ఈ రకమయిన సెంటిమెంట్లంటే చాలా అసహ్యం. ప్రౌధన్ వంటి వాళ్ళను ఈ కారణంగానే గట్టిగా దుయ్యబట్టాడు. అయితే శ్రమదోపిడీ నుండి సంపూర్ణంగా కార్మికులు విముక్తి పొందాలంటే

సోషలిజం తప్ప గత్యంతరం లేదు కాబట్టి తమ భౌతిక పరిస్థితులవల్ల వాళ్ళు అనివార్యంగా సోషలిస్టు ఆకాంక్ష వైపు ఆకర్షితులవుతారని నమ్మాడు. ఆ సెంటిమెంట్ ఏ మాత్రం సత్యమో ఈ అనివార్యత కూడా ఆ మాత్రమే సత్యమని కార్మికోద్యమ కార్యరంగంలో ఉన్న కమ్యూనిస్టులకు త్వరలోనే అర్థం అయింది. అది వారి సిద్ధాంతానికీ ఆచరణకూ చాలా ఇబ్బందికరంగా తయారయింది. ఈ ఇబ్బందిని అధిగమించడానికి 'కార్మిక వర్గం అంటే కమ్యూనిస్టు పార్టీయే' ననే దృక్పథం పుట్టింది. ఈ సూత్రీకరణ మొదట చేసింది ఎవరో కానీ లెనిన్ కాలం నుండి ఈ వైఖరి మార్క్సిస్టులలో ప్రబలం అయింది. సమసమాజ స్థాపన కార్మికవర్గం ఆకాంక్ష అయినా కాకున్నా కమ్యూనిస్టు పార్టీ చివరిదాకా దానికోసం పోరాడుతుందన్నారు. ఇది సమాజంపైన పార్టీ నియంతృత్వానికి దారితీస్తుందనేది ఈ శతాబ్దపు చరిత్ర నేర్పిన పాఠం.

ఆనాడే లెనిన్ వైఖరితో విభేదించిన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో రోజా లగ్జెంబర్గ్‌ను, ఆంటోనియా గ్రామ్‌సీని చెప్పుకోవాలి. లగ్జెంబర్గ్ లెనిన్‌తో బహిరంగంగానే విభేదించి సోషలిజాన్ని సాధించేది కార్మికవర్గమే తప్ప కమ్యూనిస్టు పార్టీ కాదనింది. మరి కార్మిక వర్గంలో సిద్ధాంతం ప్రకారం ఉండవలసిన ఆకాంక్ష లేనప్పుడు ఏం చేయాలో ఆమె సిద్ధాంతీకరించలేదు. అంతలో చనిపోయింది. గ్రామ్‌సీ బహిరంగంగా విభేదించలేదు గానీ కార్మికవర్గం - ఒక వర్గంగా ఇటలీ సమాజంపైన తమ ఆధిపత్యాన్ని నెలకొల్పి రాజ్యాధికారాన్ని ఏ విధంగా సాధించాలనే ప్రశ్న ఆయన విశేషంగా చేసిన సామాజిక రాజకీయ తాత్విక విశ్లేషణకు ప్రేరకం. ఆయన జైలులోనే చనిపోకుండా బ్రతికి ఇటలీ కమ్యూనిస్టు పార్టీ నిర్మాతగా కొనసాగి వుంటే, కార్మిక వర్గానికి ఉందో లేదో తెలియని ఆకాంక్షను ఆపాదించి ఆలోచించడంలో ఉన్న ఇబ్బందిని ఏ విధంగా అధిగమించేవాడో తెలీదు.

సమసమాజాన్ని సమాజంలో మెజారిటీ ప్రజలు తమ జీవిత ఆకాంక్షగా కోరుకున్ననాడే దాని స్థాపన ప్రజాస్వామికంగా జరుగుతుంది. అన్ని రకాల అణచివేతనూ తన గొడుగు కిందికి తీసుకొని తన నమూనాలో సకల సామాజిక సంబంధాలనూ తిరగరాస్తున్న 'పెట్టుబడి' ఆధిపత్యంలో 'భరించతగ్గ' జీవితం కూడ అసహ్యంగా ఉందని సమాజంలో మెజారిటీ ప్రజలు చైతన్యవంతంగా నిర్ణయించుకున్ననాడు ప్రత్యామ్నాయ సమాజ రూపకల్పన సాధ్యం అవుతుంది. బహుశా ఆ విధంగానే జరగబోతుంది. అంతవరకు సోషలిజం నిర్మిస్తామంటూ

ఏర్పడే ఏ ప్రభుత్వమైనా ఏదో ఒక పునాది ప్రజా సమూహం పేరు మీద ఏదో ఒక పార్టీ చలా యించే నియంతృత్వమే. పెట్టుబడిదారీ దోపిడీకి గానీ, ఇతర రూపాల అణచివేతకు గానీ గురయ్యే ప్రజలను సమీకరించడానికి జరిగే పోరాటాలన్నీ కూడ సమసమాజ విలువలను సమాజం ముందు నిలబెడతాయి. తక్షణ పోరాట అవసరం నుండి వాటిని 'జనరలైజ్' చేసి మానవ ఆకాంక్షగా సామాజిక చైతన్యంలో వాటిని భాగం చేస్తాయి. ఈ పోరాటాలలోకి వచ్చే ప్రజలలో కొద్దిమందో, ఎక్కువ మందో పోరాట ఫలం కొంత దక్కగానే సమసమాజ ఆదర్శానికి దూరం కావచ్చు. కానీ సామాజిక చైతన్యంలో ఆ పోరాటం తీసుకొచ్చిన మార్పు దాని అసలు విజయం. ఈ విజయాల పరంపర ఒక దశను చేరుకున్న తరువాత సమసమాజ నిర్మాణం సాధ్యం అవుతుంది. ధనికుల కంటె పేదవాళ్ళలో, అగ్రకులాల కంటె దళితులలో, పురుషుల కంటె స్త్రీలలో ఈ చైతన్యాన్ని సాధించడం కొంత సులభం కావచ్చునని నమ్మడం అసంబద్ధం కాదు; కాని దీనిలో అనివార్యత ఏమీ లేదు. చివరికి మనుషులు సమసమాజాన్ని కాంక్షించబోయేది కార్మికులుగా, ఆదివాసులుగా, స్త్రీలుగా, దళితులుగా కాదు; చైతన్యవంతులయిన వ్యక్తులుగా.

ఈ పరిణామం సులభతరం కాదు. అందరూ శ్రమచేసి అందరూ సమానంగా సమష్టిగా తమ జీవితాన్ని నియంత్రించుకునే సమసమాజ స్థాపన జరగాలంటే అన్ని రకాల అసమానతలను, అణచివేతను, ఈనాడు వాటికన్నిటికీ ఆలంబనమయిన పెట్టుబడి అనే వికారమయిన సామాజిక సంబంధాన్నీ ద్వేషిస్తే చాలదు. మానవ ప్రవృత్తిలోని అల్పత్వాన్ని కూడా ద్వేషించడం నేర్చుకోవాలి. అది ఉన్నన్నాళ్ళు సమష్టి సహజీవనం సాధ్యం కాదు. మనలోని అల్పత్వం తరతరాల అణచివేత వల్ల పుట్టిందని మన సంతృప్తి కోసం మనం చెప్పుకుంటామో, లేకపోతే ఆ వికార లక్షణాలు మానవ ప్రవృత్తిలో ఉండబట్టే ఇన్ని శతాబ్దాల అణచివేత సాధ్యమయిందేమోనన్న ఆలోచనను కనీసం ఒక ప్రశ్నగా, ఒక సందేహంగా ముందుకు రానిస్తామో - ఏదయినా మనలోని వికార ప్రవృత్తిని మానవులంతా ద్వేషించడం నేర్చుకునే దాకా సమష్టి జీవితం సాధ్యం కాదు. సమష్టి జీవితం సాధ్యం కావాలంటే ఆర్థిక దోపిడీ, కుల పెత్తనం, పురుషాధిక్యత, జాత్యహంకారం మొదలయినవి నశిస్తే చాలదు. అవి నశించవలసిందే. కాని అవి నశిస్తే చాలదు. మనిషిలో, సామాజిక చైతన్యంలో సహజీవన తత్వం పెరగాలి. 'సోషలిస్టు పునాది' అనేదేదో ఒకటి ఉందనీ దాన్ని నెలకొల్పితే సోషలిస్టు చైతన్యం అదే పుట్టుకొస్తుందనీ

నమ్మడం వట్టి భ్రమ. 70 ఏళ్ళకు పైగా ఈ భ్రమతో మార్క్సిస్టులు తమను తాము వంచించుకున్నారు. ప్రపంచాన్ని వంచించారు. ఈ వంచన ఈనాడు ఆర్మేనియాలో, అజర్బైజాన్‌లో, బోస్నియాలో బయటపడుతూ ఉంది. రేపు చైనాలో బయటపడుతుంది.

సోషలిజం కోసం జరిగే పోరాటాలలో భాగంగా మనుషులలో అణచివేత పట్ల వ్యతిరేకతతో బాటు సమష్టితత్వం, సహజీవన సంస్కృతి పెరగాలి. ఇవి రెండూ ఒకటి కాదు. మొదటిది సాధిస్తే రెండవది దానంతటది సిద్ధించదు. రెండవది సాధ్యం కావాలంటే మానవ ప్రవృత్తిలోని అనేక వికారమయిన లక్షణాలను ద్వేషించడం నేర్చుకోవాలి. చరిత్ర క్రమానికి ఈ లక్షణాలు ఆటంకం కాగల వైనాన్నీ, చరిత్ర క్రమంలో వాటిలో మార్పు రాగల వైనాన్నీ కూడ గుర్తించాలి. దీనికి సంబంధించిన తాత్విక అవగాహన కావాలి.

చారిత్రక భౌతికవాదంలోని ఈ ఖాళీని పూరించడానికి కాల్పనిక సాహిత్యం చాలా దోహదం చేయగలదు. మనిషిని భౌతిక శక్తుల సృష్టిగాను, ప్రయోగశాలలో వస్తువుగాను కాక చరిత్రలో నివసించే చైతన్యమూర్తిగా దర్శించగల సామర్థ్యం కాల్పనిక సాహిత్యానికి వుంది. ఈ కర్తవ్యాన్ని అందుకోగల సాహిత్యం నేడు అవసరం. 'ఈ అభ్యుదయవాదులు వట్టి మూర్ఖులు. వాళ్ళు మనుషులంతా తమ వంటివారే ననుకుంటారు' అని డాస్తయెవ్‌స్కీ తన రాజకీయ నవల 'బ్రదర్స్ కారమజోవ్'లో అంటాడు. అంటే మనిషిలో అసాంఘిక, వికారమైన లక్షణాలే ప్రధానమనీ వాటివల్ల సోషలిజం అనేది సాధ్యం కాదనీ ఆయన భావం. (అభ్యుదయవాదులు మటుకు ఇందుకు మినహాయింపని ఎందుకు భావించాడో తెలియదు!) మానవ ప్రవృత్తికి సంబంధించిన చారిత్రక విశ్లేషణ అక్కడితో ఆగిపోకుండా అర్థవంతంగా ముందుకు పోవలసి ఉంది. దానికి మార్క్సిస్టు సాహిత్యకారులు కాకపోతే ఎవరు పూనుకోవాలి?

(సాధన రాసిన రాగో నవలకు ముందుమాటగా బాలగోపాల్ మొదట ఈ వ్యాసాన్ని రాశారు. అయితే రచయిత అభిప్రాయాలతో పూర్తిగా విభేదించే రచనను ముందుమాటగా వేయడం భావ్యం కాదని, విడిగా వేయదలచుకుంటే వేయమని ఆయనే విరసం సభ్యులకు సూచించారు.)

*అరుణతార*

సెప్టెంబరు 1993

V

# మరణానంతర ఊహ

కథలు చెప్పడంలో ఊహకు చాలా కీలక స్థానం ఉంది. కథకులు ఊహాత్మక సన్నివేశాల ద్వారా తమ వాదనను ప్రతిపాదిస్తారు. మనుషుల ఆశలకూ, భయాలకూ ఊహాత్మకంగా రూపకల్పన చేస్తారు. జీవితాన్ని ఊహాత్మకంగా పునఃసృష్టిస్తారు. కథా శిల్పంలో ఊహ ఒక ముఖ్య సాధనం. ఊహించకుండ ఎవరూ కథలు రాయలేరు. కానీ ఊహను ఒక సాధనంగా అర్థం చేసుకొని సృజనాత్మకంగా ప్రయోగించడం వేరే సంగతి. దానికి చాలా నేర్పు కావాలి. ముందు కథా రచనలో శిల్పానికి తగు ప్రాముఖ్యం ఇచ్చి దానిని ప్రత్యేకంగా అధ్యయనం చేసే అలవాటు పెరగాలి.

మనిషి ఊహకు ఏ అవధులూ లేనట్టే కాల్పనిక సాహిత్యంలో అభివ్యక్తికి (ఎక్స్‌ప్రెషన్) సంబంధించిన వైవిధ్యానికి కూడ ఏ అవధులూ ఉండనవసరం లేదు. 'రూపం', 'శిల్పం', 'శైలి' అనేవి ఈ వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడానికి మనం ప్రయోగించే మాటలు మాత్రమే. నిజానికి మనిషి తన ఊహాశక్తికి పూర్తి స్వేచ్ఛనిస్తే సాహిత్యంలో సాధించగల అభివ్యక్తి వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడానికి ఈ పదాలు సరిపోవు. కానీ, ప్రగతిశీల రాజకీయాల ప్రభావం తెలుగు సాహిత్యం మీద చాలా బలంగా ఉండడం వస్తురీత్యా ఆ సాహిత్యానికి సార్థకతనూ వైవిధ్యాన్నీ కల్గించడానికి ఎంతగా దోహదం చేసిందో అభివ్యక్తి విషయంలో అంత మేలు చేయకపోగా అనేక పరిమితులు

పెట్టినట్టుంది. సాహిత్యం సామాజిక ప్రయోజనాన్ని సాధించాలనే తపన కథావస్తువుకు పూర్తి ప్రాముఖ్యం ఇచ్చి, అభివ్యక్తి అనేది తేటతెల్లంగా 'ఆవు నాలుగు కాళ్లు గల జంతువు' అనే పద్ధతిలో ఆ వస్తువును వ్యక్తం చేస్తేనే అది అభ్యుదయ సాహిత్యం అవుతుంది అనే దృక్పథానికి దారి తీసింది. 'సోషలిస్టు వాస్తవికత' అనే తొలినాటి సోవియట్ సాహిత్య సిద్ధాంతం ఈ రోజు పెద్దగా ప్రచారంలో లేదు గానీ అది అలవరచిన ఈ వైఖరి తెలుగులో అభ్యుదయ సాహిత్యాన్నే కాక మొత్తంగా తెలుగు కథా సాహిత్యాన్ని (కొద్ది మినహాయింపులతో) ఇంకా వదిలిపెట్టినట్టు లేదు. తెలుగులో కథా సాహిత్య శిల్పం మొత్తం మీద ఇంకా 'రియలిజం' పరిధులు దాటిపోలేదు. నిజ జీవితంలో లాగ తెలుగు కథా సాహిత్యంలో కూడ కాలం ఎప్పుడూ గతం నుండి భవిష్యత్తు వైపే ప్రవహిస్తుంది. కార్యకారణ సంబంధాలు కర్త కర్మ క్రియలలాగ ఉండవలసిన చోటే ఉంటాయి. చైతన్యాన్ని ఎప్పుడూ పదార్థమే నిర్ణయిస్తుంది. 'శాస్త్రీయ దృక్పథం' పాటించాలన్న నియమం లేని పిల్లల సాహిత్యానికి మాత్రమే గురుత్వాకర్షణ సిద్ధాంతాన్నీ హేతువాద తర్కాన్నీ తిరస్కరించే లైసెన్స్ ఇవ్వబడింది.

ప్రతీ రాజకీయ దృష్టి విశేషం వెనుక ఒక మానసిక వైఖరి ఉంటుంది (అంటే అర్థం రాజకీయమంతా 'సబ్జెక్టివ్' అని కాదు - సబ్జెక్ట్, ఆబ్జెక్ట్ అనే వాటిని వేరు చేయడం అంత సులభం కాదని మాత్రమే). వస్తువులో విప్లవాన్ని కాంక్షించే వాళ్ళు రూపంలో సాధారణంగా సంప్రదాయబద్ధులయి ఉంటారన్న ఆనవాయితీ ఇవ్వాళ పుట్టింది కాదు. అంతిమ విముక్తిని గురించి మాట్లాడే ప్రవక్తలు నిత్య జీవితంలో ప్రయోగాత్మకత పట్ల అసహనాన్ని ప్రదర్శించడం కూడ ఈ రోజు ఒకరు కొత్తగా కనిపెట్టి చెప్పవలసిన సంగతి కాదు. సాహిత్యంలో అభివ్యక్తి వైవిధ్యం ఒక మోతాదు మించితే అసహనంగా స్పందించే రాజకీయ వైఖరి కూడ ఈ కోవకు చెందిన ప్రవర్తనా విశేషమే. ఈ అసహనం లక్ష్య సాధనకయినా క్రమశిక్షణ పేరిట ఆమోదం కోరుకుంటుంది. ఏ లక్ష్య సాధనకు అవసరమైన క్రమశిక్షణ అవసరమే కానీ, తాము ఈ ప్రపంచాన్ని వివరించడానికి గీచిన నాలుగు గీతల మధ్య ఇమడని కొత్త విషయాలు ఎదురయినప్పుడు సిద్ధాంతవేత్తల మనసులను ఇబ్బంది పెట్టే అభద్రతా భావం నుండి పుట్టే అసహనాన్ని క్రమశిక్షణ పేరిట సమర్థించుకోవడం జరుగుతున్నదేమో గమనించకుండా ఆ వాదనకు ఆమోదం ఇవ్వడం పొరబాటు అవుతుంది.

కాల్పనిక సాహిత్యం 'వాస్తవికతా' నియమాలేవీ పాటించనవసరం లేదనీ, పాటించనంత మాత్రాన అది భావవాద సాహిత్యం అయిపోదనీ, నిజానికి అత్యంత

ప్రగతిశీల స్వభావం గల సందేశాన్ని 'అవాస్తవిక' ఊహాశిల్పం ద్వారా ఇవ్వవచ్చుననీ ఇతర భాషల సాహిత్యం చదివితే అర్థం అవుతుంది. ఉదాహరణకు అర్థరహితంగా అనిపించే కథనశైలి ద్వారా ఆధునిక జీవితంలోని అర్థరాహిత్యాన్ని బలంగా చూపించే రచనలు కాఫ్కా కాలం నుండి యూరప్ సాహిత్యంలో చాలా వచ్చాయి. కానీ ఆధునిక జీవితం అర్థరహితమా అని అడగవచ్చు. దానిని అర్థరహితంగా చూపించడం పోరాటాల నుండి పక్క దోవ పట్టించే తప్పుడు చైతన్యం అని విమర్శించవచ్చు. ఈ తార్కిక అభ్యంతరంతోనే మార్క్సిస్టులు అధివాస్తవిక సాహిత్య శిల్పాన్ని చాలా కాలం తిరస్కరించారు. దానిని సామ్రాజ్యవాద పతన సంస్కృతి నుండి పుట్టిన పెటీ బూర్జువా నైరాశ్యవాదం అన్నారు. ఇప్పటికీ 'రియలిజం' పరిధి దాటిపోయే శిల్ప సంబంధమైన ప్రయోగాలను అనుమానంగా చూసే అలవాటు పోలేదు. ప్రతీ ఆలోచనా రీతికీ ఒక వర్గ మూలాన్ని వెతికే వైఖరే చాలా యాంత్రికమైనది. జీవితంలో అర్థం కానిది ఎప్పుడూ ఎంతో కొంత ఉంటుంది. అది తాత్విక మీమాంసకూ సాహిత్య వ్యధకూ వస్తువు అవుతుంది. కాని ఇక్కడ చర్చ దాని గురించి కాదు. జీవితం మౌలికంగానే అర్థరహితమా అనే ప్రశ్నే వేసుకుందాం. మధ్యయుగాలలో దేవుడు, కర్మ మొదలయిన భావాలు జీవితానికి అర్థం చెప్పేవి. అది నిజానికి తర్కానికి అందే అర్థం కాదు. అది జీవితానికి అర్థం చెప్పలేనితనాన్ని ఒప్పుకోవడం తప్ప వేరే కాదు. కానీ అప్పటికి అదే జీవితానికి ఉండే అర్థం. అర్థం చేసుకుంటూ కూడ అర్థం కాని ఆ జీవితంలో చాలా బలమయిన అర్థరాహిత్యాన్ని మనుషులు అనుభూతి చెందుతారు. దీని ఫలితమైన మీమాంస, వ్యధ ఆనాటి సాహిత్యంలో అనేక సందర్భాలలో కనిపిస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థతో మొదలయిన ఆధునిక కాలం హేతుబద్ధమైన వైజ్ఞానిక తర్కానికి మానవ ఆలోచనలో ప్రధాన స్థానం కల్పించింది (అప్పటివరకు దానికొక స్థానం లేనే లేదని కాదు). జీవితాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకునే ఆలోచనారీతిని బాగా అభివృద్ధి చేసింది. జీవితాన్ని సంపూర్ణంగా కాకున్నా మౌలికంగా అర్థం చేసుకోవడం సాధ్యం అనే విశ్వాసాన్నీ, దానికి కావలసిన విజ్ఞానాన్నీ ఆధునిక యుగం పెంపొందించింది. అయితే అదే ఆధునిక యుగం మనుషుల జీవితాలను శాసించే ప్రబలమయిన శక్తులను సృష్టించింది. పెట్టుబడి, రాజ్యం అనేవి ఈ శక్తులు. వీటిని లోతుగా విశ్లేషిస్తే ఏదో ఒక మేరకు తార్కికంగా అర్థం చేసుకోవచ్చు. అయితే వాటి 'అర్థం' పైకి కనిపించేది కాదు. జీవించే క్రమంలో సహజంగా అనుభవంలోకి

వచ్చేదే వాటి అసలు అర్థం కాదు. వాటిని అర్థం చేసుకోవడం అనే చర్య జీవించడం అనే చర్యకు సమాంతరం కాదు. ఈ రకంగా అవి అర్థవంతమయి ఉండి కూడా అర్థరహితమయినవే. అంతేకాదు. ఒక విషయాన్ని 'అర్థం చేసుకోవడం' అనేది కేవలం వైజ్ఞానిక ప్రక్రియ కాదు. ఒక విషయంలోని తర్కాన్ని మనం అర్థం చేసుకోగలిగినా ఆమోదించలేకపోవడం, దాని అవసరాలతో మమేకం కాలేకపోవడం అనేది కూడ 'అర్థరాహిత్యం' అనే భావంలో ఇమిడి ఉంది. అంటే 'అర్థవంతం', 'అర్థరహితం' అనేవి కేవలం తార్కిక భావాలు కావు. అవి నైతిక భావాలు కూడా. ఎవ్వరికీ ఏ అన్యాయం చేయని వాళ్ళు కష్టాలకు లోను కావడం అనేది మనం ఎన్ని కర్మ సిద్ధాంతాలు నమ్మినా, ఎంత సైన్స్ చదివినా 'అర్థం' చేసుకోలేము. అంటే దానికి సమ్మతించలేము. ఈ అర్థంలో ఆధునిక రాజ్యం, పెట్టుబడి అర్థరహితమయినవే. అవి శాసించే జీవితం అర్థరహితమయినదే. శిల్పం రీత్యా అర్థరహితంగా అనిపించే సాహిత్య శైలే దీనిని బాగా వ్యక్తం చేస్తుంది. యుద్ధ వ్యతిరేక సాహిత్యం దీనికొక మంచి ఉదాహరణ. యుద్ధాలకు కార్యకారణ విశ్లేషణ చేసి ఒక మేరకు 'అర్థం' చెప్పుకోవచ్చు కాని నైతికంగా అవి అర్థరహితమయినవే కాబట్టి వాస్తవిక శైలి కంటె అబ్సర్డ్ శైలే యుద్ధ వ్యతిరేక సాహిత్యానికి బాగా అతికింది.

ప్రస్తుత రచనకు తిరిగి వద్దాం. అన్ని మానవ నాగరికతలలోనూ, మనిషి ఊహను చాలా బలంగా ఆకర్షించిన విషయాలలో మరణానంతర జీవితం ఒకటి. ప్రాచీన సాహిత్యంలో -అన్ని భాషలలోనూ - మరణానంతర జీవితానికి సంబంధించిన ఊహ ఒక ముఖ్య కథా వస్తువును కల్పించింది. ఈ మరణానంతర జీవితం గతంతో ముడిపడి ఉంటుంది. అపరిపూర్ణమైన ఈ జీవితంలోని ఖాళీలను మరణానంతరం పరిపూర్తి చేసుకునే ఊహ అన్ని మతాలలోనూ ఒక ముఖ్య విషయం. మతం 'హృదయం లేని ఈ ప్రపంచానికి హృదయం' అని మార్క్స్ అంటాడు. హృదయం లేని తనం ఒక అంశంలో దోపిడీ దౌర్జన్యాలకూ అణచివేతకూ సంబంధించిన విషయం. మార్క్స్ బహుశా దానికే ప్రాధాన్యం ఇచ్చాడు. ఈ లోకంలో న్యాయం లేదు. కష్టానికి తగిన ప్రతిఫలం రాదు. మనిషికి మనిషిగా గుర్తింపు లేదు. ఈ లోటును ఊహాత్మకంగా పూర్తి చేసుకునే కాల్పనిక సాధనం మరణానంతర జీవితం అనే ఆలోచన. అయితే వాస్తవంలో మనుషులు వ్యవస్థాగతమయిన ఈ జీవిత అపరిపూర్ణతను మానవ అస్తిత్వంలో ఎప్పుడూ ఉండే లోటుతో పాటే చూస్తారు. రెండింటినీ మనం సిద్ధాంత రీత్యా వేరు చేయవలసిందే.

జీవితంలో మనుషులు కోరుకునేది ఏదీ పరిపూర్ణంగా దొరకదు. శ్రమకు తగిన ఫలం, వ్యక్తిత్వానికి తగిన గుర్తింపు మాత్రమే కాదు, ప్రేమ, సౌందర్యం, సంతోషం ఏదీ మానవ జీవితంలో పరిపూర్ణంగా లభించదు. దయ, సాహసం, దాతృత్వం వంటి గుణాలేవీ మనుషులు పరిపూర్ణంగా ప్రదర్శించలేరు. మానవ జీవితంలోని అన్ని కోణాలలోనూ ఉన్న ఈ అపరిపూర్ణతకు శ్రమ దోపిడీ, అణచివేత, అసమానత, పేదరికం వంటి వ్యవస్థాగతమైన విషయాలు కొంతమేరకు కారణం. కానీ వాటినన్నింటినీ వడబోసినా, మానవ అస్తిత్వానికి స్వాభావికమయిన అపరిపూర్ణత మిగిలిపోతుంది. మనిషి ఆలోచన మట్టుకే పరిపూర్ణతను భావించుకో గలదు. బలంగా కాంక్షించగలదు. దానికోసం తపించగలదు. నిజానికి ఆ తపనే మనిషిని ఆచరణకు కదిలించే శక్తులలో ఒకటి. మనిషిలో ఆ తపనే లేకపోతే మానవ చరిత్ర ఈ విధంగా ఉండేదే కాదు. బహుశా చరిత్ర అనేదే ఉండేది కాదేమో. 'హృదయం లేని' ఈ ప్రపంచంలో ఈ తపన పూర్తిగా తీరదు. కాబట్టి పరిపూర్ణమైన మరణానంతర జీవితంలో మనుషులు దానిని ఊహాత్మకంగా తీర్చుకుంటారు. అక్కడ జీవితం నిజంగానే అజరామరం. అక్కడ పరాక్రమానికి పిరికితనం అడ్డం రాదు, సౌందర్యానికి వయస్సు ఆటంకం కాదు. అక్కడ సమృద్ధే తప్ప లేమి లేదు. అందరూ దైవ సమానులే కాబట్టి హెచ్చు తగ్గులు లేవు. వ్యవస్థాగతమయిన అసమానతలకు, వ్యవస్థతో సంబంధం లేని జీవిత అపరిపూర్ణతకు ఆ ఊహలో ఏక సమయంలో పరిహారం దొరుకుతుంది.

మతంతో కలగలసిపోయిన ఈ మరణానంతర ఊహ కాలక్రమంలో పురోహితుల చేతిలో చిక్కి పాలక భావజాలానికి ఉపయోగపడింది. మరణానంతర సమృద్ధి, సమాన ప్రతిపత్తి, పరమాత్మలో సకల ఆత్మల విలీనం వంటి ఊహలను ఈ లోకంలోని వ్యవస్థాగతమయిన అన్యాయాలకు పరిహారంగా పురోహితులు చూపించగలిగారు. ఇది చాలా శక్తివంతమైన భావజాలానికి దారి తీసింది. ఈ భావజాలం నుండి పీడిత ప్రజలను విముక్తి చేయడం కోసం కృషి చేయాలని అభ్యుదయ ఉద్యమాలు గుర్తించాయి. ఈ విషయంలో ఆ ఉద్యమాల ఆచరణ ఇంకా చాలా శక్తివంతంగా సాగవలసి ఉంది. 'పునాది ముందు మారితే ఉపరితలం తరువాత మారుతుంది' అనే వైఖరి వదులుకోవాలని ఈ మధ్య విమర్శకులు గుర్తిస్తున్నారు. అంతే కాదు భావజాలం అనేది ప్రజల మెదళ్లలో పాలక వర్గాలు బలవంతంగా చొప్పించే కృత్రిమ ఆలోచన అనే అవగాహన కూడ వదిలించుకోవాలి.

ఉద్యమాలు భావజాలం ప్రభావాన్ని సీరియస్‌గా పట్టించుకోవాలని హెచ్చరించే విమర్శకులు సహితం భావజాలాన్ని అర్థం చేసుకోవడంలో ఈ పొరబాటు అవగాహ నకు లోనవుతున్నారనిపిస్తుంది.

మరణానంతర జీవితానికి సంబంధించిన ఊహ మనిషిని బలంగా ఆకర్షిస్తుంది కాబట్టే అది పాలక భావజాలానికి అంతగా ఉపయోగపడగలిగింది. పాలక భావజాలం మూలాలు వెతికితే మనిషికి స్వాభావికమైన అవసరాలు, లక్షణాలు, ప్రవర్తనారీతులు, ఆలోచనా సరళి తగులుతాయి. ఇవే భావజాలానికి 'కారణం' కాదు. భావజాలానికి కారణం, అవసరం వ్యవస్థ నుండే వస్తాయి. కానీ భావజాలానికి బలం చేకూర్చే మూలాలు మానవ అస్తిత్వానికి స్వాభావికమైన గుణాలలో ఉంటాయి. భావజాలం సాధించేది అప్పటి వ్యవస్థాగతమైన ప్రయోజ నాలనే. కానీ అది ఆధారపడేది మానవ అస్తిత్వానికీ స్వభావానికీ సార్వజనీనంగా ఉండే లక్షణాల ప్రత్యేక విశదీకరణపైన. అందుకే భావజాలాలు అంత బలంగా ఉండగలుగుతాయి. భావజాలానికి ఉండే బలం కేవలం అది కాపాడే భౌతిక ప్రయోజనం నుండి వచ్చేటట్టయితే ఏ పాలక భావజాలమూ ఇంత బలంగా ఉండనవసరం లేదు.

కమ్యూనిస్టు పాలిత దేశాలు బూర్జువా సంస్కృతి నుండి తమ సమాజాలను కాపాడడానికి ఇనుప గోడలు లేపి గ్రంథాలయాలను నిర్దాక్షిణ్యంగా వడబోసి ముద్రణాలయాలను నిషేధించి నానా తంటాలు పడినా, ఇనుప గోడలలోని కనిపించని బీటల నుండి, గవాక్షాల నుండి సామ్రాజ్యవాద సంస్కృతికి సంబంధించిన గాలులు లోనికి ప్రవేశించగలిగాయంటే ఆ సంస్కృతిలో మనిషిని బలంగా ఆకర్షించే విషయం ఉండడమే దానికి కారణం. మనిషి ఈ ప్రపంచాన్ని తన కోసం వెలిసిన ఒక భోజ్య వస్తువుగా చూడడం బూర్జువా సంస్కృతికి సంబంధించిన ప్రధాన లక్షణం. ఇది పెట్టుబడిదారులు కృత్రిమంగా తయారుచేసి మనందరి మెదళ్లలోకీ చొప్పించిన సంస్కృతి కాదు. ప్రపంచాన్ని ఒక భోజ్య వస్తువుగా చూసే వైఖరి మనుషులందరినీ సర్వత్రా ఆకర్షిస్తుంది. దానికి స్థానం కల్పించని సంస్కృతి ఏదీ లేదు (ఆదివాసీ సంస్కృతిలో అది అతి తక్కువ స్థాయిలో కనిపించినప్పటికీ). అయితే దానిని మానవ జీవితంలో ప్రధాన విషయం చేసి చాలా ఆకర్షణీయంగా విపులీకరించి ఒక ప్రచండ భోజ్య సంస్కృతిని సృష్టించింది బూర్జువా వ్యవస్థ. ఆ వ్యవస్థను 'మార్చేస్తే' మనలోని ఆ వైఖరి పోదు. ఆ వైఖరిని మనం మానవీయంగా

నియంత్రించుకోగలిగినప్పుడే బూర్జువా వ్యవస్థను 'మార్చేయ' గలుగుతాం. స్టాలిన్ ఇనుపగోడలు, చియాంగ్ చింగ్ నిషేధాలు, విప్లవ ప్రచార హోరు ఆ భోక్త వైఖరిని పోగొట్టలేవు. మనం దానిలో ఉన్న ఆకర్షణను వాస్తవికంగా గుర్తిస్తూనే దానిలోని అమానుషత్వాన్ని అర్థం చేసుకొని ఆ భోజ్య సంస్కృతిని నైతికంగా తిరస్కరించే విలువలను సామాజిక చైతన్యంలో బలంగా పెంచుకోగలిగినప్పుడే పెట్టుబడిదారీ వ్యవస్థను అధిగమించగలుగుతాం. అంతదాకా అది రాక్షసుడి తలలాగా ఎన్నిసార్లు నరికి వేస్తే అన్నిసార్లు తిరిగి మొలుస్తూనే ఉంటుంది. ఆ ప్రత్యామ్నాయ నైతిక సంస్కృతి సాధ్యం కావచ్చునేమోనని నమ్మడానికి ఆధారమేమిటంటే భోక్త వైఖరి మనిషిని ఆకర్షించినట్టే అందుకు భిన్నమయిన సంస్కృతి కూడ మనిషికి మరొక కోణంలో చాలా సంతృప్తిని ఇవ్వగలదు. ఈ ప్రపంచాన్ని భోజ్య వస్తువుగా కాక తనలో భాగంగా, తనను ఈ ప్రపంచంలో భాగంగా చూసే మమైక్యతా సంస్కృతి కూడ మనిషికి స్వాభావికంగానే సంతృప్తినిస్తుంది. దీనిని మానవ జీవితంలో ప్రధాన విషయం చేయడం సాధ్యమైతేనే కమ్యూనిజం సాధ్యం అవుతుంది.

'పెట్టుబడి' అంటే కేవలం సంపద కాదు. అదొక సామాజిక సంబంధం అన్న మార్క్స్ విశ్లేషణను మార్క్సిస్టులు తరచుగా ఉటంకిస్తుంటారు. అదొక సామాజిక సంబంధం మాత్రమే కాదు. ఒక ప్రాపంచిక దృక్పథం. ఒక జీవన వైఖరి. దానికి భిన్నమైన మమైక్యతా దృక్పథం, కమ్యూనిస్టు జీవన వైఖరి. ఈ అవగాహన మార్క్స్ తొలి రచనలలో (ముఖ్యంగా ఎకనమిక్ అండ్ ఫిలసాఫికల్ మేనుస్క్రిప్ట్స్‌లో) ఉంది. కానీ తరువాతి కాలంలో తన సిద్ధాంతాన్ని విశదీకరించినప్పుడు ఆయన ఈ అవగాహనకు ప్రాముఖ్యం ఇవ్వలేదు. దానికి తిరిగి ఈ మధ్య కాలంలో ప్రాణం పోసే ప్రయత్నం చేస్తున్నది మార్క్సిస్టులు కాదు. మార్క్సిస్టులు తృణీకరిస్తున్న పర్యావరణ ఉద్యమకారులు. అయితే వాళ్ల తాత్త్విక బలహీనతల వల్ల వాళ్లు ఈ పని సక్రమంగా చేయలేకున్నారు.

మనిషికి ఉన్న వివిధమైన మానసిక అవసరాలు, స్థితులు, వైపరీత్యాలు పాలక భావజాలానికి మనుషుల ఆలోచనలను ఆక్రమించుకునే అవకాశం కల్పిస్తున్నాయని గుర్తిస్తున్నామంటే ఆ మానసిక స్థితులనూ అవసరాలనూ 'కండెమ్' చేస్తున్నామని కాదు. అవి మన అస్తిత్వంలో భాగం. మన కాళ్లూ చేతులూ ఎట్లాగో అవీ అట్లాగే. వాటి ఫలితంగా మన జీవితం అమానుషంగా తయారు కాకుండా వాటి అభివ్యక్తిని మానవీయంగా మలచుకోవడం ఒకటే మనం చేయగల పని. ఈ

అవసరాన్ని మార్క్సిజం ఇప్పటివరకు గుర్తించలేదు. దీని గురించి కొంత ఆలోచించింది మార్క్సిస్టుల చేత పెటీ బూర్జువా సోషలిస్టులుగా తిరస్కరించబడిన ఎరిక్ ఫ్రాం, బర్ట్రాండ్ రస్సెల్ వంటి వారే. ఇది నైతిక, సాంస్కృతిక స్వభావంగల రాజకీయ కృషి. ఉదాహరణకు, అన్ని రకాల దోపిడీ దౌర్జన్యాలూ అసమానతలూ ఎప్పటికయినా తొలగిపోయినా మానవ జీవితంలో అపరిపూర్ణత ఇంకా మిగిలి పోతుంది. మనిషి తన గురించి, తన జీవితాన్ని గురించి ఊహించుకోగల పరిపూర్ణతకు, నిజంగా సాధించగల దానికి మధ్య ఒక అగాధం ఎప్పుడూ ఉంటుంది. కాల్పనికంగా దానిని పూరించుకొని ఊహాత్మకంగా సంతృప్తి పొందే ప్రయత్నం చరిత్ర చివరిదాకా సజీవంగానే ఉంటుంది. అయితే ఇది ఊహను నిజమని నమ్మజూపే భావజాలం రూపంలో కాక ఊహను కాల్పనిక సృష్టిగా స్పష్టంగా గుర్తించే సాహిత్యము, కళల రూపంలో జరగగలిగితే అమానుషతకు తావు లేకుండా చూడవచ్చు. అందువల్ల మానవ జీవితాన్ని మానవీయంగా పునర్నిర్మించే ప్రయత్నంలో 'అవాస్తవిక' కాల్పనిక సాహిత్యానికి తనదయిన స్థానం ఎప్పుడూ ఉంటుంది.

ఊహాత్మక పునఃసృష్టి వల్ల వచ్చే మానసిక సంతృప్తి ఒకెత్తు. జీవితాన్ని విశదీక రించడానికి ఒక సాహిత్య శిల్ప సాధనంగా దానికి ఉండే ప్రయోజనం వేరొక ఎత్తు. మరణానంతర ఊహనే ఉదాహరణగా తీసుకుందాం. పరలోక భావనలో అనేక రకాల సౌకర్యం ఉంది. ఇక్కడ జరగడం సాధ్యం కానివెన్నో అక్కడ జరగగలుగుతాయి. అక్కడ కాలం స్తంభించిపోతుంది. కాబట్టి చరిత్రలో కలుసుకోవడం సాధ్యం కాని వ్యక్తులు మరణానంతరం కలుసుకోగలరు. అక్కడ దూరం అనేది ఉండదు కాబట్టి అందరూ ఒకే సమయంలో ఒకే చోట ఉండగలరు. అక్కడ మనుషులకు ప్రకృతి, సమాజం ఏర్పరచిన దినచర్య అనేదేదీ ఉండదు కాబట్టి వాళ్ళు ఏ సమయంలోనయినా ఏ పనయనా చేయగలరు. అక్కడ అందరూ స్వతంత్రులే కాబట్టి ఒకరికొకరు భయపడకుండా ప్రవర్తించగలరు. ఇక్కడి జీవితంలో జరగవలసినవి అనేకం జరగకుండా పోవడానికి ఈ భయం ఒక ముఖ్య కారణం. హిట్లర్ చేతిలో చనిపోయిన యూదులు సహితం పరలోకంలో అతనిని ఎదిరించి మాట్లాడగలరు. అయితే మరణానంతర మరణం అనేది లేదు కాబట్టి హిట్లర్ కూడ వారికి తార్కికంగాను నైతికంగాను భయపడాలే తప్ప శారీరకంగా భయపడనవసరం లేదు. తార్కిక సంవాదం అక్కడ భౌతిక హింసవల్ల అర్థాంతరంగా ఆగిపోనవసరం లేదు.

ఇన్ని సదుపాయాలున్న మరణానంతర జీవిత భావన ఒక రచయిత చేతిలో అనేక విషయాలను విశదీకరించడానికి సాధనంగా ఉపయోగపడగలదు. పరలోకంలో మార్క్స్ స్టాలిన్‌ను కలుసుకున్నప్పుడు మార్క్స్ సిద్ధాంతం పేరిట స్టాలిన్ నెలకొల్పిన క్రూరమయిన నియంతృత్వం గురించి ఇద్దరూ ఏ విధంగా వాదులాడుకొని ఉంటారు? అదంతా సోషలిజాన్ని కాపాడుకోవడానికి అవసరం అని ఈ లోకంలో చాలామందిని ఈనాటికీ నమ్మింపచేసినట్టు మార్క్స్‌ను కూడ స్టాలిన్ నమ్మించి ఉంటాడా?

ఈ కోవకు చెందిన ఊహ ఒకటి సోవియట్ రష్యాలో జోక్‌గా చలామణిలో ఉండేది. మార్క్స్‌కు మళ్లీ ప్రాణం వచ్చి ఆయన భూలోకంలోకి వస్తాడు. తన వారసులు నిర్మించిన రాజ్యం చూద్దామని సోవియట్ రష్యాకు పోతాడు. అక్కడ కొన్నాళ్లు పర్యటించి అన్నీ చూస్తాడు. ఆ తరువాత తన అభిప్రాయం ప్రజలకు తెలియజేయడానికి ప్రభుత్వ రేడియోలో అవకాశం ఇమ్మని సోవియట్ ప్రభుత్వాన్ని కోరతాడు. ప్రభుత్వానికి తప్ప వేరే ఎవ్వరికీ ప్రజలతో మాట్లాడే హక్కు ఉండగలదని గుర్తించని సోవియట్ పాలకులు మొదట ఒప్పుకోరు. కానీ ఆయన చాలా బ్రతిమాలగా కేవలం ఒక్క వాక్యం మాట్లాడే అవకాశం ఇస్తామంటారు. మార్క్స్ తనకదే చాలని చెప్పి రేడియో స్టేషన్‌లో మైక్ చేతిలోకి తీసుకొని "ప్రపంచ కార్మికులారా! నన్ను క్షమించండి!" అన్న ఏకవాక్య సందేశం ఇచ్చి వెళ్లిపోతాడు.

ఈ మధ్య వియత్నాంలోని హోచిమిన్ సిటీ (సైగాన్)లో వియత్నాం ఏకీకరణ ద్విదశాబ్ది ఉత్సవం భారీ ఎత్తున జరిగింది. ఆ ఉత్సవం ఖర్చంతా భరించి స్పాన్సర్ చేసింది ఒక అమెరికన్ మల్టీ నేషనల్ కార్పొరేషన్! ఈ వార్త 'యమనాడు'లో చదివిన హోచిమిన్ అక్కడే ఉన్న మావోతో ఏమని మొరపెట్టుకుని ఉంటాడో! అయినా వాళ్ళిద్దరూ అసలు మాట్లాడుకుంటున్నారో, లేక తూర్పు ఆసియా ప్రచ్ఛన్న యుద్ధ రాజకీయాలు యమలోకంలో కూడా కొనసాగుతున్నాయో.

హిట్లర్ ఫాసిజాన్ని చాలా పట్టుదలగా ధైర్యంగా ఎదుర్కొన్నందుకు స్టాలిన్ పాలనలోని సోవియట్ ప్రజలు ప్రపంచ ప్రశంసలు అందుకున్నారు. ఈ రోజు ఆ తరువాతి తరం రష్యా ప్రజలు తమ స్వంత జాతి ఫాసిస్టు జిరినోవ్‌స్కీని అధికంగా ఆదరిస్తున్నారనీ, అతను రాబోయే ఎన్నికలలో రష్యా అధ్యక్షునిగా గెలవవచ్చుననీ తెలిసి పరలోకంలో ఉన్న హిట్లర్ అక్కడే ఉన్న స్టాలిన్‌ను ఎంతగా ఎద్దేవా చేస్తున్నాడో! 'చివరి విజయం నాదే చూడు' అంటున్నాడా?

అమెరికా ప్రజాస్వామ్యం మూల పురుషులయిన థామస్ పెయిన్, థామస్ జెఫర్సన్, జార్జి వాషింగ్టన్ మొదలయిన వాళ్లంతా పరలోకంలో ఉన్నారు. వారి వారసులు ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట హతమార్చిన 30 లక్షల మంది వియత్నామీలు కూడా అక్కడే ఉన్నారు. ఈ జనమంతా థామస్ పెయిన్‌ను, జెఫర్సన్‌ను ఏమని నిలదీసి అడుగుతున్నారో! వారి సరసనే కంపూచియాలో పోల్ పాట్ కమ్యూనిజం పేరిట హతమార్చిన 20 లక్షల మంది కంపూచియన్లు ఉన్నారు. వాళ్లు అక్కడికి చేరుకోగానే మార్క్స్‌ను వెతికి పట్టుకుని ఉంటారు. వాళ్ళ ప్రశ్నల నుండి తప్పించుకోవడానికి ఆయన ఎక్కడ దాక్కున్నాడో!

బుర్ర రాములు ఇటువంటి సన్నివేశం ఒకటి ఎంచుకున్నాడు. ఈ లోకంలో న్యాయం పేరిట కోర్టులలో నడిచే నేర విచారణలోని అన్యాయంతో ఒక్క క్షణం కూడా రాజీపడని నర్రా ప్రభాకరరెడ్డి యమలోకంలో ధర్మం పేరిట నడిచే చిత్రగుప్తుడి ప్రాసిక్యూషన్‌కు ఏ విధంగా స్పందించి ఉంటాడు? ఆ 'ధర్మం' ఇక్కడి 'న్యాయానికి' ప్రజల తల ఒగ్గింపజేసే భావజాలమే కదా!

ఆ ధర్మం న్యాయానికి పర్యాయపదం అని ఇహలోకంలో నమ్మింపజూసిన గాంధీ ఆ లోకంలో చీఫ్ ప్రాసిక్యూటర్ అయ్యే ఉంటాడు కదా? అయితే సత్యాన్ని అత్యున్నతమైన విలువగా ప్రతిపాదించిన వాడు యముడి ప్రాసిక్యూటర్‌గా ఉండడంలో గల వైరుధ్యానికి ఎట్లా తట్టుకుంటాడు? కళ్ళూ చెవులూ నోరూ మూసేసుకోవడం తప్ప గత్యంతరం ఉంటుందా?

మనిషి ఔన్నత్యాన్ని గురించి ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా ఆ ఔన్నత్యాన్ని దిగజార్చే మద్యాన్ని వదులుకోలేని శ్రీశ్రీ, రావిశాస్త్రి వంటి అభ్యుదయ రచయితలు ఈ లోకంలో నడుస్తున్న మద్య వ్యతిరేక ఉద్యమాన్ని గురించి 'యమనాడు'లో చదివి ఏ విధంగా స్పందించి ఉంటారు? నిస్సందేహంగా ఆహ్వానించి ఉంటారని బుర్ర రాములు విశ్వాసం. దానితో విభేదం లేదు. కానీ తాము మాత్రం పర్మిట్లు తీసుకొని ఉంటారేమో! యముడికే తెలియాలి.

బహుశా ఒక్క కౌటిల్యుడిని మినహాయిస్తే తక్కిన బ్రాహ్మణ ధర్మశాస్త్ర కారులంతా రాజద్రోహాన్ని సెక్యులర్ నేరంగా కాక ధర్మద్రోహంగా భావించారు. సారా నిషేధం పాలసీ వికృత విన్యాసాల మీద రావిశాస్త్రి రాసిన ఆరు సారా కథలపైన ఈ లోకంలో రాజద్రోహం కేసు పెట్టడానికి మనువునూ కౌటిల్యుడినీ

దాటి చాలా దూరం ప్రయాణించిన ఆధునిక భారత రాజ్యాంగం అడ్డం వచ్చిందేమో కానీ, దానిని ధర్మద్రోహంగా రూపాంతరం చేసి కేసు పెట్టడానికి యముడికి అడ్డం ఏముంది?

అయితే యముడి ధర్మం మధ్యయుగాల నాటిదే అయినా ఈ ప్రాసిక్యూషన్ లో అది ఎదుర్కొనే ప్రత్యర్థులు అత్యాధునికులు. 'ధర్మం', 'న్యాయం' అనే మాటల వెనుక ఉన్నతమయిన విలువలతో పాటు ఎంత మాత్రం ఉన్నతం కాని రాజకీయముంటుందని తెలిసిన అరుణక్క, దేవేంద్రక్క, సాహు ఉన్నారు. సారా వ్యాపార వ్యవహారం మొత్తం చెప్పగల సి.వి.సుబ్బారావు ఉన్నాడు. ఏ అధికారానికీ ఎన్నడూ తల ఒగ్గని నర్రా ప్రభాకరరెడ్డి ఉన్నాడు. అంతా పోగొట్టుకొని ఇంక పోగొట్టుకునేది ఏమీ లేదని తెగించిన నూకాలమ్మలున్నారు. అందరికీ పెద్ద దిక్కు శ్రీశ్రీ ఉన్నాడు. చివరికి ప్రాసిక్యూషన్ వారు ముద్దాయికి విజయవంతంగా శిక్ష వేస్తారా? లేకపోతే భూలోక రాజకీయాల ధిక్కార వైఖరి అలవరచుకున్న ఈ కొత్త తరం ప్రజలకు భయపడి వదిలి పెడతారా? లేక తామే కోర్టు హాలు విడిచిపెట్టి ఉడాయిస్తారా? ఇది ఊహించేకొద్దీ ఆలోచనలను ఊరించే సన్నివేశం.

ఉద్యమ కథా సాహిత్యం ఒకే మూసలో పోసిన శైలిలో ఉండనవసరం లేదనీ, ప్రగతి సంబంధమయిన నిబద్ధత, సీరియస్‌నెస్ అనేవి 'స్పిరిట్'కు సంబంధించిన విషయాలే తప్ప వస్తువుకు గానీ, శిల్పానికి గానీ సంబంధించినవి కావనీ బుర్ర రాములు కథ ఇచ్చే సందేశాన్ని ఉద్యమ రచయితలు స్వీకరిస్తారని ఆశిద్దాము. ఇటువంటి సందేశాలు ఇప్పటిదాకా ఎవరూ ఇవ్వనే లేదని కాదు. కానీ పదే పదే ఇవ్వవలసిన అవసరం ఇంకా మిగిలే ఉంది.

బుర్ర రాములు రాసిన 'ఏడో సారా కథ'కు ముందుమాట
పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ, జూలై 1995

V

# రాజ్యహింస గురించి ఇంకొంచెం ఆలోచిద్దాం

రాజ్యం ప్రయోజనాలను రాజ్యం కాపాడుకోదు. దానికి కాళ్లు, చేతులు, తల, తోక వుండవు. దాని ప్రయోజనాలను మనుషులు కాపాడతారు. వీళ్లు రాజ్యం భద్రతను తమ భద్రతగా భావించే మనుషులు. రాజ్యం భద్రతకు సంబంధించిన భావజాలాన్ని స్వంతం చేసుకున్న మనుషులు. రాజ్యం అభద్రమైతే భయపడే మనుషులు.

నిజంగానే వాళ్ల అవసరాలు రాజ్యం భద్రతతో ముడిపడి ఉండవచ్చును. అంటే వాళ్లు ఆ భద్రత వల్ల ప్రత్యక్షంగా ప్రయోజనం పొందేవాళ్ళు కావచ్చును. లేదా, తమ అవసరాలేవీ తీరకున్నా, రాజ్య భద్రతను వ్యక్తం చేసే భావజాలంలోని ఏదో ఒక ప్రబలమైన అంశం పట్ల ఆకర్షితులయిన వారు కావచ్చు. అదీ కాకపోతే, రాజ్యం అభద్రమైపోతే సంఘ జీవితం కూడ అభద్రమయిపోతుంది కాబట్టి, అభద్రతకు వెరచే మామూలు మనుషులు కావచ్చు.

ఈ మూడు రకాలలో మొదటి రకం కేవలం సమాజంలోని ప్రధాన పెత్తందారీ వర్గాలకు (అంటే వేరే ఎవ్వరి చేతా ఏ రకమైన అణచివేతకూ గురి కాని వర్గాలకు) పరిమితం కాదు. ప్రధాన పెత్తందారీ వర్గాలు సమాజంలో ఎప్పుడయినా ఒక చిన్న మైనారిటీయే కాబట్టి రాజ్యం భద్రతవల్ల ప్రత్యక్షంగా ప్రయోజనం పొందేది, దానిని తమ భద్రతగా భావించేది ఆ వర్గాలు మాత్రమే అయితే అదొక పెద్ద సమస్య కాదు. కానీ అది నిజం కాదని మనకు అనుభవపూర్వకంగా తెలుసు.

సమాజంలో అనేక మంది అనేక రకాల పెత్తనాన్ని అనుభవిస్తుంటారు. ఏ సమాజంలోనయినా ఆధిపత్యం దొంతరలు దొంతరలుగా నెలకొని ఉంటుంది. కమ్యూనిస్టు పార్టీలకు అలవాటయిన విప్లవ వ్యూహ రచన దృష్టితో చూసినప్పుడు ఏదో ఒక రూపంలో పెత్తనాన్ని అనుభవించే వారంతా పాలక వర్గంలో భాగంగా కనిపించకపోవచ్చు. కానీ అంతమాత్రం చేత ఆ పెత్తనాన్ని వదులుకోవడానికి వాళ్లు సిద్ధంగా ఉంటారనుకోకూడదు. రాజ్యం భద్రతతో వారి పెత్తనం ముడిపడి ఉంటుంది కాబట్టి వాళ్లలో చాలామంది రాజ్యం భద్రతను తమ భద్రతగా భావించి దానిని కాపాడడానికి ఆరాటపడుతుంటారు. ఉదాహరణకు అమెరికాలో ఆదివాసీలు (రెడ్ ఇండియన్లు) తప్ప తక్కిన వాళ్లందరూ యూరప్ నుండి ఆఫ్రికా ఆసియాల నుండి, వలస వచ్చిన వారే అయినా, తొలుత వచ్చిన వారికి చాలా ప్రతిష్ఠ ఉంది. అమెరికా ప్రజాస్వామ్యానికీ సంస్కృతికీ ఆద్యులు వాళ్లేనన్న గుర్తింపు ఉంది. దేశ భద్రతకు భంగం కలిగితే ఆ ప్రతిష్ఠకు దెబ్బ కాబట్టి తమను తాము అసలు సిసలు అమెరికన్లుగా భావించేవారు తమ కంటే తరువాత వలస వచ్చిన వారి దేశద్రోహకర చర్యలను ఎంత మాత్రం సహించరు.

రెండవ రకాన్ని గురించి అర్థం చేసుకోవడానికి భావజాలాన్ని గురించి కొంత అవగాహన కావాలి. వ్యవస్థను భద్రంగా నిలబెట్టడానికి ఉపయోగపడే ఆలోచనలూ ఆశలూ విశ్వాసాలూ ప్రజల ప్రాపంచిక దృక్పథంలో భాగం అవుతాయనీ, ఆ 'భావజాలం' వ్యవస్థ భద్రతకు దోహదపడే ఒక ప్రబల శక్తి అనీ గుర్తించిన సామాజిక తత్వవేత్తలలో మార్క్స్ ఒకడు. ప్రతీ సమాజంలోనూ 'పాలక వర్గాల భావాలే పాలక భావాలు' అని ఆయన అంటాడు. కానీ ఆయన పూర్తి చేయని ఈ విశ్లేషణను మనం పూర్తి చేసుకుంటే తప్ప భావజాలాన్ని గురించి సమగ్రమైన అవగాహన ఏర్పడదు. భావజాలాన్ని కేవలం ఆధిపత్య వర్గాల ప్రయోజనాల భావాత్మక వ్యక్తీకరణగా అర్థం చేసుకుంటే సరిపోదు. అది విషయాన్ని ఒకవైపు నుండి మాత్రమే చూడడం అవుతుంది. మనుషులకు స్వాభావికమైన మానసిక అవసరాలనూ మానసిక స్థితులనూ ఆధిపత్య వర్గాల ప్రయోజనాలకు ఉపయోగపడే రీతిలో భావజాలం విపులీకరిస్తుంది, విశదీకరిస్తుంది. తద్వారా ఆ వ్యవస్థకు అందులో బ్రతికే వారందరి ఆమోదం సంపాదించే ప్రయత్నం చేస్తుంది. వ్యవస్థను కదిలించే ఏ ప్రయత్నాన్నయినా తమ వ్యక్తిత్వానికే దెబ్బగా సామాన్య మనుషులు భావించేలాగ చేస్తుంది. అటువంటి ప్రయత్నాల పట్ల వ్యతిరేకత రేకెత్తిస్తుంది. పాలక భావాలు

మనుషుల మెదళ్ల మీద బయటినుండి రుద్దబడవు. మనుషులకు స్వాభావికమైన అనుభూతులను, ఆకాంక్షలను, మానసిక స్థితులను ఒక ప్రత్యేక రూపంలో విపులీకరించడం ద్వారా భావజాలం పాలక భావాలు సమాజ భావజాలం అవుతాయి. పాలక వర్గాల అవసరాల మీద ఒక కాలు పెట్టి నిలబడితే, మనుషులకు స్వాభావికమైన మానసిక అవసరాలు, స్థితులపైన దాని రెండవ కాలు నిలబడుతుంది.

ఈ మానసిక స్థితులలో అభద్రత ఒకటి. దీనిని అర్థం చేసుకుంటే మనం మూడవ రకాన్ని గుర్తించగలుగుతాము. నిత్య జీవితంలో అభద్రతకు భయపడడం మనిషికి సర్వత్రా ఉండే లక్షణాలలో ఒకటి. అది రాజ్యం భద్రతకూ వ్యవస్థ భద్రతకూ  చాలా దోహదం చేస్తుంది. అది ఏదో ఒక భావజాలం రూపంలో వ్యక్తం కావచ్చును గానీ దానంతటది భావజాల సంబంధమైన విషయం కాదు. భావజాలాలతో సంబంధం లేకుండానే అభద్రతా భయం రాజ్య భద్రతకు దోహదం చేయగలదు.

అభద్రతా భయాన్ని బూర్జువా లేక పెటీబూర్జువా లక్షణంగా భావించడం మార్క్సిస్టులకు పరిపాటి అయింది ('మధ్యతరగతి అభద్రత' అంటుంటారు - పేదవాళ్లలో అభద్రత లేనట్టు). కానీ అభద్రత అనేది కేవలం ఆస్తికి సంబంధించిన విషయం కానవసరం లేదు. మనుషులు తమదిగా భావించే ఏ విషయాన్ని గురించయినా అభద్రతకు లోను కాగలరు. అది ఆస్తి కావచ్చు, జీవనం కావచ్చు, అనుబంధం కావచ్చు, ప్రాణం కావచ్చు, 'నాది' అనుకునే ఐడెంటిటీ ఏదయినా కావచ్చు. నిత్య జీవితంలో అలవాటయిపోయిన క్రమబద్ధత సహితం కావచ్చు. మానవ ప్రవర్తనలో వ్యక్తమయ్యే ఏ ఒక్క గుణమూ ఒక వర్గానికో ఒక వ్యవస్థకో పరిమితం కాదు. దాని, వ్యక్తీకరణ రూపం, పరిధి, పరిమితులు, అవకాశం, అవసరం, అనుమతి, ఆమోదం మాత్రం వ్యవస్థను బట్టి, వర్గాన్ని బట్టి మారుతాయి.

అభద్రతా భయం యధాస్థితికి ఆకర్షణ కల్పిస్తుంది. ఒక వ్యవస్థ కొన్నాళ్లు నిలిస్తే దానిలో మనుషుల జీవితం ఒక మూసలో పడిపోతుంది. అనేక రకాల సంతృప్తిని దాని ఇరుకు సందులలోనే వెతుక్కోవడం మనుషులు నేర్చుకుంటారు. పూర్తి సంతృప్తి కావాలన్న కోరిక చచ్చిపోతుందని కాదు. దాని కోసం ప్రయత్నిస్తూనే ఉంటారు. కానీ ఆ ప్రయత్నం, అలవాటయిపోయిన తమ జీవిత భద్రతకు భంగం

కలిగిస్తే మనుషులు దానిని చాలా సులభంగా నిరసించగలరు. ఆ అభద్ర స్థితిలో ఈ జీవితం (అప్పటిదాకా తాము గడుపుతున్నది) చాలా అందంగా కనిపించనూ గలదు.

అభద్రతా భయం వల్ల ఆకర్షణీయంగా కనిపించే యథాస్థితికి ఆపైన పాలక భావజాలం ముస్తాబు చేయగలదు. యథాస్థితే 'మన సంస్కృతి', 'మనసంప్రదాయం'. అదే నిజమైన స్వేచ్ఛ. నిజమైన సమానత్వం. వ్యవస్థలోని యథాస్థితి 'దేశం'తో, 'జాతి'తో సమానార్థకం. దానిని ఆమోదించడమే దేశభక్తి, జాతీయత. దానిని తిరస్కరించే వాళ్లు దేశద్రోహులు, జాతికి శత్రువులు. ఈ విధంగా, వ్యవస్థలోని యథాస్థితి వల్ల ప్రయోజనం పొందే వర్గాలనే కాక ప్రయోజనం పొందని వారిలో చాలా మందిని కూడా యథాస్థితిని సంరక్షించే కర్తవ్యంలో రాజ్యం సమీకరించగలదు.

వ్యవస్థనూ రాజ్యాన్నీ వ్యతిరేకించే వాళ్లు విజాతీయులయినట్లయితే ఇది ఇంకా సులభం అయిపోతుంది. జాతి, మతం, భాష, ప్రాంతాల ప్రాతిపదికన 'నావాళ్లు' 'పరాయివాళ్లు' అని ఈ ప్రపంచాన్ని వర్గీకరించుకొని ఆ ప్రాతిపదిక మీద ప్రేమనూ, ద్వేషాన్నీ పెంచుకోగలగడం మనిషికి ఉన్న అత్యంత స్వాభావికమైన గుణాలలో ఒకటి. దీనిని తమ నిత్య జీవిత ప్రవర్తనలో సహజంగానే అధిగమించగల నైతిక సంస్కృతిని మనుషులు పెంచుకోగలిగే వరకు సలీష్టి సంఘ జీవితం సాధ్యం కాదు. దీని అర్థం మనుషులు పరాయివాళ్లను ఎప్పుడూ ద్వేషిస్తుంటారని కాదు. మామూలు సమయాలలో మనుషులు తమవారిలాగే పరాయి వాళ్లను కూడా దయగా చూడగలరు, స్నేహంగా ఉండగలరు. ఈ మామూలు సమయం అనే దానిలో మామూలు అభద్రత కూడా ఉండవచ్చును. అది పూర్తిగా భద్రమైన స్థితి కానవసరం లేదు. కానీ తమకు అలవాటు లేని అభద్ర స్థితి దాపురించినపుడు ఈ నీగ్రోలు, ఈ తురకవాళ్లు, ఈ అరవవాళ్లు, ఈ బెంగాలీలు మా కష్టాలన్నిటికీ కారణం అంటూ విజాతీయులపైన సులభంగా ద్వేషం పెంచుకోగలరు. వ్యవస్థ భద్రతకు అవసరమైన రాజ్య భావజాలానికి ఈ గుణం ఎంత బాగా ఉపయోగపడుతుందో ఈ శతాబ్దపు చరిత్ర చక్కగా రుజువు చేసింది. సోవియట్ రష్యా, చైనా వంటి దేశాలు సహితం అనేక సందర్భాలలో రాజ్యం వెనుక ప్రజలను సమీకరించడానికి విప్లవ ఉత్తేజం కంటె 'తనవాళ్లు - పరాయివాళ్లు' అనే జాతీయతా భావాన్ని ఎక్కువగా వాడుకున్నాయి. ప్రపంచంలో మానవ సమూహాల మధ్య దూరాలు తగ్గిపోయి ఇప్పటిదాకా వేరు వేరుగా బ్రతుకుతున్న జాతులు ఒకదాని కొకటి ఎన్నడూ లేనంత

దగ్గర అవుతున్నాయి. జాతి విద్వేషం బాగా పెరగడానికి దీని నుండి అవకాశం ఏర్పడింది. దాని అవసరం ఆయా దేశాలలో ఆధిపత్యం చలాయిస్తున్న వర్గాలకు, ప్రపంచ పెట్టుబడికి ఉంది. ఈ విద్వేషానికి వ్యతిరేకమైన ప్రజాతంత్ర సంస్కృతి లేనేలేదని కాదు. అందరినీ సమంగా ప్రేమించడం అనేది ఏనాడయినా - క్రీస్తు చెప్పినా, సూఫీలు చెప్పినా - మానవతా భావనలో భాగమే. ఆధునిక ప్రజాతంత్ర సంస్కృతిలో కూడ ఈ విలువకు ప్రాముఖ్యం ఉంది. కానీ విద్వేషాన్ని అధిగమించడానికి, ఇప్పటికింకా ఇదంతా సరిపోదు. ఆ సంగతి రోజూ చూస్తూనే ఉన్నాము.

శాక్కో, వాంజెట్టీలు ఇటాలియన్లు కాకపోయినట్లయితే, వాళ్లు అరాచక వాదులయినా కమ్యూనిస్టులే అయినా వారికి ఇంత అన్యాయం జరిగి ఉండేదా? ఏదో ఒక దశలో ఒక న్యాయమూర్తయినా ఒక అధికారి అయినా జోక్యం చేసుకునే వారు కాదా? అమెరికా సమాజంలోనే వీరి ఉరిశిక్ష విషయంలో వచ్చిన వ్యతిరేకత కంటె ఎక్కువ వ్యతిరేకత వచ్చి ఉండేది కాదా? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పడానికి పెద్దగా కష్టపడనవసరం లేదు. అమెరికా పాలక వర్గం, రాజ్యాంగ యంత్రం, కరడు గట్టిన కమ్యూనిస్టు వ్యతిరేకులయిన జడ్జి థేయర్ వంటి వారి విషయం వేరే. వాళ్లకు శాక్కో, వాంజెట్టీలు, ఇటాలియన్లయినా ఇంగ్లీషు మాట్లాడే అమెరికన్లయినా ఒకటే అయి ఉండవచ్చు. బోల్షివిజం ప్రభావం గురించి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ నిజంగానే చాలా భయపడిన రోజులవి. అయితే రాజ్యాంగయంత్రం సమాజ ఆమోద అనామోదాలతో నిమిత్తం లేకుండా పని చేయజాలదు. అది సహజంగా లభించకపోతే పనిగట్టుకొని కల్పించవలసి ఉంటుంది. పత్రికా స్వేచ్ఛ, సమాచార స్వేచ్ఛ, బహిరంగ నేరవిచారణ హక్కులుగా ఉన్న అమెరికా వంటి దేశాలలో అది మరీ అవసరం. నిర్బంధానికీ అణచివేతకూ సామాజిక ఆమోదం ఉన్నా, లేక కల్గించగలిగినా, రాజ్యాంగ యంత్రం తన పని సులభంగా చేసుకుపోగలుగుతుంది.

ఏ తిరుగుబాటుదార్ల పైనయినా ద్వేషాన్ని కల్గించడానికి మనుషులలోని మామూలు అభద్రతా భావాన్ని వ్యవస్థలు వాడుకుంటాయి. పైగా ఈ కేసు సందర్భంగా అరాచక వాదులు, వారి సానుభూతిపరులు తమ నిరసనను అనేక బాంబు దాడుల రూపంలో వ్యక్తం చేసారు కాబట్టి ప్రజలలోని అభద్రతా భయాన్ని వాడుకోవడం ఎట్లాగూ సులభమే అయ్యేది. అయితే ఈ తిరుగుబాటుదారులు విజాతీయులు కావడం రాజ్యం కర్తవ్యాన్ని మరింత సులభతరం చేసింది.

ఇటాలియన్లయిన శాక్కొ, వాంజెట్టీలు అక్కడ బ్రతుకు తెరువు లేక అమెరికా వచ్చి ఇక్కడ పని సంపాదించుకొని హాయిగా తింటూ యుద్ధమొచ్చినప్పుడు మాత్రం ఈ దేశం పట్ల కనీస భక్తి ప్రదర్శించకుండా శాంతివాదులమంటూ తప్పించుకు తిరిగారన్న అభియోగాన్ని ప్రాసిక్యూటర్ నేర్పుగా వాడుకుంటాడు. దానికీ వారిపైన ఉన్న కేసుకూ ఏమీ సంబంధం లేదు. అయితే జూరర్ల మనస్సులో విజాతీయుల పట్ల మామూలుగా ఉండే పరాయి భావనను వాడుకొని దేశాభిమానాన్ని రెచ్చగొట్టడానికి ఇది బాగా ఉపయోగపడింది. కార్మిక వర్గానికీ దిగువ మధ్యతరగతికీ చెందిన జూరర్లు ప్రాసిక్యూషన్ కేసుకున్న బలాబలాలతో నిమిత్తం లేకుండా విజాతీయ వ్యతిరేక దేశ దురభిమానం ప్రభావంలో శాక్కొ, వాంజెట్టీలు నేరస్తులేనని నిర్ధారించగలిగారు.

ఈ అసందర్భమైన దేశదురభిమానం మొత్తంగా అమెరికా సమాజంలో నెలకొనడం వల్లనే ఆ తరువాతి దశలో కూడ తమ విధి నిర్వహణలో కనీస ప్రజాతంత్ర దృక్పథం కనబరచవలసిన అవసరం న్యాయమూర్తులకూ పత్రికా సంపాదకులకూ లేకుండా పోయింది. 'ప్రజలేమనుకుంటారో' అని భయపడవలసిన అవసరం వారికి లేకుండా పోయింది. నిజానికి, ప్రజాతంత్ర దృక్పథం కనబరిస్తేనే 'ప్రజలేమనుకుంటారో' అని వారు బెదిరిపోవలసి వచ్చింది. కాబట్టే ఉదారవాదులుగా పేరు పొందిన కొందరు అమెరికా న్యాయమూర్తులు సహితం శాక్కొ, వాంజెట్టీల పిటిషన్లు ఆమోదించడానికి సిద్ధపడనట్టున్నారు. (కాదనుకుంటే, ఉదారవాదులుగా వారికుండే ప్రతిష్టనే మనం శంకించవలసి ఉంటుంది.) న్యాయం కోసం ధైర్యం చేసి మాట్లాడిన వారు - పత్రికలు, న్యాయశాస్త్ర కోవిదులు, కార్మికులు, మామూలు ప్రజలు - చాలామందే ఆనాటి అమెరికాలో ఉన్నప్పటికీ శాక్కొ, వాంజెట్టీల ప్రాణాలు కాపాడడానికి వారి పట్టుదల సరిపోలేదు.

ఈ కథను ఇంకొక కోణం నుండి చూద్దాం. శాక్కొ, వాంజెట్టీలు అమెరికా సమాజంలో అసమ్మతి వాదులు. పాలక వర్గంలో అసమ్మతి వాదులు కారు. వ్యవస్థ లోపలి అసమ్మతివాదులు కారు. వాళ్లు వ్యవస్థకే అసమ్మతివాదులు. దోపిడీ, అసమానత, హింస లేని సమాజం నెలకొల్పాలనేది వాళ్ల లక్ష్యం. ఆ నూతన వ్యవస్థ స్వరూపం ఎట్లాంటిదో వాళ్లకు తెలియకపోవచ్చు. దానిని ఎట్లా నెలకొల్పాలో తెలియక పోవచ్చు. కమ్యూనిస్టుల నమూనాయే 70 సంవత్సరాల ప్రయోగం తర్వాత సందేహాస్పదంగా తయారయింది. అరాచక వాదులకు ఆ మాత్రం నమూనా కూడా ఏ రోజూ లేదు. అయినప్పటికీ వారి అసమ్మతి అమెరికా రాజ్యాంగ యంత్రం

దృష్టిలో చిన్న విషయం కాదు. 1920ల చివరి దాకా 'విప్లవం' అనేది ఈ రోజో రేపో సిద్ధించే మార్పనే ఉత్సాహం యూరప్‌లో ప్రబలంగా ఉండింది. పాలక వర్గాలలో దానికి తగిన భయం కూడా ఉండింది. 'విప్లవం' రావాలంటే ఎన్ని అడ్డంకులున్నాయో ఎవరికీ అర్థం కాని ఆ రోజులలో (ఈ రోజయినా అర్థం చేసుకోవడానికి అందరూ సిద్ధంగా ఉన్నారని కాదు) బోల్షివిజం ప్రపంచమంతటినీ త్వరలో ఆక్రమించేసుకుంటుందని పెట్టుబడిదారులూ ఇతర సంప్రదాయవాదులూ నిజంగానే భయపడ్డారు. ఇటువైపు విప్లవాన్ని ఆహ్వానించిన వారిలో ఉత్సాహం, సంఘీభావం చెప్పుకోదగ్గ మోతాదులో ఉన్నాయి. ఆ వాతావరణం దాదాపు మృగ్యమయిపోయిన ఈ రోజు మనం దానిని ఊహించుకొని అనుభూతి చెందవలసిందే. శాక్కో, వాంజెట్టీల కథలో రాజ్యం నిర్దాక్షిణ్యతకే కాక విప్లవాభిమానుల ప్రపంచవ్యాప్త సంఘీభావానికి కూడా ఉదాహర ణలు కనిపిస్తాయి.

తన ఉనికికే ప్రమాదకరమని తాను - వాస్తవికంగానో, అవాస్తవికంగానో - నమ్మిన అసమ్మతివాదుల విషయంలో రాజ్యం చాలా నిర్దాక్షిణ్యంగా ఉంటుంది. తన సమాజంలో మామూలుగా ఆదరించే విలువలను సహితం తృణీకరించి వారిని శిక్షిస్తుంది. న్యాయవిచారణలో నిష్పాక్షికంగా సాక్ష్యాన్ని మదింపు వేయవలసిన న్యాయమూర్తి ఆ నిష్పాక్షికత పాటించడు. ముద్దాయిలపైన జూరీలో అప్రస్తుతమయిన ద్వేషాన్ని రెచ్చగొట్టడం తప్పని తెలిసీ ప్రాసిక్యూటర్ ఆ పనే చేస్తాడు. ముద్దాయిలపైన కేసేదీ లేదని నమ్మే పోలీస్ అధికారిని తొలగించి, ముద్దాయిల రాజకీయాల పట్ల కసి ఉన్న పోలీస్ అధికారి చేత నేరపరిశోధన జరిపిస్తారు. కోర్టులో సత్యం చెప్పక తప్పదని తెలిసీ, సత్యం చెప్పిన వారి ఉద్యోగాలు పీకి వేయిస్తారు.

ఇది అందరికీ తెలిసిన ఒక రాజకీయ సత్యమే. రాజ్యహింస గురించి మనకు అనుభవం లేకపోలేదు, అవగాహన అసలే లేకపోలేదు. కానీ ఈ సత్యాన్ని గురించి మనం ఎంతగా ఆందోళన చెందాలో అంతగా చెందుతున్నామా? చాలా మంది దృష్టిలో రాజ్యహింస అనేది మానవ అస్తిత్వానికి సంబంధించిన ఒక మౌలిక సమస్య కాదు. అది కేవలం 'ప్రస్తుత వ్యవస్థ'లో ప్రజలు, ప్రజా ఉద్యమాలు ఎదుర్కొనే సమస్య. రేపు రాబోయే ప్రజారాజ్యంలో రాజ్యమే సమాజాన్ని విప్లవీకరించే సాధనం కాబట్టి అప్పుడు జరిగే రాజ్యహింసను విప్లవం అనాలి. ఆ తరువాత రాజ్యమే అదృశ్యమయి పోతుంది కాబట్టి రాజ్యహింస కూడ దానితో బాటు అదృశ్యమయి పోతుంది.

మనిషి సంఘ జీవితాన్ని నియంత్రించడానికి ఉత్పన్నమయిన వ్యవస్థలలో రాజ్యం ఒకటి. ఈ నియంత్రణ అనే అవసరం వర్గ సమాజం చేత కృత్రిమంగా కల్పించబడినది కాదు. సంఘ జీవితానికి అదెప్పుడయినా అవసరమే. అయితే సమాజంలో అసమానతలు, ఆధిపత్యం ఉన్నంత కాలం ఈ నియంత్రణ అనేది నిష్పాక్షికంగా, సమాజానికి అతీతంగా జరగదు. అది సమాజంలో కొందరి పక్షాన మరికొందరిని నియంత్రించే స్వభావాన్ని సంతరించుకుంటుంది. అసమానతలు, ఆధిపత్యం పోవాలని మనం కోరుకున్నట్టే సామాజిక జీవితానికి రాజ్యం అనే ఒక బాహ్య నియంత్రణాధికారి అవసరం లేకుండా సమాజం స్వయం నియంత్రితం కావాలని కూడా కోరుకుంటున్నాము. మనుషులు తమ ముందు ఉంచుకున్న అనేక ఉన్నత ఆదర్శాలలో ఈ రాజ్యరహిత సమాజం ఒకటి. దానినొక ఆదర్శంగా కాక ఒక చారిత్రక దశగా అర్థం చేసుకోవడం వల్ల ఆ చారిత్రక దశను అందుకోవడానికి జరిగే విప్లవ కృషిపైన ప్రస్తుత వ్యవస్థ ప్రయోగించే హింసే ప్రామాణికమైన రాజ్యహింస అయింది. ఆ తరువాత రాజ్యమే ఉండదు కాబట్టి రాజ్యహింస గురించి ఇంతకంటే ఎక్కువ ఆలోచించవలసిన అవసరం లేకుండా పోయింది.

అంతే కాదు. రాజ్యం ప్రయోగించే హింసను అసమాన వ్యవస్థలో నియంత్రణాధికారానికి ఉండే ఒక లక్షణంగా గుర్తించే బదులు రాజ్యం అంటేనే హింస అని సిద్ధాంతీకరించడం జరిగింది. దీని ఫలితంగా రాజ్యం నిర్వహించే నియంత్రణా కర్తవ్యంలోని ఇతర అంశాలు లెక్కలోకి రాకుండా పోయాయి. దీని పర్యవసానంగా కమ్యూనిస్టు పాలనలోని రాజ్యాలు ఆ ఇతర కర్తవ్యాలను కూడా హింసాత్మకంగానే నిర్వర్తించినా విమర్శించే మార్క్సిస్టులు లేకుండా పోయారు. రాజ్యం అంటేనే హింస అనే సిద్ధాంతం కమ్యూనిస్టు పాలిత రాజ్యాలలో సర్వత్రా అలుముకున్న అనాగరికమైన హింసను సమర్థించుకోవడానికి పనికొచ్చింది.

ప్రస్తుత విషయానికి తిరిగి వద్దాము. శాక్కో, వాంజెట్టీలకు జరిగిన అన్యాయాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? అది కేవలం అమెరికా పెట్టుబడిదారీ రాజ్యంలో ప్రజాస్వామ్యానికుండే పరిమితులను (లేక దాని 'అసలు స్వరూపాన్ని') ఎత్తిచూపించే వికారమైన ఉదంతమా? కానీ ఇరవయ్యవ శతాబ్దంలో శాక్కో, వాంజెట్టీలు కోకొల్లలు. అన్ని దేశాలలోనూ రాజకీయ అసమ్మతిని సహించని రాజ్యహింసకు బలయిన ఉద్యమకారులు వేల సంఖ్యలో ఉన్నారు. అమెరికాలో కమ్యూనిస్టులు, భారతదేశంలో కమ్యూనిస్టులే కాక కాశ్మీరీ పంజాబీ నాగా మిజో జాతీయవాదులు,న సోవియట్ రష్యా, చైనా వంటి కమ్యూనిస్టు పాలిత దేశాలలో

పాలక పార్టీతో గానీ దాని అగ్రనాయకునితో గానీ విభేదించిన వారు, అన్ని మూడవ ప్రపంచ దేశాలలోనూ సరిహద్దు ప్రాంతాలలో నివసించే అల్ప సంఖ్యాక జాతీయులు - ఇటువంటి శాక్కో, వాంజెట్టీలు ఈ శతాబ్దంలో నిజంగానే కోకొల్లలు.

సోషలిస్టు దేశాలలోని శాక్కో, వాంజెట్టీల గురించే కొంచెం సేపు మాట్లాడుకుందాం. వ్యక్తుల కథలు కాదు, దాని సిద్ధాంత మూలాల గురించి మాట్లాడుకుందాం. రాజ్యరహిత సమాజంతో సహా అన్ని సమసమాజ ఆదర్శాలు ఒక చారిత్రక దశలో సాధ్యం అవుతాయనీ, ఆ చారిత్రక దశను సాధించడంలో రాజ్యమే ఒక సాధనంగా పని చేస్తుందనీ సిద్ధాంతీకరించడంలోనే లోపం ఉంది. దానికి మూలం మార్క్స్‌లోనే ఉంది. ఆయన ఆలోచనలకు ఆయన అనుచరులు ఇచ్చిన వికృత రూపం మార్క్స్‌కు ఆమోదనీయం అయి ఉండేది కాదు. ఆయన బ్రతికి ఉంటే దానిని గట్టిగా వ్యతిరేకించి ఉండేవాడు. కానీ దాని తాత్విక మూలం ఆయన రచనలలోనే ఉంది. కార్మికవర్గం పెట్టుబడిదారుల ఆస్తులను స్వాధీనం చేసుకొని కార్మిక రాజ్యాన్ని నెలకొల్పి సమష్టి ఉత్పత్తి వ్యవస్థను రూపొందిస్తుందనీ, అక్కడితో ఇప్పటివరకు మానవజాతి కన్న అన్ని కలలనూ సఫలం చేసే ప్రాతిపదిక ఏర్పడుతుందనీ మార్క్స్ సిద్ధాంతీకరించాడు. కార్మికవర్గం ఒక దశ వరకు సోషలిజం పట్ల కొంత ఉత్సాహం చూపించినప్పటికీ అది ఈ మహత్తర కర్తవ్యాన్ని తన మీద వేసుకునేటట్టు కనిపించడం లేదని గమనించిన కమ్యూనిస్టులు ఆ కర్తవ్య పూరణను తమ బాధ్యతగా నెత్తిన వేసుకొని తామే కార్మిక వర్గమైనట్టు వ్యవహరించడంతో మార్క్స్ ఆలోచనల వక్రీకరణకు పునాది పడింది. ఈ కమ్యూనిస్టు పార్టీలలో కొన్నిటికి తక్కువ ప్రజా పునాది ఉండి ఉండవచ్చు, కొన్నిటికి ఎక్కువ ఉండి ఉండవచ్చు. కానీ అవి నెలకొల్పినవి కమ్యూనిస్టు పార్టీ నియంతృత్వాలే తప్ప కార్మికవర్గ నియంతృత్వాలు కావు.

ఈ విధంగా నెలకొన్న 'కార్మిక రాజ్యాల'న్నీ ఒకటి రెండు తరాలలో దిగజారాయి. అవి 'దిగజారిన కార్మిక రాజ్యాలు'గా మారిపోయాయని ట్రాట్స్కీవాదులు, 'బూర్జువా రాజ్యాలు'గా మారిపోయాయని మావోయిస్టులు, కరడు గట్టిన బ్యూరోక్రాట్ రాజ్యాలుగా మారిపోయాయని కొంతమంది మార్క్సిస్టు మేధావులు సిద్ధాంతీకరించారు. ఏ పేరు పెట్టినా అవన్నీ దిగజారాయనేది అందరూ ఒప్పుకుంటున్న సత్యం.  అధికారం రుచి మరిగిన కమ్యూనిస్టులందరూ రివిజనిస్టులు. కాకపోతే రెనెగేడ్లు, కాకపోతే బ్యూరోక్రాట్‌లు అయ్యారు. ఏదయినా ఒక విషయం

మన అనుభవంలో క్రమం తప్పకుండా పదే పదే జరిగితే అక్కడొక సూత్రం ఇమిడి ఉందని భావించడం శాస్త్రీయ దృక్పథం. కానీ ఈ విషయంలో మాత్రం మార్క్సిస్టులు శాస్త్రీయ దృక్పథాన్ని అనుసరించదలుచుకోలేదు. రాజ్యరహిత సమాజం నిర్మించమని చెప్పి సంపూర్ణ రాజ్యాధికారం ఒకరి చేతిలో పెడితే వాళ్లు రాజ్యరహిత సమాజాన్ని నిర్మించే బదులు ఒక నూతన నిరంకుశ రాజ్యాన్ని నిర్మించే ప్రమాదం ఉంది అనే సూత్రాన్ని ఇరవయ్యవ శతాబ్దపు కమ్యూనిస్టు ప్రయోగం చరిత్ర నుండి గుణపాఠంగా స్వీకరించవలసి ఉంటుంది. (ఈ పతనానికి కారణం అధికారం రుచి తలకెక్కడం మాత్రమే అనుకోనవసరం లేదు. ఆ విశ్లేషణలోకి పోవడానికి ఇది సందర్భం కాదు.)

అటువంటప్పుడు ఆ పతనాన్ని ఎదుర్కోవడానికి అవసరమైన ప్రజాస్వామ్యం ప్రజలకు లేకపోవడం ప్రమాదకరం అని కూడా అంగీకరించవలసి ఉంటుంది. కానీ విప్లవం పేరిట రాజ్యానికి సర్వాధికారాలూ ఇచ్చేసి ఆ రాజ్యమే రాజ్యరహిత సమాజాన్నీ కమ్యూనిజాన్నీ నిర్మించే సాధనం అని సిద్ధాంతీకరించిన తరువాత ఆ రాజ్యం దిగజారిందని చెప్పి దానిపైన పోరాటం చేయడానికి ప్రజలకు ప్రజా స్వామ్యం కావాలంటే ఎక్కడినుండి వస్తుంది? కార్మిక రాజ్యం పతనమై బూర్జువా వ్యవస్థను పునరుద్ధరించింది కాబట్టి బూర్జువా ప్రజాస్వామ్యాన్ని కూడా పునరుద్ధ రించాలని డిమాండ్ చేయాలా? ప్రజాస్వామ్యాన్ని గురించి ఇంత కృత్రిమంగా ఆలోచించవలసిన అవసరం ఏముంది?

సమసమాజ సాధనకు సంబంధించిన మార్క్స్ సూత్రీకరణలను ఇంకొంచెం లోతుగానే ప్రశ్నించడం అవసరం. సమానత్వం, సమష్టి జీవితం, రాజ్యరహిత సమాజం మొదలయిన సమసమాజ ఆదర్శాలన్నిటికీ ప్రాతిపదిక కల్పించే 'పునాది' ఒకటేదయినా ఉండగలదా? సమష్టి ఉత్పత్తి వ్యవస్థ దానికి పునాది కల్పిస్తుందని మార్క్స్ భావన. కానీ అన్ని సమసమాజ ఆదర్శాలూ తీరిన తరువాతే సమష్టి ఉత్పత్తి వ్యవస్థ సాధ్యం అవుతుంది. అన్ని రకాల అసమానతలు, అరమరికలు పోనిదే మనుషులు తమ ఉత్పత్తి క్రియను సమష్టిగా నిర్వహించుకునే వ్యవస్థ సాధ్యం కాదు. కమ్యూనిస్టు భావనలోని ఆదర్శాలలో ఏ ఒక్కటీ వేరే ఏ ఒక్కదానికీ ప్రాతిపదిక కాదు, పర్యవసానం కాదు. అన్నీ ఒక క్రమంలో సాధ్యం కావలసినవే (అసలు సాధ్యం అంటూ అయితే.) ఈ క్రమంలో సామాజిక ఆర్థిక సమానత్వం కోసం

పోరాటాలు, నూతన సామాజిక సంస్కృతి కోసం జరగవలసిన కృషి కలగలసి జరగవలసి ఉంటుంది. ఆ సంస్కృతిలో ఒక అంశం, రాజ్య నియంత్రణ స్థానంలో సమాజ స్వయం నియంత్రణను నెలకొల్పడం.

సమసమాజ ఆదర్శాల కోసం పోరాటాలు, సాంస్కృతిక కృషి అనంతంగా సాగుతూనే ఉంటాయి. ప్రతీ చారిత్రక దశలోనూ సమాజం కొంత ప్రగతిని సాధించి ఒక రూపంలో వ్యవస్థితమవుతుంది. అది తీసుకునే రూపం ఆపైన ప్రగతినీ అభ్యుదయాన్నీ సాధించడానికి ఏ మేరకు అవకాశం కల్పిస్తే ఆ మేరకు మాత్రమే అభ్యుదయం నిరాటంకంగా సాగుతుంది. అంతకు మించిన అభ్యుదయాన్ని ఆ వ్యవస్థను కాపాడే రాజ్యం ప్రతిఘటిస్తుంది. దానిని సాధించదలచుకున్న వాళ్లు రాజ్యంపైన పోరాడవలసి ఉంటుంది. రాజ్యహింసను ఎదుర్కోవలసి ఉంటుంది. ఏదయినా ఒక చారిత్రక దశలో నెలకొన్న రాజ్యానికి 'కార్మిక రాజ్యం' లేక 'ప్రజారాజ్యం' అని పేరు పెట్టి, ఆ రాజ్యం రాజ్యరహిత సమాజాన్ని నిర్మించి తాను పక్కకు తప్పుకుంటుందని సిద్ధాంతం చేసి, సకల చారిత్రక సద్గుణాలకు అది ప్రతిబింబం అని చెప్పి దాని చేతిలో నియంతృత్వ అధికారాలు పెట్టడం చాలా ప్రమాదకరం. ప్రతీ దశలోనూ రాజ్యాన్నీ ప్రభుత్వాన్నీ ధిక్కరించే స్వేచ్ఛ ప్రజలకు ఉండాలి. రాజ్యం వ్యవహారాలు ప్రజలకు తేటతెల్లంగా తెలియాలి. రాజ్యం సహించడానికి సిద్ధంగా లేని ప్రగతి కోసం ఆచరణకు పూనుకునే స్వేచ్ఛ ప్రజలకు ఉండాలి. అటువంటి ఆచరణకు పూనుకునే వాళ్లను దేశ భద్రత పేరిటనో విప్లవం పేరిటనో అణచివేసే అధికారం రాజ్యానికి ఉండడానికి వీలులేదు.

కమ్యూనిస్టు పాలిత దేశాల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని 'సోషలిజంలో ప్రజాస్వామ్యం' అనే అంశం మీద కొంత కాలంగా చర్చ జరుగుతూ ఉంది. (మన దగ్గర కాదనుకోండి) ఆ దేశాలలో ప్రజలెవ్వరికీ రాజ్యం వెలుపల స్వేచ్ఛ లేదు. (స్టాలిన్ పాలనలో రాజ్యం లోపల కూడా స్వేచ్ఛ లేదు) తిరోగమనానికే కాక పురోగమనానికి కూడా కమ్యూనిస్టుపాలకులు స్వేచ్ఛ ఇవ్వలేదు. ఆ రాజ్యమే పతనమయినప్పుడు ఇది సమస్యాత్మకంగా తయారయింది. దీనిని దృష్టిలో ఉంచుకొని సోషలిస్టు వ్యవస్థలో ప్రజా వ్యతిరేకులకు ప్రజాస్వామ్యం ఉండకూడదు గానీ ప్రజలకు ఉండాలనీ, అసత్యానికి స్వేచ్ఛ ఉండకూడదు గానీ సత్యానికి ఉండాలనీ కొన్ని ప్రతిపాదనలు ముందుకొస్తున్నాయి. ఇది విన ముచ్చటయిన పరిష్కారం. పైగా కొత్తది కూడా కాదు. లెనిన్ కాలంలోనే రోజాలగ్జెంబర్గ్ బోల్షివిక్‌ల నియంతృత్వ వైఖరిని నిరసిస్తూ

కార్మిక వర్గానికి పార్టీ వెలుపల కూడా స్వేచ్ఛ ఉండాలనీ, కార్మిక వ్యతిరేక శక్తులను మాత్రం నిర్దాక్షిణ్యంగా అణచి వేయాలనీ అనింది. ఇది వినడానికి బాగానే ఉంటుంది కానీ ఎవరు ప్రజలు, ఎవరు ప్రజాద్రోహులు, ఏది సత్యం, ఏది అసత్యం, ఏది కార్మికవర్గ దృక్పథం, ఏది కార్మిక వ్యతిరేక దృక్పథం అని తేల్చేది ఎవరు?

స్వేచ్ఛను అనుమతించవలసిన వాళ్లే తాము ఎవరికి అనుమతించేదీ నిర్ణయిస్తారు. అంటే రాజ్యమే నిర్ణయిస్తుంది. కానీ మనం చర్చిస్తున్నది రాజ్యం దిగజారితే ఏమవుతుంది అన్న ప్రశ్నను కదా? అప్పుడు వాళ్లు ఏ సత్యాన్ని అనుమతిస్తారు? దేనిని అసత్యంగా గుర్తిస్తారు? వాళ్లు చెప్పేదే కార్మిక వర్గ దృక్పథం. తక్కినదేదయినా కార్మిక వ్యతిరేకం. దానికి స్వేచ్ఛ ఉండదు. దానిని అనుసరించే వాళ్లకు ప్రజాస్వామ్యం ఉండదు. అప్పుడేమవుతుంది? సిద్ధాంతరీత్యానే సకల చారిత్రక సద్గుణాలు, విజ్ఞత కార్మికరాజ్యానికి ఆపాదించబడ్డాయి కాబట్టి ఆ రాజ్యానికి వెలుపల సత్యం ఎక్కడిది, జ్ఞానం ఎక్కడిది? ఆ రాజ్యానికి వెలుపల ఉండేదంతా తిరోగమనమే అయినప్పుడు దానికి స్వేచ్ఛ ఎక్కడిది?

నిజానికి పతనావస్థ దాకా పోనక్కర లేదు. రాజ్యాధికారం చేతిలో ఉన్నవాళ్లు ఇంకా అభ్యుదయవాదులుగానే ఉంటూ కూడా తమ ఆదేశాలతో విభేదించే వాళ్ల పట్ల అసహనాన్ని ప్రదర్శించవచ్చు. అధికారం మనుషులలో పెత్తందారీ లక్షణాలు కల్గించడానికి వారు పూర్తిగా దిగజారనవసరమేమీ లేదు. తమ అవగాహనకు అప్పటికింకా అందని విషయాల పట్ల వారు అసహనాన్ని ప్రదర్శించవచ్చు. కానీ అవే నిజానికి ప్రగతిశీల భావాలు కావచ్చు. తాము నిర్దేశించిన విప్లవ పంథాకు వ్యతిరేకంగా చేపట్టే రాజకీయ ఆచరణను ప్రత్యామ్నాయ రాజకీయచరణగా గుర్తించక ప్రజా వ్యతిరేక పంథా అని దూషించవచ్చు. కమ్యూనిజం సాధనకు సంబంధించిన ప్రత్యామ్నాయ అవగాహనలన్నిటినీ ప్రజా వ్యతిరేక కార్యకలాపాలుగా చిత్రీకరించి అణచివేసిన ఉదాహరణలు ఈ శతాబ్దపు కమ్యూనిస్టు పాలనలలో కోకొల్లలు.

శాక్కొ, వాంజెట్టీలనే తీసుకుందాం. వాళ్లు 'ప్రజల' కిందికి వస్తారా, 'ప్రజా ద్రోహులు' కిందికి వస్తారా? వాళ్లకు ఒక కమ్యూనిస్టు పాలిత రాజ్యంలో ఇంతకంటే న్యాయం జరిగి ఉండేదా? వాళ్లు అరాచక వాదులు. వాళ్లు రాజ్యాన్ని ద్వేషిస్తారు. బూర్జువా రాజ్యాన్నే కాదు, కమ్యూనిజం సాధన కోసం ఏర్పడిన కార్మిక రాజ్యాన్ని

కూడ ద్వేషిస్తారు. దానికి వ్యతిరేకంగా ప్రజలను 'రెచ్చగొడతారు.' మరి కమ్యూనిస్టు ప్రభుత్వం వాళ్లను ప్రజా ద్రోహులుగా చూస్తుందా, లేక ఒక ప్రత్యామ్నాయ విముక్తి మార్గాన్ని అనుసరించే తోటి విప్లవకారులుగా గుర్తిస్తుందా? వాళ్లు యుద్ధంలో పాల్గొనరు. యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజలలో ప్రచారం చేస్తారు. కానీ కమ్యూనిస్టు ప్రభుత్వం సామ్రాజ్యవాదం పేరు మీదనో ఇంకేదో పేరు మీదనో యుద్ధాలు చేస్తూనే ఉంటుంది. దానిలో పాల్గొనవద్దని ప్రజలను రెచ్చగొట్టే అరాచకవాదులు దేశద్రోహులా, లేక ప్రత్యామ్నాయ రాజకీయ కార్యకర్తలా? బూర్జువా వ్యవస్థలాగే కమ్యూనిస్టు పాలనకు కూడా అరాచకవాదులు అసమ్మతి వాదులు. వ్యవస్థ లోపలి అసమ్మతి వాదులు కారు, వ్యవస్థకే అసమ్మతి వాదులు.

శాక్కొ, వాంజెట్టీలకు అమెరికాలో ఎంత అన్యాయం జరిగిందో వారి వంటి అరాచకవాదులకు (రష్యాలో వీరిని సోషల్ రెవల్యూషనరీలు అనే వారు) అన్ని కమ్యూనిస్టు పాలిత దేశాలలోనూ అంతే అన్యాయం జరిగింది. వారిని పాలక కమ్యూనిస్టు పార్టీలు దేశద్రోహులుగా, విప్లవ విద్రోహులుగా చిత్రీకరించాయి. లెనిన్ ప్రభుత్వం అరాచకవాదులను తీవ్రంగా అణచివేసిందని వాంజెట్టీ అంటాడు. అమెరికాలో శాక్కొ, వాంజెట్టిలకు కనీసం ఒక డిఫెన్స్ కమిటీ ఏర్పడింది. కోర్టులో కొట్లాట జరిగింది. బయట సంవాదం జరిగింది. వారి కథ చరిత్రకెక్కింది. వాళ్లు అన్యాయంగా చనిపోయినా అనామకంగా చనిపోలేదు. రష్యాలో అటువంటి అవకాశమే లేదు. స్టాలిన్ హయాంలోనయితే బుఖారిన్ వంటి బోల్షివిక్ అగ్రనాయకులకే దిక్కులేదు. స్టాలిన్‌ను వ్యతిరేకించిన పాపానికి కోర్టులో చేతులు కట్టుకుని నిలబడి తాము సోషలిజానికి వ్యతిరేకంగా కుట్ర చేసామని ఒప్పేసుకొని శిక్షను ఆహ్వానించవలసి వచ్చింది. ఇంక ఒక చేపలమ్ముకునే వాడికీ, ఒక చెప్పులు కుట్టే వాడికీ దిక్కేముంటుంది?

ప్రజలకూ ప్రజాభ్యుదయానికీ ప్రజాస్వామ్యం వర్తిస్తుంది గానీ ప్రజాద్రోహులకు వర్తించదని సూత్రీకరిస్తే, ప్రజాభ్యుదయానికి అత్యున్నత ప్రతినిధి తానే కాబట్టి తనను వ్యతిరేకించే వాళ్లంతా ప్రజాద్రోహులేనంటుంది 'కార్మిక రాజ్యం'. తనకు వెలుపల స్వేచ్ఛ ఉండజాలదంటుంది. ఈ తర్కం ఫలితంగానే అన్ని కమ్యూనిస్టు పాలిత దేశాలలోనూ ప్రజలకూ, ప్రజా ద్రోహులకూ ఎవరికీ ప్రజాస్వామ్యం లేకుండా పోయింది. ఇది సమాజానికి నష్టకరంగా పరిణమించడానికి ఈ 'కార్మిక రాజ్యం' దిగజారి కమ్యూనిస్టు వ్యతిరేక రాజ్యంగా మారనవసరమేమీ

లేదు. అది ఇంకా అభ్యుదయ పంథాలో ఉంటూ ఉండగానే ఈ వైఖరి చాలా నష్టం కలిగించగలదు. అన్ని సమస్యలకూ పరిష్కారం ఏ ఒక్కరికో అర్థం అవుతుందనుకోవడం పొరబాటు. అన్ని విషయాలూ ఏ ఒక్కరికీ అనుభవం కావు. అవగాహన కావు. సృజనశీలత ఏ ఒక్కరిలోనూ ఎప్పటికీ ఇంకిపోకుండ ఉండదు. పైగా అధికారం నుండి పుట్టే జడత్వం, అసహనం ఎప్పటికయినా కొత్త ఆలోచనలకు ప్రతిబంధకంగానే ఉంటాయి. ఈ మేరకు సమస్యను మావో గుర్తించాడు. రాజ్యం ప్రజలను చైతన్యవంతులను చేసి తన వ్యవహారాలలో భాగస్వాములను చేయాలని గుర్తించాడు. రాజ్యం బ్యూరోక్రాటిక్‌గా మారిపోకుండా ఉండడానికి ఇది అవసరం అని గుర్తించాడు. కానీ ఇది రాజ్యం లోపలి స్వేచ్ఛే తప్ప రాజ్యం వెలుపలి స్వేచ్ఛ కాదు. రాజ్యమే రెండుగా చీలి ఒక భాగం తిరోగమనం వైపు, ఒకటి పురోగమనం వైపు నిలిచినప్పుడు తిరోగమనాన్ని 'బొంబార్డ్' చేయమని మావో అన్నాడు. అంతే తప్ప కార్మిక నియంతృత్వానికి వెలుపల ప్రజలకు స్వేచ్ఛ ఉండాలనేది మావో భావన కాదు. లెనిన్, ట్రాట్స్కీ, స్టాలిన్, మావో లెవ్వరూ కార్మికరాజ్యానికి వెలుపల ప్రజలకు స్వేచ్ఛ ఉండగలదని ఒప్పుకోలేదు. ఒక్క రోజా అగ్జెంబర్గ్ మాత్రమే కార్మిక రాజ్యానికి వెలుపల సహితం కార్మికులకు స్వేచ్ఛ ఉండాలనింది. కానీ ఎవరు కార్మికులు అనేది కార్మిక రాజ్యమే నిర్ణయిస్తుంది కాబట్టి ఇది సమస్యకు పరిష్కారం కాదు.

మరయితే ప్రజాస్వామ్యానికి ఏ పరిమితులూ ఉండకూడదా అని ఎవ్వరూ ఆవేశపడనవసరం లేదు. నిజానికి ఈ సమస్యకు సులభమైన పరిష్కారమేదీ లేదు. ప్రజాస్వామ్యానికి ఉండగల పరిమితుల గురించి, పరిధి గురించి బూర్జువా వ్యవస్థ కనీసం రెండు శతాబ్దాలుగా తన తాత్విక చట్రంలో చాలా చర్చ జరిపింది. రాజకీయ ప్రజాస్వామ్యం బూర్జువా వ్యవస్థతోనే పుట్టి కాలక్రమంలో చాలా ఎదిగింది. అది ఎదగడానికి అసమ్మతి ఉద్యమాలు చాలా దోహదం చేసాయి. బూర్జువా వ్యవస్థను తిరస్కరిస్తూనే రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ఒక నాగరికతా విలువగా గౌరవించిన వామపక్ష మేధావులు కూడా చర్చకు మేలు చేసారు. ఈ సంప్రదాయాన్ని సీరియస్‌గా తీసుకొని దానికున్న బూర్జువా పరిమితులను ఏ విధంగా తొలగించాలో ఆలోచించి సమసమాజ ఆదర్శాల సాధనకు అనుకూలంగా దానిని మలచుకోవడం అవసరం. ముందు బూర్జువా ప్రజాస్వామ్యం ఒక తిట్టు మాట కాదనీ, శాక్కొ, వాంజెట్టీల సమస్య 'ప్రస్తుత వ్యవస్థ'కు సంబంధించిన సమస్య మాత్రమే కాదనీ, రాజ్యరహిత

సమాజం ఒక ఆదర్శమే తప్ప మార్క్స్ ఊహించినట్టు 'మానవ చరిత్ర పూర్వదశ' (ది ప్రీహిస్టరి ఆఫ్ మాన్‌కైండ్) అంతాన సిద్ధించబోయే చారిత్రక దశ కాదనీ గుర్తించడం అవసరం.

బూర్జువా ప్రజాస్వామ్యం అనే భావనకు మార్క్సిస్టు సిద్ధాంత సంప్రదాయంలో ఉన్న స్థానాన్ని వివరంగా చర్చించడానికి ఇది సందర్భం కాదు. కానీ కొన్ని మౌలిక మయిన విషయాలను ప్రస్తావించాలి. బూర్జువా ప్రజాస్వామ్యం అనేది సారాంశంలో బూర్జువా నియంతృత్వానికి ఒక రూపం మాత్రమేననే లెనినిస్టు సూత్రీకరణను తిరస్కరించవలసి ఉంది. సంక్షోభ సమయంలో బూర్జువా పాలక వర్గాలు ప్రజా స్వామ్యాన్ని వదిలిపెట్టి నియంతృత్వాన్ని ఆశ్రయిస్తారనడం వేరు. సారాంశంలో బూర్జువా ప్రజాస్వామ్యం బూర్జువా నియంతృత్వమేననడం వేరు. రాజకీయ వ్యవస్థ ఆర్థిక వ్యవస్థను అనుసరించే ఉంటుందని అనుకున్నా, నియంతృత్వ రూపంలో కాక ఒక నిర్దిష్టమైన ప్రజాస్వామ్య రూపంలో పరిపాలించడమే బూర్జువా వ్యవస్థలో రాజ్యానికి తగిన రూపం. అయితే రాజకీయ వ్యవస్థలోనూ రాజ్యాంగ యంత్రంలోనూ ఉన్న విలువలన్నీ ఆర్థిక వ్యవస్థ అవసరాల కోసం పుట్టినవి కావు. మధ్యయుగాలలో ఫ్యూడల్ వ్యవస్థ ఏర్పరచిన ఆటంకాలు, అవరోధాల నుండి పెట్టుబడికి అవసరమయిన విముక్తి బూర్జువా విప్లవానికి ప్రధాన చోదక శక్తి అని ఒప్పుకుందాం. అయితే, ఈ భౌతిక అవసరం సమాజంలోని మనుషుల ఆలోచనలలో స్వేచ్ఛ, స్వతంత్రం, వివేచన, లౌకికత మొదలయిన విలువల రూపం తీసుకోవడంతో ఆ మార్పు కేవలం ఆర్థిక వ్యవస్థకు పరిమితం కాకుండా సమాజంలోని అన్ని రంగాలకూ విస్తరించింది. నిర్దిష్టమైన భౌతిక పరిస్థితుల నుంచి పుట్టే ఆలోచనలు సార్వత్రిక స్వభావం గల విలువల రూపం తీసుకోవడం మనిషి ఆలోచనా రీతికి ఉండే విలక్షణమయిన గుణం. ఈ గుణాన్నీ దాని పర్యవసానాలనూ జాగ్రత్తగా అధ్యయనం చేస్తే మార్క్సిజం లోని లోపాలను అర్థం చేసుకోవడానికీ సవరించడానికీ అవసరమయిన తాత్విక పరికరాలు దొరుకుతాయి. మానవ చైతన్యానికి ఉండే ఈ గుణం కారణంగా ఒక అవసరం నుంచి పుట్టిన ఆలోచన ఆ అవసరంతో నిమిత్తం లేని ఇతర జీవిత రంగాలపైన కూడా ప్రభావం వేయగలదు. మార్పును సాధించగలదు. అన్ని రంగాలలోనూ వచ్చిన మార్పులు చివరికి స్థిరీకరణ చెందేటప్పటికి పరస్పర సారూప్యత, సమన్వయం లేకుండా ఉండదు.

నిజానికి అన్ని రంగాలలోని మార్పులలోనూ తరచుగా ఒక సామాన్య తాత్విక సూత్రం అంతర్లీనంగా ఉంటుంది. అది ఆ వ్యవస్థ ప్రాపంచిక దృక్పథాన్ని

సూచిస్తుంది. అయితే వివిధ సామాజిక రంగాలలో వచ్చే మార్పు సరిగ్గా 'పునాది'కి అవసరమయిన మేరకు వచ్చి ఆగిపోనక్కర లేదు. ఆ రంగాలలో కృషి చేసేవారు అందుకోసం మాత్రమే కృషి చేయనప్పటికీ చివరికి 'పునాది'కి అనుగుణ్యమైన రూపంలోనే 'ఉపరితలం' మారుతుందనుకునే యాంత్రికమైన అవగాహనకూ, 'పునాది'లో పుట్టిన భౌతిక అవసరం విలువల రూపంలో, ఆదర్శాల రూపంలో వ్యక్తం కావడం వల్ల వివిధ ఇతర జీవిత రంగాలపైన కూడా ఆ విలువల దృష్టి ప్రసరించి పోరాటాలు, సంఘర్షణల ద్వారా అన్ని జీవిత రంగాలలోనూ తదనుసారం మార్పు వస్తుందనే అవగాహనకూ మౌలికమైన తేడాయే ఉంది. ఫ్యూడల్ నియంత్రణ నుండి పెట్టుబడికి అవసరమైన విముక్తి స్వేచ్ఛ, స్వతంత్రం, లౌకికత, వివేచన మొదలయిన విలువల రూపంలో వ్యక్తం కాబడం వల్ల ఆ విలువల చేత ప్రేరితమైన మానవ ఆచరణ వైవాహిక సంబంధం నుండి రాజకీయ వ్యవస్థ దాకా అన్ని రంగాలలోనూ మార్పును సాధించింది. ఈ మార్పంతా బూర్జువా ప్రాపంచిక దృక్పథానికి లోబడి ఉన్నప్పటికీ పెట్టుబడిదార్ల అవసరాలకు పరిమితమయి నిలిచిపోలేదు. ఆ మార్పుకు బూర్జువా పరిమితులున్నప్పటికీ అది కేవలం బూర్జువా వర్గ ప్రయోజనాలను కాపాడే మార్పు కాదు. విజ్ఞాన శాస్త్రం బూర్జువా వ్యవస్థ పరిధిలోనే మానవాళికి శాశ్వతంగా ఉపకరించగల జ్ఞానాన్నీ భౌతిక సంపదనూ సాధించినట్టే, స్వేచ్ఛ, స్వతంత్రం మొదలయిన విలువల వెలుగులో 'ఉపరితల' రంగాలలో సాధించిన మార్పు కూడా బూర్జువా ప్రాపంచిక దృక్పథం పరిధిలోనే మానవాళికి శాశ్వత నైతిక సంపదను సమకూర్చి పెట్టింది. ప్రజాస్వామ్య హక్కులు, ప్రజాస్వామ్య విలువలు, సంప్రదాయాలు దీనిలో ముఖ్యమైనవి. వీటికుండే బూర్జువా తాత్విక పరిమితులను తొలగించి సమసమాజం దిశగా, రాజ్యరహిత సమాజం దిశగా ఈ నైతిక సంపదను ఏ విధంగా కొనసాగించాలని ఆలోచించాలి తప్ప బూర్జువా ప్రజాస్వామ్యం అనే దాన్ని ఒక తిట్టు మాటగా ఉపయోగించి దానిలోని సాంస్కృతిక పురోగతిని తిరస్కరించే నియంతృత్వం ద్వారా రాజ్యరహిత సమాజం నెలకొం టుందనుకోవడంలో అర్థం లేదు.

బి. చంద్రశేఖర్ రాసిన 'శాక్కో-వాంజెట్టీ' పుస్తకానికి వెనకమాట
ప ర్ స్పె క్టి వ్స్ ప్రచురణ, నవంబర్ 1995

V

# తాత్విక మానవతావాదం లేని మార్క్సిజం అపరిపూర్ణం

"పిల్లలు తల్లిదండ్రులను ప్రేమిస్తూ పెరుగుతారు. ఎదిగే క్రమంలో వాళ్ళ తప్పొప్పుల్ని ఎంచుతారు. చాలా అరుదుగా మాత్రమే క్షమిస్తారు" అని ఆస్కార్ వైల్డ్ అంటాడు.

మనిషికి బాల్యం ఉన్నట్టే మనిషి ఆలోచనలకు కూడా బాల్యం ఉంటుంది. ఆ బాల్యంలో నమ్మే సత్యాలుంటాయి. ఎదిగే క్రమంలో ఆ నమ్మకాలలో ఎంత సత్యం ఉందో అర్థం చేసుకుంటాం. వాటిని క్షమించగలిగితే అదృష్టవంతులమే.

ఈ సంకలనంలోని వ్యాసాలు నేను ఒకప్పుడు రాసినవి. రాజ్య హింస గురించి, అణచివేత గురించి, వాటికి సంబంధించిన సంస్కృతి గురించి, వాటిని ప్రతిఘటించే ప్రజా చైతన్యాన్ని గురించి, మానవతా విలువల గురించి రాసినవి. వాటిని ఈ రోజు ఒక సంకలనంగా అచ్చు వేయడం వల్ల ప్రయోజనం ఉంటుందని ప్రచురణకర్తల అభిప్రాయం. అదేమో గానీ వాటి వెనుక ఉన్న తాత్విక వైఖరి గురించి నేను ఈ రోజు ఏమనుకుంటున్నానో రెండు ముక్కలలో చెప్పకపోతే నష్టం జరుగుతుందని మాత్రం అనుకుంటున్నాను. ఈ వ్యాసాలలోని ఆదర్శాలతోనూ విలువల తోనూ నాకు ఈ రోజు కూడ పేచీ లేదు (బహుశా ఎప్పటికీ ఉండదు). అందువల్ల నేను వాటిని 'డిసోన్' చేసుకోవడం లేదు. కానీ వాటిలోని తాత్విక దృక్పథంతో నేనీ రోజు సంతృప్తి చెందడం లేదు.

ఈ తాత్విక వైఖరి మార్క్సిస్టు సంప్రదాయానికి చెందినది. దానిని 'మార్క్సిజం' అనే బదులు 'మార్క్సిస్టు సంప్రదాయానికి చెందినది' అనడానికి ఒక కారణం ఉంది. మార్క్సిజం అనేది మార్క్స్ ఆలోచనలతో ప్రేరణ చెందిన వివిధ వామపక్ష తత్వవేత్తలు చేసిన ఆలోచనల సంగ్రహం. వారిలో కౌట్స్కీ, లెనిన్, గ్రామ్‌సీ, లగ్జెంబర్గ్‌ల వంటి కమ్యూనిస్టు నాయకులున్నారు; లూకాచ్, అల్తూజర్‌ల వలె కమ్యూనిస్టు పార్టీలో ఉంటూ ప్రధానంగా సాంస్కృతిక, తాత్విక రంగాలలో కృషి చేసిన వారున్నారు; ఏ కమ్యూనిస్టు పార్టీలోను ఎన్నడూ సభ్యులు కాకుండా (లేదా కమ్యూనిస్టు పార్టీలో ఇమడలేక బయటకు పోయి) సిద్ధాంత రంగంలో కృషి చేసిన వాళ్ళున్నారు. ఈ సంప్రదాయంలో ఒక స్రవంతి మార్క్సిజం-లెనినిజం. మన దగ్గర మార్క్సిజం పేరు మీద చాలామంది నమ్ముతున్న అభిప్రాయాలు ఈ స్రవంతికి చెందినవే. అందులో కూడ భిన్న వ్యాఖ్యానాలకు కొంత తావు ఉంది. అయినప్పటికీ మార్క్సిస్టు సంప్రదాయంలో భాగంగానే మార్క్సిజం-లెనినిజం అనే దానికి ఒక కచ్చితమైన స్వరూపం ఉంది. ఈ పుస్తకంలోని వ్యాసాలు ఆ తాత్విక స్రవంతికి చెందినవి. ఆ సంప్రదాయంలోనే వీటితో విభేదించేవాళ్ళు, ఇవే విషయాలను ఇంతకంటే భిన్నంగా వ్యాఖ్యానించేవాళ్లు ఉంటారనేది వేరే సంగతి.

మార్క్సిజం-లెనినిజం అనే సిద్ధాంత ధోరణితో సంతృప్తి చెందడం లేదంటే అర్థం మార్క్సిజం సంప్రదాయంలోని వేరే ఏదైనా వ్యాఖ్యానాన్ని దీనికంటే సంతృప్తి కరమైనదిగా భావించగలమనా? అది కూడ పూర్తిగా వాస్తవం కాదనుకుంటున్నాను.

బోల్షివిక్‌లు సోవియట్ రష్యాలో రాజ్యాధికారాన్ని నెలకొల్పిన తరువాత వారి ఆలోచనలే అసలైన మార్క్సిజం అనే అభిప్రాయం నెలకొనింది. అంతకు ముందు 'ఇదే అసలైన మార్క్సిజం' అని ఒకే ఒక అభిప్రాయాన్ని మార్క్స్ అనుయాయులందరికీ ప్రమాణంగా చలామణీ చేసే సత్తా ఎవరికీ లేదు. నిజానికి ఏది అసలయిన మార్క్సిజం అనే ప్రశ్నను అటుంచి ఒక వామపక్షవాది తన అభిప్రాయాలను మార్క్సిజం అని పిలుచుకోకపోతే అసలు వామపక్షవాదిగానే గుర్తింపు పొందకుండా పోయే పరిస్థితి అంతకుముందు లేదు. మార్క్స్ అప్పటికింకా ప్రవక్త కాడు. ఆయనదే ప్రామాణిక సోషలిస్టు సిద్ధాంతం కాదు. మార్క్సిజం అనేదే ఏకైక శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతమనీ, దానితో విభేదించడం (వామపక్ష దృక్పథంలో భాగంగానే విభేదించినా) పెటీ బూర్జువా ఆదర్శవాదమనీ, అంతిమ పరిశీలనలో ప్రజాద్రోహమనీ, మార్క్సిజం అంటే బోల్షివిక్ పార్టీ సిద్ధాంత దృక్పథమేననీ (దీనికే కాలక్రమంలో మార్క్సిజం-లెనినిజం అనే పేరు వచ్చింది) భావించడం,

దీనితో విభేదించే వాళ్లను కార్మిక ద్రోహులని అనడం బోల్షివిక్‌ల విజయం తర్వాతే మొదలయింది. ఒక సమాజంలో అధికారం ఎవరి చేతిలో ఉంటుందో వాళ్ల అభిప్రాయాలే అక్కడ సత్యంగా చలామణీ అవుతాయని వేరొక సందర్భంలో (వర్గ సమాజాలలో భావజాలాన్ని గురించి మాట్లాడుతూ) మార్క్స్ చెప్పింది మార్క్సిజం విషయంలోనూ సత్యమయింది.

అయితే ఈ మార్క్సిస్టు-లెనినిస్టు సంప్రదాయంతో అసంతృప్తి చెందిన మార్క్సిస్టులు ప్రత్యామ్నాయ వ్యాఖ్యానాలలో తమ ప్రశ్నలకు జవాబులు వెతుక్కోవడం జరుగుతూనే ఉంది. స్థూలంగా చెప్పాలంటే మార్క్సిజంలో రెండు ప్రధాన సంప్రదాయాలు ఉన్నాయి. రెండింటికీ ఆధారం మార్క్స్ రచనల్లోనే ఉంది. ఒకటి - ఉత్పత్తి వ్యవస్థ అనే వస్తుగత (objective) విషయాన్ని మార్క్స్ చారిత్రక సిద్ధాంతానికి ప్రాతిపదికగా భావిస్తుంది. పునాది - ఉపరితలం, పదార్థం - చైతన్యం, ఆచరణ - సిద్ధాంతం మొదలైన ద్వయాలకు ఈ కోవకు చెందిన సిద్ధాంత వ్యాఖ్యలలో ప్రముఖస్థానం ఉంది. వాటిలో ఒకటి నిర్ణయించేది, మరొకటి నిర్ణయించబడేది; ఒకటి మౌలికమైనది, మరొకటి దానికి అనుబంధమైనది, ఒకటి కార్యం, మరొకటి కారణం; అని ఈ మార్క్సిస్టు సంప్రదాయం వ్యాఖ్యానిస్తుంది. మార్క్సిజం-లెనినిజం పేరుతో కమ్యూనిస్టు పార్టీలు నమ్మే మార్క్సిజం ఈ సంప్రదాయంలో భాగమే. దీనిని భౌతికవాద (materialist) మార్క్సిజం అని పిలుస్తున్నారు. ఇది కౌట్స్కీ, ప్లెఖనోవ్‌లతో మొదలై (ఎంగెల్స్ కూడ దీనిలో భాగమని చాలామంది అభిప్రాయం) బోల్షివిక్‌ల ద్వారా ప్రధాన మార్క్సిస్టు సంప్రదాయమై కూర్చుంది. ఈ భౌతికవాద మార్క్సిజాన్ని సామాజిక పరిశోధనకు, ఆచరణకు అన్వయించేటప్పుడు అనేక తాత్విక సమస్యలు ఎదురవుతాయి. ఆ సమస్యల మూలాలలో ముఖ్యమైనది పైన పేర్కొన్న (పునాది - ఉపరితలం వగైరా) ద్వయాల మధ్య మార్క్సిజం ప్రతిపాదించే కార్యకారణ తదితర సంబంధాలు. సంప్రదాయక మార్క్సిజం-లెనినిజంలో ఈ సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారం లేదు. భౌతికవాద మార్క్సిస్టు స్రవంతిలో భాగంగానే ఈ సమస్యలను పరిష్కరించడానికి ఫ్రెంచి మార్క్సిస్టు తత్వవేత్త అల్తూజర్ ప్రయత్నిం చాడు. వాటిని ఆయన సంతృప్తికరంగా పరిష్కరించాడని అనలేము కాని భౌతికవాద మార్క్సిస్టు స్రవంతిలోనే ఉంటూ 'ఉపరితల రంగాన్ని', ఆ రంగంలో జరిగే కృషిని సృజనాత్మకంగా అర్థం చేసుకోవడానికి ఆయన ఆలోచనలు కొంతమేరకు ఉపయోగ పడతాయి.

రెండవ మార్క్సిస్టు సంప్రదాయం మానవ ఆచరణను మార్క్స్ ఆలోచనలకు కేంద్రంగా భావిస్తుంది. మార్క్స్ చారిత్రక సిద్ధాంతానికి ఉత్పత్తి వ్యవస్థ అనే వస్తుగత విషయం ప్రాతిపదిక కాదనీ, ఏక సమయంలో వస్తుగతం, వ్యక్తిగతం (objective and subjective) అయిన ఉత్పిత్తిదాయకమైన మానవ ఆచరణ ప్రాతిపదిక అనీ ఈ రెండవ కోవకు చెందిన వ్యాఖ్యాతలు నమ్ముతారు. వీరు పునాది - ఉపరితలం, ఆచరణ - సిద్ధాంతం, పదార్థం - చైతన్యం అనే ద్వయాలను, వాటి మధ్య నున్న కార్యకారణ సంబంధాలను ప్రతిపాదించడంలో గల తాత్విక సమస్యలను తప్పించుకోగలుగుతారు. వీరిలో చాలామంది ఆ వర్గీకరణనే తిరస్కరిస్తారు. గ్రామ్‌సీ, ఎరిక్ ఫ్రాం వంటి ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ మార్క్సిస్టులు, చిన్ననాటి జార్జి లూకాచ్, రేమాండ్ విలియమ్స్ మొదలైనవారు ఈ సంప్రదాయానికి చెందినవారు. దీనిని మానవతావాద (humanist) మార్క్సిజం అని పిలుస్తున్నారు. అయితే భౌతికవాద మార్క్సిజం ఎదుర్కొనే ఇబ్బందికరమైన (కార్యకారణ సంబంధాలకూ, నిర్ణాయకతకూ సంబంధించిన) తాత్విక సమస్యలను ఈ మానవతావాద మార్క్సిస్టు సంప్రదాయం తప్పించుకోగలుగుతుంది కానీ, భౌతికవాద మార్క్సిజం వస్తుగత వ్యవస్థకు ప్రాముఖ్యం ఇవ్వడం వల్ల ఒక మూలకు నెట్టి వేయగల ఒక ముఖ్యమైన ప్రశ్నను మానవతావాద మార్క్సిజం ముఖాముఖి ఎదుర్కొనక తప్పదు. మనిషి ఎవరు, మానవత స్వభావం ఏమిటి అనేది ఈ ప్రశ్న. మనిషి ఆచరణకు చారిత్రక సిద్ధాంతంలో కేంద్రస్థానం యిచ్చే దృక్పథం ఈ ప్రశ్నను తప్పించుకోజాలదు. దానికి సంతృప్తికరమైన సమాధానం యిప్పటివరకు లేదు. అంతవరకు భౌతికవాద మార్క్సిజం గెలుస్తుందని (సిద్ధాంత రంగంలోనయినా, ఆచరణలో నయినా) నమ్మలేం.

అయినప్పటికీ కమ్యూనిస్టు పార్టీలు అసలయిన మార్క్సిజంగా భావించే మార్క్సిజం-లెనినిజంతో అసంతృప్తి చెందిన వాళ్లు అటు భౌతికవాద మార్క్సిస్టు స్రవంతికి చెందిన అల్తూజర్ వంటి సిద్ధాంతకర్తల ఆలోచనల్లోను, ఇటు మానవతావాద మార్క్సిజం యిచ్చే వివరణలలోను కొంత తృప్తి పొందగలరు. కొన్ని సంతృప్తికరమైన సమాధానాలు పొందగలరు. అయితే నా దృష్టిలో ఈ సిద్ధాంతాలేవీ పూర్తి సమాధానం ఈయలేవు.

'నా దృష్టిలో' అనడానికి ఒక కారణం ఉంది. ఏ సిద్ధాంతమూ అన్ని ప్రశ్నలకూ సమగ్రమైన సమాధానం యివ్వదు. ప్రతి సిద్ధాంతమూ కొన్ని ప్రశ్నలకు సంతృప్తికరంగా సమాధానం చెపుతుంది. కొన్నిటికి అసంతృప్తికరంగా చెపుతుంది.

కొన్నిటికి అసలే చెప్పదు. మనం ఒక సిద్ధాంతాన్ని నమ్ముతున్నామంటే - లేదా ఒక సిద్ధాంతంతో సంతృప్తి చెందుతున్నామంటే - అర్థం అది సంతృప్తికరంగా జవాబు చెప్పలేని ప్రశ్నలు ఏమంత ముఖ్యమైనవి కావని లేదా వాటికి జవాబు చెప్పలేకపోవడం ఏమంత నష్టకరం కాదని నమ్ముతున్నామని. ఈ అర్థంలో ఎవరయినా నిజాయితీగానే మార్క్సిజం - లెనినిజం అని పిలవబడే మార్క్సిస్టు సంప్రదాయాన్ని విశ్వసించవచ్చు. ఆ సంప్రదాయాన్ని కొంతవరకు మెరుగుపరిచి యింకొంత సంతృప్తికరమైన సమాధానాలు చెప్పే అల్తూజర్ వివరణనుగాని, అందుకు భిన్నమైన మానవతావాద మార్క్సిస్టు సంప్రదాయాన్ని గాని విశ్వసించ వచ్చు. (అయితే మార్క్సిజం సంతృప్తికరంగా సమాధానం చెప్పలేని విషయాల ఉనికినే గుర్తించడానికి నిరాకరించేవాళ్లు, అది సంతృప్తికరంగా సమాధానం జవాబు చెప్పలేని ప్రశ్నలు ముఖ్యమైనవేనని లోలోపల అనుకొంటూ కూడా పైకి నిబద్ధత ప్రకటించే వాళ్లు - దానిని క్రమశిక్షణగా అర్థం చేసుకోవడం వల్ల కావచ్చు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కావచ్చు కూడ ఉన్నారు. అటువంటి 'నిబద్ధత'ను గౌరవించడం కష్టం.)

గడచిన చరిత్రనూ సమాజాన్నీ అర్థం చేసుకోవడం, వర్తమాన పరిస్థితులను విమర్శించడం, భవిష్యత్తుకు కావలసిన కార్యాచరణను రూపొందించడం అనే మూడు కర్తవ్యాలు మార్క్సిస్టుల కార్యరంగంలో ఎప్పుడూ ఉన్నాయి. మార్క్సిజాన్ని ఏ విధంగా అర్థం చేసుకున్నా ఈ మూడు కర్తవ్యాలకు అది అందివ్వగల సిద్ధాంత భూమిక అసంతృప్తికరమైనదే.

ఉత్పత్తి వ్యవస్థే సామాజిక జీవితంలోని అన్ని విషయాలకూ పునాది, ప్రాతిపదిక, నిర్ణాయక శక్తి అనే సూత్రాన్ని నిర్దిష్ట చారిత్రక పరిశీలనకు అన్వయించి నపుడు శేషప్రశ్నలు చాలా ఉండిపోతాయి. ఆ నిర్ణాయకత 'అంతిమ పరిశీలనలోనే' (in the final analysis) అని ఎంగెల్స్ కాలం నుండి మార్క్సిస్టులు అంటూనే ఉన్నారు. దానికి నిర్దిష్టమైన అర్థమేదో ఇవ్వకపోతే అది తప్పించుకోవడానికి ఉపయోగపడే సాధనం మాత్రమే అవుతుంది. దానికి నిర్దిష్టమైన అర్థం ఇవ్వడానికి ప్రయత్నం చేసిన అల్తూజర్ చివరికి ఆ 'అంతిమ ఘడియ ఎప్పటికీ రాదు' (the final instance never comes) అని ప్రకటించి ఊరుకున్నాడు. అప్పుడేం చేయవచ్చునంటే ఉత్పత్తి వ్యవస్థనూ దానిలో కాలానుగుణంగా వచ్చే మార్పులనూ విశ్లేషించి, దాని ఆర్థికేతర పర్యవ సానాలను వీలయిన మేరకు వ్యాఖ్యానించి ఊరుకోవచ్చు. అల్తూజర్ ప్రయత్నాన్ని అనుసరించి నిర్ణాయకత ఒక వైపు నుండే ఉండదనీ, ఒక మేరకు అన్నివైపుల నుండీ ఉండగలదనీ అర్థం చేసుకొని చరిత్రను మరికొంత అర్థం

చేసుకోవచ్చు. లేదా మానవతావాద మార్క్సిస్టు లాగ పునాది - ఉపరితలం అనే వర్గీకరణనే విడిచిపెట్టి ఉత్పత్తిదాయకమైన మానవ ఆచరణనూ, అది తీసుకున్న రూపాలనూ, ఎదుర్కొన్న సంఘర్షణలనూ చారిత్రకంగా విశ్లేషించి, దానిని ఆశ్రయించి ఇతర జీవిత రంగాలలో వచ్చిన మార్పులను వీలయిన మేరకు వ్యాఖ్యానించుకోవచ్చు. దీనితో ఎంత అర్థమైతే అంతే మార్క్సిజం చెప్పగల చరిత్ర అని సంతృప్తి చెందవచ్చు. దీనితో అర్థం కాని విషయాలు ఏమంత ముఖ్యమైనవి కావని భావించేవాళ్లకు ఇబ్బంది ఉండదు. కానీ సంతృప్తి చెందలేని వాళ్ల అసంతృప్తికి వర్గమూలాలు అంటగట్టడంలో అర్థం లేదు.

సాహిత్యం, సంస్కృతి మొదలైన రంగాలను విశ్లేషించేటపుడు ఈ ఇబ్బంది చాలా బలంగా ఎదురవుతుంది. పునాది - ఉపరితలం అనే సంప్రదాయక మార్క్సిస్టు వర్గీకరణలో పునాది మాత్రమే ఏ సిద్ధాంత సమస్యలూ లేకుండా మానవ ఆచరణకు వేదిక కాగలుగుతుంది. ఉపరితలమనేది పునాది చేత నిర్ణయించబడే (అంతిమ పరిశీలనలోనే కావొచ్చు) విషయాల కలయిక. అందులో క్రియాశీలకమైన ఆచరణకు చోటు కల్పించడం సులభం కాదు. ఒకవేళ చోటు ఉన్నా అది పునాదిచేత నిర్ణయించ బడిన చోటు కావాలి. అయితే సంకల్ప పూర్వకమైన క్రియాశీలక మానవ ఆచరణ మరొక బాహ్య విషయం చేత నిర్ణయించబడుతుంది అనడంలో తాత్త్విక సమస్య లున్నాయి. సాహిత్యం, సంస్కృతి మానవ ఆచరణ రూపాలు. కేవలం చైతన్యరూపాలు కావు. సాహిత్య సాంస్కృతిక ఆచరణలోని (active) సృజనశీలాన్నీ, అది పునాది చేత నిర్ణయించబడుతుందనే (passive) భావననూ సమన్వయపరచడం కష్టం. మార్క్సిజం-లెనినిజం సాహిత్యాన్నీ సంస్కృతినీ చైతన్యరూపాలుగా భావిస్తుంది కాబట్టి ఈ ఇబ్బందిని గ్రహించదు. వాటిని ఆచరణ రూపాలుగా భావించే మార్క్సిస్టులు దానిని గుర్తించక తప్పదు. దానిని అధిగమించడానికి పునాది - ఉపరితలం అనే వర్గీకరణనే తిరస్కరించి ఉత్పత్తిదాయకమైన మానవ ఆచరణను ప్రాతిపదిక చేసుకొన్న మానవతావాద మార్క్సిస్టు సంప్రదాయాన్ని ఆశ్రయించడం తప్పనిసరి అని రేమాండ్ విలియమ్స్ వంటివారు భావించారు. 'భావజాలం' అనే వస్తుగత విషయం సాహిత్య విశ్లేషణకు పెద్దగా ఉపయోగపడదనీ, సాహిత్యానికి ఉండే క్రియాశీలక సృజనాత్మకతను దృష్టిలో పెట్టుకున్నప్పుడు 'భావజాలం' (ideology) అనే నిశ్చలమైన (దాని అర్థం అందులో మార్పు ఉండనే ఉండదని కాదు) భావన కంటే గ్రామ్‌సీ చెప్పిన నిత్యచలనశీలి అయిన ఆధిపత్య ఆచరణ (hegemonic practice) అనే భావన ఎక్కువగా

ఉపయోగపడుతుందనీ విలియమ్స్ భావిస్తాడు. సాహిత్య సృజన కూడా ఒక ఉత్పత్తేనని సూత్రీకరిస్తాడు. ఈ రకంగా సాహిత్యానికి సముచిత స్థానం కల్పించే ప్రయత్నం చేస్తాడు. అయితే విలియమ్స్ ఆచరణను ప్రధానంగా వర్గ ఆచరణగా భావించి ఇతర రూపాల ఆచరణను దానికి అనుబంధంగా సాగే కృషిగా అర్థం చేసుకోవడం వల్ల అతని విశ్లేషణ పూర్తి సంతృప్తినివ్వదు. అయినప్పటికీ అది మార్క్సిస్టు - లెనినిస్టు సాహిత్య సిద్ధాంతాల కంటే మెరుగైన అవగాహననే యిస్తుంది.

సాహిత్యం ఒక ఆలోచనాత్మకమైన క్రియ. సాహిత్యం విషయంలో వచ్చే సమస్య అన్నిరకాల ఆలోచనాత్మకమైన మానవక్రియల విషయంలోనూ వస్తుంది. మొత్తంగా మానవ ప్రవర్తనకే ఆ సందిగ్ధం వర్తిస్తుంది. మనుషుల ప్రవర్తన (అంతిమ పరిశీలనలో) వారి వర్గస్థితి చేత నిర్ణయించబడుతుందని మార్క్సిజం భావిస్తుంది. ఆ అంతిమ ఘడియ ఎప్పటికీ రాదన్న అల్తూజర్ ప్రకటనను పైన చూశాం. అదట్లా ఉంచి యిందులో ఉన్న వేరొక సమస్యను పరిశీలిద్దాం. మనుషుల ప్రవర్తనను వారి వర్గస్థితి, లేక ప్రయోజనాలే ఎందుకు నిర్ణయించాలి? దీని వెనకున్న తర్క మేమిటి? మనుషుల ప్రవర్తన ఆలోచనాత్మకమైనది కాబట్టి, ఆలోచన (చైతన్యం) దాని చోదకశక్తి కాబట్టి, చైతన్యాన్ని భౌతిక జీవితం నిర్ణయిస్తుంది కాబట్టి మనుషుల ప్రవర్తన వర్గస్థితిని బట్టి, ప్రయోజనాలను బట్టి ఉంటుందని వివరించవచ్చు. భౌతిక జీవితమంటే వర్గజీవితమేనా అనే ప్రశ్న ఇక్కడ వస్తుంది. దానిని ప్రస్తుతానికి పక్కన పెడదాం. పై వివరణను అంగీకరించినా మనుషుల ప్రవర్తనకు ప్రేరణనిచ్చేది వారి చైతన్యం కాదని, వారి వ్యక్తిత్వమని మనస్తత్వశాస్త్రం చెపుతుంది. నిజానికి చైతన్యం లేక ఆలోచన అనేది భౌతిక జీవిత పరిస్థితుల ప్రభావం నుండి నేరుగా పుట్టేది కాదు. బాహ్య ప్రభావాలకు, ఆలోచనలకు మనిషి వ్యక్తిత్వం మాధ్యమంగా పనిచేస్తుందని మనస్తత్వశాస్త్రం చెపుతుంది. కర్తగా (subject) మనిషిని పరిశీలించి నపుడు మార్క్సిజం మనిషి చైతన్యానికి యిచ్చే స్థానం నిజానికి మనిషి వ్యక్తిత్వానికి చెందుతుందనేది సైకో ఎనాలసిస్ చేసిన ముఖ్యమైన సవరణ. మనం కేవలం మన మెదడుతో ఆలోచించం. మన వ్యక్తిత్వం ద్వారా ఆలోచిస్తాం. మరయితే మనిషి వ్యక్తిత్వం కూడ వర్గ ప్రయోజనాల చేత లేక వర్గస్థితి చేత నిర్ణయించ బడుతుందా? అసలు వ్యక్తిత్వం రూపొందే క్రమం ఎట్లాంటిది? అందులో మనిషి లోపల అంతర్లీనంగా ఉండే 'పొటెన్షియల్'కూ బాహ్య ప్రభావాలకూ మధ్య జరిగే ఘర్షణ ఎట్లాంటిది? ఈ ప్రశ్నలు వేసుకోవడం ద్వారా సైకో ఎనాలసిస్‌ను,

మార్క్సిజాన్ని సమన్వయపరచడానికి ఎరిక్ ఫ్రాం, అడార్నో వంటి ఫ్రాంక్‌ఫర్ట్ స్కూలు మార్క్సిస్టులు చాలా ప్రయత్నం చేశారు. వీరు కూడ పునాది - ఉపరితలం, పదార్థం - చైతన్యం అనే భౌతికవాద మార్క్సిస్టు వర్గీకరణలను తిరస్కరించి మానవతావాద మార్క్సిస్టు సంప్రదాయంలో భాగంగా తమ కృషి చేశారు. ఎరిక్ ఫ్రాం విశ్లేషణ చాలా ఆసక్తికరమైన విషయాలను వెలికి తెచ్చింది. మనుషుల ప్రవర్తన వారి వర్గస్థితిని బట్టి ఉంటుందన్న మార్క్సిస్టు సూత్రాన్ని సైకో ఎనాలసిస్ ప్రాతిపదికన రుజువు చేసే తాపత్రయంలో ఫ్రాం విశ్లేషణ కొన్నిచోట్ల కప్పదాట్లు వేసినట్టు కనిపించినా మార్క్సిస్టు - లెనినిస్టు సంప్రదాయంతో మాత్రమే పరిచయం ఉండి, ఆ సంప్రదాయం ప్రాతిపదికన మనుషుల ప్రవర్తనను ఎట్లా అర్థం చేసుకోవాలో పాలుపోనివారు ఫ్రాం రచనల నుండి చాలా నేర్చుకోగలరు.

అయితే ఉత్పత్తి రంగాన్ని (ఉత్పత్తి వ్యవస్థ రూపంలోనయినా, ఉత్పత్తి దాయకమైన మానవ ఆచరణ రూపంలోనయినా) ప్రాతిపదిక చేసుకొని చేసే విశ్లేషణకు అందకుండ ఉండిపోయే విషయాలు కేవలం సాహిత్య సాంస్కృతిక రంగాలకు సంబంధించినవి కానవసరం లేదు. కొన్ని ప్రధానమైన అణచివేత రూపాలు కూడ ఈ విశ్లేషణలో సమగ్రంగా చోటు చేసుకోకపోవచ్చు. పురుషాధిక్యత, కులం దీనికి ఉదాహరణలు. నిజానికి పితృస్వామ్యం యొక్క ఆర్థిక పార్శ్వానికి సహితం మార్క్స్ విశ్లేషణలో స్థానం లేకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. శ్రమ విభజనకు మార్క్స్ ఆలోచనలలో చాలా ముఖ్యస్థానం ఉంది. ఆర్థిక, చారిత్రక విశ్లేషణల్లోనే కాక, పరాయీకరణ గురించి మార్క్స్ చేసిన ఆలోచనలో కూడ శ్రమ విభజనకు ముఖ్యస్థానం ఉంది. అయినప్పటికీ స్త్రీ పురుష శ్రమ విభజన (చరిత్రలో జరిగిన మొదటి శ్రమ విభజన) కు ఆయన రచనలలో ఉన్న స్థానం చాలా స్వల్పమైనది. అయితే పురుషాధిక్యతకు స్త్రీ పురుష శ్రమ విభజనే మూలం అనుకునేటట్టయితే మార్క్స్ రచనలలోని ఈ ఖాళీని పూరించి (ఈ ప్రయత్నం ఎంగెల్స్‌తోనే కొంత మొదలయింది) చారిత్రక భౌతికవాద సిద్ధాంతం మౌలిక స్వభావంలో మార్పులేకుండానే పురుషాధిక్యతకు కూడ అందులో చోటు కల్పించవచ్చు. కాని పితృస్వామ్యానికి స్త్రీ పురుష విభజనే మూలమా? లేక అది ప్రధానంగా ఒక అధికార రూపమా (Form of power?) స్త్రీ చేసే శ్రమతో మొదలుపెట్టి ఆమెకు సంబంధించిన అన్ని విషయాలపైనా మగవాడు సాగించే పెత్తనాన్ని పితృస్వామ్యంగా నిర్వచించేటట్టయితే, శ్రమపైన చేసే పెత్తనాన్ని ఇతర రూపాల పెత్తనాన్నీ పునాదిగా భావించగలిగితేనే అది చారిత్రక భౌతికవాద సిద్ధాంతంలో ఇముడుతుంది. అట్లాగాక

సమాంతరంగా ప్రయోగించే అన్నిరకాల అధికారాల సమాహారమే పితృస్వామ్యం అనుకుంటే మార్క్స్ చారిత్రక సిద్ధాంతం (అది భౌతికవాద రూపంలో ఉన్నా, మానవతావాద రూపంలో ఉన్నా) పితృస్వామ్యాన్ని సమగ్రంగా వివరించ జాలదు. అప్పుడు ఉత్పత్తి వ్యవస్థ తక్కిన అన్ని సామాజిక సంబంధాలను నిర్ణ యిస్తుందన్న భౌతికవాద మార్క్సిస్టు సిద్ధాంతం నిజం కాకపోగా, మానవ ఆచరణను ప్రధానంగా వర్గ ఆచరణగా భావించే మానవతావాద మార్క్సిస్టు వివరణ కూడా అసమగ్రమని తేలుతుంది.

కులం సంగతి కూడా అంతే. వర్ణవ్యవస్థ ఆవిర్భావం ఉత్పత్తిరంగంలోని మార్పులతో ముడిపడి ఉందని కోశాంబితో సహా మార్క్సిస్టు చరిత్రకారులు చాలామంది భావిస్తారు. వర్ణం అనేది అంతకుముందే ఉనికిలోకి వచ్చింది కాని అదే ప్రధానమైన సాంఘిక వ్యవస్థగా మారినది ఆహార సేకరణ స్థానంలో ఆహార ఉత్పత్తి చేపట్టడం ద్వారా మిగులు సంపద సాధ్యమైన తర్వాతేనంటారు. ఆ తర్వాత వర్ణం కులంగా మారి అసంఖ్యాకమైన కులాలు ఉనికిలోకి వచ్చిన క్రమం కూడా ఉత్పత్తి రంగంతో ముడిపడి ఉంది కాని, ఉత్పత్తి రంగంలో మొదట మార్పులు వచ్చాయనీ, దాని ఫలితంగానే కులవ్యవస్థలో మార్పులు వచ్చాయనీ భావించడం సరైన వివరణ కాదు. అంతేకాక కులవ్యవస్థలో ఉన్న అసాధారణమైన వివక్షనూ దాని వికృత స్వభావాన్నీ ఆర్థిక దోపిడీ ప్రాతిపదికన వివరించడం అసాధ్యం. కులం కేవలం శూద్రుల శ్రమఫలాన్ని బ్రాహ్మణ తదితర అగ్రవర్ణాలు దోచుకునేందుకు ఉపయోగపడిన సాధనం కాదు. అది భౌతిక సంపద నుండి జ్ఞానం దాకా, శ్రమ నుండి వ్యక్తిత్వం దాకా అన్నిటిపైన, అన్నిటిలోను వారికి అధికారాన్ని, ఆధిక్యతను ఇచ్చిన వ్యవస్థ. అది ప్రధానంగా ఒక అధికార రూపం, లేక ఆధిక్యతా రూపం. అన్ని దోపిడీ వ్యవస్థలూ ఆధిపత్య వర్గాలకు సంపదపైన యాజమాన్యంతో పాటు సకల సామాజిక విషయాలపైన అధికారాన్ని కూడ ఇస్తాయని మార్క్సిజం నమ్ముతుంది. కాబట్టి దోపిడీ వ్యవస్థలలో ఉండే అధికారం మార్క్సిజానికి తెలియంది కాదు. అయినా ఉత్పత్తిరంగంలో ఉండే యాజమాన్య హక్కు ఈ అధికారానికి ప్రాతిపదిక లేక పునాది అని నమ్ముతుంది. మరయితే కులవ్యవస్థలో శ్రమ, సంపద, హోదా, జ్ఞానం, గుర్తింపు మొదలైన అన్ని విషయాలలోను ఉన్న ఆధిక్యతలకు, అది వ్యక్తమయ్యే సకల రూపాలకు శ్రమపైన, సంపదపైన ఉన్న ఆధిపత్యమే పునాది అనీ, మిగిలినది దాని ఫలితమనీ వివరించడం సాధ్యమవుతుందా? 'అంతిమ పరిశీలనలోనే' అనే క్లాజ్ చేర్చినా సాధ్యమవుతుందా? కాదనుకుంటాను.

చరిత్రను, సమాజాన్ని అర్థం చేసుకోవడంలో ఇటువంటి సమస్యలున్నాయి. కేవలం ఉత్పత్తి వ్యవస్థను లేక వర్గ ఆచరణను ప్రాతిపదిక చేసుకుని జరిపే విశ్లేషణ పాక్షిక సత్యాన్ని మాత్రమే తెలుపుతుంది. ఇక వర్తమానాన్ని విమర్శించే కర్తవ్యాన్ని పరిశీలిద్దాం. దీనికి మార్క్సిస్టు ఆలోచనారీతి బాగా ఉపకరిస్తుంది. సమాజంలో అన్యాయం కాకతాళీయంగా ఉండదనీ, వ్యవస్థితమై ఉంటుందనీ, దానిని కాపాడేది కేవలం బలప్రయోగం కాదనీ, సంస్కృతీ నీతీ చట్టాలూ మొదలైనవన్నీ అందులో భాగమై ఉంటాయనీ మార్క్సిజం అంటుంది. ఇది విమర్శకు బలమైన సిద్ధాంత పునాదిని కల్పిస్తుంది. అయితే శ్రమదోపిడీ ఇతర రూపాల వ్యవస్థిత అసమానతలకూ, అన్యాయాలకూ పునాది అనే అభిప్రాయం ఇక్కడ కూడా పునాది-ఉపరితలం సమస్యనూ, కార్యకారణ సంబంధాల సమస్యనూ తీసుకొస్తుంది. ఈ సమస్య గురించి పైన చెప్పాను కాబట్టి మళ్లీ వివరించవలసిన అవసరం లేదు. అయితే వర్తమాన పరిస్థితులను విమర్శించడంలో వేరొక సమస్య ఉంది. చెడును సులభంగానే విమర్శించగలం కాని వర్తమాన పరిస్థితులలోని మంచిని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? ప్రజలలో ఉండే మంచిని కాదు. దాని విషయంలో ఇబ్బందేమీ లేదు. వ్యవస్థలోని మంచిని ఏ విధంగా అర్థం చేసుకోవాలనేది ప్రశ్న. అది చట్టాలు, సంస్కరణలు, అధికారిక సంస్కృతిలోని నైతిక విలువలు తదితర రూపాలలో ఉంటుంది. ఈ మంచి ఎంత ఉంటే అంతమేరకు పీడిత ప్రజలకు వ్యవస్థ లోపల పీడన నుండి రక్షణ లభిస్తుంది. పోరాటాలకు అండ దొరుకుతుంది. కాబట్టి దానిని మార్క్సిస్టులు ఆహ్వానించాలి. కాని వర్తమాన వ్యవస్థలోని మంచికి వ్యవస్థను కాపాడే భావజాలంగా పనిచేసే లక్షణం కూడ ఉందని మార్క్సిజం నమ్ముతుంది. అంటే అర్థం ఆధిపత్య వర్గాలు వ్యవస్థలోని మంచిని ఉన్నదానికంటే ఎక్కువ చేసి చూపించి వ్యవస్థపట్ల ప్రజామోదం పొందే ప్రయత్నం చేస్తారని మాత్రమే కాదు. భావజాలంగా మంచికి ఉండే పాత్ర యిదే అయితే దానిని అర్థం చేసుకోవడంలో తాత్విక సమస్యలు ఏమీ ఉండవు. వ్యవస్థలో మంచి ఎంతవరకు ఉంటే అంతవరకు దానిని సమర్థించి, దానిని అంతకంటే ఎక్కువ చేసి చూపించే ప్రయత్నాన్ని వ్యతిరేకించవచ్చు. ఇక్కడ ఆచరణాత్మకమైన సమస్యలు ఎన్నయినా ఉండవచ్చు కాని తాత్విక సమస్య ఏమీ లేదు. కాని వ్యవస్థలోని మంచికి స్వాభావికంగానే పాలక భావజాలంగా పనిచేసే లక్షణం ఉందని (ఈ వ్యవస్థను తిరస్కరించనవసరం లేదని, సంస్కరించి బాగుచేసుకోవచ్చునని ప్రజలను అది నమ్మింప జేస్తుందని) దానిని వస్తుగతంగా (objective) చూసినప్పుడు

వ్యవస్థలో దాని అది భావజాలంగా మారదు. భావజాలంగా పనిచేయడం సారాంశంలో దాని స్థానం, సారాంశంలో దాని పాత్ర యిదేనని నమ్మడం మార్క్సిజం భావజాలం గురించి చేసే విశ్లేషణలో ఒక ముఖ్య అంశం. దానిని ఎక్కువ చేసి చూపించడం ద్వారా స్వాభావిక ధర్మమే. (ప్రజలకు మేలు చేసే లక్షణం దానిలో ఉంటే అది సెకండరీ అంశం మాత్రమే). భావజాలంగా మంచికి ఉండే ఈ పాత్ర వల్లనే పాలకవర్గాలు దానిని సహిస్తారు, ప్రోత్సహిస్తారు. అటువంటప్పుడు వ్యవస్థలోని మంచి వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని (జరిగిన మేరకు) దానిని ఆహ్వానించాలా లేక అది ఎంత మేరకు ఉంటే అంత మేరకు వ్యవస్థను కాపాడే భావజాలంగా పనిచేస్తుందని తిరస్కరించాలా? దానిని పెంపొందించి ప్రజలకు మరింత ఊరట కలిగించే కృషిలో మార్క్సిస్టులు భాగం కావాలా లేక అది ఎంత పెరిగితే అంత బలమైన భావజాలంగా మారుతుంది కాబట్టి ఆ కృషిని వ్యవస్థకు ఊడిగం చేసే పని అని ఈసడించు కోవాలా?

మార్క్సిజానికి ఈ సందిగ్ధం స్వాభావికమైనది. వ్యవస్థలోని మంచి ప్రజలకు కొంత ఊరట, కొంత రక్షణ కలిగించడమే కాక ప్రజల పోరాటాలకు కూడా ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది కాబట్టి ఈ సందిగ్ధం మరీ తీవ్రంగా ఉంటుంది. అది అవసరం, దానిని వాడుకోవాలి, కాని గౌరవించకూడదు. అవసరమైన దానికంటే ఎక్కువగా గౌరవించకూడదని కాదు. అసలే గౌరవించకూడదు. ఎందుకంటే గౌరవించేకొద్దీ భావజాలంగా దాని ప్రభావం పెరుగుతుంది. ప్రజల అవసరాల కోసమైనా, పోరాటాల అవసరాల కోసమైనా వ్యవస్థలో మంచిని పెంపొందించే కృషిలో మార్క్సిస్టులు ఎంతో కొంత పాల్గొనక తప్పదు. పాల్గొంటూనే ఉంటారు. కాని అది పెరిగేకొద్దీ పాలక భావజాలం బలపడుతుంది కాబట్టి దానిని ఈసడించు కుంటూనే ఉండాలి. సంస్కరణలు, నీతి, ప్రజాస్వామ్యం, పౌరహక్కులు మొదలైన విషయాల పట్ల మార్క్సిస్టులు ప్రదర్శించే ఎడతెగని సందిగ్ధానికి యిదే మూలం. దీనికి సంతృప్తికరమైన పరిష్కారం లేదు. మార్క్సిజాన్ని ఏ విధంగా అర్థం చేసుకున్నా లేదు. గ్రామ్‌షీ అల్తూజర్‌ల ఆలోచనారీతులు వ్యవస్థలోని చెడుకే కాక అందులోని మంచికి కూడ ప్రజల మంచిని ఎదురొడ్డి పోరాడే అవకాశాన్ని రాజకీయ సాంస్కృతిక రంగాలలో కల్పిస్తాయి. (Sic)అయితే మన ప్రశ్నకు యిది జవాబు కాదు. వ్యవస్థలోని మంచినీ, దానివల్ల ప్రజలకు లభించే ప్రయోజనాన్నీ, దానిపట్ల ఉండే ఆకర్షణనూ ఆహ్వానించాలా దానిని పెంపొందించాలా లేక అది భావజాలమని తిరస్కరించాలా అనేది మన ప్రశ్న. వ్యవస్థలోని మంచికి ద్వంద్వ స్వభావం ఉంటుందనీ, దానిని

గతితార్కికంగా అర్థం చేసుకోవాలనీ పడికట్టు పదాలు ప్రవచించవచ్చును కాని దాని విషయంలో నియమబద్ధమైన ఆచరణ చేపట్టడానికి పనికి వచ్చే సూత్రీకరణ ఏదీ సాధ్యం కాదు. అప్పటి అవసరాలను బట్టి ఎత్తుగడలు వేయడం మాత్రమే సాధ్యమవుతుంది. కమ్యూనిస్టు రాజకీయాలు సంస్కరణలు, నీతి, ప్రజాస్వామ్యం, పౌరహక్కులు మొదలైన విషయాలలో అనుసరించే అనిశ్చితమైన ఎత్తుగడల తాత్విక భూమిక ఇదే. ఇది మార్క్సిజానికి ప్రత్యేకమైన సందిగ్ధం కాదు. ఏ రాడికల్ తాత్విక దృక్పథంలోనైనా ఈ సందిగ్ధం ఉండకతప్పదు. ఈ సందిగ్ధాన్ని తప్పించుకోవాలంటే అవి తమ రాడికల్ స్వభావానికి దూరమై సంస్కరణవాదానికి దగ్గర కావలసి ఉంటుంది. విప్లవ బాటలోనే ఉంటూ ఈ సందిగ్ధాన్ని తప్పించుకోవడం మార్క్సిస్టు ఆచరణకు సాధ్యం కాదుగానీ, వ్యవస్థ మీద విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టే విశ్లేషణకు పరిమితమయ్యే మేధావులు ఈ సందిగ్ధం ఉందన్న సందేహం సైతం కలగకుండా వ్యవస్థమీద పదునైన విమర్శ చేయగలరు. ఈ సంకలనంలోని వ్యాసాలు దీనికొక ఉదాహరణ.

ఇంక మూడవ విషయానికి వద్దాం. వర్తమానం మీద పూర్తి అవిశ్వాసం మార్క్సిస్టు సంప్రదాయంలో ఎంత ముఖ్య లక్షణమో భవిష్యత్తు మీద (భవిష్యత్తు దిశగా నడిచే వర్తమాన పోరాటాలతో సహా) అచంచల విశ్వాసం కూడ అంతే ముఖ్య లక్షణం. కమ్యూనిజానికి మార్క్స్ 'బ్లూప్రింట్' ఇవ్వలేదని అంటుంటారు. కమ్యూనిజాన్ని ఆయనొక వ్యవస్థగా భావించాడనే కంటే మనిషి సర్వశక్తులూ విముక్తమై స్వేచ్ఛగా అభివృద్ధి చెందే స్థితిగా అర్థం చేసుకున్నాడనడం సబబుగా ఉంటుంది. అటువంటి స్థితికి 'బ్లూప్రింట్' ఇచ్చే ప్రసక్తే ఉండదు. అయితే మనిషిలో అంతర్లీనంగా ఉండే శక్తులన్నీ విముక్తమయితే మనిషికి సాధ్యమయ్యే మంచితోపాటు చెడు కూడ విముక్తమవుతుంది కదా అన్న సందేహం ఆయనకు రాలేదు. దానిని అదుపు చేసే నీతి కూడ అదే చారిత్రక క్రమంలో ఎదుగుతుందని ఆయన భావించాడని కూడ అనలేము. కమ్యూనిజంలో ఒక వస్తుగత నీతి ఉంటుందనీ, అది అవసరం అవుతుందనీ ఆయన అనుకోలేదు. ఆయన గొప్ప ఆశావాది. అప్పటినుండి భవిష్యత్తుపట్ల అచంచల విశ్వాసం కలిగి ఉండటం మార్క్సిస్టుల సామాన్య లక్షణం అయింది. మార్క్స్ చెప్పిన మానవ శక్తుల విముక్తి ఈనాటి కమ్యూనిస్టు పార్టీల తక్షణ కార్యక్రమానికి బాగా దూరంగా ఉంది కానీ, తాము రాజ్యాధికారాన్ని చేజిక్కించుకొని నూతన సమాజాన్ని నిర్మిస్తామన్న విశ్వాసం (మధ్యమధ్యలో తిరోగామి శక్తులవల్ల ఒడిదుడుకులు ఎదురయినప్పటికీ) ఆ పార్టీల ప్రాపంచిక

దృక్పథంలో విడదీయరాని భాగం అయింది. ఇది కేవలం భవిష్యత్తుపట్ల విశ్వాసం కాదు. భవిష్యత్తుకు బాట వేసే ప్రస్తుత ఉద్యమాల పట్ల విశ్వాసం కూడా. ఆ విశ్వాసం ఎంత బలంగా ఉంటే వర్తమాన వ్యవస్థపట్ల అవిశ్వాసం అంత సంపూర్ణంగా ఉండగలుగుతుంది. మార్క్సిస్టు విశ్లేషణలో (ఈ సంకలనంలోని వ్యాసాలలాగ) వర్తమాన పరిస్థితుల పట్ల బలంగా ధ్వనించే విమర్శకు దన్ను భవిష్యత్తుపైన ఉన్న సందేహం లేని విశ్వాసం నుండి లభిస్తుంది. ఆ విమర్శ అందుకే అంత పదునుగా ఉంటుంది.

కానీ నిజానికి మార్క్స్ చారిత్రక సిద్ధాంతం కన్నా, భవిష్యత్తును గురించి ఆయన చేసిన ఊహే ఈ రోజు ఎక్కువగా సందేహాస్పదం అయింది. కార్మికవర్గం తనను తాను శ్రమదోపిడీ నుండి విముక్తి చేసుకోవడం కోసం పెట్టుబడి ఆధిపత్యాన్ని కూలదోసి సమాజం భవితవ్యాన్ని తన చేతిలోకి తీసుకొని సమసమాజానికి పునాది అయిన సమష్టి ఉత్పత్తి వ్యవస్థను నిర్మిస్తుందని మార్క్స్ నమ్మాడు. ఆచరణలో కమ్యూనిస్టు పార్టీలు కార్మికవర్గం స్థానాన్ని ఆక్రమించుకున్నాయి. అధికారాన్ని చేజిక్కించుకొని సమసమాజ నిర్మాణానికి పూనుకున్నాయి. అవి ప్రజలను కొంతమేరకు సమీకరించినప్పటికీ ఆ ప్రయోగంలో కమ్యూనిస్టు పార్టీల రాజ్యాధికార బలానికే కీలకస్థానం ఉండింది. సమసమాజానికి ఆర్థిక ప్రాతిపదిక అని తాము భావించే సమష్టి, లేక సహకార ఉత్పత్తి వ్యవస్థను నిర్మించే ప్రయత్నం చేశాయి. కానీ ఆ ప్రయోగం ఒక దశవరకే నిలిచింది. స్థూలంగా చెప్పాలంటే ఆర్థిక వ్యవస్థ వెనుకబాటుతనం నుండి బయటపడి సాంకేతికంగా ఆధునిక రూపాన్ని అందుకునేంత వరకే నిలిచింది (అయితే ఈ విషయంలో ఒక దేశానికీ మరొక దేశానికీ చాలా తేడా ఉంది). ఈ ప్రయోగాన్ని సమీక్షించుకుంటే, సమసమాజ నిర్మాణం అధికారబలంతో జరిగేది కాదని అర్థం అవుతుంది. కమ్యూనిస్టులు ప్రభుత్వ అధికారం (అది నూతన రాజ్యాధికారం కానవసరం లేదు) చలాయించడం పెట్టుబడిదారీ వ్యవస్థపైన జరిగే పోరాటానికి ఉపయోగపడగలదు. ఒక దశలో అది అవసరం కూడ కావచ్చు. అదయినా ప్రజాస్వామికంగా నెలకొనకపోతే నిలవదు. అది వేరే సంగతి. నూతన సమాజ నిర్మాణం - అందులో భాగంగా సమష్టి ఉత్పత్తి వ్యవస్థను నెలకొల్పే క్రియ - రాజ్యాధికారం ద్వారా జరగగల పని కాదు. అది పూర్తిగా స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా సమాజంలో జరగవలసిన క్రియ. అధికారం ఈ క్రియకు ఎంత దూరం ఉంటే అంత మంచిది. అధికారం ఎక్కడ ఉన్నా అక్కడ స్వేచ్ఛ నిజంగా ఉందా అనేది సందేహాస్పదంగానే ఉంటుంది. పూర్తిగా స్వేచ్ఛగా జరగవలసిన క్రియలకు అధికారం దూరంగా ఉండడం అవసరం. సమసమాజ

కాంక్ష సమాజంలో స్వచ్ఛందంగా ఎదిగి నిలదొక్కుకుంటేనే సమసమాజం సాధ్యం అవుతుంది. రాజ్యం అన్ని ప్రసారసాధనాలనూ విద్యావైజ్ఞానిక రంగాలనూ తన గుప్పిట్లో పెట్టుకొని ప్రత్యామ్నాయ రాజకీయాలన్నిటినీ నిషేధించి బలవంతంగా నేర్పించే కాంక్ష కాదది.

మరయితే మనుషులు సమసమాజాన్నీ సహకార ఉత్పత్తి వ్యవస్థనూ ఏ పరిస్థితిలో స్వచ్ఛందంగా కోరుకుంటారు? ఎందుకోసం కోరుకుంటారు? అందరికీ సమానత్వం కల్పించే సమష్టి వ్యవస్థ (సోషలిజం లేక కమ్యూనిజం) తప్ప పెట్టుబడిదారీ వ్యవస్థకు వేరే ప్రత్యామ్నాయం ఏదీ లేదనేది సత్యమే కావచ్చు. అది సత్యమైనా ఒక తార్కిక సత్యం మాత్రమే. ఆ తార్కిక సత్యం సమాజంలో ఒక బలమైన కాంక్ష రూపం తీసుకుంటుందని నమ్మడానికి ఆధారం ఏముంది? సమసమాజానికి అర్థం సమానత్వాన్ని పొందడం మాత్రమే కాదు, సమానత్వాన్ని ఇవ్వడం కూడ. అంటే సమసమాజం నెలకొనడం వల్ల అందరూ అంతో యింతో కోల్పోవలసి వస్తుంది కూడ. దొంతరలుగా ఉన్న ఈ సమాజంలో కేవలం భూస్వాములు, పెట్టుబడిదారులే కాక, అందరూ ఎంతో కొంత ఆధిపత్యాన్ని, కొంత ప్రివిలేజ్‌ను కోల్పోవలసి వస్తుంది. ఏదీ లేకపోయినా 'అహం' కొంత కోల్పోవలసి వస్తుంది. అందుకు భిన్నంగా, పోరాటాలు ప్రధానంగా 'పొందడం' కోసం చేస్తాము. (అది మన న్యాయమైన హక్కే కావచ్చు). సమసమాజ నిర్మాణాన్ని కార్మికుల పోరాటాల కొనసాగింపుగా చూస్తే ఈ తేడా కనిపించదు. పొందడం కోసం చేసే పోరాటాలు, పంచుకోవడం కోసం చేసే పునర్నిర్మాణం భిన్న స్వభావం గల క్రియలు. మనిషిలో అవి ఆకర్షించే గుణాలు వేరు, కలిగించే అనుభూతులు వేరు, కోరుకునే స్పందన వేరు, వాటికి ఆలంబననిచ్చే విలువలు వేరు. తమను తాము శ్రమ దోపిడీ నుండి విముక్తి చేసుకోవడం కోసం కార్మికులు చేసే పోరాటాల కొనసాగింపుగానే (కార్మిక రాజ్యం ద్వారా) సమసమాజ నిర్మాణం జరుగుతుందన్న మార్క్స్ నమ్మకం ఈ తేడాను గుర్తించలేక పోయిందను కుంటాను.

లెనిన్ కాలం నుండి కమ్యూనిస్టు పార్టీలు ఈ సమస్యను ఒక రూపంలో గుర్తించాయి. తమ మనుగడ కోసం కార్మికులు చేసే పోరాటాలు వారికి కేవలం ట్రేడ్ యూనియన్ (అంటే ఆర్థిక) చైతన్యాన్ని మాత్రమే ఇస్తాయనీ వారిలో రాజకీయ చైతన్యం కమ్యూనిస్టు పార్టీలు ప్రయత్నపూర్వకంగా కల్గించాలనీ సూత్రీకరించారు. అయితే ఇక్కడ రాజకీయ చైతన్యం అంటే ప్రధానంగా ప్రస్తుత వ్యవస్థను

తిరస్కరించి కార్మిక రాజ్యాధికారం నెలకొల్పాలనే చైతన్యం అసలు సమస్య అది కాదు. 'న్యాయమైన వ్యవస్థ' స్థాపన 'న్యాయమైన పోరాటా'ల కొనసాగింపుగా ఒక సరళ క్రమంలో జరిగేది కాదు. దానికి ప్రేరణ ప్రధానంగా ఇంకెక్కడి నుండో రావాలి.

సమసమాజ కాంక్ష మనుషుల చైతన్యంలో ఏ విధంగా స్థిరపడాలి? అది ఎక్కడి నుండి రావాలి? కలిసిమెలిసి బ్రతికే సంస్కృతి, కష్టసుఖాలు పంచుకునే ఆచారం, సమానత్వ విలువ మనుషులలో లేనే లేవని కాదు. మానవ జీవిత ఆచరణలో (ముఖ్యంగా లేమినీ అణచివేతనూ అనుభవించే ప్రజలలో) ఆ సంస్కృతి అన్ని సమాజాలలోనూ కనిపిస్తూనే ఉంటుంది. కానీ ఇప్పటిదాకా అది ఏ నాగరిక సమాజంలోనూ ప్రధాన సంస్కృతిగా లేదు. ఒక మినహాయింపుగా మాత్రమే ఉంది. అది ప్రధాన సంస్కృతి కావాలంటే లేమి నుండీ అణచివేత నుండీ పుట్టి ఒక మినహాయింపుగా సమాజం దిగువ పొరల్లో ఉన్నది జీవనకాంక్షగా సమాజంలో నెలకొనాలి. లేమిలోనే కాక కలిమిలోనూ, అణచివేతలోనే కాక స్వేచ్ఛలోనూ, పీడనలోనే కాక పాలనలోనూ మనుషులు సమష్టి జీవనాన్ని కోరుకోవాలి. అణచివేత నుండి పుట్టి ఒక ఆదర్శంగా ఉన్న జీవన విధానం మనుషుల ప్రగాఢ కాంక్ష కావాలి.

ఇది ఏ విధంగా జరగగలదని వివరంగా చర్చించడానికి ఇది సందర్భం కాదు. కానీ ఈ చర్చను చివరిదాకా తీసుకుపోతే మనిషి ఎవరు, మానవత ఏమిటి, మనిషిని మనిషిగా నిర్వచించే లక్షణాలేవి అనే ప్రశ్నల దగ్గర ఆగుతుంది.

ఈ ప్రశ్నలకు మార్క్సిజంలో జవాబు ఉందా? మార్క్స్ సమకాలికులు, ఆయన పూర్వీకులు అయిన యూరోపియన్ తత్వవేత్తలలో ఒక అలవాటుండేది. వారిలో చాలామంది మానవతకు ఒక నిర్వచనం ఇవ్వడంతో తమ పరిశోధనలను మొదలుపెట్టేవారు. 'మనిషి సంఘజీవి', 'మనిషి రాజకీయ ప్రాణి' అంటూ మొదలు పెట్టేవారు. ఈ పద్ధతి పట్ల మార్క్స్‌కు వ్యతిరేకత ఉండేది. మనిషికి, మానవతకు ఒక నిర్వచనం ఇవ్వడంతో మొదలుపెట్టడం భావవాద పద్ధతి అని ఆయన విమర్శించాడు. మనిషి తన శ్రమద్వారా తనను తాను నిర్వచించుకునే క్రమమే చరిత్ర అనీ, ఆ శ్రమ పరాయీకరణ నుండి (అదే చరిత్ర క్రమంలో) విముక్తి పొందినప్పుడే మనిషి తన నిర్వచనాన్ని పరిపూర్తి చేసుకుంటాడనీ, ఈ క్రమాన్ని విశదీకరించడమే తత్వవేత్తల పని అనీ భావించాడు. ఇది ఆసక్తికరమైన ప్రతిపాదనే కాని మనిషి

స్వీయ నిర్వచనానికి ఏవైనా ప్రాథమికమైన పరిధులు, పరిమితులు, నిర్దిష్ట ప్రాతిపదిక ఉన్నాయా లేక అది అనంతమూ అపరిమితమూ అనే ప్రశ్న మిగిలిపోతుంది. నిజానికి మానవతకూ మనిషికీ మార్క్స్ యిచ్చినది కూడ ఒక నిర్వచనమేనని భావించవచ్చు. 'మనిషి స్వార్థగుణం ప్రధానమైన ప్రాణి' అనో, 'మనిషి సహకార గుణం ప్రధానమైన ప్రాణి' అనో అనే బదులు 'ప్రకృతితో సంఘర్షించి సృజనాత్మకంగా శ్రమ చేయడం ద్వారా ప్రకృతిని, తనను మార్చుకునే ప్రాణి' అని మార్క్స్ మనిషిని నిర్వచించాడని భావించవచ్చు. (మనిషికి మార్క్స్ ఇచ్చిన ఈ నిర్వచనమే ఆయన చారిత్రక సిద్ధాంతమనీ దానిని చారిత్రక భౌతికవాదం అనే కంటే ప్రాకృతిక మానవతావాదం అనడం సబబుగా ఉంటుందనీ కోలకోవ్స్కీ అంటాడు.) ఆ విధంగా అర్థం చేసుకున్నప్పుడు మనిషి గురించి మార్క్స్ యిచ్చిన నిర్వచనంలోని అసమగ్రత కూడా స్పష్టమవుతుంది. సృజనాత్మకమైన శ్రమ ద్వారా మనిషి తనను తాను మార్చుకునే క్రియకు ఉండే పరిమితులేమిటి? దాని పరిధి ఏమిటి? ఏవీ లేవా? అది అనంతమైన అపరిమితమైన మార్పా? ప్రకృతి మీద మనిషి చేసే పోరాటం పెట్టుబడిదారీ వ్యవస్థ రూపం తీసుకున్న తర్వాత మనిషి ఉత్పాదకశక్తి విపరీతంగా పెరిగి మనిషిలోని సర్వశక్తులూ విముక్తం కాగల భౌతిక పరిస్థితి వచ్చిందని మార్క్స్ గుర్తించాడు. అప్పుడిక మనుషులు ఒకరి శ్రమను ఒకరు దోచుకోకుండా తమ ఉమ్మడి ఉత్పాదన శక్తి సృష్టించే సమృద్ధిని ఉమ్మడిగా అనుభవించడం సాధ్యమవుతుంది. అంటే మానవ జీవితంలో చరిత్రానంతరదశ (కమ్యూనిజం) యిక ప్రారంభం కాగలదు. ఏ చారిత్రక క్రమమైతే మనిషి ఉత్పాదక శక్తిని ఆ స్థితికి తీసుకువచ్చిందో అదే చారిత్రక క్రమం యికపైన సాధ్యమయ్యే కమ్యూనిజానికి కావలసిన సమష్టి ఆకాంక్షను, దానిని సాధించే సంకల్పాన్ని (కార్మిక వర్గం రూపంలో) ముందుకు తీసుకువచ్చిందని మార్క్స్ నమ్మాడు. అంటే మనిషిలోని సర్వశక్తులనూ విముక్తి చేయగల భౌతిక ఉత్పాదన శక్తిని మానవజాతి సాధించేనాటికి (అదే క్రమంలో) ఆ ఉత్పాదకశక్తిని సిద్ధంగా అనుభవించడానికి అనువైన ఆర్థిక వ్యవస్థ పట్ల ఆకాంక్ష, దానిని నెలకొల్పాలనే సంకల్పం సమాజంలో పెరుగుతాయని ఆయన నమ్మాడు. సుందరమైన ఈ చిత్రానికి ఆయన వివరణ ఇవ్వకపోలేదు. కాని అందులో ఆశావాదం ఉన్నంతగా తర్కం లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పాదనశక్తిని విపరీతంగా పెంచినమాట వాస్తవమే కావచ్చు. శ్రమదోపిడీ ఇంక అనవసరం కావొచ్చు. ఎవరూ ఎవరినీ దోచుకోకుండ, పీడించకుండ అందరూ సమష్టి సమృద్ధిని అనుభ వించడానికి కావల్సిన పరిస్థితులు ఉన్నాయనేది సత్యమే కావొచ్చు.

అంతమాత్రం చేత మనుషులలో సమష్టి సహజీవన కాంక్ష బలంగా నెలకొనాలని ఏముంది? సమసమాజం బదులు కార్మికులకు కొంత భద్రత కల్పించే కొత్త దోపిడీ వ్యవస్థ రావొచ్చు కదా? ఉత్పాదన శక్తితోపాటు బల ప్రయోగశక్తి కూడా చాలా పెరిగింది కాబట్టి భయంకర నిర్బంధంతో కూడిన కొత్త దోపిడీ వ్యవస్థ ఎందుకు రాకూడదు?

మానవతను సృజనాత్మక శ్రమతో సమానం చేయడం దగ్గర ఆగిపోకుండా మరింత సమగ్రమైన నిర్వచనం ఇవ్వనిదే ఈ ప్రశ్నలకు సమాధానం దొరకదు. చరిత్ర క్రమంలో మనిషి తనను తాను భౌతికంగాను, నైతికంగాను మార్చుకునే మాట వాస్తవమే. కాని దాని పరిధి, పరిమితి, ప్రాతిపదిక ఏమిటనేది మానవత నిర్వచనంలో భాగం కావాలి. అంతవరకు మార్క్స్ ఆలోచన సమగ్ర స్వరూపం తీసుకోదు. కమ్యూనిజం సాధ్యాసాధ్యాలు అంతవరకు అర్థం కావు. సాధ్యమైతే ఏ విధంగా సాధ్యం కాగలదో అర్థం కాదు.

కాని మార్క్స్ ఆలోచనల్లో మనిషికి, మానవతకు ఒక నిర్వచనం యిచ్చే తాత్విక మానవతా భావన (philosophical anthropology) లేనే లేదనేది మార్క్సిస్టు సంప్రదాయంలో బలంగా ఉన్న అభిప్రాయం. అది లేకపోవడం మార్క్స్‌ను భావవాద తత్వవేత్తల నుండి వేరుచేసే ఒక ప్రత్యేకత అనే ప్రశంస కూడ మార్క్సిస్టు సంప్రదాయంలో భాగమే. చాలా వైవిధ్యమున్న మార్క్సిస్టు సంప్రదాయంలో ఈ విషయంలో అసాధారణమైన ఏకాభిప్రాయం ఉంది (అతి కొద్ది మినహాయింపులతో). ప్రధాన మార్క్సిస్టు - లెనినిస్టు స్రవంతి నుండి అల్తూజర్ దాకా, అల్తూజర్ నుండి గ్రామ్‌సీ దాకా, చివరికి మానవతావాద మార్క్సిజమే నిజమైన మార్క్సిజమని బలంగా వాదించే లూసియో కోలెటి దాకా చాలామంది అభిప్రాయం ఇదే. కాని హేతుబద్ధమైన తాత్విక మానవతా వాదనను చేర్చుకోకపోతే మార్క్స్ ఆలోచన పరిపూర్ణం కాదు.

తన వ్యాస సంకలనం 'కల్లోల కథాచిత్రాలు'కు తనే రాసుకున్న చివరిమాట
పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ, డిసెంబరు 1997

V

# ముస్లిం ఐడెంటిటీ - అభ్యుదయ రాజకీయాలు

ముస్లింలు తమను తాము ముస్లింలుగా భావించుకునే రాజకీయ స్పందనకు భారతదేశంలో తావు ఉందా? భావించుకోవడం జరుగుతున్నది. భావించుకొని స్పందించడమూ జరుగుతున్నది. ముఖ్యంగా, బాబ్రీమసీదు కూల్చివేత తరువాత. దానిని ఏ విధంగా స్వీకరించాలన్నదే సమస్య. దానిని అభ్యుదయ వాదులు అర్థవంతమైన రాజకీయ భావనగా స్వీకరించాలా (విమర్శనాత్మకంగా నయినా సరే) లేక వాస్తవిక పునాది లేని తప్పుడు అవగాహన అని తిరస్కరించాలా లేక మతోన్మాదానికి బీజం వేయగల పెడదృష్టి అని నిందించాలా?

ఒక మైనారిటీగా ముస్లింలు ఎదుర్కొంటున్న వివక్షనూ సాంస్కృతిక అణచివేతనూ భౌతిక దాడులనూ అర్థం చేసుకోలేని అభ్యుదయ వాదులెవరూ ఉండరు. దాని నుండి పుట్టే నిరసనను అందరూ తప్పక ఆహ్వానిస్తారు. అంతవరకు అభిప్రాయ భేదాలుండవు. కానీ ఈ నిరసన ఒక నెగటివ్ భావన మాత్రమే. అది ఇచ్చే 'ఐడెంటిటీ' ఒక నెగటివ్ ఐడెంటిటీ మాత్రమే. 'మేము వివక్షకు గురి అవుతున్న మైనారిటీ' అనే భావన మాత్రమే. 'మేము' అనే సంపూర్ణమైన భావన కాదు. మరి ఆ సంపూర్ణ భావనకు ఏ విధంగా స్పందించాలి? అది ఉనికిలో ఉంది. కేవలం మైనారిటీ

భావనకు దానిని పరిమితం కమ్మంటే అది కాదు. మరయితే ఏం చేయాలి? ముస్లింలు ముస్లింలుగా స్పందించే రాజకీయ చైతన్యాన్ని అభ్యుదయవాదులు ఆమోదించడం, ఆహ్వానించడం సాధ్యమా అసాధ్యమా? అది మతోన్మాద రూపం తీసుకుంటే అసాధ్యమే. సంప్రదాయాన్ని చెక్కుచెదరకుండా కాపాడాలని భావించే ఛాందసవాద రూపం తీసుకుంటేనూ అసాధ్యమే. కానీ మతోన్మాదాన్ని తిరస్కరిస్తూ, సంస్కరణలను ఆహ్వానిస్తూ అదే సమయంలో 'ముస్లిం రాజకీయం'గానే ఉండేది ఆహ్వానించదగినదేనా? మతాతీతమైనది మాత్రమే ఆమోదనీయమా?

ఈ ప్రశ్నకు జవాబు చెప్పేముందు 'ఐడెంటిటీ' అనే దానికి మానవ అస్తిత్వంలో ఉండే పాత్రను గుర్తించడం అవసరం. ఐడెంటిటీని ఎవరో తెలుగులోకి 'గుర్తింపు' అని అనువాదం చేశారు. అది అసంతృప్తికరమైన అనువాదం. కానీ ఇప్పుడు 'గుర్తింపు రాజకీయాలు' అనే ప్రయోగం కూడ అలవాటయిపోయింది. కులం, మతం, భాష, జాతి, ప్రాంతం, లింగం మొదలయిన సాంఘిక వర్గీకరణల ప్రాతిపదికన జరిగే రాజకీయ కృషిని ఈ పేరుతో పిలుస్తున్నారు. మనుషుల్ని అమూర్తమైన 'పౌరులు'గా భావించే లిబరల్ బూర్జువా రాజకీయ దృక్పథానికి, మనుషులను వర్గాలుగా విభజించే మార్క్సిస్ట్ రాజకీయ దృక్పథానికి ఈ 'గుర్తింపు రాజకీయం' భిన్నమైనదని చెప్పడం ఇక్కడ ఉద్దేశ్యం. పై రెండు దృక్పథాలలోనూ మనుషులు ('పౌరులుగా'నయినా, 'వర్గం'గానయినా) తమ అవసరాల ప్రాతిపదికన హేతుబద్ధమైన వివేచనతో ప్రవర్తిస్తారనీ, గుర్తింపు రాజకీయాలు అందుకు భిన్నమైనవనీ ఇక్కడ అర్థం. ఇది సరయిన విశ్లేషణేనా అన్న ప్రశ్న అటుంచి, 'గుర్తింపు రాజకీయాలు' అన్న పేరులో ఈ భావం స్ఫురించదు.

దానికన్నా ముందు మానవ అస్తిత్వంలో ఈ 'ఐడెంటిటీ' అనే దానికి ఉండే స్థానాన్ని పరిశీలిద్దాం. ఏ విషయం గురించి ఆలోచించేటప్పుడయినా దాని సామాజిక పార్శ్వాన్ని - మనిషి ఉనికిలో దానికుండే పాత్రనూ ప్రాముఖ్యాన్నీ - కూడ అర్థం చేసుకోవడం అవసరం. అప్పుడే మన అవగాహన సంపూర్ణం అవుతుంది. 'ఐడెంటిటీల' సాంఘిక ఆర్థిక పార్శ్వాన్ని (కులం, మతం, వర్గం, లింగం, ప్రాంతం, భాష వగైరాల ప్రాతిపదికన ఏర్పడే 'నేను', 'మేము' అనే భావనలను) రాజకీయంగా అర్థం చేసుకోవడం, విమర్శించడం నేర్చుకుంటున్నాం. రాజకీయ ఐడెంటిటీలను శాస్త్రీయం, వాస్తవికం, అశాస్త్రీయం, భ్రమాజనితం, తప్పుడు చైతన్యం అని వర్గీకరిస్తున్నాం. ఆ పని చేసేముందు ఐడెంటిటీల మానవ పార్శ్వాన్ని కూడ అర్థం చేసుకోవడం అవసరం. రాడికల్‌గా ఆలోచించడం అంటే విషయాల మూలాలలోకి

పోవడం. 'మనిషికి సంబంధించినంతవరకు అన్ని విషయాల మూలం మనిషే'నని మార్క్స్ తన తొట్టతొలి రచనలలో ఒక చోట అంటాడు. విలువైన ఈ సూచనను ఆ తరువాతి కాలంలో ఆయనే ఎల్లప్పుడూ జ్ఞాపకం పెట్టుకోలేదు. కానీ దానిని జ్ఞాపకం పెట్టుకోవడం అవసరం.

ఇతర జంతువులకూ మనిషికీ ఉండే ఒక ముఖ్యమైన తేడా ఏమిటంటే ఇతర జంతువుల వ్యక్తిత్వం చాలావరకు పుట్టుకతోనే నిర్ణయించబడుతుంది. అంటే దాని 'జీన్స్' చేతే నిర్ణయించబడుతుంది. మనిషి అట్లా కాదు. మనిషిలో పుట్టుకతో - అంటే జీన్స్ ద్వారా - నిర్ణయించబడే అంశం కొంచెమే. ఆ పైన నేర్చుకోవడం, తనను తాను రూపొందించుకోవడం జరుగుతుంది. ఈ విధంగా ఎదిగే క్రమంలో మనిషి వ్యక్తిత్వం (personality) ఏర్పడుతుంది. ప్రవర్తనను నిర్ణయించడంలో ఇతర జంతువులలో 'జీన్స్' నిర్వహించే పాత్రను మనిషిలో వ్యక్తిత్వం నిర్వహిస్తుంది.

ఈ వ్యక్తిత్వానికి కేంద్రం 'నేను' అనే వ్యక్తి భావన (ఇంగ్లీషులో సెల్ఫ్ లేక ఐడెంటిటీ). ప్రతి మనిషిలోనూ వ్యక్తావ్యక్తమైన ఐడెంటిటీ ఉంటుంది. దీనిలో కొన్ని పూర్తిగా వ్యక్తిగతమైన భావనలుంటాయి. 'నేను క్రమశిక్షణగల మనిషిని', 'నాది దయార్ద్ర హృదయం' మొదలైన భావనలు. కాని అవే కాక, వివిధ సాంఘిక సమూహాలలో భాగంగా తనను తాను గుర్తించడం కూడా 'నేను' అనే ఐడెంటిటీ ఏర్పడే క్రమంలో భాగమే.

ప్రపంచాన్ని నా వాళ్ళు - పరాయివాళ్ళు అని విభజించుకొని తనవారిగా తాను భావించిన వారితో మమేకం కావడం మనిషికి ఉన్న అత్యంత స్వాభావికమైన లక్షణాలలో ఒకటి. ఐడెంటిటీ అనే వ్యక్తి భావన ఏర్పడే క్రమంలో దీనికి ముఖ్యస్థానం ఉంటుంది. మనుషులకు ఒకేసారి పలు సాంఘిక ఐడెంటిటీలు ఉండగలవు. ప్రాంతం, భాష, కులం, మతం మొదలయినవేవయినా దీనికి ప్రాతిపదిక కాగలవు. ఇవికాక, పైన చెప్పినట్టు, వ్యక్తిగతమయిన ఐడెంటిటీ భావనలు కూడా ఉంటాయి. వీటన్నిటి సమాహారమే 'నేను' అనే వ్యక్తి. ఈ 'నేను' అనే వ్యక్తి భావనకు స్థిరత్వం ఉండదనీ, అది చంచలం అనీ భావించే 'పోస్టు-మోడరన్' దృక్పథంతో ఏకీభవించనవసరం లేదు. అయితే అందులో వివిధ అంశాలుంటాయనేది సత్యం. వాటి ప్రాధాన్యతలు పరిస్థితులను బట్టి మారగలవనేది కూడ సత్యం. ఒక వ్యక్తి కార్మికుల మధ్య కార్మికునిగా, ముస్లింల మధ్య ముస్లింగా, మగవాళ్ళ మధ్య మగవాడిగా ఉండటం సాధ్యమే. అన్ని

సందర్భాలలోనూ ఏదో ఒక అంశమే ప్రబలంగా ఉండే వాళ్ళు కొద్దిమందే ఉంటారు. అయినప్పటికీ 'నేను' అనే వ్యక్తిభావన నిర్దిష్టతలేని అస్థిర భావన కానవసరం లేదు. వైవిధ్యంలోనే దానికి (సాపేక్ష) స్థిరత్వం ఉండగలదు. ఉంటుంది.

ఇదంతా మనిషికి స్వాభావికం అంటే అర్థం విమర్శకు అతీతమని కాదు. మనిషికి ఉండే వ్యక్తి భావనలో ఆధిపత్య స్వభావం కలిగినవి కొన్ని ఉంటాయి. వాటిని అభ్యుదయవాదులు విమర్శించడమే కాక తిరస్కరించాలి కూడా. ఉదాహరణకు తానొక ఆధిపత్య వర్గానికి లేక కులానికి చెందిన వ్యక్తినన్న భావన. లేదా 'నేను అందరినీ దాసోహం చేసుకోగలను' అనే వ్యక్తిగత ఆధిపత్య భావన. కానీ ఆధిపత్య స్వభావం నుండి పుట్టని 'ఐడెంటిటీల' పట్ల ఏ వైఖరి ఉండాలి? అవన్నీ అణచివేత నుండి పుట్టినవే కానవసరం లేదు. ఒకవేళ అయినా అన్ని అణచివేత రూపాల స్వభావమూ ఒకటి కాదు. ఈ (సాంఘిక) ఐడెంటిటీలు రాజకీయ ఆచరణకూ సాంఘిక సమీకరణకూ ప్రాతిపదిక కాగలవు. వాటిపట్ల ఏ వైఖరి ఉండడం ఉచితంగా ఉంటుంది?

ఇప్పటికి మూడు వైఖరులు ఉనికిలో ఉన్నాయి. మరీ సాంప్రదాయక మార్క్సిస్టులు 'వర్గం' ఒక్కటే శాస్త్రీయమైన వ్యక్తిభావన అనీ, తక్కినవన్నీ తప్పుడు చైతన్యం నుండి పుట్టినవనీ, ప్రజలు వాటిని వదులుకొని వర్గచైతన్యం పొందాలనీ అంటుంటారు. ఐడెంటిటీని వ్యక్తిత్వం ఎదిగే క్రమంలో రూపొందే 'నేను' అనే స్వీయభావనకు సంబంధించిన విషయంగా కాక, కేవలం చైతన్యానికి (ఆలోచనలకూ అవగాహనకూ) సంబంధించిన విషయంగా అర్థం చేసుకోవడం వల్లనే దానిని 'శాస్త్రీయం' 'అశాస్త్రీయం' అని, 'సరయిన చైతన్యం' 'తప్పుడు చైతన్యం' అని వర్గీకరించడం, అశాస్త్రీయమైన తప్పుడు ఆలోచనలను వదులుకొమ్మనడం సాధ్యమవుతున్నది. ఇక్కడ మళ్ళీ నా ఉద్దేశ్యం ఐడెంటిటీలు విమర్శకు అతీతం అని కాదు. కానీ అది పదార్థ జ్ఞానానికి సంబంధించిన తప్పొప్పుల విమర్శ కాజాలదు. ఆ ఐడెంటిటీలో వ్యక్తమయ్యే విలువలకు సంబంధించిన తప్పొప్పుల విమర్శ కాగలదు.

రెండవ వైఖరి ఏమిటంటే, వర్గేతర పీడిత భావనలన్నీ వర్గ భావనలో భాగం కావాలి (లేక దానికి లోబడి ఉండాలి లేక దానిలో మిళితం కావాలి) అని చెప్పడం. ఇది ఈ రోజు కమ్యూనిస్టులు ఎక్కువగా అనుసరిస్తున్న వైఖరి. కానీ స్వభావరీత్యా 'వర్గం' కంటే చాలా భిన్నమైన ఐడెంటిటీలు వర్గభావనలో 'భాగం' కావడం లేదా దానికి లోబడి నడవడం ఏ విధంగా సాధ్యం కాగలదు? తన నాయకత్వంలోనే

అందరి సమస్యలూ పరిష్కారం అవుతాయనీ, అన్ని న్యాయమైన ఆకాంక్షలూ తీరుతాయనీ కార్మికవర్గం సకల పీడిత ప్రజాశ్రేణులను నమ్మించి వారి విశ్వాసం పొందాలని గ్రామ్‌సీ అన్నాడు. ఆయన ప్రధానంగా రైతాంగాన్ని ఉద్దేశించి ఈ మాట అన్నాడు గానీ దానిని అన్ని రకాల పీడనకూ అన్వయించుకోవచ్చును. వర్గేతర పీడిత భావనలను తప్పుదోవ పట్టిన చైతన్యం అని తిరస్కరించే వైఖరి కంటే ఇది మెరుగయినదే. కానీ కార్మిక వర్గం ఇతర పీడిత ప్రజలలో ఈ విశ్వాసం కలిగించగలదని నమ్మడానికి హేతుబద్ధమైన కారణం ఏమైనా ఉందా? మగవాళ్ళ యిన పారిశ్రామిక కార్మికవర్గం మెజారిటీగా ఉండే నాయకత్వంలో లైంగిక అణచివేత తొలగిపోతుందని స్త్రీలు ఎందుకు నమ్మాలి? నిజానికి పారిశ్రామిక కార్మికవర్గం మెజారిటీగా మగవాళ్ళయి ఉండడానికి లైంగిక అణచివేత ఒక ముఖ్య కారణం. అటువంటప్పుడు ఆ కారణంగా 'మగ' స్వభావం సంతరించుకున్న కార్మికవర్గం నాయకత్వంలో స్త్రీల సమస్యలు పరిష్కారమవుతాయని స్త్రీలెందుకు నమ్మాలి? అటువంటి ప్రశ్నలే దళితులూ ఆదివాసులూ కూడా కార్మికవర్గం గురించి అడగవచ్చు.

పారిశ్రామిక కార్మికులు మెజారిటీగా మగవాళ్ళా, దళితేతరులా అన్న ప్రశ్న అటుంచి స్వభావరీత్యానే చాలా భిన్నమైన అసమానతలు ఏదో ఒక్క జీవిత అనుభవం నుండి పుట్టిన చైతన్యం ద్వారా, అది ముందుకు తెచ్చే ఆలోచనల ద్వారా తొలగిపోగలవని నమ్మడానికి హేతుబద్ధమైన కారణం ఏముంది? కార్మిక వర్గానిది (తత్పూర్వకాలపు విప్లవ వర్గాల లాగా) ఒక ప్రత్యేకమైన లక్ష్యం కాదనీ, దాని లక్ష్యమే సార్వజనీనమనీ మార్క్స్ భావించాడు. (ఒక్కొక్కసారి కార్మిక వర్గమే ఒక సార్వజనీన వర్గం - యూనివర్సల్ క్లాస్ - అంటాడు.) కార్మిక వర్గం తాను ఎదుర్కొంటున్న శ్రమ దోపిడీకి పరిష్కారంగా ముందుకు తెచ్చే వర్గరహిత ఉత్పత్తి వ్యవస్థలోనే అన్ని న్యాయమైన ఆకాంక్షలు సాధ్యమవుతాయని దీనిని వివరించుకోవచ్చు. కానీ వర్గరహిత ఉత్పత్తి వ్యవస్థ అభిలషణీయమని అంగీకరిస్తూ కూడా అది అన్ని సమస్యల పరిష్కారానికి పునాది అన్న భావనను ప్రశ్నించవచ్చు. ఆర్థికేతర అణచివేతకు గురి అవుతున్న వారంతా దీనినే ప్రశ్నిస్తున్నారు. బోల్షివిక్ ఆచరణ పుణ్యాన కార్మిక వర్గం అన్న మాటకు అసలు అర్థం పోయి కమ్యూనిస్టు పార్టీయే కార్మిక వర్గం అన్న అర్థం వచ్చిన తరువాత ఈ సంశయం మరింత బలపడింది. దానికి సంతృప్తికరమైన జవాబు ఇవ్వకుండా వర్గ ఐడెంటిటీలో ఇతర ఐడెంటిటీలు మిళితం కావాలనడంలో అర్థం లేదు.

ఇప్పుడివి రెండూ కాక మూడవ వైఖరి కూడా ముందుకొచ్చింది. ఐడెంటిటీల ప్రాధాన్యతల జోలికి పోకుండ, ఏదో ఒకటే అన్నింటి కంటే శాస్త్రీయమైనది అనకుండ, సకల పీడిత ప్రజలు (దళితులు, కార్మికులు, స్త్రీలు, ఆదివాసులు, మైనారిటీలు వగైరా) ఒక్కటై అందరికీ శత్రువైన 'వ్యవస్థ'ను కూలదోయాలనీ లేదా మార్చుకోవాలనీ ఈ వాదన పిలుపునిస్తుంది. ఇప్పుడు చాలామంది అభ్యుదయ వాదులు (కొంతమంది మార్క్సిస్టులు కూడ) ఈ విధంగానే వాదిస్తున్నారు. పీడిత ప్రజా పోరాటాల మధ్య పరస్పరం సంఘీభావం, సహాయ సహకారాలు, సమన్వయం ఎంత సాధ్యమైతే అంత పెంపొందించవలసిందే గానీ అన్నీ 'ఒక్కటి' ఎట్లా కాగలవు? అన్నీ ఒకటి అయి ఎవరిపైన పోరాటం చేయగలవు? అందరి శత్రువూ ఒకరు కారు కదా? స్త్రీలనూ ఆదివాసులనూ పారిశ్రామిక కార్మికులనూ ఒక్కటి చేయగల ప్రాతిపదిక ఏముంటుంది? అందరి ఆకాంక్షలలోనూ సమానత్వం అనే విలువ ఉంటుంది కాబట్టి విలువల సారూప్యత ప్రాతిపదికన సంఘీభావం సాధ్యం అవుతుంది. కానీ తమ సమస్యలు వేరువేరయినప్పుడు, తాము పోరాడే శత్రువులు వేరువేరయినప్పుడు, ఈ ప్రజలంతా 'కలిసి' ఎవరిపైన పోరాటం చేయగలరు? ఈ పోరాటాలకు నైతిక ఐక్యతేగానీ భౌతిక ఐక్యత సాధ్యం అవుతుందా?

ఎవరి సమస్యలేవయినా అన్నిటికీ మూలం రాజ్యంలో ఉంది కాబట్టి (లేదా అన్ని ఆధిపత్యాలకూ దన్ను రాజ్యం నుండి లభిస్తుంది కాబట్టి) అందరూ ఒక్కటై రాజ్యంపైన పోరాటం చేయాలని దీనికి సమాధానం చెప్తారు. కానీ నిజానికి రాజ్యంతో పీడిత ప్రజాశ్రేణులన్నిటికీ ఒకే రకమైన శత్రుత్వం ఉండదు. రాజ్యంతో తలపడడం అన్ని పోరాటాలకూ ఒకే రకమైన అవసరం కాదు. ఒకే సందర్భంలో అవసరం కాదు. రాజ్యం సార్వభౌమత్వాన్ని సవాలు చేసే కమ్యూనిస్టు పోరాటాలకు మాత్రమే రాజ్యం ప్రత్యక్ష శత్రువు. కమ్యూనిస్టు పోరాటాల లక్ష్యం స్వంత ఆస్తిని రద్దు చేయడం. స్వంత ఆస్తిని కాపాడే చట్టాలు చేసే సార్వభౌమ అధికారం రాజ్యానికి ఉంది కాబట్టి ఆ సార్వభౌమత్వాన్ని స్వాధీనం చేసుకోనిదే స్వంత ఆస్తి రద్దు కాదని కమ్యూనిస్టులు భావిస్తారు. అందువల్ల తమ పోరాటాలను రాజ్యంపైనే ఎక్కుపెడతారు. (శాసనం ద్వారా స్వంత ఆస్తిని రద్దు చేయవచ్చును గాని స్వంత ఆస్తి లేని వ్యవస్థను శాసనం ద్వారా - అంటే సార్వభౌమ రాజ్యాధికారం ద్వారా - నిర్మించలేమని ఇప్పుడు అర్థం అవుతున్నది. కాబట్టి కమ్యూనిస్టు పోరాటాలయినా రాజ్యాధికారానికి అంత కేంద్ర స్థానం ఇవ్వడం సబబా అన్న ప్రశ్న ఇప్పుడు వచ్చింది.) అది అట్లా ఉంచి చట్టాలతో నిమిత్తం లేని సాంఘిక అణచివేత రూపాలకు వ్యతిరేకంగా సాగే పోరాటాలకు రాజ్యం

సార్వభౌమత్వాన్ని నేరుగా ప్రశ్నించవలసిన అవసరం ఉండకపోవచ్చు. అవి ఎదుర్కొనే శత్రువులు చట్టంతో (అంటే రాజ్యాధికారంతో) పుట్టినవీ, చట్టంతో పోయేవీ కానప్పుడు ఆ పోరాటాలకు రాజ్యం కేంద్రబిందువు ఎందుకు కావాలి? పోరాట క్రమంలో, భద్రతను కాపాడే పేరు మీద రాజ్యం బలవంతుల పక్షాన రంగంలోకి దిగినప్పుడే రాజ్యంతో వారు తలపడవలసి వస్తుంది. అంతే తప్ప రాజ్యమే ఆ ప్రజల ప్రత్యక్ష శత్రువు కాదు.

అంతేకాదు, సాంఘిక అణచివేతను ఎదుర్కొనే ప్రజలు రాజ్యం నుండి సంస్కరణలు కోరుకుంటారు. అణచివేతను అదుపుచేసే చట్టాలు కోరుకుంటారు. అది పూర్తిగా అసాధ్యమైనప్పుడు మాత్రమే వారు రాజ్యం సాధికారతనూ సార్వభౌమత్వాన్నీ ప్రశ్నిస్తారు. అంతవరకు, రాజ్యం భద్రత పేరిట ఆధిపత్య శక్తులకు అండగా నిలబడి తమ ఆందోళనలను అణచివేసిన మేరకే వారు రాజ్యంతో నేరుగా తలపడతారు. ఆ అవసరం వాళ్ళకు అన్ని సందర్భాలలోనూ రాదు. ముస్లింలనే ఉదాహరణగా తీసుకుంటే భారత రాజ్యం తన సెక్యులర్ స్వభావానికి కట్టుబడి ఉండాలనేది రాజ్యంపైన వారు (ముస్లింలుగా) పెట్టే ప్రధాన డిమాండు. భారత రాజ్యం ఆ స్వభావాన్ని కోల్పోనంత మేరకు హైందవ ఆధిపత్యాన్ని వ్యతిరేకించడానికి అది వారికి ఉపకరించే సాధనమే. కోల్పోయిన మేరకే వారు రాజ్యంపైన పోరాటం చేయవలసి ఉంటుంది. అప్పుడు కూడ - రాజ్యం పూర్తిగా హైందవ రాజ్యంగా మారితే తప్ప - అదే వారి ప్రధాన పోరాటం కాదు. స్థూలంగా చెప్పాలంటే, రాజ్యం ప్రజాస్వామ్య నియమాలన్నింటినీ తిరస్కరించి ఫాసిస్టు రాజ్యంగా మారినప్పుడు మాత్రమే (లేదా మారిన మేరకు మాత్రమే) అన్ని ప్రజాపోరాటాలకూ రాజ్యంతో తలపడవలసిన అవసరం ఉంటుంది. ఎందుకంటే ఏ పోరాటానికయినా ప్రజాస్వామ్య అవకాశాలు అవసరం కాబట్టి. అయితే అప్పుడు కూడా అందరికీ రాజ్యం సార్వభౌమత్వాన్ని సవాలు చేయవలసిన అవసరం ఉండకపోవచ్చు. దానిని ప్రజాస్వామ్యీకరించడం కోసం పోరాడడంతో సరిపెట్టుకునే ప్రజాశ్రేణులుంటాయి.

కాబట్టి పీడిత ప్రజలంతా భౌతికంగా ఒకటై ఒక ప్రచండ శక్తిగా మారి 'వ్యవస్థ'ను కూలదోయాలి అనే ఆలోచనకు పెద్దగా అర్థం లేదు. ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల మధ్య ఎంత ఐక్యత ఉంటే అంత మంచిది గానీ అది అరుదుగా మాత్రమే భౌతిక ఐక్యత కాగలదు. కావడానికి అందరి అవసరాలూ ఆకాంక్షలూ ప్రయోజనాలూ కోరికలూ ఒకటి కావు. వాటి మధ్య అంతస్సంబంధం ఎంతో కొంత ఉంటుంది కాబట్టి ఆ మేరకు ఐక్యత సాధ్యం కావచ్చు. రాజ్యం

నియంతృత్వ రూపం తీసుకుని ప్రజాస్వామ్య అవకాశాలను ధ్వంసం చేసినప్పుడు కూడా భౌతిక ఐక్యత (ప్రజాస్వామ్య పునరుద్ధరణ లేక సాధన కోసం) సాధ్యం అవుతుంది కానీ సాధారణ పరిస్థితులలో ఉద్యమాల మధ్య ఐక్యత నైతిక సంఘీభావంగానే ఉండగలదు, ఐక్య భౌతికశక్తిగా కాదు. నైతిక సంఘీభావంగా దానిని అర్థం చేసుకొని పెంపొందించినప్పుడే అత్యవసర పరిస్థితులలోనయినా అది భౌతిక ఐక్యత రూపం తీసుకోగలదు.

నైతిక ఐక్యతకు - సంఘీభావానికి - తావు ఎక్కడి నుండి వస్తుంది? అది కేవలం అభ్యుదయవాదుల కోరిక మాత్రమేనా? ఎంత గొప్ప కోరిక అయినా దానికి వాస్తవ ప్రాతిపదిక లేకపోతే వదులుకోవడం మంచిది. కానీ ఈ కోరికకు వాస్తవ ప్రాతిపదిక ఉందనుకుంటాను. మనుషుల ప్రయోజనాలన్నీ పాక్షికమైనవే గానీ వాటిని వ్యక్తం చేసే విలువలెప్పుడూ సార్వజనీనమైనవి (అవి ప్రజాతంత్ర విలువలు కావచ్చు, ఆధిపత్య విలువలు కావచ్చు). తమ పాక్షిక ప్రయోజనాలలోనే సార్వజనీన ప్రయోజనాలను ఇముడ్చుకున్నవారు (మార్క్స్ ఊహించిన కార్మిక వర్గం) ప్రపంచంలో ఎవరూ లేరు, ఉండబోరు. భౌతిక ప్రయోజనాలలోనే సార్వజనీనత ఉండగలదనుకోవడం వల్లనేమో నైతిక సార్వజనీనతకు మార్క్స్ పెద్దగా విలువ ఇవ్వలేదు. ఇవ్వకపోగా, దానిని గురించి మాట్లాడిన కొద్ది సందర్భాలలో దానిని తృణీకరించాడు. కానీ నిజమైన సార్వజనీనత ఉండేది విలువలలోనే, భౌతిక ప్రయోజనాలలో కాదు. దీనికి మూలం కూడా మనిషిలోనే ఉంది. తన పాక్షికమైన అవసరాలను సార్వజనీనమైన విలువల రూపంలో వ్యక్తం చేసే గుణం మనిషిలో ఎందుకుందో, మానవజాతి ఎదుగుదలలో ఏ దశలో అది మానవ నైజంలో భాగం అయిందో తెలీదుగాని అది మనకు తెలిసిన మనిషి నైజంలో విడదీయరాని భాగం. ఈ విలువల సార్వజనీనతే ఉద్యమాల మధ్య, ఆరాటాల మధ్య సంఘీభావానికీ, సహానుభూతికీ తావు కల్పిస్తుంది. అందరి ప్రయోజనాల మధ్య ఒక కృత్రిమ భౌతిక ఐక్యతను ఊహించి దాని కోసం భౌతికంగా అందరూ ఐక్యమై ఒక ప్రచండమైన భౌతిక శక్తిగా మారుతారన్న ఆలోచన వదిలిపెట్టి, భౌతిక ఐక్యత ఏ మేరకు సాధ్యమైతే ఆ మేరకు దానిని నిలబెట్టుకుంటూ ఐక్యత ప్రధానంగా నైతికం అనీ, దానిని ప్రయత్నపూర్వకంగా పెంపొందించడం ద్వారా ఒకరి సంఘీభావం మరొకరికి అందగలుగుతుందనీ అర్థం చేసుకున్నప్పుడు విభిన్నమైన ఐడెంటిటీలను ఏ విధంగా స్వీకరించాలో అర్థం అవుతుంది.

ఉదాహరణకు పది మంది నిరుద్యోగులు కలిసి ఒక నిరుద్యోగ సంఘం పెట్టుకుంటే 'మా పదిమందికి ఉద్యోగాలు ఇవ్వండి' అని మాత్రమే అడగరు. 'ఒక ప్రజాస్వామిక దేశంలో నిరుద్యోగం ఉండటానికి వీలులేదు' అన్న జనరల్ సూత్రాన్ని ప్రతిపాదిస్తారు. 'మనిషయి పుట్టిన ప్రతీ ఒక్కరికీ కాయకష్టం చేసుకొని గౌరవప్రదంగా బ్రతికే అవకాశం ఉండాలి' అన్న సార్వజనీన నైతిక విలువ రూపంలో తమ కోరికను వ్యక్తం చేస్తారు. ఇది మనుషులెప్పుడూ చేసే పనే. అదే ఊరిలో ఇంకొక పదిమంది దళితులు అంటరానితనానికి వ్యతిరేకంగా ఒక సంఘం పెట్టారనుకోండి. వాళ్ళు కూడా 'మా వాడలో చాయ్ హోటల్లో వేరే గ్లాసులు పెట్టడానికి వీలులేదు' అని మాత్రమే అనరు. సామాజిక గౌరవాన్ని గురించి, మానవత గురించి సార్వజనీన విలువలనూ సూత్రాలనూ ప్రతిపాదిస్తారు. తద్వారా తమ పాక్షిక డిమాండ్లను వ్యక్తం చేస్తారు. ఇప్పుడు ఈ రెండు సంఘాల మధ్య ఐక్యత కోరుకునేవారు, 'మీరిద్దరూ ఒక్కటై మీ ఉమ్మడి శత్రువు అయిన వర్గ - కుల రాజ్యానికి (లేక ఫ్యూడలిజంతో షరీకయిన పెట్టుబడిదారీ రాజ్యానికి) వ్యతిరేకంగా మీ పోరాటాన్ని ఎక్కుపెట్టండి అనడంలో అర్థం లేదు. ఇద్దరూ తమ పాక్షికమైన కోరికలను వ్యక్తం చేయడానికి ప్రయోగించే సార్వజనీన విలువలలో సంఘీభావానికి తావు దొరుకుతుంది గానీ వారి భౌతిక ప్రయోజనాలలో కాదు. నిజమే, నిరుద్యోగానికి కారణమైన రాజకీయార్థిక వ్యవస్థకూ అంటరానితనాన్ని కాపాడే కులవ్యవస్థకూ మధ్య సంబంధం ఉంది. కానీ అవి రెండూ ఒకటి కావు. ఒకే క్రమంలో 'కూలిపోయే'వీ కావు. ఆస్తి, కులం, పితృస్వామ్యం మొదలయిన వ్యవస్థల మధ్య పరస్పర సంబంధాలున్నాయి. దేనికది ఒక సర్వస్వతంత్రమయిన ద్వీపం కాదు. కానీ వాటినన్నిటినీ కలబోస్తే అందరికీ ఉమ్మడి శత్రువయిన ఒక వ్యవస్థ 'అవదు'. ఒక్కొక్క అణచివేత రూపానికి వ్యతిరేకంగా ముందుకొచ్చే పోరాటాలు వ్యక్తం చేసే సార్వజనీన నైతిక విలువలలోని సామాన్య అంశాలలోంచి సంఘీభావానికి చోటు వెతకడం సబబుగా ఉంటుంది. 'నీ కోసం నువ్వు న్యాయం కోరుకుంటున్నావు కాబట్టి ఇతరుల కోసం కూడా న్యాయం కోరుకోవాలి, ఇతరులకు నువ్వు న్యాయం చేయాలి' అనేది హేతుబద్ధమైన వాదన. ఎందుకంటే న్యాయం అనే భావనే (అన్ని విలువలలాగ) సార్వజనీనమైనది. మన అవసరాలను మనం మానవత అనే భావన ద్వారా ఎప్పుడైతే వ్యక్తం చేస్తామో అప్పుడు అదే మానవతాభావనను ఇతరులకు కూడా అన్వయించడాన్ని మనం సులభంగా తప్పించుకోలేము. తప్పించుకోవడానికి ప్రయత్నించమని కాదు. కాని

తప్పించుకోవటం కష్టం. దానికి అడ్డమొచ్చే సార్వజనీనత ఆ విలువలో (అన్ని విలువల లాగ) ఉంది. భౌతిక ప్రయోజనాలకు (విలువల రూపంలో వ్యక్తం అయ్యేదాకా) అటువంటి సార్వజనీనత లేదు. భౌతిక అవసరాలలో సార్వజనీనత కోసం వెతికే మార్క్సిస్టు సంప్రదాయం స్థానాన్ని మానవ వ్యవహారాలలో ఏ రకమైన సార్వజనీనతా సాధ్యం కాదని నమ్మే 'పోస్ట్ - మోడరన్' దృక్పథం ఆక్రమిస్తున్నది కాబట్టి ఈ మాటలు చెప్పడం అవసరం అయింది.

కాబట్టి ఐడెంటిటీల గురించి ఆలోచించేటప్పుడు ప్రధానంగా లెక్కలోకి తీసుకోవలసింది వాటిలో వ్యక్తమయ్యే విలువలను. అవి ఏ రకమైన సంఘీభావాన్ని వ్యక్తం చేస్తాయి? ఏ దిశగా మనల్ని, మన ఆకాంక్షలను నడిపిస్తాయి? ఏ ఆచరణకు ఊతమిస్తాయి?

'ముస్లిం ఐడెంటిటీ' గురించి ఈ కోణం నుంచి ఆలోచిద్దాం. వివక్షకూ నిర్లక్ష్యానికీ గురవుతున్న మైనారిటీగా ముస్లింలు వ్యక్తం చేసే ఆందోళనను మైనారిటీ హక్కుల కోణం నుండి చూసి సమర్థించాలనడం సబబే. కానీ ఆ నిరసనలో వ్యక్తమయ్యే ఆలోచనలలోని విలువలు సమాజ సాంస్కృతిక సంపదను పెంపొందించగలవని అర్థం చేసుకున్నప్పుడే ఆ నిరసన తన అవసరాలను తీర్చుకుంటూనే ఇతర పురోగామి ప్రయోజనాలలో ఏ విధంగా భాగం కాగలదో అర్థం అవుతుంది. అప్పుడది 'వాళ్ళ' అవసరం - సమంజసమైన అవసరం - మాత్రమే కాదనీ, ఒక రకంగా అందరి అవసరం కూడాననీ అర్థం అవుతుంది. నిత్యం శంకించబడే వ్యక్తులకు అర్థమయినంతగా 'ఆత్మగౌరవం' అనే భావన ఇతరులకు అర్థం కాగలదా? వాళ్ళు నేర్పించినంత గట్టిగా ఆ విలువను వేరెవరు నేర్పించగలరు? కానీ ఆత్మగౌరవం అనే భావన సామాజిక సంస్కృతిలో నిండుగా ఎదగకుండ మనమంతా కోరుకునే కొత్త సమాజం సాధ్యమవుతుందా? తన సంస్కృతినీ అలవాట్లనూ ఆచారాలనూ సార్వజనీనమైన సత్యంగా భావిస్తూ 'బోరవిరుచుకొని' తిరిగే మెజారిటీ మధ్య ఒక మైనారిటీగా బ్రతికే వాళ్ళకు అర్థమయినంతగా భిన్నత్వం, వైవిధ్యాల విలువలు ఇతరులకు అర్థం అవుతాయా? భిన్నత్వాన్నీ వైవిధ్యాన్నీ కేవలం సహించడమే కాక ఆహ్వానించడం మనమందరం నేర్చుకోకపోతే మనం ఊహించుకునే కొత్త సమాజం సంపూర్ణం అవుతుందా?

ఇటువంటి విలువలనేకం ఈ 'జల్‌జలా' సంకలనంలోని కవితలలో కనిపిస్తాయి. వాటిని మైనారిటీల న్యాయమైన సమస్యల కవితాత్మక (లేక తాత్విక) 'వ్యక్తీకరణ'గా (మాత్రమే) చూడకుండ, భారతదేశ ముస్లింల భౌతిక పరిస్థితి, దాని

నుండి పుట్టిన ఆలోచనలు, మొత్తంగా సమాజానికి అందించే విలువల దృక్కోణంగా అర్థం చేసుకున్నప్పుడు ఈ కవితలు చదివే ముస్లిమేతరులు సానుభూతినీ సంఘీభావాన్నీ 'ఇచ్చే' వారిగానే కాక తీసుకునే వారిగా కూడా కనబడతారు. 'ఒంటరి పోరాటం ఏమి చేస్తారు, ఇతరులతో కలవండి' అనే ముందు ఇప్పటికే అందరి అవసరాలకూ వాళ్ళు అందిస్తున్న విలువలున్నాయని అర్థం చేసుకోగలుగుతాము. భౌతికంగా చేతులు కలపడం అన్ని సందర్భాలలోనూ అవసరం గానీ, సాధ్యం గానీ కాకపోవచ్చును గానీ విలువల చేయూత ఎప్పుడూ ఉంటుంది. అయితే దాని గురించి స్పృహ అవసరం, అవగాహన అవసరం. ఒక జీవిత అనుభవం నుండి పుట్టిన విలువలు వాటంతటవి ఇతర జీవన రంగాలలోకి వ్యాపించే క్రమం సంక్లిష్టంగానూ నెమ్మదిగానూ జరుగుతుంది. ఆ పని ప్రయత్నపూర్వకంగా చేయటం - విలువల సంఘీభావాన్ని పెంపొందించడం - అవసరం. ఉద్యమాలకు మనం సలహాలు, సానుభూతి 'ఇచ్చే' వారమే కాక పొందేవారము కూడ అన్న ఎరుక అవసరం.

నిరసన అనే నెగటివ్ భావనలో కూడా ఇన్ని పాజిటివ్ విలువలున్నాయి. అయినప్పటికీ అది పరిమితమైన భావనే. ముస్లింలను ముస్లింలుగా కదిలించే పాజిటివ్ ఆలోచనలు - 'ముస్లిం ఐడెంటిటీ'లో భాగం కాగలిగినవి - లేవా? ఇస్లాం - అందులో ప్రత్యేకించి భారతదేశంలో అది తీసుకున్న రూపం - మన సమాజానికి చేసిన మేలేమీ లేదా? అందిచ్చిన సంస్కృతి ఏమీ లేదా? దానిని తనలో ఇముడ్చుకున్న ముస్లిం ఐడెంటిటీ ఒక పాజిటివ్ రాజకీయ భావనకు బీజం కాజాలదా? బ్రాహ్మణీయ హైందవ సంస్కృతి గుప్పిట్లో ఉన్న మన సమాజంలోకి ఇస్లాం కొన్ని కొత్త ఆలోచనలనూ కొత్త సాంస్కృతిక విలువలనూ ప్రవేశపెట్టింది. అవి హైందవ సంస్కృతిలోని రెండు బలమైన దుర్గుణాలను కొంత మేరకు వ్యతిరేకించే విలువలు. అవి సంకుచితత్వం, సాంఘిక అసమానత అనే రెండు గుణాలు. ఇస్లాం వాటికి విరుద్ధమైన విలువలను పెంపొందించిన విషయాన్ని గర్వంగా జ్ఞాపకం చేసుకోవడం ఇప్పటి దాకా ముస్లిం ఛాందసవాదుల వంతయింది. అది వాళ్ళ వంతుగానే ఉండిపోతే మంచి కంటే చెడుకే ఎక్కువ ఉపయోగపడే ప్రమాదం ఉంటుంది.

బ్రాహ్మణీయ దృక్పథంలో హెచ్చుతగ్గుల సంకుచితత్వమే కాక 'ప్రాదేశిక' సంకుచితత్వం కూడ బలంగా ఉంది. హిందువులుగా పుట్టి పెరిగిన వాళ్ళకు తమలో ఈ దృష్టిలోపం ఉందని గ్రహించడం సహితం కష్టం. హిందువుల మానసిక

దృష్టి చుట్టూ కొన్ని గోడలుంటాయి. ఆ గోడలను దాటి ఆలోచించడం, సహానుభూతితో స్పందించడం హిందువులకు సహజంగా రాదు. కులం ఒక ప్రధానమైన అడ్డుగోడ కాగా అది నేర్పించిన సంస్కృతి ఫలితంగా జాతి, భాష, దేశం మొదలయిన అడ్డుగోడలు కూడ హిందువుల చుట్టూ మొలిచాయి. సహానుభూతికీ స్పందనకూ ఇవి బలమైన పరిమితులు పెడతాయి. ఇస్లామిక్ సంస్కృతి దీనికి పూర్తిగా అతీతమని నా ఉద్దేశ్యం కాదు. ఏ ఎల్లలూ లేకుండ విశ్వజనీనంగా 'మమేకం' కావడం మనుషులెవరికీ సాధ్యం కాదు. కానీ ఆ పరిమితిని వ్యతిరేకించే సాంస్కృతిక విలువలు ఇస్లాంలో ఉన్నాయి. ముస్లింలంతా భౌతికంగా ఒకటేనని నిరూపించడానికి ఛాందసవాదులు 'ఉమ్మా' అనే భావనను వాడుకునే తీరును వ్యతిరేకించవలసిందే; ప్రపంచ ముస్లింలు భిన్నజాతులలోనూ సంస్కృతులలోనూ భాగమై ఉన్నారనీ, ఈ వైవిధ్యాన్ని కాదనడం సంకుచిత దృక్పథమనీ విమర్శించాల్సిందే. కానీ దానిని భౌతిక ఏకతగా అర్థం చేసుకోకుండ, విశాలమైన సహానుభూతికి (కనీసం తమ మతానికి చెందినవారి వరకైనా) తావు కల్పించే సాంస్కృతిక విలువగా అర్థం చేసుకోవడం అవసరం. హైందవ సంస్కృతిలోని సంకుచిత దృష్టిని ఎత్తిచూపడం ద్వారా దానిని బలహీనపరచడానికి అది ఉపయోగపడుతుందనీ, ఉపయోగపడిందనీ కూడా అర్థం చేసుకోవడం అవసరం. ప్రపంచ ముస్లింలలో ఎంత సాంస్కృతిక వైవిధ్యమున్నప్పటికీ అరబ్బీ మాట్లాడే పాలస్తీనా ముస్లింలకు ఇక్కట్లు వస్తే తమిళం మాట్లాడే కోయంబత్తూరు ముస్లింలు ఆందోళన చెందగలరు, గుజరాతీ మాట్లాడే పోర్బందర్ ముస్లింలు బాధ పడగలరు. ప్రస్తుతానికది మతం పరిధిలోనే ఉంది. మత ఛాందసవాదుల అదుపులోనే ఉంది. అయినప్పటికీ, మతం ప్రమేయం లేని సార్వజనీనమైన స్పందనకు ఈ వైఖరి దారి చూపగలదు. 'ఎక్కడో చెచెన్యాలో ఏదో జరిగితే వీళ్లు హైదరాబాదులో బస్సుల అద్దాలెందుకు పగలగొడతారు' అని విసుక్కొనే హిందువులకు, గడప దాటి స్పందించలేని తమ సంకుచితత్వాన్ని ఇది ఎత్తి చూపుతుందని అర్థం కాదు.

దేవుడి ముందు అందరూ సమానులేననేది ఇస్లాంలోని మరొక విలువ. పురుషాధిక్యత, ఆర్థిక అసమానత దీనికి బలమైన పరిమితులు పెట్టినప్పటికీ - మతమే సమానత్వ సూత్రాన్ని ప్రతిపాదించే సంస్కృతికీ, గుణకర్మలను బట్టి దేవుడే మనుషులను అసమానులుగా సృష్టించాడని నమ్మే హైందవ సంస్కృతికీ చాలా తేడా ఉంది. హైందవ సమాజంలోని శ్రామిక కులాలకు చెందినవారు ఇస్లాం వైపు ఆకర్షితులు కావడానికి ఇది దోహదం చేసింది. ఆ విధంగా మతం మార్చుకున్న

వారిలో కనిపించే ఆత్మగౌరవం హిందువులుగా ఉండిపోయిన వారిలో కనిపించదు. ఇస్లాం, క్రైస్తవం భారతదేశంలోకి రాకపోతే ఈ దేశంలో 'క్రింది కులాల' పరిస్థితి ఇంకెంత దుర్భరంగా ఉండేదో!

భారతదేశంలో ఇస్లాంను ఎక్కువగా ప్రచారం చేసింది కత్తి చేతబట్టిన సుల్తాన్లు కాదు. సమానత్వ విలువను ప్రచారం చేసిన 'సూఫీ' ప్రచారకులు. వీళ్ళు ప్రచారం చేసిన ఇస్లాంలో దేవుడి ముందు అందరూ సమానమనే భావన, ప్రేమ, దయ, సహనం, సానుభూతి మొదలైన విలువలు ముఖ్యమైనవి. వీళ్ళు పేదరికంలో ఉంటూ పేదల మధ్య తిరుగుతూ మతాన్ని ప్రచారం చేశారు. వీరి సమాధులే దేశమంతటా కనిపించే దర్గాలు. మతానికి అతీతంగా ప్రజలందరూ పూజలు చేసే ఏకైక ప్రార్థనా స్థలాలు దర్గాలు. "హిందూ ముస్లిం భాయి భాయి" అన్న లౌకికవాదుల నినాదం కంటే దర్గాలే ఎక్కువగా హిందూ - ముస్లిం ప్రజలను (ముఖ్యంగా శ్రామిక ప్రజలను) ఒక దగ్గరికి తెచ్చాయనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు.

భారతదేశపు ఇస్లాంకు ఉన్న ఈ చరిత్రను సగర్వంగా స్వీకరించే 'ముస్లిం ఐడెంటిటీ'కి ఒక వాస్తవికమైన రాజకీయ స్థానం ఉండగలదు. అది సనాతన వాదాన్ని తిరస్కరిస్తూ 'ముస్లిం'గానే ఉంటూ అభ్యుదయ రాజకీయ స్రవంతిలో భాగం కాగలదు. దానిని అభ్యుదయవాదులెందుకు ఆహ్వానించకూడదు? ఆహ్వానించడమే కాదు, దానికోసం ఎందుకు ప్రయత్నం చేయకూడదు?

'జల్‌జలా' ముస్లింవాద కవిత్వం పుస్తకానికి రాసిన వెనకమాట
నీలగిరి సాహితి ప్రచురణ, మార్చి 1998

V

# ఆధునికానంతరవాదం నుంచి నేర్చుకోవలసింది ఆత్మవిమర్శ

**ప్ర : ఆధునికం, అత్యాధునికం, ఆధునికానంతరం వంటి మాటలను ఎలా అర్థం చేసుకోవాలి? ఉత్పత్తి సంబంధాల ఆధారంగా చారిత్రక దశలను నిర్వచించే మార్క్సిజం ఈ మాటలను అంగీకరిస్తుందా?**

**జ :** మార్క్సిజం అంగీకరిస్తుందా లేదా అన్న సంగతి పక్కన పెడదాం. అదంత ముఖ్యం కాదు. ఆధునికం, ఆధునికానంతరం అనే మాటలను చారిత్రక దశలుగా లేక స్థితులుగా అర్థం చేసుకోవడం సబబు కాదేమో. ఆ మాటలను రకరకాల అర్థాలలో వాడుతున్నారు. సోషలిస్టు రాజ్యాల పతనం తరువాత ప్రపంచం ఆధునికానంతరం (పోస్ట్ - మోడరన్) దశలోకి ప్రవేశించిందని అనేవారున్నారు. కానీ నా దృష్టిలో ఆధునికం (మోడరన్), ఆధునికానంతరం (పోస్టు - మోడరన్) అనేవి ప్రాథమికంగా జ్ఞాన సిద్ధాంత సంబంధమైన (epistemological) మాటలు. ఆధునికవాద జ్ఞాన సిద్ధాంతంపైన ఆధునికానంతర వాదం పెట్టే విమర్శే ఆధునికానంతర వాదంలోని ప్రధాన విషయం అని నేను అనుకుంటాను. దానికి వేరే ఏ అర్థాలు ఇచ్చినా అది దీని నుండి వచ్చినవే, లేక దీనితో ముడిపడినవే. ఆ అర్థంలో ప్రస్తుత చారిత్రకదశను ఆధునికానంతర దశ అనడం సబబు కాదేమో. సోషలిస్టు ప్రయోగాల వైఫల్యం నుండి నేర్చుకున్న కొత్త జ్ఞాన సిద్ధాంతం - ఆధునికానంతర వాదంలో ఉందా? అందులో జ్ఞాన సిద్ధాంత విమర్శ ఉంది కాని ప్రపంచాన్ని అర్థం

చేసుకోవడానికీ ఆచరణను రూపొందించు కోవడానికీ అవసరమయిన ప్రమాణాలు కల్పించే జ్ఞాన సిద్ధాంతమేదీ లేదు. వట్టి విమర్శనాత్మక దృక్పథం - ఎంత సద్విమర్శ అయినా ఒక చారిత్రక దశను లేక యుగాన్ని నిర్వచించడానికి పనికొస్తుందనుకోను. ఆధునికానంతర వాదం మనకిచ్చేది ఒక కొత్త ప్రాపంచిక దృక్పథం కాదు. అన్ని ప్రాపంచిక దృక్పథాలను లోపలి నుంచి తొలచి (subvert చేసి) చూపించే విమర్శ నాత్మక సాధనాలనిస్తుంది. అది విలువయిన దనే నేను అనుకుంటాను. అయితే ఈ ఆలోచనల సబ్‌వర్షన్ (subversion) ఒక యుగాన్ని నిర్వచించే తాత్విక ధోరణి కాజాలదు. అట్లా అనుకోవడం చాలా నెగటివ్ వైఖరి. దురదృష్టవశాత్తు ఇప్పుడు చాలామంది ఆధునికానంతర వాదాన్ని ఒక ప్రాపంచిక దృక్పథంగా లేక ప్రాపంచిక దృక్పథానికి ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారు.

మరొక అర్థంలో ప్రస్తుత చారిత్రక దశను ఆధునికానంతర దశ అనడం జరుగుతూ ఉంది. ఆధునికానంతర వాదం మానవ 'ఐడెంటిటీల'ను అస్థిరమైనవిగా, చంచలమైనవిగా భావిస్తుంది. ఒక కార్మికుడు తాను కార్మికుడు అని పూర్తిగా అనుకునే లోపలే మగవాడిగానో, ముస్లింగానో, తెలుగువాడిగానో, మున్నూరుకాపు కులస్తుడిగానో కనిపిస్తాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రస్తుత దశలో సమాజాన్ని చీలిక పేలికలు చేసి ఎక్కడికక్కడ పరిమితమైన ఐడెంటిటీలను సృష్టించిందనీ ఆ సత్యాన్ని ఆధునికానంతర వాదం ప్రతిబింబిస్తుందనీ వాదించే వారున్నారు. అయితే ఈ చంచలత్వంలో ఉండే సాపేక్షక స్థిరత్వాన్ని, విభిన్న ఐడెంటిటీల మధ్యనుండే సంబంధాలను అర్థం చేసుకోవడానికీ, చీలికనే కాక కలయికను (ఎంత సాపేక్షికమయినప్పటికీ) అర్థం చేసుకోవడానికీ కావలసిన తాత్విక పరికరాలు పోస్టు-మోడర్నిజంలో ఉన్నాయనుకోను. అవి లేకుండా పెట్టుబడిదారీ వ్యవస్థనయినా వేరే ఇతర ఆధిపత్యాలనయినా సమర్థంగా ఎదుర్కోలేము. ఎదుర్కోలేని అశక్తతను ప్రస్తుత చారిత్రక యుగ లక్షణంగా పేర్కొనదలచుకుంటే తప్ప దీనిని ఆధునికా నంతర శకం అనడం సబబు కాదు. అంతటి అశక్తతను ప్రస్తుత యుగానికి అంట గట్టనవసరం లేదు.

**ప్ర : పోస్టు మోడర్నిజం విమర్శించే హేతువాదం, సైన్సు, అభివృద్ధి వంటి భావనల మాయలో మార్క్సిజం కూడా పడిపోయిందా?**

**జ :** మార్క్సిజం వాటి 'మాయ'లో పడిపోయిందనడం ఆధునికానంతర వాద విమర్శను సరిగ్గా వ్యక్తం చేయదు. మార్క్సిజం కూడా (బూర్జువా ఉదారవాదం లాగా) ఒక 'ఆధునిక' తాత్వికధోరణే. 'మాయ'లో పడిపోవడం వల్ల కాదు. అదే దాని

నైజం. 18వ శతాబ్దానికి చెందిన యూరోపియన్ 'జ్ఞానోదయం' (ఎన్‌లైటెన్‌మెంట్) నుండి మొదలయిన భావవికాసం ఒక సామాన్య (common) జ్ఞాన సిద్ధాంతం మీద ఆధారపడింది. బూర్జువా హేతుత్వ దృష్టికీ మార్క్సిజానికీ ప్రాతిపదిక అయిన జ్ఞాన సిద్ధాంత దృక్పథాలు ఈ సామాన్య లక్షణాలను పంచుకున్నాయి. దీని అర్థం బూర్జువా హేతుత్వ దృష్టిని మార్క్స్ అసలే విమర్శించలేదని కాదు. నిజానికి ఆయన చాలా బలంగా విమర్శించాడు. మనకు కనిపించేదే ప్రాపంచిక వాస్తవికత అనీ, మనం దానిని ఉన్నదున్నట్టుగా నిర్దుష్టంగా అర్థం చేసుకుంటామనీ, 'మనం' ఎవరు అనే దానితో నిమిత్తం లేకుండా మనం సార్వత్రిక జ్ఞానం పొందగలమనీ, దాని ప్రాతిపదికన హేతుబద్ధంగా మన ఆచరణను రూపొందించుకొని మన ఆలోచనలలో భావించే ఫలితాలనే సాధిస్తామనీ నమ్మే హేతుత్వ దృష్టిని బలంగా విమర్శించిన తత్వవేత్తలలో మార్క్స్‌నూ ఫ్రాయిడ్‌నూ లెక్కిస్తారు. అయినప్పటికీ వారి దృక్పథానికీ, అన్ని 'ఆధునిక' దృక్పథాలకూ సామాన్యమైన జ్ఞాన సిద్ధాంత ప్రాతిపదిక ఒకటుంది.

మానవ వ్యవహారాలలో హేతువు (reason) ఉందనీ, అంటే అందులో కార్యకారణ సంబంధాల రూపంలోని హేతుబద్ధమైన క్రమం ఉన్నదనీ, దాని స్వభావాన్ని వస్తుగతంగా అర్థం చేసుకోవడం మనిషికి (నేరుగా, సులువుగా కాక పోయినప్పటికీ) సాధ్యమనీ, ఆ హేతువే సామాజిక చరిత్రలో ప్రగతి, పురోగమనం, అభివృద్ధి అనే వాటికొక వస్తుగతమైన నిర్వచనాన్నీ, అర్థాన్నీ ఇస్తుందనీ, దానిని అర్థం చేసుకొని సమగ్రమైన జ్ఞానాన్నీ సార్వజనీనమైన సత్యాన్నీ గ్రహించడం మనిషికి సాధ్యమనీ, తద్వారా ఆ వస్తుగత హేతు క్రమాన్ని తమ ఆచరణ క్రమంగా మనుషులు మలచుకుంటారనీ, ప్రపంచం ఒక తాటిపైన మొత్తంగా పురోగమి స్తుందనీ మార్క్సిజం నమ్ముతుంది. బూర్జువా ఉదారవాదమూ నమ్ముతుంది. అన్ని రకాల ఆధునికవాద సిద్ధాంతాలూ నమ్ముతాయి. వాటి మధ్య బలమైన తేడాలు న్నాయి. శత్రుత్వం కూడా ఉంది. అవి గుర్తించే హేతువులోనూ, అవి నిర్వచించే అభివృద్ధిలోనూ, అవి సూచించే ప్రగతిదాయకమైన ఆచరణలోనూ తేడాలున్నాయి. కానీ అన్నిటివెనుక ఒక సామాన్య జ్ఞాన సిద్ధాంత వైఖరి ఉంది. ప్రాపంచిక వాస్తవికతకు ఉండే వస్తుగతత్వం (objectivity) గురించి, హేతుత్వం (rationality) గురించి, వీటి విషయంలో మనకుండే జ్ఞానం గురించి, సార్వజనీన సార్వత్రిక శాస్త్రీయత గురించి, ప్రగతి దాయకమైన మానవ ఆచరణ ప్రాపంచిక

హేతువును అనుసరించి ఉన్నట్టయితే అది సాధించగల సార్వజనీర (universal-ity) ప్రగతి గురించి ఒక సామాన్య వైఖరి ఉంది. ఈ వైఖరిలో సార్వజనీనత ఒక ముఖ్య లక్షణం. ఈ ప్రపంచం ఒక అర్థవంతమైన మొత్తం. దానిలోని క్రమబద్ధత ఒక మొత్తం. ఎప్పటికప్పుడు మన (లేక కొందరి) జ్ఞానంలో లోపాలు ఉండవచ్చును గాక. కానీ అది సూత్రప్రాయమైన పరిమితి కాదు. సూత్రప్రాయంగా మానవ జ్ఞానం సమగ్రం, వస్తుగతం, శాస్త్రీయం కాగలదు. ఈ శాస్త్రీయ జ్ఞానం అందరికీ జ్ఞానమే. సత్యం అందరికీ సత్యమే - ఆ విషయాన్ని గుర్తించడంలో వివిధ కారణాల వల్ల లోపాలు ఉండవచ్చును. హెచ్చుతగ్గులుండవచ్చును. (ఈ లోపాలగురించి, హెచ్చుతగ్గుల గురించి ఒక్కొక్క ఆధునికవాద సిద్ధాంతం ఒక్కొక్క రకమైన విశ్లేషణ చేస్తుంది. హేతువాదం పరిశోధనా పద్ధతిపైన దృష్టిపెట్టి వివరించగా, మార్క్సిజం వర్గస్థితినీ ఆచరణనూ ప్రమాణం చేసుకొని విశ్లేషిస్తుంది. భావజాలం, తప్పుడు చైతన్యం, మార్మికత మొదలయిన భావాలు ఇక్కడ ముఖ్యమైనవి). నిర్దిష్టమైన ఈ శాస్త్రీయ జ్ఞానం ప్రాతిపదికన సాధించే ప్రగతి, అభివృద్ధి ఎవరి వ్యక్తిగత ఇష్టాయిష్టాల నుండి పుట్టేవి కావు. అవి శాస్త్రీయమైనవి. అంటే ప్రాపంచిక వాస్తవికతలోని హేతుత్వ క్రమం చేత నిర్ణయించబడేవి. ఆ ప్రగతి క్రమాన్ని వ్యతిరేకించడం అభివృద్ధి నిరోధకం, మూర్ఖత్వం. వస్తుగత హేతుక్రమం సూచించే ప్రగతి శాస్త్రీయమైనది కాబట్టి దానిని ఆహ్వానించడమే అంతిమ పరిశీలనలో అందరికీ మంచిది. ఆ అర్థంలో ఆ ప్రగతి సార్వజనీనం, సార్వత్రికం.

వస్తుగతమైన హేతువు (objective rationality), శాస్త్రీయత, శాస్త్రీయ జ్ఞానం, పురోగమనం లేక అభివృద్ధి అనే భావనలను పోస్టు - మోడర్నిజం చాలా లోతుగా విమర్శిస్తుంది. ఇది జ్ఞాన సిద్ధాంత విమర్శగా మొదలై రాజకీయ విమర్శగా ముగుస్తుంది. వస్తుగత సత్యంగా చలామణి అయ్యేదానిలో దృష్టికోణం పాత్రను విడదీయలేమనీ, సత్యం 'అందరికీ' సత్యం ఎప్పుడూ కాదనీ, సత్యం స్వాభావికంగానే సాపేక్షికమనీ పోస్ట్ - మోడర్నిజం అంటుంది. సార్వజనీనత ఆపాదించబడే హేతువు, జ్ఞానం, అభివృద్ధి అనేవి నిజానికి నిర్దిష్ట స్థలకాలాలకూ పరిస్థితులకూ బందీలయిన రూపకల్పనలేననీ, వాటికి వస్తుగతత్వం, ప్రామాణికత ఆపాదించే 'శాస్త్రీయత' మార్మికత మాత్రమేననీ, అన్ని మార్మికతలలాగ ఈ సైన్స్ - హేతువు - అభివృద్ధి అనే మార్మికత కూడ పాక్షిక ప్రయోజనాలనూ, సాపేక్ష సత్యాలనూ పరమ సత్యాలుగా, సార్వజనీన హేతుక్రమంగా నిలబెట్టడం ద్వారా అనేక ఇతర వాస్తవాలనూ ప్రయోజనాలనూ తొక్కి పెడుతుందనీ పోస్ట్ - మోడర్నిజం విమర్శిస్తుంది.

వెలుతురులో మనకేదయితే కనిపిస్తుందో దానిని మనకు చూపించడమే వెలుగు నిర్వహించే పాత్ర, దాని ప్రయోజనం అనే హేతుత్వ దృష్టికి భిన్నంగా, ఆ వెలుగు ప్రసరించని చోట ఉన్న చీకట్లను చూపించకపోవడం అనేది కూడా అది మనకు 'చూపించే' విషయమేనని ఆధునికానంతర వాదం అంటుంది. భాషణ మనకు చెప్పే విషయాలే అది మనకు అందిచ్చే సందేశం అనే హేతుత్వదృష్టికి భిన్నంగా, అది చెప్పని విషయాలు మన చెవిన పడకుండ చేయడమే అది ఇచ్చే అసలు సందేశమేమో చూడమంటుంది ఆధునికానంతర వాదం. ప్రాపంచిక వాస్తవికతలోని క్రమబద్ధతను ఆవిష్కరించడం ద్వారా సైన్స్ మనకు జ్ఞానం ఇస్తుందన్న హేతుత్వ దృష్టికి భిన్నంగా, ఆ క్రమబద్ధత మన మెదడును ఆక్రమించడం వల్ల మనకు కనిపించకుండ పోయే క్రమరాహిత్యాన్ని - లేదా ప్రత్యామ్నాయ క్రమాలను - మన నుండి దాచిపెట్టడం వల్ల సైన్స్ అదే సమయంలో మన అజ్ఞానాన్ని కూడా పెంచు తుందని ఆధునికానంతర వాదం అంటుంది.

ఈ రకమైన విమర్శ నిజానికి మార్క్సిజానికి పూర్తిగా కొత్తకాదు. పైన చెప్పినట్టు, ప్రాపంచిక వాస్తవికతకూ మన జ్ఞానానికీ, మన జ్ఞానానికీ ఆచరణకూ, మన ఆచరణకూ ప్రాపంచిక వాస్తవికతకూ మధ్య సరళమైన సంబంధాన్ని ప్రతిపాదించే హేతుత్వ దృష్టిని బలంగా విమర్శించిన తత్వవేత్తలలో మార్క్స్, ఫ్రాయిడ్ ముఖ్యులు. అయితే వాళ్ళు ఆధునికవాదులుగానే ఈ విమర్శ చేసారు. పై సంబంధం అన్ని సందర్భాలలోనూ సరళంగా ఉండదు కానీ అది సరళంగా ఉండగల సందర్భం ఒకటి ఉంటుందని వాళ్ళు భావించారు.

బూర్జువా హేతువు, బూర్జువా శాస్త్రీయత, బూర్జువా అభివృద్ధి శ్రమదోపిడీని కాపాడే భావజాలాలని మార్క్స్ విమర్శించాడు. అవి చెప్పుకునే సార్వజనీనత, ప్రామాణికత వాటిలో లేవని మార్క్సిజం తొలినాటి నుండి విమర్శిస్తూ ఉంది. అభివృద్ధికి శాస్త్రీయ పద్ధతులు అనుసరిస్తున్నానని చెప్పి చంద్రబాబు ప్రభుత్వం ఇళ్ళు కూల్చి రోడ్లు వెడల్పు చేయడానికి పూనుకున్నప్పుడు, కొందరి అభివృద్ధిని అందరి అభివృద్ధిగా చూపించే ఈ శాస్త్రీయత ఒక వర్గ భావజాలం అని అందరం విమర్శించగలిగామంటే అది మార్క్సిజం ప్రభావం వల్లనే. అయితే ఇది వర్గ రాజకీయ విమర్శ. ఆధునికానంతర వాదం దీనిని జ్ఞాన సిద్ధాంత విమర్శగా మలచి మార్క్సిజం పైన కూడ ఎక్కు పెట్టింది. అసలు సమగ్రమైన హేతువు - ప్రపంచాన్ని నడిపించే హేతుత్వక్రమం ఒకటి ఉందా? దానిని గ్రహించగల దృక్కోణం ఒకటి ఉండగలదా? అందరి పురోగమనాన్నీ ఇముడ్చుకున్న ప్రగతి క్రమం ఒకటి

ఉండగలదా? దృక్కోణానికీ వాస్తవికతకూ మధ్యనున్న అంతరాన్ని చెరిపివేయగల వస్తుగత జ్ఞానం ఒకటి ఉండగలదా? ఇదే ప్రశ్నను ఇంకొకరకంగా అడగాలంటే, అందరికీ సత్యమైన జ్ఞానం - 'శాస్త్రీయ' జ్ఞానం - ఉండగలదా? ఇవి హేతువు గురించీ, శాస్త్రీయత గురించీ, ప్రాపంచిక క్రమబద్ధత గురించీ ఆధునికానంతర వాదం లేవదీసే జ్ఞాన సిద్ధాంత సంబంధమైన ప్రశ్నలు.

మార్క్సిజం బూర్జువా 'శాస్త్రీయత' మీద పెట్టే విమర్శకు కూడా జ్ఞాన సిద్ధాంత రూపం ఇచ్చినవారు లేకపోలేదు. దోపిడీవర్గ జీవిత అనుభవం నుండి సత్యాన్ని సమగ్రంగా కనుక్కోవడం సాధ్యం కాదనీ, అసమగ్రమైన సత్యానికి సమగ్రత ఆపాదించడం భావజాలానికీ, అణచివేతకూ దారి తీస్తుందనీ, కార్మికవర్గ జీవిత అనుభవం నుండే సత్యాన్ని సమగ్రంగా చాటడం సాధ్యమవుతుందనీ, అప్పుడే సార్వజనీనమైన, సార్వత్రికమైన సత్యం మనకు లభ్యం అవుతుందనీ - జ్ఞాన సిద్ధాంతానికి వర్గపునాదిని కల్పిస్తూ - వాదించిన మార్క్సిస్టులు ఉన్నారు. (మార్క్స్ ఈ విధంగా వాదించలేదు - దానికి కారణం వివరించడానికిది సందర్భం కాదు.)

కానీ ఆధునికానంతర వాదం మొత్తంగా ఆధునికవాద జ్ఞాన సిద్ధాంత భూమికనే ప్రశ్నిస్తుంది. ప్రపంచాన్ని నడిపించే హేతువు ఒకటి ఉందనీ, దానిని సమగ్రంగా గ్రహించగల ఆచరణ ఒకటి (పరిశోధనా పద్ధతి కావొచ్చు, జీవన స్థితి కావచ్చు) ఉందనీ, అది ఇచ్చే జ్ఞానం సమగ్రమే కాక సార్వజనీనమనీ, ఆ హేతుక్రమం ఆవిష్కరించే ప్రగతి అందరి ప్రగతని నమ్మడమే తప్పనీ అంటుంది. ఆ నమ్మకాన్ని ఆచరణలో పెడితే కొన్ని కోణాలలో (అంటే కొందరికి) కొంత ప్రయోజనం ఒనగూడినప్పటికీ ఇతర కోణాలలో అది అణచివేతకూ వివక్షకూ నిర్లక్ష్యానికీ దారితీస్తుందని విమర్శిస్తుంది. ఉత్పత్తి క్రమం ప్రపంచాన్ని నడిపిస్తుందనీ, కార్మికవర్గ పోరాట ఆచరణ ఈ ప్రాపంచిక హేతువును సమగ్రంగా అర్థం చేసుకొని సార్వత్రికమైన సత్యాన్ని ఆవిష్కరిస్తుందనీ, ఆ ఆచరణలోనే అందరి ప్రగతీ - మొత్తంగా మానవాళి ప్రగతి - ఇమిడి ఉందనీ నమ్మే మార్క్సిజం మీద ఈ కోణం నుండి ఆధునికానంతర వాదం విమర్శ పెడుతుంది. ఈ హేతువు, ఈ శాస్త్రీయత ఎన్ని విషయాలను నిర్లక్ష్యం చేస్తాయో, ఎన్ని విషయాలు ఇందులో కనిపించకుండా పోతాయో వివరణాత్మకంగా చూపిస్తుంది. పెట్టుబడిదారీ శ్రమ దోపిడీ మీద, కార్మిక వర్గ పోరాటం మీద దృష్టి కేంద్రీకరించడం వల్ల స్త్రీల సమస్యలు, నల్లజాతి ప్రజల సమస్యలు (అమెరికా వంటి దేశాలలో), కుల అణచివేతకు గురయ్యే దళితుల సమస్యలు, ఆదివాసుల సమస్యలు మొదలయినవి ఏ విధంగా

కనిపించకుండా పోయాయో చూపిస్తుంది. ఉత్పాదకశక్తి పెరుగుదల మీద దృష్టి పెట్టడం వల్ల ఆ క్రమంలో ప్రకృతిలోనూ పర్యావరణంలోనూ జరిగే విధ్వంసాన్ని నిర్లక్ష్యం చేసిన వైనాన్ని చూపిస్తుంది. చరిత్రాంతాన సంభవించబోయే పెనుమార్పును ప్రామాణికం చేసుకోవడం వల్ల వర్తమానంలో విలువలు, హక్కులు, నీతి మొదలైన విషయాలలో సున్నితత్వం కోల్పోయిన విషయాన్ని ఎత్తి చూపుతుంది. చరిత్ర గమనాన్ని (ఎవరి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేని) వస్తుగత హేతువు శాసిస్తుందన్న నమ్మకంలో వ్యక్తి బాధ్యతకు చోటు లేకుండ పోయిన వైనాన్ని చూపిస్తుంది. ఈ విమర్శ కొత్తది కాదు. ఇతర కోణాల నుండి ఇతరులు చేసి ఉన్నారు. అయినప్పటికీ ఇది విలువైన విమర్శే. కానీ నిర్మాణాత్మకంగా ఆధునికానంతర వాదం మనకేమయినా చెప్తుందా అంటే లేదనే చెప్పాలి.

**ప్ర : ఇంకా ఆధునికతే పూర్తిగా ప్రవేశించని మన సమాజానికి పోస్ట్- మోడర్నిజం ఏ విధంగా అన్వయిస్తుంది?**

**జ :** మోడర్నిజం, పోస్ట్ - మోడర్నిజం ఈ రోజు కేవలం పాశ్చాత్య భావనలు కావు. మనం పాశ్చాత్య దేశాలలో పుట్టిన పెట్టుబడిదారీ విధానాన్నీ, సైన్సునూ, టెక్నాలజీని మన జీవితంలో భాగం చేసుకున్నాము. దీనికి సంబంధించిన తాత్విక వైఖరి కూడ మన ఆలోచనలలో భాగం అయింది. అదే తాత్విక ధోరణితో నిండి ఉన్న పాలనా వ్యవస్థనూ, ఇతర రాజ్యాంగ వ్యవస్థలనూ, విద్యా వ్యవస్థనూ స్వీకరించాము. అవి మన జీవితంలో భాగం అయ్యాయి. ఈ మొత్తాన్ని అదే ఆధునికవాద జ్ఞాన సిద్ధాంత ధోరణి నుండే విమర్శించే మార్క్సిజం ఒక ప్రబలమైన రాజకీయ ఉద్యమంగా మన సమాజంలో ఉంది. అంటే మోడర్నిజం అనేది (ఈనాటి) ఇక్కడి వాస్తవికతలో భాగమే. దానిని విమర్శించే పోస్ట్ - మోడర్నిజం పాశ్చాత్య దేశాలకు ఏ మేరకు పనికొస్తుందో మనకు కూడా ఆ మేరకు పనికొస్తుంది.

ఇదంతా కాదనుకున్నా సమగ్రం, సాపేక్షం, సార్వజనీనం, ప్రత్యేకం అనే తాత్విక భావనలు మనకు కూడ అవసరమే కదా? వాటి మధ్య సంవాదం, సంఘర్షణ మనకు కూడా అవసరమే కదా? మన సామాజిక వాస్తవికతను మనం ఏ విధంగా నిర్వచించుకొని ఆలోచించడం మొదలుపెట్టినా ఈ తాత్విక భావనలు ముందు కొస్తాయి. వాటికి సంబంధించిన సంవాదంలో మనం పాల్గొనక తప్పదు. ఇవి అన్ని జాతులలోనూ, అన్ని సంస్కృతులలోనూ తాత్విక చర్చలో నలిగిన భావాలే. సామాజిక జీవితంలో మార్పుకు ప్రాధాన్యం ఇచ్చే సమకాలీన రాజకీయ సంస్కృతి ఈ ప్రశ్నలను అసలే తప్పించుకోజాలదు.

**ప్ర : పోస్ట్ కలోనియల్, పోస్ట్ మోడర్న్ - ఈ రెండూ సమానార్థకాలేనా? మన దేశ పరిస్థితులకు పోస్ట్ కలోనియల్ అన్న విశేషణమే సరిపోతుందనేది నిజమా?**

**జ :** పోస్ట్ - కలోనియల్, పోస్ట్ - మోడరన్ అనేవి ఒకే కోవకు చెందిన మాటలు కావు. మొదటిది సామాజిక రాజకీయ ఆర్థిక స్థితికి సంబంధించిన మాట. రెండవది తాత్విక (జ్ఞాన సిద్ధాంత సంబంధమైన) మాట. మొదటిది ఒక చారిత్రక దశను సూచిస్తుంది. రెండవది గడచిన మూడు శతాబ్దాలుగా పాశ్చాత్య సమాజాలను (వాటి వలసలుగా మారిన ఆసియా ఆఫ్రికా దేశాలనూ) శాసించిన తాత్విక దృక్పథాన్ని విమర్శించే క్రమంలో పుట్టిన మాట. పోస్ట్ - కలోనియల్ అనేది మనబోటి దేశాల స్థితిని (ఒక కోణం నుండి) వివరించడానికి పనికొచ్చే భావన. పోస్ట్ - మోడరన్ అనేది దేనినీ వివరించదు. అది అన్ని వివరణలనూ నిశితంగా విమర్శించడానికి పనికొచ్చే (అందుకోసం మాత్రమే పనికొచ్చే) భావన. ఉదాహరణకు పోస్ట్ - కలోనియల్ అనే భావననే పోస్ట్ - మోడరన్ దృక్పథంతో విమర్శించవచ్చు. మన ప్రస్తుత చారిత్రక దశ వలసానంతర దశ అనేది ఒక శాస్త్రీయ సత్యమేమీ కాదని ఆధునికానంతర వాదం అంటుంది. అంటే ఒకప్పుడు మనం బ్రిటన్‌కు వలసగా ఉన్నామనీ, ఆ తరువాత వలస స్థితి నుండి బయటపడ్డామనీ అనడం అవాస్తవమని అర్థం కాదు. ప్రస్తుత చారిత్రక దశకు వలసానంతర దశ అనేదే 'శాస్త్రీయ' వివరణ అని అనలేమనేదే అర్థం. అది మన దేశ చరిత్ర తన గురించి తాను ప్రకటించుకునే వస్తుగత వివరణ కాదు. అదొక సిద్ధాంత రూపకల్పన (theoretical construct). ఈ సిద్ధాంత రూపకల్పన మన చరిత్రను 1947కు పూర్వం, 1947 తరువాత అని వర్గీకరిస్తుంది. దీనినొక శాస్త్రీయమైన - అంటే చరిత్ర వస్తుగత సరళిని తనకు తానే ప్రకటించుకునే - వర్గీకరణ అనుకునే దృక్పథం ఈ వర్గీకరణ నుండి మనం నేర్చుకునే విషయాల మీద దృష్టి పెడుతుంది. అట్లా కాకుండా దీనినొక సిద్ధాంత రూపకల్పనగా భావించే దృక్పథం ఈ వర్గీకరణ వల్ల కనుమరుగయ్యే విషయాలపైన కూడ దృష్టి పెట్టగలుగుతుంది. చరిత్రలో శాస్త్రీయమైన వర్గీకరణ - దాని వస్తుగత గమనం తానే ప్రకటించుకునే వర్గీకరణ - ఒకటి ఉందని చెప్పి దానికోసం అన్వేషించే ఆధునికవాద వైఖరికి భిన్నంగా, ప్రతీ వర్గీకరణ ఒక రూపకల్పన (అంటే కేవలం కల్పితం అని అర్థం కాదు) అని అర్థం చేసుకునే ఆధునికానంతరవాద వైఖరి ప్రతీ వర్గీకరణలోనూ (వలస - వలసానంతరం, మధ్యయుగాలు - ఆదునిక యుగం, భూస్వామ్యం - పెట్టుబడి స్వామ్యం) అది చెప్పే విషయాలనే కాక అది చెప్పలేని విషయాలను కూడ చూపిస్తుంది. మన వర్తమాన చరిత్రను వలస - వలసానంతరం అని విభజించే

పోస్ట్ - కలొనియల్ అనే భావన తాను ఎంచుకున్న వర్గీకరణ వల్ల చూడలేకుండా పోయే విషయాలను పోస్ట్ - మోడరన్ దృక్పథం విమర్శనాత్మకంగా ఎత్తి చూపగలుగుతుంది.

ఈ విమర్శే దాని బలం. పోస్ట్ - మోడర్నిజం పరిభాషలో (వాళ్ళకొక పెద్ద పరిభాష ఉంది) silence (నిశ్శబ్దం) అన్న మాటకు చాలా ప్రాముఖ్యం ఉంది. ఇది ఒక్కొక్క సిద్ధాంత రూపకల్పన చెప్పలేని విషయానలు వెలికితీస్తుంది. ఇది విలువైన భావనే. కానీ అక్కడే ఆధునికానంతర వాదం పరిమితులు మొదలవుతాయి. వస్తుగత శాస్త్రీయత స్థానంలో సిద్ధాంత రూపకల్పన అనే భావనను ప్రవేశపెట్టడం ఒక రకంగా మన జ్ఞానాన్ని పెంచుతుంది. అయితే మనం చేసే రూపకల్పనకూ వాస్తవికతకూ మధ్య నున్న సంబంధం ఏమిటి? అన్న ప్రశ్నకు జవాబు చెప్పకోకుండా ఇక ముందుకు పోలేము. దీనికి స్పష్టమయిన జవాబు ఆధునికానంతర వాదంలో లేదు. ఆ జవాబు చెప్పాలంటే జ్ఞాన సిద్ధాంత విమర్శ సరిపోదు, జ్ఞాన సిద్ధాంతం కావాలి.

**ప్ర : ఇప్పుడు కనిపిస్తున్న, పుట్టుకొస్తున్న అస్తిత్వ ఉద్యమాలను ఎలా అర్థం చేసుకోవాలి? వాటి సాహిత్య సాంస్కృతిక ప్రతిఫలనాలను పోస్ట్-మోడర్నిజంగా కొందరు చెబుతున్నారు. మరి ఆ ఉద్యమాల రాజకీయం ఏ 'ఇజం' కిందికి వస్తుంది?**

**జ :** ఆధునికానంతరవాద చర్చ ఉండగలదు గానీ ఆధునికానంతరవాద 'ఉద్యమాలు' (చర్చా ఉద్యమాలు తప్ప) ఉండగలవా? ఉండలేవనుకుంటాను. సాంఘిక రాజకీయ ఉద్యమాలకొక జ్ఞాన సిద్ధాంతం అవసరం. సత్యాసత్యాలను వివేచించే ప్రమాణం - ఎంత సత్యం, ఎందుకు సత్యం అనే ప్రశ్నలకు జవాబు చెప్పే తాత్విక భూమిక - కావాలి. కాబట్టి పోస్ట్ - మోడర్నిస్టు సాంఘిక రాజకీయ ఉద్యమాలు ఉండజాలవు. పోస్ట్ - మోడరన్ విమర్శను గుర్తించి దాని వెలుగులో ఆధునికతా జ్ఞాన సిద్ధాంతాన్ని సవరించుకున్న ఉద్యమాలు ఉండగలవు.

అయితే పోస్ట్ - మోడర్నిస్టులు కొన్ని ఉద్యమాల పట్ల తాత్వికంగా ఆకర్షితులవుతున్నారు. సత్యానికి సార్వజనీన ప్రమాణాలను ప్రతిపాదించడానికి పూనుకోకుండా, అందరినీ అన్నిటినీ విముక్తిచేసే వ్యూహాల అన్వేషణ జోలికి పోకుండా, ఆ సార్వజనీన ప్రమాణాలనూ విముక్తిపంథానూ వివరించే హేతువు నొకదానిని చరిత్రలో ఆవిష్కరించే సాహసం చేయకుండా, ఒక నిర్దిష్ట జీవిత అనుభవాన్ని నిర్దిష్టంగా విశ్లేషించి దాని నుండి పుట్టిన ఆకాంక్షలను తీర్చగల పరిష్కారాలను ఊతం చేసుకొని నడిచే ఉద్యమాల పట్ల పోస్ట్ - మోడర్నిస్టులు

ఆకర్షితులవుతున్నారు. (ఈ ఉద్యమాలను 'అస్తిత్వ ఉద్యమాలు' అని పిలవడంలో ఔచిత్యమేమీ లేదు. ఆ వివరణలోకి నేనిప్పుడు పోను.) అన్ని ఆదర్శాలను సాధించి పెట్టే ఒక మౌలిక భౌతిక క్రమం - అన్నిటినీ నడిపించే ఒక పునాదిప్రాయమైన హేతువు, సార్వజనీన సత్యాన్ని దర్శించగల ఒక ప్రత్యేకమైన దృక్కోణం - లేవనే తమ తాత్విక వాదనకు నిదర్శనంగా వారు ఈ ఉద్యమాలను భావిస్తారు.

అంతవరకూ సబబుగానే ఉంది గానీ ఈ ఉద్యమాలూ వాటి సిద్ధాంతాలూ (సిద్ధాంతాలు లేకుండా ఏ ఉద్యమం నడవదు) పోస్ట్ - మోడర్న్ జ్ఞాన సిద్ధాంత విమర్శతో సంతృప్తి చెందలేవు. (ఆ ఉద్యమకారులకు ఆ విమర్శతో పరిచయం కూడ ఉండక పోవచ్చునేది వేరే సంగతి). వాటికి తమదైన జ్ఞాన సిద్ధాంతం కావాలి. అది వ్యక్తంగా ఉన్నా అవ్యక్తంగా ఉన్నా, ప్రాపంచిక వాస్తవికతను వస్తుగత సత్యంగానూ, మనకుండే జ్ఞానాన్ని దానిని (ఎంతో కొంత నిర్దుష్టంగా) ప్రతిఫలించే చైతన్యంగానూ గుర్తించి హేతుబద్ధమైన అన్వేషణ ద్వారా తమ కోరికలకు వస్తుగతమైన పరిష్కారం వెతుక్కునే - అంటే ఆధునికవాద నమూనాలో ఉండే - జ్ఞాన సిద్ధాంతమే అయి ఉంటుంది. అంతకు మించి సార్వత్రిక హేతువు జోలికీ అంతిమ పరిష్కారాల జోలికీ వారు పోకపోవడానికి వేరే సాంఘిక రాజకీయ కారణాలుంటాయి. జ్ఞాన సిద్ధాంత సంశయం దానికి కారణం కానక్కరలేదు.

అయితే పోస్ట్ - మోడరన్ విమర్శతో వారికి (వారికే కాదు, అందరికీ) పరిచయం ఉంటే మంచిదనేది సత్యం. అప్పుడు జ్ఞానసంబంధమైన అహంకారం నుండి, దాని ఫలితమైన అనైతికత నుండి, అమానుషత్వం నుండి దూరం ఉంటాము.

కాబట్టి మీరు చెప్పే కొత్త (అంటే ప్రధానంగా కమ్యూనిస్టేతర) ఉద్యమాలు 'ఆధునికానంతరవాద ఉద్యమాలు' కావు. ఆ మాటకే అర్థం లేదు. ఒక మార్క్సిస్టు పరిశీలకుడు అన్నట్టు, 'ఆ ఉద్యమాలకు ఆధునికానంతర వాదం అక్కరలేదు. ఆధునికానంతర వాదానికి ఆ ఉద్యమాలు కావాలి!' అయితే 'అక్కరలేదు' అనేది పాక్షిక సత్యం మాత్రమే. ఆధునికానంతర వాదం అందించే నిరంతర జ్ఞానసిద్ధాంత ఆత్మవిమర్శనా దృక్పథం అందరికీ, అన్ని ఉద్యమాలకూ చాలా అవసరం. ముఖ్యంగా ఈ రోజు తెలుగునాట పరమ సత్యాలనూ అంతిమ పరిష్కారాలనూ జేబులో పెట్టుకు తిరుగుతున్న ఉద్యమ మేధావులు ఆ దృక్పథాన్ని కొంచెం ఒంటబట్టించుకుంటే వారికే కాదు అందరికీ మంచిది.

**ప్ర : ఈ కొత్త ఉద్యమాల సాహిత్య సాంస్కృతిక ప్రతిఫలనాలను 'పోస్ట్ - మోడర్నిజం' అనడమైనా సరయినదేనా?**

జ : ఆ ఉద్యమాలు కొన్ని కొత్త ఆలోచనలనూ, కొత్త విలువలనూ, కొత్త వ్యాఖ్యానాలనూ ఉనికిలోకి తీసుకొచ్చాయి. వాటిని పోస్ట్ - మోడరన్ తాత్విక చట్రంలో వ్యక్తం చేసే సాహిత్య సాంస్కృతిక ప్రయోగాలని అనవచ్చును గానీ ఇప్పుడు ముందుకొస్తున్న కొత్త ఉద్యమ సాహిత్యం ఆ చట్రంలో ఉందా? ఉంటేనే ఆ పేరు సబబుగా ఉంటుంది. దళిత ఉద్యమ సాహిత్యమయితే ఆ చట్రంలో లేదని కచ్చితంగా చెప్పవచ్చు. మనవాళ్ళు ఎక్కువగా 'మార్క్సిస్టేతర' అనే అర్థంలో 'పోస్ట్ - మోడరన్' అనే మాటను వాడుతున్నట్టున్నది. మార్క్సిజం తప్ప వేరే సత్యం లేదని ప్రగతి కాముకులందరూ నమ్మినచోట అకస్మాత్తుగా కొత్త (ప్రగతిశీలం గల) సత్యాలు గుర్తింపు పొందేసరికి వాటికొక పేరు పెట్టవలసిన అవసరం వచ్చినట్టుంది. కాని నిజానికి ఇప్పుడొస్తున్న కమ్యూనిస్టేతర ఉద్యమాలన్నిటి తాత్విక దృక్పథం ఒకటి కాదు. స్త్రీవాదులకు మాత్రమే పోస్ట్ - మోడర్నిజమ్‌తో తాత్విక సంబంధం ఉంది. స్త్రీవాదంపైన పోస్ట్ - మోడర్నిజం ప్రభావం చాలా ఉంది. కానీ స్త్రీవాదులందరూ పోస్ట్ - మోడర్నిస్టులు కాదు. మిగిలిన (దళిత, ఆదివాసీ, ప్రాంతీయ వగైరా) ఉద్యమకారులెవ్వరూ ఆధునికానంతర వాదులు కారు. జ్ఞాన సిద్ధాంతం వరకు వాళ్ళు ఎక్కువగా మోడర్నిస్టులే, ఆధునిక వాదులే. అయితే వాళ్ళు తమ అనుభవం నుండి కమ్యూనిస్టుల మీద పెడుతున్న విమర్శకు ఆధునికానంతరవాదులు మార్క్సిజంపైన పెడుతున్న తాత్విక విమర్శతో (ఇది కాకతాళీయం కాదు) కొంత సారూప్యత ఉంది. అంతమాత్రం చేత ఆ ఉద్యమాలనూ ఆ ఉద్యమాలనుండి పుట్టిన సాహిత్యాన్నీ 'ఆధునికానంతర వాదం' అనడం సబబు కాదు.

**ప్ర : మార్క్సిస్టు సంప్రదాయంలోని తాత్విక దృక్పథంతో నేనీరోజు సంతృప్తి చెందడం లేదు-అన్నారు. హేతుబద్ధమైన తాత్విక మానవతా వాదనను చేర్చుకోకపోతే మార్క్స్ ఆలోచన పరిపూర్ణం కాదు-అన్నారు. అల్తూజర్, గ్రామ్‌సీ, రేమండ్ విలియమ్స్ వంటివారిని కోట్ చేస్తున్నారు. మీలో ఈనాడు కనిపిస్తున్న కొత్త ఆలోచనలకు పోస్ట్ మోడర్న్‌వాదుల ప్రభావం యేమీ లేదా?**

జ : ఉంటే ఒప్పుకోవడానికి నాకు అభ్యంతరమేమీ లేదు. కానీ ఆ ప్రభావం కొంచెమేనని చెప్పుకోవాలి. ఆధునికానంతరవాదంలోని కొన్ని విషయాలు పాశ్చాత్య తాత్విక చరిత్రలో ఇదివరకు ఉన్నవే. జ్ఞానసిద్ధాంతంలో సంశయవాదం పాతదే. కొన్ని శతాబ్దాలుగా ఉన్నదే. దోపిడీ సమాజం తన గురించి తాను అనుకునేది దాని అసలు స్వభావం కాదనీ, అసలు స్వభావాన్ని కప్పిపెట్టే మార్మికత అనీ

మార్క్స్ అన్నాడు. అలాగే మనిషి తన గురించి తాను చెప్పుకునేది అసలు విషయం కాదనీ, అది అసలు విషయాన్ని కప్పిపెట్టే (repress చేసే) సాధనమనీ ఫ్రాయిడ్ అన్నాడు. ఏ హేతువూ మనిషి ఉనికిని పూర్తిగా నిర్ణయించజాలదనీ ఏ హేతువుకూ అందని స్వయం ప్రతిపత్తి మనిషికి ఉందనీ అస్తిత్వవాదులన్నారు.

(ఇంటర్వ్యూ : కె. శ్రీనివాస్. ప్రశ్నలు సమాధానాలు రెండూ లిఖితపూర్వకంగా ఇచ్చినవే. ఇది మొదటి భాగం మాత్రమే. 'మరోదారి' ఆగిపోవడంతో రెండో భాగం అచ్చు కాలేదు. అముద్రిత భాగం దొరకనూ లేదు.)

మరోదారి

మే/జూన్ 1998

---

*తెలుగు సాహిత్యంలో ఇప్పుడు జరుగుతున్న ప్రధాన చర్చలన్నీ పోస్ట్ - మోడర్నిజం చుట్టూనే తిరుగుతున్నాయి. పోస్ట్-మోడర్నిజం పాశ్చాత్య మూలాల గురించీ, తాత్విక సిద్ధాంతాల గురించీ పరిచయం ఉన్నవారూ, లేనివారూ కూడా ఆ మాటను విరివిగా ఉపయోగిస్తున్నారు. స్త్రీవాద, దళితవాదాల చర్చలతో ప్రారంభమై కొనసాగుతున్న ఒక క్రమం, దాని చుట్టూ అలుముకున్న వాతావరణం, ప్రతి అంశాన్నీ ఖండించి, ఖండించి విమర్శించే ధోరణి పెరగడం - నేడు నెలకొని ఉన్న పరిస్థితిని కొత్తగా నిర్వచించవలసిన అవసరం కల్పిస్తున్నాయి. ఈ పరిస్థితి సాహిత్యానికంటే మించినది. రాజకీయ, తాత్విక, సాంస్కృతిక రంగాలన్నిటినీ ఆవరించింది. మానవహక్కుల రంగంలో కొత్త ప్రశ్నలను వేసి, కొత్త భావనలు ప్రవేశపెడుతున్న డాక్టర్ కె. బాలగోపాల్ నేటి మార్క్సిస్టుల ఆచరణ మీదనే కాదు, మార్క్సిజంలోని కొన్ని మౌలిక అంశాల మీద కూడా నిశితమైన విమర్శలు చేస్తున్నారు. ఆ విమర్శ క్రమంలో భాగంగా ఆయన పోస్ట్ మోడర్నిజం మీద కూడా వ్యాఖ్యలు చేశారు. పోస్ట్ మోడర్నిజం మీద ఇప్పుడు జరుగుతున్న చర్చకు బాలగోపాల్ అభిప్రాయాలు విలువయిన దోహదం చేస్తాయి.*

*కె. శ్రీనివాస్*

## V

# కమ్యూనిస్టు మేనిఫెస్టో : ఒక పునఃపరిశీలన

కమ్యూనిస్టు మేనిఫెస్టో మార్క్సిజానికి ఎంతవరకు ప్రామాణికం అనేది చర్చించవలసిన ప్రశ్నే. దానికంటే జర్మన్ ఐడియాలజీలోని మొదటి భాగం మార్క్స్ ఆలోచనా సరళికి బాగా అద్దం పడుతుందని వాదించే వాళ్లున్నారు. అయితే ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీల ఆలోచననూ ఆచరణనూ ఎక్కువగా ప్రభావితం చేసింది కమ్యూనిస్టు మేనిఫెస్టోయే అనడంలో సందేహం లేదు. అందువల్ల, మేనిఫెస్టోలోని అభిప్రాయాలను చర్చించడం కమ్యూనిస్టు ఉద్యమాన్ని అంచనా వేయడానికి చాలా అవసరం.

కమ్యూనిస్టు మేనిఫెస్టోకు స్ఫూర్తినిచ్చిన అన్వేషణ ఈనాటికీ అర్థవంతమైనదే. ఆ అన్వేషణ 150 సంవత్సరాల తరువాత కూడ సజీవంగానే ఉంటుందని - ఇంకా ముగియకుండా ఉంటుందని - మార్క్స్‌గానీ ఎంగెల్స్‌గానీ ఊహించి ఉండరు. ఎందుకంటే 19వ శతాబ్దపు మధ్యభాగం నుండీ పెట్టుబడిదారీ వ్యవస్థను అధిగమించే కార్మిక విప్లవం ఆసన్నమయిందని వారు భావిస్తూ వచ్చారు. ఆ విప్లవ ప్రయత్నం ఓటమిని చవిచూసినప్పుడు ఆ ఓటమిని వారు వాస్తవికం గానే గుర్తించారు. కానీ ఎప్పటికప్పుడు ఆఖరుదెబ్బ దగ్గరిలోనే ఉందని అనుకుంటూ వచ్చారు.

కానీ ఆ అన్వేషణ ఈనాటికీ సజీవంగానే ఉంది. అది సజీవంగా ఉండడం మేనిఫెస్టో కర్తలకు ఇంకొక రకంగా ఆశ్చర్యం, అసహనం కూడా కల్గించి ఉండేదేమో. సమసమాజాన్ని చాలామంది కాంక్షించారు గానీ ఆ భావనను సహేతుకమైన ప్రాతిపదికపై నిలబెట్టింది తామేనని వారు భావించారు. ఇతర సోషలిస్టు సిద్ధాంత దృక్పథాలను కమ్యూనిస్టు మేనిఫెస్టో 'ఫ్యూడల్ సోషలిజం', 'పెటీ బూర్జువా సోషలిజం', 'బూర్జువా సోషలిజం', 'యుటోపియన్ సోషలిజం' అని వర్గీకరించి వివరించి తిరస్కరించింది. కార్మికవర్గం ఆధ్వర్యంలో జరగబోయే స్వంత ఆస్తిలేని సమాజం నిర్మాణంలోనే నిజమైన సమసమాజానికి పునాది ఉందని కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రకటించింది. అయితే తక్కిన సోషలిస్టు సిద్ధాంతాలను కేవలం తప్పుడు ఆలోచనలు లేక అహేతుకమైన ఆలోచనలు అని కొట్టిపారేయలేదు. నిజమైన సమసమాజ భావనకు కార్మికవర్గ పునాది ఉన్నట్టే తప్పుడు భావనలన్నిటికీ ఏదో ఒక అన్యవర్గ జీవితంలో ప్రాతిపదిక ఉందని - పెట్టుబడిదార్ల చేతిలో దెబ్బతిని పాత ఔన్నత్యం కోసం తపిస్తున్న ఫ్యూడల్ దొరలు కావచ్చు, పెట్టుబడిదారీ పురోగమనం వల్ల దెబ్బతిని జీవనం కోల్పోతున్న చేతివృత్తులవారు కావచ్చు, పాతసమాజాన్ని అంటిపెట్టుకొని ఉన్న రైతాంగం కావచ్చు, పెట్టుబడిదారీ వ్యవస్థలో భాగంగా ఉంటూ కూడా మానవతా దృక్పథంతో సోషలిజాన్ని కాంక్షించే బూర్జువా మేధావులు కావచ్చు, తన బలాన్నీ సంఘటిత శక్తినీ ఇంకా గుర్తించని శైశవదశలో ఉన్న కార్మిక వర్గమే కావచ్చు. ఈ విధంగా సోషలిజానికి సంబంధించిన ప్రతీ ప్రత్యామ్నాయ దృక్పథానికీ ఒక అన్య (లేక అపరిణిత) వర్గ ప్రాతిపదికను గుర్తించటం ద్వారా ఇంక ప్రత్యామ్నాయ అన్వేషణకు సాధికారమైన (లెజిటిమేట్) స్థానం లేదన్న ధ్వనితో కమ్యూనిస్టు మేనిఫెస్టో సాగుతుంది. కానీ అన్వేషణ ఈనాటికీ సజీవంగానే ఉంది. కార్మికవర్గ రాజ్యాధికారం ద్వారా సోషలిజాన్ని నిర్మించే ప్రయత్నం ఈ శతాబ్దంలో పలుదేశాలలో జరిగింది. అన్ని ప్రయత్నాలూ విఫలం అయ్యాయి. సిద్ధాంతలోపమేమీ లేదనీ ఆచరణలో మాత్రమే పొరబాట్లు దొర్లాయనీ అనే వారున్నారు. కావచ్చు, కాకపోవచ్చు. ఆ విషయాన్ని వివరంగా చర్చించడానికిది సందర్భం కాదు. కానీ ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణకు తావు లేదనీ, అది ఏదో ఒక అన్యవర్గ ప్రయోజనం నుండే పుట్టాలనీ ఇంక అనడానికి వీలులేదు. ఆ అర్థంలో కూడా కమ్యూనిస్టు మేనిఫెస్టో కర్తలు చేపట్టిన అన్వేషణ ఇంకా సజీవంగానే ఉంది.

కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రతిపాదించిన మార్గం ఎందుకు ఫలితాన్నివ్వలేదన్న చర్చ ఈనాటి అన్వేషణలో ఒక ముఖ్య విషయం అవుతుంది. ఆ చర్చ మొత్తం ఇక్కడ నేను చేపట్టబోనుగానీ తాను చేసిన ప్రతిపాదనలో భాగంగా మేనిఫెస్టో చేసిన వివిధ సూత్రీకరణలను, వాటి సత్యాసత్యాలనూ పరిశీలించడం ఆ చర్చకు ఉపయోగ పడగలదు.

నాగరికత పుట్టిననాటి నుండి ప్రపంచ చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే ననేది మేనిఫెస్టోలోని ప్రఖ్యాతమైన వాక్యాలలో ఒకటి. ఇది సత్యమేనా? నిజానికసలు పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ వచ్చేవరకు ఎక్కడా సాంఘిక వ్యవస్థ వర్గాల రూపంలో లేదు. స్త్రీ పురుష విభజన ఉంది. భాష, జాతి, మతపరమైన విభజన ఉంది. మన దేశంలో కులాల విభజన ఉంది. శిష్టులు - సామాన్యులు, రాజన్యులు - ప్రజలు, స్వేచ్ఛా జీవులు - బానిసలు, పౌరులు - జానపదులు మొదలయిన వివిధ రకాల విభజనలు ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తాయి. వీటన్నిటికీ ఆస్తి సంబంధాలు నిర్ణాయక అంశం కాదు. అన్నిటి మీదా ఉత్పత్తి సంబంధాల ప్రభావం ఉన్నా అదే ప్రధానం కాదు. ఆ మాటకొస్తే ఆస్తి సంబంధాల మీద జెండర్ ప్రభావం, కులం ప్రభావం చాలా ఉంది.

మరి ఈ రకరకాల విభజనల ప్రాతిపదికన ఘర్షణలు చరిత్రలో జరగలేదా? అవేవీ చరిత్రను అసలే మార్చలేదా? ఉత్పత్తి సంబంధాల ప్రాతిపదికన జరిగిన పోరాటాలు మాత్రమే చరిత్రను మార్చాయా? వేరేవి ఒకవేళ చరిత్రను మార్చినా, వాటిలో ఆర్థిక పోరాటం దాగి ఉండడం వల్లనే - అవి మారురూపంలో జరిగిన వర్గ పోరాటాలు కావడం వల్లనే - మార్చాయనుకోవాలా? దక్షిణ భారతదేశంలో శైవ వైష్ణవ ఘర్షణ పెద్ద భూస్వాములకూ చిన్న భూస్వాములకూ మధ్య పోరాటం తీసుకున్న రూపం మాత్రమేనని కోశాంబి అంటాడు. మలబార్‌లోనూ, తూర్పు బెంగాల్‌లోనూ ముస్లింలలో మతపరంగా వచ్చిన ఉద్యమాలన్నీ హైందవ భూస్వాముల ధ్గగర కౌలుదార్లుగా ఉన్న ముస్లిం రైతుల వర్గచైతన్యం తీసుకున్న రూపం మాత్రమేనని మార్క్సిస్టు విశ్లేషకులు అంటుంటారు. ప్రాచీన భారత చరిత్రలో వేదకాలం అనంతరం నెలకొన్న స్థిర వ్యవసాయ సమాజంలోని వ్యవసాయ వ్యాపార వర్గాలు పశుబలులపై, సంపదను వృథా చేసే యజ్ఞకాండపై చేసిన తిరుగుబాటే వైదిక బ్రాహ్మణమతంపైన బౌద్ధం, తదితర అబ్రాహ్మణ మతాలు చేసిన పోరాటం అని వ్యాఖ్యానించినవారు చాలామందే ఉన్నారు. ఇది సరయిన

విశ్లేషణేనా అన్న ప్రశ్న పక్కన పెడదాం. ఒక సామాజిక విషయంలో రెండు అంశాలు కలిసి ఉన్నప్పుడు వాటిలో ఒకటి అసలు విషయమనీ, రెండవది దాని రూపం మాత్రమేనని నిర్ణయించడానికి హేతుబద్ధమైన ప్రాతిపదిక చూపించగలగాలి. లేకపోతే ఈ రకమైన విశ్లేషణలను సిద్ధాంత విశ్వాసం కారణంగా నమ్మవలసిందే. అదెట్లాగున్నా, ఆయా పోరాటాలలోనూ, ఘర్షణలలోనూ పాల్గొన్నవారు తమకే తెలియకుండా ఏవో ఉత్పత్తి సంబంధమైన వర్గ పోరాటాలలో మారురూపంలో పాల్గొన్నావారనుకున్నా, వారు ఘర్షణ పడింది వర్గేతర రూపంలో కావడం వల్ల ఆ ఘర్షణకు ఆర్థికేతర పర్యవసానాలు చాలా ఉంఅయి. బ్రాహ్మణ్యంతో బౌద్ధం చేసిన పోరాటం సారాంశంలో వర్గపోరాటమేనని ఒప్పుకున్నా, అది ఈ రూపంలో జరగడం సామాజిక చరిత్ర మీద చాలా ప్రభావం వేసింది. అదే సారాంశం వేరొక రూపం తీసుకుని ఉంటే ఇంకొక రకమైన ప్రభావం ఉండేది. అటువంటప్పుడు మన దేశ చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే అనగలమా? శైవ వైష్ణవ ఘర్షణలు సారాంశంలో భిన్న వ్యవసాయ వర్గాల మధ్య ఘర్షణలేననుకున్నా వాటిలో పాల్గొన్నవారు తమ వర్గ స్థితితో సంబంధం లేకుండా శైవులుగా, వైష్ణవులుగా పాల్గొన్నారు. దాని ప్రభావం దక్షిణ భారతదేశంలో కులవ్యవస్థపైన, తద్వారా సామాజిక జీవితంపైన చాలా పడింది. అదే ఘర్షణ ఇంకొక రూపం తీసుకొని ఉంటే (రూపం - సారాంశం అన్న ఈ విశ్లేషణ సరయినదేననుకున్నా) ఈ ప్రభావం ఉండేది కాదు. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు జాతీయవాదం పేరిట జరిగినప్పటికీ, ఆయా దేశాల గుత్తపెట్టుబడిదారీ వర్గాల మధ్య ఉన్న ఘర్షణ సామ్రాజ్యవాద దశలో తీసుకున్న సంఘర్షణాత్మక రూపమే ఆ యుద్ధాల సారాంశం అన్న విశ్లేషణ చాలామంది మార్క్సిస్టులు చేసారు. అది (ఏదో ఒక అర్థంలో) నిజమేననుకున్నా, ఆ ఘర్షణ జాతీయ ఉన్మాదం రూపం తీసుకోవడం వల్లనే యూదులపైన జర్మనీలో భయంకరమైన ఊచకోత జరిగింది. దాని ప్రభావం ఆధునిక ప్రపంచ చరిత్రపైన అనేక రూపాలలో ఉంది. అదే ఆర్థిక సంక్షోభం లేక ఘర్షణ జాతీయ ఉన్మాదం రూపం తీసుకోకుండా ఉండి ఉంటే (ఇంకేదయినా రూపం తీసుకొని ఉంటే) ఆధునిక చరిత్ర ఇంకొక రకంగా ఉండేది.

ఇటువంటి ఉదాహరణలు చాలా ఇయ్యవచ్చు. చరిత్రలో మనుషులు ఎల్లప్పుడూ వర్గాలుగానే విడిపోయి లేరు. వర్గాలుగానే సంఘర్షించుకోలేదు. అదే సారాంశం, పైకి కనిపించేది రూపం మాత్రమే అనుకుందామంటే ఒక సామాజిక విషయం మరొక సామాజిక విషయంగా పరివర్తన చెందే పరిణామ క్రియకు

సహేతుకమైన వివరణ ఏదీ లేకపోగా, ఆయా రూపాలలో జరిగిన ఘర్షణల ప్రభావం ప్రపంచ చరిత్ర మీద ఎంత ఉందంటే 'అది రూపం మాత్రమే' అనడంలో అర్థమేమీ కనిపించదు. ఆ ప్రభావాన్ని అర్థం చేసుకునేటప్పుడు మనకు రూపంతోనే ప్రమేయం ఉంటుంది తప్ప దాని వెనుక దాగి ఉందనుకునే 'అసలు విషయం'తో కాదు.

పోతే, వర్గపోరాటమా లేక మరొక పోరాటమా అన్నది పక్కన పెట్టి, అసలు ప్రపంచ చరిత్ర అంతా (ఏదో ఒక) పోరాటాల చరిత్రేనా? మానవ సామాజిక జీవితంలో వచ్చిన మార్పంతా సంఘర్షణల రూపంలోనే వచ్చిందా? చాలా మార్పుకు సంఘర్షణలు మూలం అనేది వాస్తవమే. కానీ నిర్మాణాత్మకమైన అన్వేషణ ద్వారా వచ్చిన మార్పు కూడా చరిత్రలో చాలా ఉంది. ఈ రకమైన అన్వేషణను కమ్యూనిస్టు మేనిఫెస్టో కూడా కాదనదు. ఎక్కడో ఒకచోట నిత్యం ఎవరో ఒకరు తమ జీవితాలను బాగుచేసుకోవడం కోసం కొత్త ఉత్పత్తిశక్తుల అన్వేషణలో నిమగ్నమయి ఉంటారు. ఇప్పటికి సాగులో లేని భూమిని సాగులోకి తెచ్చే ప్రయత్నంతో మొదలుపెట్టి కొత్త సాంకేతిక ప్రక్రియల అన్వేషణ దాకా ఇది అనేక రూపాలలో ఉంటుంది. ఈ అన్వేషణ అనివార్యంగా వర్గఘర్షణకు దారి తీయనవసరం లేదు. వర్గ (లేక ఇతర) ఘర్షణలతో కూడి ఉన్నా లేక ప్రశాంతంగా సాగినా ఈ అన్వేషణ చరిత్రలో చాలా మార్పు సమకూర్చింది.

ఈ మాత్రం సవరణ కమ్యూనిస్టు మేనిఫెస్టో రచయితలకు పెద్దగా ఇబ్బంది కరం కాదు. నిజానికి మరీ ఇంత దూకుడుగా రాయని ఇతర రచనలలో మార్క్స్, ఎంగెల్స్‌లు ఈ అన్వేషణకు తగు ప్రాముఖ్యం ఇచ్చారు.

కానీ చరిత్రలో చెప్పుకోదగ్గ పాత్ర నిర్వహించిన నిర్మాణాత్మక కృషి వేరే కూడా ఉంది. సంఘ జీవిత నియమాల ఆవిష్కరణ ఒక ఉదాహరణ. మానవ సమాజాలు ఎల్లప్పుడూ సమసమాజాలు కావు గానీ అవి ఎప్పుడూ సమాజాలే! అంటే మనుషు లెప్పుడూ సంఘజీవులే. ఆ సంఘజీవితం ఎంత అసమమయినదయినా కావచ్చు గాక అంతేకాక, అసమాన సమాజం లోపల కూడా పరస్పర సమానత్వం పాటించే ఉపసమాజాలుంటాయి. కాబట్టి పదిమంది ఒక సంఘంగా బ్రతకడానికి కావలసిన నియమాల అన్వేషణ చరిత్ర ఆదినుండి జరుగుతూనే ఉంది. ఇది సాంఘిక నీతి, పరిపాలనా నియమాలు, చట్టాలు, తగవుల పరిష్కారానికి ఉపయోగించే ప్రమాణాలు (వ్యవస్థలు, అవ్యవస్థిత సంప్రదాయాలు

కూడా) మొదలయిన రూపాలలో ఉంటుంది. వీటి రూపకల్పనలో ఎప్పుడూ కూడా ఆయా సామాజిక పరిస్థితులలోని వ్యవస్థిత అసమానతల పాత్ర, ప్రభావం ఎంతో కొంత ఉంటుంది. వాటిని కాపాడడం కోసమే రూపొందించే నియమాలూ ఉంటాయి. కానీ దానితో పాటు సంఘ జీవితానికి - అవి ఏ రూపంలో ఉన్నప్పటికీ - అవసరమైన నియమాల ప్రతిపాదన కూడా ఉంటుంది. సాంఘిక నీతి, సంప్రదాయాలు, పరిష్కార వ్యవస్థలు, ప్రభుత్వ పాలనా నియమాలు, చట్టాలలో సంఘ జీవిత నియమాలు అనేక ఒడిదుడుకులతో ఎదుగుతూ (అప్పుడప్పుడు తిరోగమిస్తూ) ఉంటాయి. ఇది ఎల్లప్పుడూ వర్గ (లేక ఇతర) ఘర్షణల రూపంలోనే జరగనవసరం లేదు. హేతుబద్ధమైన అన్వేషణ రూపంలో జరగగలదు. చరిత్ర గతిలో ఇది కూడా ఒక ముఖ్య అంశమే.

అబద్ధాలు చెప్పడం తప్పు అనే సంఘ జీవిత నియమాన్ని ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. ఒక్కొక్క సామాజిక పరిస్థితిలో ఒక్కొక్కరికి సంబంధించి ఈ నియమానికి భిన్నమైన మినహాయింపులు ఉండగలవు. కొన్ని సందర్భాలలో ఇది కపట రూపం కూడా తీసుకోగలదు. అయినప్పటికీ ఇది 'ఆ సమాజంలో దోపిడీ అసమానతలున్నాయా లేవా, అన్న ప్రశ్న దగ్గరే ఆగిపోనక్కరలేని సాధారణ సంఘ జీవిత నియమం. దీనిని నిక్షిప్తం చేసుకున్న సామాజిక సంప్రదాయాలు, కట్టుబాట్లు, చట్టాలు చరిత్రలో చాలానే వచ్చాయి.

కళాసాహిత్య రంగాల చరిత్రకు కూడ ఇది వర్తిస్తుంది. ఒక నిర్దిష్టమైన జీవిత అనుభవం నుండి (అది 'వర్గ' అనుభవమే కానక్కరలేదు), జీవిత ఘర్షణల నుండి పుట్టిన కళాసాహిత్య అన్వేషణ కూడా ఉంది. మనుషులందరికీ సామాన్యమైన అనుభూతులను, మానసిక అవసరాలనూ కాల్పనిక రూపంలో తీర్చడం కావచ్చు. మనుషులు తమ ఉనికిని గురించి (అది భౌతికం కావచ్చు, మానసికం కావచ్చు, వ్యక్తిగతం కావచ్చు, సామాజికం కావచ్చు) తాము స్పష్టంగా గుర్తించలేని (గుర్తించడానికి ఇష్టపడని, ధైర్యం చాలని) సత్యాలను స్పష్టంగా వ్యక్తం చేయడం కావచ్చు, మనకు తెలిసిన చిన్న జీవితానికి సంబంధించిన విషయంగా మనం అనుకుంటున్న దానికి శిల్పం, లేఖనం, కథనం అనే ప్రక్రియల ద్వారా సార్వజనీనత కల్పించి మనల్ని ఒక పెద్ద జీవితంలో భాగం చేయడం ద్వారా కావచ్చు, మనుషుల జీవిత అనుభవంలో పాక్షికంగా, అసమగ్రంగా ఉండే (భౌతిక, నైతిక, మానసిక) ఔన్నత్యానికి సమగ్ర రూపం ఇవ్వడం ద్వారా కావచ్చు- కళాసాహిత్యాలు మానవ జీవితానికి పరిపూర్తి

నిస్తాయి. ఇదొక మానవీయమైన అవసరం. దానికి తగిన రూపాల, ప్రక్రియల, వ్యక్తీకరణ మార్గాల అన్వేషణ సాగుతూనే ఉంటుంది. అప్పటి సామాజిక పరిస్థితులలోని అసమానతలు, ఘర్షణల ప్రభావం కళాసాహిత్యాలపైన ఎంత ఉంటుందో వాటి దగ్గరే ఆగిపోని అన్వేషణ కూడా అంతే ఉంటుంది. ఇది ఎప్పుడూ సంఘర్షణాత్మకంగా సాగనవసరం లేదు.

మానవ చరిత్రలో ఘర్షణ, పోరాటం, విప్లవాలే కాక అవిచ్ఛిన్నంగా (అంటే సరళరేఖలో అనుకోకూడదు) సాగే ఆవిష్కరణ కూడా ఉంటుందనేది మార్క్స్ ఒక్క ఉత్పత్తి సాధనాల విషయంలో తప్ప వేరే ఏ విషయంలోనూ ఒప్పుకోడు. ఇది ఆయన తొలినాటి రచనల నుండి చివరి రచనల దాకా ఉన్న గుణం. అందుకే కేపిటల్‌లో (అనుకుంటాను) ఒకచోట 'మనం ప్రాచీన గ్రీకు సాహిత్యాన్ని ఈ నాటికీ ఎందుకు అభిమానిస్తాం?' అన్న ప్రశ్న వేసుకుని, దానికి సులభంగా సమాధానం చెప్పలేకపోవడానికి తానే ఆశ్చర్యపోతూ, మన చిన్నప్పటి చేష్టలు పెద్దయిన తరువాత మనల్ని అలరించినట్టు మానవజాతి చిన్నప్పటి సాహిత్యం పెద్దయిన తరువాత కూడా మానవజాతిని అలరిస్తుంది అని వివరణ ఇస్తాడు. ఇది తిరుక్కురళ్‌కూ మహాభారతానికీ కూడా వర్తిస్తుంది కాబోలు. కానీ మానవజాతి చిన్నతనాన్ని 'తమ' బాల్యంగా భావించే మనుషులెవరూ లేరు. సాహిత్యాన్ని మాత్రం మనం ఒక 'జాతి'గా అభిమానించం, వ్యక్తులుగా అభిమానిస్తాం. అప్పటి సామాజిక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చూపించడం ఆ సాహిత్యానికి ఈనాడు కూడా ఉండే విలువకు ఒక కారణం కావచ్చు. అయితే అప్పటి సామాజిక జీవితాన్ని తెలుసుకోవాలన్న కుతూహలం అందరిలోనూ ఎందుకుంటుంది? అప్పటి సామాజిక వ్యవస్థకూ ఇప్పటి సామాజిక వ్యవస్థకూ తేడా లెన్ని ఉన్నప్పటికీ మానవ వ్యవహారాలలో సర్వత్రా తలెత్తే విషయాల గురించి బలమైన చర్చ లేక హృద్యమైన వ్యక్తీకరణ లేక ఆలోచనాత్మకమైన వివేచన ఏదో ఉండబట్టే ప్రాచీన సాహిత్యం ఈనాటికీ నిలిచిపోగలిగింది.

ఈ ప్రశ్నను కమ్యూనిస్టు మేనిఫెస్టో చర్చించింది. 'మతం, నీతి, తాత్విక చింతన, న్యాయసిద్ధాంతాలకు సంబంధించిన భావనలలో చారిత్రకంగా మార్పులొచ్చిన మాట వాస్తవమే గానీ, ఎన్ని మార్పులొచ్చినా మతం అనేది ఎప్పుడూ ఉంది నైతికత ఎప్పుడూ వుంది. తాత్విక వివేచన ఎప్పుడూ ఉంది. న్యాయశాస్త్రం ఎప్పుడూ ఉంది కదా' అనీ, 'అంతేకాక అన్ని సామాజిక దశలలోనూ స్వేచ్ఛ, న్యాయం మొదలైన సార్వత్రిక సత్యాలకు గుర్తింపు ఉంది కదా' అనీ, 'మరి

కమ్యూనిస్టులు ఈ సార్వత్రిక సత్యాలకూ మతానికీ నీతికీ కొత్త ప్రాతిపదిక కల్పించే బదులు వాటిని రద్దు చేస్తామనడం న్యాయమా' అనీ తమ విమర్శకులు అంటారని మేనిఫెస్టో గుర్తిస్తుంది. దానికి జవాబుగా, ఇప్పటిదాకా గడచిన చరిత్రలో మార్పుతో బాటుగా అవిచ్ఛిన్నత, లేక కొనసాగింపు ఉండటానికి కారణం ఇప్పటిదాకా ఎన్ని సామాజిక వ్యవస్థలు ఉనికిలోకి వచ్చినప్పటికీ అవన్నీ శ్రమదోపిడీ మీద, వర్గ వైషమ్యాల మీద ఆధారపడినవే కావడం అని వివరిస్తుంది. అందువల్ల వాటి మధ్య ఎంత భిన్నత్వం ఉన్నా, ఎంత వైవిధ్యం ఉన్నా అవన్నీ కొన్ని సామాన్య రూపాలలోనూ కొన్ని సాధారణ భావనల పరిధిలోనూ పరిభ్రమిస్తుంటాయనీ, శ్రమదోపిడీ పోయిన తరువాతే ఇవి పూర్తిగా రద్దయిపోతాయనీ అంటుంది.

స్వేచ్ఛ, న్యాయం మొదలైన భావాలలోనూ, సంఘజీవిత నియమాలలోనూ (నీతి, న్యాయశాస్త్రం), చరిత్రలోనూ (మార్పుతో బాటు) కనిపించే అవిచ్ఛిన్నతకు, అంటే ఒక చారిత్రక దశనుండి మరొక చారిత్రక దశకు, ఈ విలువలలో ఆలోచనలలో కొన్ని కొనసాగడానికి కారణం ఇదేనా? జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ సమాధానంలో మూడు విషయాలున్నాయి. 1) ఒక చారిత్రకదశ నుండి మరొక చారిత్రకదశకు ఏ ఒక్క విషయంలోనైనా కొనసాగింపు లేక సామాన్య లక్షణాలు ఉండాలంటే, రెండింటి ఉత్పత్తి వ్యవస్థలలో ఏదో ఒక సామాన్య అంశం ఉండాలి. ఉత్పత్తి వ్యవస్థ సమాజాల మధ్య అంతటి అగాధాలు కల్పిస్తుంది. 2) నైతిక విలువలు, తత్వశాస్త్రం, న్యాయ సిద్ధాంతం మొదలయినవి శ్రమ దోపిడీ ఉన్న సమాజంలోనే ఉంటాయి. శ్రమదోపిడీ లేకపోతే ఇవి ఉండవు. (లేదా వీటి అవసరం లేదు) ఇప్పటిదాకా చరిత్ర అంతా దోపిడీ వ్యవస్థల చరిత్రే కాబట్టే అన్ని చారిత్రక దశలలోనూ ఇవి ఉన్నాయి. 3) వర్గరహిత సమాజంలో మనుషులు స్పాంటేనియస్‌గా - ఒక నియమం, ఒక న్యాయ వ్యవస్థ అక్కర లేకుండా - నీతిగా న్యాయంగా స్వేచ్ఛగా ఉంటారు. అప్పుడు వారికి నీతిశాస్త్రం, న్యాయ సిద్ధాంతం అక్కరలేదు.

విలువలు, నీతినియమాల విషయంలో ఆర్థిక నిర్ణాయక వాదాన్ని ఇంత దూరం తీసుకుపోయే వైఖరి కమ్యూనిస్టు ఉద్యమానికి చాలా నష్టం చేసింది. ఈ వైఖరిని మార్క్స్ తన చివరి రోజులు దాకా కూడా మార్చుకున్న దాఖలాలు లేవు. ఈ అతివాద వైఖరివల్ల కమ్యూనిస్టులు మానవ నాగరికతలోని నైతిక అంశాన్ని కేవలం విమర్శించడమే తప్ప పెంపొందించే కర్తవ్యం తమది కాదనుకున్నారు. ఈ వైఖరి నష్టం అంతా యింతా కాదు.

అంతేకాక, ఒక చారిత్రక దశ నుండి మరొక చారిత్రక దశకు ఉత్పత్తి శక్తులు తప్ప వేరే ఏదీ కొనసాగదన్న సిద్ధాంతం వల్ల, కాలక్రమంలో ఎదిగే నాగరికత కేవలం సాంకేతిక సామర్థ్యానికీ దాని పర్యవసానాలయిన సంపద, జ్ఞానం, భౌతిక జీవిత వైవిధ్యం, విస్తృతులకూ సంబంధించిన విషయం అయింది. కమ్యూనిస్టు మేనిఫెస్టో నాగరికత అనే మాటను వీటికి సమానార్థకంగా వాడుతుంది. నాగరికత అంటే భౌతిక నాగరికతే. మామూలుగా నాగరికత భావనలో ఉండే ఇతర విషయాలు ఆ భౌతిక నాగరికతలోని దోపిడీ అసమానతల నుండి పుట్టినవి. వాటిని కప్పిపెట్టే భావజాలం కావచ్చు, లేదా వాటినుండి పుట్టే బాధకొక తాత్కాలిక ఉపశమనం కావచ్చు. కానీ మొత్తానికి దోపిడీ అసమానతల నుండి పుట్టినవే. నాగరికత అనే భావనలో మనుషులు తమ భిన్న (భౌతిక, మానసిక, వ్యక్తిగత, సామాజిక) అవసరాలు తీర్చుకోవడానికి సృష్టించుకున్న ఇతర సాధనాలకు చోటు లేకుండా పోయింది. వర్గరహిత సమాజం వచ్చిన తరువాతే ఆ ప్రయత్నానికి అర్థం వస్తుంది. అప్పుడు మనుషులు రూపకల్పన చేయబోయే నాగరికతకు ఇప్పుడున్న నాగరికతకూ పోలికేమీ ఉండదు. ఎందుకంటే ఇప్పుడున్నదంతా దోపిడీ పీడనల నుండి పుట్టి దానికొక సాధనంగానో, భావజాలంగానో, మహా అయితే ఆ బాధను ఉపశమింపచేసే మత్తుమందుగానో పనిచేస్తుంది - అందుకోసమే కల్పించబడింది - కాబట్టి.

గతానికీ భవిష్యత్తుకూ మధ్యన ఇంతటి అగాధాన్ని ఊహించుకోవటం వల్ల మానవ నాగరికత పురోగమనంలో కమ్యూనిస్టులు ఎంత నిండుగా పాల్గొనాలో అంత నిండుగా పాల్గొనలేకపోయారు. ఒక్కొక్కసారి విధ్వంస వైఖరిని ప్రదర్శించారు కూడ.

కార్మిక విప్లవం దగ్గరకు తిరిగి వద్దాం. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకూ తత్పూర్వ వ్యవస్థలకూ మధ్యనున్న తేడాను కమ్యూనిస్టు మేనిఫెస్టో వివరిస్తుంది. అంతకు ముందున్న సమాజాలలో దొంతరలుగా అనేక వర్గాలుండేవని అంటుంది. వాటిని ఏకరువు పెడుతుంది. ఈ జాబితా కేవలం ఆర్థిక వర్గాలకే పరిమితం అయినప్పటికీ పెట్టుబడిదారీ పూర్వ సమాజాలలోని వైవిధ్యాన్ని గుర్తిస్తుంది. కాగా, బూర్జువా వ్యవస్థ సామాజిక వర్గీకరణను చాలా సరళం చేసిందనీ, అది దాని ప్రత్యేక లక్షణమనీ మేనిఫెస్టో అంటుంది. బూర్జువాలు, కార్మికులు అన్న రెండు వర్గాలు మాత్రమే ఇక్కడ ఉన్నాయనీ, తక్కిన వర్గాలన్నీ వేగంగా దీనిలోనో దానిలోనో

(ఎక్కువ భాగం కార్మిక వర్గంలోనే) కలసి పోతాయని, కలిసి పోతున్నాయనీ సూత్రీకరిస్తుంది.

కార్మిక విప్లవం త్వరలో రానున్నదన్న నమ్మకానికి ఈ అభిప్రాయం చాలా ఊతం ఇచ్చిందనడంలో సందేహం లేదు. అయితే చాలామంది పరిశీలకులు గుర్తించినట్టు బూర్జువా వ్యవస్థ వర్గవిభజనను సరళం చేయలేదు. 'స్కిల్' ఉన్నవారు, అది లేనివారు (నిజానికి 'స్కిల్' లేని పని ఏదీ లేకపోయినప్పటికీ), వైట్ కాలర్ కార్మికులు, బ్లూ కాలర్ కార్మికులు, ప్రభుత్వరంగ కార్మికులు, ప్రైవేటురంగ కార్మికులు, ప్రైవేటులో మళ్లీ కార్పొరేట్ రంగ కార్మికులు, అనియతరంగ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, అన్ని రంగాలలోనూ స్త్రీ కార్మికులు, మగ కార్మికులు, పారిశ్రామిక కార్మికులు, వ్యవసాయ కార్మికులు అంటూ కార్మికులలోనే తేడాలు ఉన్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థే అందరినీ ఒక కోవకు కుదించి వేస్తుందన్న మేనిఫెస్టో అభిప్రాయం నిజం కాకపోగా, ఆ వ్యవస్థ ఎదిగిన క్రమంలోనే కొత్త విభజనలు వచ్చాయి. కార్మికవర్గంలో పైభాగాన ఉన్నవారు మధ్యతరగతికి చాలా దగ్గరయ్యారు.

ఒక్కమాటలో చెప్పాలంటే పెట్టుబడిదారీ పూర్వ ఆర్థిక వ్యవస్థలలోని వర్గ విభజనలో ఎంతటి సంకీర్ణత ఉండిందో అంత సంకీర్ణత - బహుశా అంతకంటే ఎక్కువ సంకీర్ణత - ఇప్పుడు బూర్జువా ఆర్థిక వ్యవస్థలోను ఉంది. సోషలిస్టు విప్లవం కమ్యూనిస్టు మేనిఫెస్టో ఊహించిన రీతిలో రాకపోవడానికి ఇదొక ముఖ్య కారణం అని గత 50 సంవత్సరాలుగా అభివృద్ధి చెందిన దేశాలలోని మార్క్సిస్టులు గుర్తిస్తున్నారు.

మరొక ముఖ్యమైన విషయంలో కూడా మేనిఫెస్టో తప్పుగా ఊహించింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికులు పోను పోను మరింత పేదవారవుతారని మేనిఫెస్టో అంటుంది. వేరే రచనలలో కూడా, సమాజంలో సంపద పెరిగే కొద్దీ ఆ సంపదను సృష్టించే కార్మికులు మరింతగా పేదలవుతారని మార్క్స్ అంటాడు. అయితే ఇతర రచనలలో (ముఖ్యంగా కేపిటల్) ఆయన కార్మికులు సాపేక్షంగా పేదలవుతారన్నాడు తప్ప నిజంగానే పేదలవుతారని అనలేదని (అంటే పెరుగుతున్న సంపదలో కార్మికుల వాటా క్రమంగా పడిపోతుందని అన్నాడు తప్ప నిజంగానే కార్మికుల ఆదాయం పడిపోతుందనలేదని) వాదించే అవకాశం ఉంది. లేదా పేదరికం అన్నప్పుడు భౌతిక (ఆదాయ సంబంధమైన) అర్థంలో కాక, తన సృజనాత్మకతనూ వ్యక్తిత్వాన్నీ కోల్పోవడం అనే అర్థంలో తీసుకోవాలని వాదించే అవకాశం ఉంది. కానీ మేనిఫెస్టో స్పష్టంగానే

కార్మికుల జీవన ప్రమాణం క్రమంగా పడిపోతుందని అంటుంది. సాపేక్షంగా మాత్రమేనని ఇప్పుడు దానిని వ్యాఖ్యానించుకోవడానికి అభ్యంతరం ఉండవలసిన అవసరం లేదు గానీ ఇక్కడొక సమస్య ఉంది. కార్మికులు నిజంగానే మరింతగా పేదవారయ్యేటట్లయితే బూర్జువా వ్యవస్థ మీద కసి పెంచుకొని దానిని కూలదోస్తారనుకోవచ్చును. మేనిఫెస్టో ఆ మాటే అంటుంది. కానీ కేవలం సాపేక్షంగానే కార్మికుల దారిద్ర్యం పెరిగేటట్లయితే వారిలో అంత కసి పెరుగుతుందన్న నమ్మకం ఏముంది? యజమాని ఆస్తి పెరుగుతున్నంత వేగంగా తన జీతం పెరగడం లేదన్న విషయం కార్మికునిలో అసంతృప్తి కలిగించ వచ్చును గానీ యజమాని వర్గాన్ని కూలదోసేంత వర్గకసి పెరుగుతుందన్న హామీ ఏమీ లేదు. పరాయీకరణ వల్ల కార్మికులు తమ వ్యక్తిత్వాన్నీ గుర్తింపునూ కోల్పోవడం విషయం కూడా అంతే. అదే క్రమంలో ఆదాయాలు కూడా పెరిగినట్టయితే పెరిగిన ఆదాయం కంటే కోల్పోయిన వ్యక్తిత్వానికీ గుర్తింపుకూ కార్మికులందరూ ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారన్న భరోసా లేదు.

అదెట్లాగున్నా నిజంగానే కాలక్రమంలో కార్మికులు మరింత దరిద్రులవు తారన్నదే మేనిఫెస్టో అభిప్రాయం. కార్మిక విప్లవం ఆసన్నం అయిందన్న మేనిఫెస్టో విశ్వాసానికిది ఒక ముఖ్య ఆధారం. పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థలు శ్రామిక ప్రజలను కొంత మేరకైనా సంతృప్తి పరచడానికి వారి బాగోగులను చూసుకున్నాయి గానీ బూర్జువా వ్యవస్థ మాత్రం కార్మికులకు పీల్చి పిప్పిచేసి మరింత లాభాలు సంపాదించుకునే పోటీలో అటువంటి అవకాశమేదీ ఇవ్వదని మేనిఫెస్టో అంటుంది. అందువల్ల మరింతగా పేదరికంలోకి దిగజారే కార్మికులకు బూర్జువా వ్యవస్థను కూలదోయడం తప్ప గత్యంతరం లేదంటుంది. కానీ కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రకటించిన తరువాత గడచిన 150 సంవత్సరాలలో పాశ్చాత్య దేశాల కార్మికులు తమ నిజవేతనాలను ఎన్నోరెట్లు పెంచుకున్నారు. గతంలో ఏ ఆర్థిక వ్యవస్థలోనూ పెరగనంతగా శ్రామిక ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి.

ఈ పెరుగుదల పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాదరూపం తీసుకోవడం వల్లనే జరిగిందనీ, వలస, వలసానంతర దేశాల శ్రామికులను మరింత దోచుకోవడం వల్లనే జరిగిందనీ విశ్లేషించవచ్చును. పాశ్చాత్య దేశాలలో సర్వత్రా పెరిగిన ఆదాయాల వెనుక సామ్రాజ్యవాద దోపిడీ ఉన్నమాట వాస్తవమే. కానీ వలస, వలసానంతర దేశాలలో సహితం పెట్టుబడిదారీ దోపిడీకి లోనయిన

తరువాత నిజవేతనాలు పడిపోయిన కార్మికులున్నట్టే, పెంచుకున్న కార్మికులూ ఉన్నారు.

ఇది పెట్టుబడిదార్ల దయ వల్ల జరగలేదు. కార్మిక పోరాటాల వల్ల, ప్రగతిశీల రాజకీయ ఉద్యమాలు తీసుకొచ్చిన సంస్కరణల వల్ల జరిగింది. వాటి వెనుక మార్క్సిజం ప్రభావం ఉంది. అయినప్పటికీ దీనివల్ల పెట్టుబడిదారీ వ్యవస్థ కూలిపోలేదు. వర్థిల్లుతూనే ఉంది. ఎప్పటికప్పుడు - మేనిఫెస్టో కాలం నుండి కమ్యూనిస్టులు ఊహించుకున్నదాని కంటే ఎక్కువ నిలకడ ప్రదర్శిస్తూనే ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థ మనమీద రుద్దుతున్న జీవితమంటే మనకు ఎంత అసహ్యం ఉన్నా వాస్తవాన్ని గుర్తించక తప్పదు.

కార్మికుల నిజవేతనాలు పడిపోతాయని మేనిఫెస్టో నమ్మడానికొక కారణం ఉంది. యంత్రాలు మరింత ఎక్కువగా వాడకంలోకి వచ్చేకొద్దీ కార్మికుడు కేవలం దానికి అనుబంధమైన ఒక పరికరంగా మారిపోతాడు. అతని జ్ఞానం పెరగదు. నైపుణ్యం పెరగదు. కాబట్టి అతను ఫ్యాక్టరీలో ఖర్చుచేసే శ్రమశక్తి ఖరీదు పెరగదు. ఆ శ్రమశక్తి పునరుత్పత్తికి అయ్యేఖర్చు కేవలం కార్మికుడి భౌతిక పునరుత్పత్తికి - అంటే తిండి, బట్ట, తదితర కనీస అవసరాలకు - అయ్యే ఖర్చు. అందువల్ల కార్మికుల వేతనాలు పెరగవని మేనిఫెస్టో అంటుంది. కానీ నిజానికి ఈ పరిణామం ఒక సరళరేఖలో జరగలేదు. కొన్ని రంగాలలో యంత్రాల వాడకం పెరిగే కొద్దీ వాటితో పనిచేసే కార్మికులకు అవసరమైన విద్య, నైపుణ్యం పెరిగాయి. కొన్ని రంగాలలో తగ్గాయి. చేతివృత్తుల దశలో కార్మికులకు తమ ఉత్పత్తి క్రియమీద ఉన్న అజమాయిషీ - అందులో ఉన్న సంతృప్తి - ఆధునిక ఫ్యాక్టరీలో లేని మాట సత్యమే. అయినా సాంకేతిక జ్ఞానం పూర్తిగా క్షీణించిపోయి కార్మికులు యంత్ర పరికరాలలో ఒక పరికరంగా మారిపోయారనీ, వారి శ్రమశక్తి పునరుత్పత్తిలో కేవలం తిండి తదితర కనీస అవసరాల ఖర్చు తప్ప వేరే ఏమీ కాదనీ అనుకోవడం వాస్తవికం కాదు. ఇప్పుడు ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ పెరిగే కొద్దీ పెట్టుబడికి అవసరం అయిన కార్మికుల సంఖ్య (పెట్టుబడికి సాపేక్షంగా) పడిపోతుంది గానీ ఆ కొద్దిమంది విద్యా ప్రమాణాలు హెచ్చుగానే ఉంటాయి. ఈ విషయాలను మార్క్స్ వేరే సందర్భాలలో, ముఖ్యంగా కేపిటల్‌లో గుర్తించకపోలేదు గాని మేనిఫెస్టోలో ఈ అభిప్రాయానికి కీలకస్థానం ఉంది. నేర్పరితనమంతా యంత్రంలోనే ఉండడం వల్ల శ్రమశక్తి ఉత్పత్తికి పెద్దగా ఖర్చుకాదనీ అందువల్ల కార్మికుల వేతనాలు పెరగవనీ, కార్మికుల

జీతాలు ఎంత పెరిగితే పెట్టుబడిదార్ల లాభాలు అంత తగ్గుతాయి కాబట్టి ఆ కారణంగా కూడా పరస్పర లాభాలపోటీలో ఉన్న యజమానులు జీతాలు పెరగ నివ్వరనీ, ఈ కారణాల వల్ల కార్మికుల పేదరికం రోజురోజుకు పెరిగి వారు తిరుగుబాటుదార్లవుతారనీ మేనిఫెస్టో అంటుంది. నిజమే, మేనిఫెస్టో కేవలం దారిద్ర్యాన్నే కాక కార్మికుడి పరాయీకరణ గురించి కూడా మాట్లాడుతుంది. యంత్రంలో నిక్షిప్తమయిన మృతశ్రమ సజీవశ్రమ మీద పెత్తనంచేసే వైనాన్ని వివరిస్తుంది. పెట్టుబడిదారీ దోపిడియేకాక ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్ నిరంకుశ అజమాయిషీ కూడా కార్మికుడిపైన ఒక పీడనగా పనిచేస్తుందని గుర్తిస్తుంది. ఇవన్నీ కలిసి కార్మికులను విప్లవకారులుగా మారుస్తాయని అంటుంది. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థ పురోగమన క్రమంలో కార్మిక వర్గంలోని ఒక్కొక్క శ్రేణి తన ఆదాయాన్ని పెంచుకుంటూ పైకి పోసాగింది. మిగిలిన కారణాలు దీనిని అధిగమించి కార్మికులలో విప్లవ చైతన్యాన్ని నిలబెట్టలేక పోయాయి.

కార్మికుల పేదరికం పెరిగిందా లేదా, పెరగకున్నా బూర్జువా వ్యవస్థను ద్వేషించడానికి కార్మకులకు ఇతర కారణాలున్నాయా లేదా అన్న ప్రశ్న కొంచెం సేపు పక్కన పెడదాం. కార్మికులు వట్టి కార్మికులు కారు. వారికి జాతీయత ఉంటుంది. మత భావాలుంటాయి. స్త్రీ పురుష విభేదం ఉంటుంది. భాషాపరమైన ఐడెంటిటీ ఉంటుంది. మన దేశంలోనయితే కులం ఉంటుంది. పాశ్చాత్య దేశాలలో కూడా నలుపు - తెలుపు అన్న వర్ణభేదం ఉంటుంది. ఇవన్నీ కార్మికులను విభజించి ఐక్యతకు నష్టం చేయవా? పైగా, శ్రమదోపిడీ నుండి విముక్తి కోరుకునే కార్మికులలో అనేకులు ఇతర రూపాలలో ఆధిపత్య శ్రేణులకు చెందినవారయి ఉండవచ్చు. దాని ఫలితంగా వారిలోని సమానత్వ కాంక్ష బలహీనపడదా? 'మేము ఎవరి దోపిడీకీ లోను కాదలచుకోలేదు' అని ప్రకటించే ముందు తమపైన అదే డిమాండు తమ కంటే తక్కువ స్థాయిలో ఉన్నవారు (కులాలకు చెందినవారు) పెట్టగలరన్న స్పృహ వచ్చి వారి ఉత్సాహం కుంటుపడదా?

పెట్టుబడిదారీ మార్కెట్‌లోని పోటీ కార్మికులను చీలుస్తుందని మేనిఫెస్టో గుర్తిస్తుంది. బహుశా జాతీయత, ప్రాంతం వంటి తేడాలను కూడా గుర్తిస్తుంది కాబట్టి వర్గఐక్యత రూపొందించుకోవలసిందే తప్ప పుట్టుకతోనే ఉనికిలో ఉన్నది కాదని గుర్తిస్తుంది. అయితే మేనిఫెస్టో గుర్తించేది ఈ పరిమితమైన అనైక్యతా

హేతువులను మాత్రమే. మిగిలినవి బూర్జువా వ్యవస్థ వల్లనే అంతరించి పోతాయని మేనిఫెస్టో భావిస్తుంది. కార్మికుడికి తన భార్యా పిల్లలతో ఉండే సంబంధానికీ బూర్జువా వర్గంలోని మగవాళ్లకు తమ భార్యా పిల్లలతో ఉన్న సంబంధంతో అసలేమీ పోలిక లేదని మేనిఫెస్టో అంటుంది. పెట్టుబడి ఇంగ్లండులోనయినా అమెరికాలో నయినా ఫ్రాన్స్‌లోనయినా ఒకటే కాబట్టి కార్మికుడికి దేశం లేదు, జాతి లేదు అంటుంది. కార్మికుల మధ్య పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలోనే తలెత్తే భేదాలు సహితం ఆ క్రమంలోనే తొలగిపోతాయంటుంది. యంత్రాల ప్రాముఖ్యం పెరిగి కార్మికులు యంత్రానికి ఒక అనుబంధ పరికరంగా మారిన కొద్దీ కార్మికుల మధ్య ఉత్పత్తి క్రమంలోనూ తేడాలు లేకుండా పోతాయంటుంది.

కార్మికుల గురించి మేనిఫెస్టో చేసిన ప్రతిపాదనలను అర్థం చేసుకునే ముందు ఈనాటి ఫ్యాక్టరీ కార్మికులకూ 150 ఏళ్లనాటి ఫ్యాక్టరీ కార్మికులకూ మధ్య చాలా తేడా ఉందని గుర్తించాలి. విపరీతమైన శ్రమ దోపిడీ, పేదరికం, ఏ చట్టాలు, ఏ హక్కులూ లేని పరిస్థితి ఆనాడు ఉండింది. అటువంటి వారికి జాతి ఎక్కడిది, భాష ఎక్కడిది, ప్రాంతం ఎక్కడిది అనుకోవడం మరీ విడ్డూరం కాదు. దీనిని దృష్టిలో పెట్టుకున్నప్పటికీ ఆ దృక్పథంలోని లోపాలను గుర్తించాలి. కార్మికులు ఎంతగా ఒకే రకమైన శ్రమదోపిడీకి గురైనా వారిలో జాతీయత, ప్రాంతీయత తదితర భావాలు అంకురించకుండా పోలేదనీ, ఎంత శ్రమదోపిడీకి తాము గురయినా తాగి ఇంటికొచ్చి భార్యను కొట్టకుండా ఉండలేదనీ కమ్యూనిస్టు పార్టీలే తరువాత కాలంలో గుర్తించాయి. మార్క్స్, ఎంగెల్స్‌లకు కూడా ఇది తెలియని విషయం అయి ఉండదు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఈ కార్మికులు వారి వారి దేశాల, జాతుల మధ్య చీలిపోయి దేశభక్తి ఉన్మాదంలో పాలుపంచుకోవడం కార్మికోద్యమ అంతర్జాతీయతను తీవ్రంగా దెబ్బతీసింది. కార్మిక నాయకులనూ, ఆయా దేశాలకు చెందిన వామపక్ష పార్టీల నాయకులనూ లెనిన్ 'సోషల్ షావనిస్టులు' (Chanvimism) అని నిందించాడు గానీ ఇది కేవలం నాయకుల జబ్బు కాదు. కార్మికులే మెజారిటీగా చీలిపోయారు. ఉత్పత్తి సంబంధాలలో మనిషికుండే స్థానమే మనిషి ఆలోచనలనూ, వ్యక్తిత్వాన్నీ సంపూర్ణంగా నిర్ణయిస్తుందన్న అతివాద వైఖరి (మేనిఫెస్టోలో ఇది స్పష్టంగా ఉంది) నుండి కార్మిక వర్గం గురించి ఏర్పరచుకున్న అభిప్రాయాలకు వాస్తవికతలో ప్రాతిపదిక లేదని ఆ తరువాత కూడా అనేక ఘటనలు రుజువు చేసాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ కార్మికులను భాష, జాతి, జెండర్ వగైరాలేవీ లేని వట్టి కార్మికులుగా మార్చడం మాత్రమే కాదు, మొత్తంగా సమాజాన్నే తన నమూనాలో తిరిగి రాస్తుందని మేనిఫెస్టో భావిస్తుంది. తన అవసరాలకు తగినట్టు అన్నిటినీ, అంతటినీ రూపకల్పన చేస్తుందని భావిస్తుంది. ఇక్కడ నిర్ణయవాదం మాత్రమే కాక పెట్టుబడి వ్యాప్తికి ఉండే గాఢత గురించి కూడా ఒక అభిప్రాయం ఉంది. నిజంగానే పెట్టుబడికి మతం, కళలు, నీతి, కుటుంబం మొదలయిన ప్రతీ ఒక్క విషయాన్నీ తన నమూనాలో పూర్తిగా తిరగరాయవలసిన అవసరం ఉందా? అన్నిటిమీదా పెట్టుబడి తన ప్రభావం బలంగా వేసిన మాట వాస్తవమే. కానీ ఏదీ తన పూర్వకాలపు స్వభావాన్ని పూర్తిగా కోల్పోలేదు. అది పెట్టుబడికి ఎందుకు అవసరం?

మనిషికీ మనిషికీ మధ్య స్వార్థరహితమైన బాంధవ్యమేదో ఉందన్న మధ్య యుగాల భావజాలాన్నీ, కృత్రిమమైన సెంటిమెంట్లనూ, మత సంబంధమైన ఉద్విగ్నతనూ ధ్వంసంచేసి వట్టి డబ్బు సంబంధాన్నీ, లాభాలు లెక్కబెట్టే స్వార్థాన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థ వాటి స్థానంలో నిలబెట్టిందని మేనిఫెస్టో ప్రశంసాపూర్వకంగా అంటుంది. ప్రశంస ఎందుకంటే ఆ మధ్యయుగాల భావాలు పూర్తిగా కృత్రిమ మయినవి, దోపిడీకి అందమైన ముసుగు తొడిగే సాధనాలు కాబట్టి. ఆ ఆచ్ఛాదనను తొలగించి ఉన్నదున్నట్లు చెప్పడం ప్రశంసనీయమే మరి. కానీ పెట్టుబడిదారీ పూర్వ దశలో మనిషికీ మనిషికీ మధ్యనున్న సంబంధాలలోని విలువలన్నీ కృత్రిమమైనవేనా, కేవలం దోపిడీకి అందమైన ఆచ్ఛాదనలేనా, లేక దానితో పాటు వాటిలో మానవ అవసరాలకు తగిన హేతుబద్ధమైన అంశమేమైనా ఉందా అన్న ప్రశ్న అటుంచి గత కాలపు ఆలోచనలనూ సంస్కృతినీ పెట్టుబడిదారీ వ్యవస్థ పూర్తిగా నాశనం చేయలేదనేది ఈ 150 సంవత్సరాల అనుభవం. వాటన్నిటి మీదా పెట్టుబడి తన ముద్ర వేసింది. ఒకమేరకు అన్నిటినీ వ్యాపారానికి వస్తువులుగా మార్చింది. కానీ అవి పూర్తిగా చావలేదు. కొన్ని విలువలు పెట్టుబడిదారీ వ్యవస్థలోని అమానవీయమైన సంస్కృతిపట్ల నిరసనను సమీకరించే ఆలోచనలుగా కొనసాగుతున్నాయి. కొన్ని (ఉదాహరణకు మతం, ఆధ్యాత్మికత) ప్రజలలోనే గాక అధికార సంస్కృతిలోను వర్థిల్లు తున్నాయి.

దీనిని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? ఒక వివరణ నిర్ణయవాదాన్ని విడిచి పెట్టకుండానే - అంటే సమాజంలోని ప్రతీ అంశం మౌలికంగా పెట్టుబడి

అవసరాలకు తగిన రూపంలో ఉంటుందన్న అభిప్రాయాన్ని విడిచి పెట్టకుండానే - గతకాలపు విలువల కొనసాగింపును వ్యాఖ్యానిస్తుంది. ఆ విలువలూ సంప్రదాయాలూ తనకు కూడా భావజాలంగా పనికొస్తాయని గుర్తించిన తరువాత - ముఖ్యంగా సామ్రాజ్యవాద దశలో - పెట్టుబడిదారీ వ్యవస్థ అవి కల్పించే ఆచ్ఛాదనను తాను కూడా వాడుకుంటూ ఉందనీ, వాటిని పెంచి పోషిస్తూ ఉందనీ ఈ వ్యాఖ్యానం చెప్తుంది. తొలినాడు మధ్యయుగాల సంస్కృతిలోని అనేక సెంటిమెంట్ల మీద యుద్ధం ప్రకటించి, హేతుబద్ధమైన స్వప్రయోజనం తప్ప మనుషుల మధ్య వేరే ఏ సంబంధం లేదని వాదించిన బూర్జువా వర్గం తరువాత కాలంలో తన ఉనికికి కూడా ఆ భావాలు పనికొస్తాయని గుర్తించిందని ఈ వ్యాఖ్యానం అంటుంది. అయితే, అసలు ఉత్పత్తి వ్యవస్థకు అంత సంపూర్ణంగా ప్రతీ ఒక్క విషయాన్నీ నిర్ణయించాల్సిన అవసరం గానీ అంతటి ప్రభావం గానీ ఉంటుందా? ఎందుకుండాలి? చారిత్రక భౌతికవాదానికి తర్కబద్ధమైన ప్రాతిపదిక కల్పించడానికి ప్రయత్నించిన కొహెన్ వంటి ఎనలిటికల్ మార్క్సిస్టులు ఉత్పత్తి వ్యవస్థతో - అంటే ఉత్పత్తి మారకాల క్రియతోగానీ ఉత్పత్తి సంబంధాల పునరుత్పత్తితో గానీ - సంబంధమున్న విషయాలపైన మాత్రమే నిర్ణాయకత పనిచేస్తుందని రుజువు చేయడం సాధ్యమనీ, తక్కిన విషయాలపైన ఆర్థిక విషయాల నిర్ణాయకత తప్పక పనిచేస్తుందని రుజువు చేయడానికి తర్కబద్ధమైన వాదన లేదనీ అంటారు. ఆ మేరకైనా ఆర్థిక నిర్ణాయకత శక్తిగా పనిచేస్తుందా లేక ఆర్థిక విషయాలూ, వాటితో సంబంధం ఉన్న ఆర్థికేతర విషయాలూ (ఉదాహరణకు చట్టం) ఒక పరస్పర ప్రతిచర్యలో సమతుల్యాన్ని వెతుక్కుంటాయా అన్న ప్రశ్న పక్కన పెట్టినా, మతం, నీతి, తత్వశాస్త్రం మొదలయిన విషయాలన్నిటినీ పూర్తిగా తన చేతిలోకి తీసుకుని తన అవసరాల వెలుగులో తిరగరాయవలసిన అవసరంగానీ అంతటి ప్రభావంగానీ పెట్టుబడికి ఉండదని అర్థం చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. అప్పుడు ఎంత ప్రభావం ఉందో అంత గుర్తించగలుగుతాం. ఆ ప్రభావానికి ఆవలనున్న విషయాలను విడిగా విశ్లేషించాలని అర్థం చేసుకో గలుగుతాం. అందులోని మంచిని మిగుల్చుకొని చెడునూ, అన్యాయాన్నీ ఏ విధంగా అధిగమించాలో ఆలోచించగలుగుతాం.

పెట్టుబడిదారీ వ్యవస్థను విపరీతంగా ద్వేషించే మేనిఫెస్టో అదే సమయంలో అది చరిత్రలో ఒక గొప్ప విప్లవాన్ని తీసుకొచ్చిందని పొగుడుతుంది. తద్వారా సమసమాజానికి బాట వేసిందని ప్రశంసిస్తుంది. ఈ విప్లవాత్మక కృషిలోని ప్రధాన

అంశాలు మూడు. (ఈ అభిప్రాయం ఒక్క కమ్యూనిస్టు మేనిఫెస్టోలోనే కాదు, మార్క్స్ రచనలన్నిటిలోనూ కనిపిస్తుంది).

1) అది మానవ ఉత్పాదకశక్తిని విపరీతంగా పెంచింది. అపూర్వమైన ఉత్పత్తి శక్తులను మనిషికి అందించింది.

2) విడివిడిగా చిన్న చిన్న ప్రపంచాలలో బ్రతుకుతున్న మానవ సమూహాల మధ్య అది సంపర్కాన్ని ప్రవేశపెట్టి వారందరినీ ఒక పెద్ద ప్రపంచంలో భాగం చేసింది. నిజమైన అర్థంలో మానవజాతి కాగల భౌతిక పరిస్థితులిప్పుడు మనిషి ముందున్నాయి.

ఈ రెండు మార్పుల వల్ల మనుషుల భౌతిక సంపద, జ్ఞానం పెరగడమే కాక మనుషుల ఆలోచనల పరిధి కూడా చాలా పెరిగింది. విశ్వవ్యాప్తమయింది. దీనికి మార్క్స్ చాలా ప్రాముఖ్యం ఇస్తాడు. గ్రామీణ జీవితంలోని బావిలో కప్ప స్వభావమంటే ఆయనకు చాలా అసహ్యం. (రైతాంగం పట్ల ఆయనకున్న చులకన భావానికి ఇది కూడా ఒక కారణమే).

3) మధ్య యుగాల మానవ సంబంధాలలో ఉన్న నిస్వార్థత, దయ, కరుణ, మమేకత, ఆధ్యాత్మికత, మొదలయిన కృత్రిమమైన (అంటే దోపిడీకి ఆచ్ఛాదనమైన) సెంటిమెంట్లన్నిటినీ తొలగించి తమ నిజజీవితమేమిటో స్పష్టంగా చూసుకునే అవకాశం కార్మికులకు కల్పించింది.

ఈ మూడు అంశాలలోనూ పెట్టుబడిదారీ వ్యవస్థ తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పును ఎవరు వ్యతిరేకించినా ప్రతిఘటించినా వారిని నిర్దాక్షిణ్యంగా తిరోగామి వాదులు అని నిందించడానికి కమ్యూనిస్టు మేనిఫెస్టో వెనకాడదు. ఉదాహరణకు, మొదటి రెండు అంశాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ తీసుకొచ్చిన మార్పులవల్ల తమ ఉనికిని కోల్పోయి వీధిన పడతామని భయపడి దానిని నిరసించిన చేతివృత్తుల వారినీ రైతాంగాన్నీ మేనిఫెస్టో తిరోగామి (రియాక్షనరీ) వర్గాలు అంటుంది. వారి నిరసనను చరిత్రను వెనక్కి తీసుకుపోయే ప్రయత్నంగా అర్థం చేసుకుంటుంది. అప్పటి నుండి చైనా విప్లవం దాకా రైతాంగం పట్ల, గ్రామీణ జీవితం పట్ల చిన్నచూపు ఉండడం కమ్యూనిస్టు రాజకీయాల లక్షణం అయింది. రైతాంగం, చేతివృత్తుల వారు తమ (గతించి పోక తప్పని) పాత జీవితానికి సంబంధించిన చైతన్యాన్ని వదులుకొని తమ భవిష్యత్ రూపమైన కార్మిక వర్గ

చైతన్యాన్ని పొందినప్పుడే విప్లవంలో భాగం కాగలుగుతారని మేనిఫెస్టో అంటుంది. ప్రోధన్, బకూనిన్ వంటి అనార్కిస్టులకు మద్దతు ఎక్కువగా చేతి వృత్తులవారి నుండి, రైతాంగం నుండి రావడం మార్క్స్ అనార్కిస్టుల పట్ల ప్రదర్శించిన విపరీతమైన అసహనానికి కారణం కావచ్చు.

బోల్షివిక్‌లు (ముఖ్యంగా లెనిన్) ఈ విషయంలో కొంత భిన్నమైన దృక్పథాన్ని తీసుకొచ్చారు. రష్యాలో పెట్టుబడిదారీ సంబంధాలు పరిమితంగానే వ్యాప్తి చెందాయి. పెట్టుబడి పరిధిలోకి పూర్తిగా రాని విశాలమైన రైతాంగం ఉండింది. ఆ ప్రజానీకాన్ని తిరోగామి వర్గంగా కొట్టిపారేయకుండా కలుపుకొని పోవలసిన అవసరం ఉండింది. అయితే ఆధునిక పారిశ్రామిక రంగానికి చెందిన కార్మికులే శ్రామిక ప్రజల అగ్రగామి అన్న కమ్యూనిస్టు మేనిఫెస్టో సూత్రీకరణ దెబ్బతినకుండా కార్మికుల నాయకత్వంలో రైతాంగాన్ని కలుపుకోవాలని బొల్షివిక్‌లు సూత్రీకరించారు. అయినప్పటికీ రైతాంగాన్ని కమ్యూనిస్టు సంప్రదాయంలో ఆపాదించబడిన అభివృద్ధి నిరోధక గుణం పేరుతోనే బలవంతపు కలెక్టివైజేషన్‌లో భాగంగా స్టాలిన్ ప్రభుత్వం సోవియట్ రైతాంగంపైన విపరీతస్థాయిలో అమలు చేసిన హింసను సమర్థించు కోవడం జరిగింది. రైతాంగాన్ని గురించి మేనిఫెస్టో ప్రకటించిన అవగాహనను నిజంగా సవరించినవారు గ్రామ్‌సీ, మావో మావో ఆలోచనా విధానం అంటూ ఆయనకు నిర్విచక్షణగా గొప్ప తాత్వికుడన్న బిరుదు ఇవ్వడం జరుగుతూ ఉంది. కానీ ఆయన కమ్యూనిస్టు రాజకీయాలకు చేసిన నిజమైన మేలు రైతాంగాన్ని అభివృద్ధి నిరోధక వర్గంగా భావించడం మానేసి సమాజ పునర్నిర్మాణంలో వారికి సముచిత స్థానం కల్పించడం. దీని అర్థం చైనా కమ్యూనిస్టు పార్టీ రైతాంగంతో ఎల్లప్పుడూ చాలా ప్రజాస్వామికంగా వ్యవహరించిందని కాదు. కార్మిక నియంతృత్వం పేరిట ప్రజలపైన పార్టీ నియంతృత్వాన్ని రుద్దడంలోనే సమస్యలున్నాయి. అది వేరే విషయం.

పెట్టుబడిదారీ వ్యవస్థ తీసుకొచ్చిన మొదటి రెండు మార్పుల పరిపూర్తికి పెట్టుబడిదారీ వ్యవస్థే అడ్డంకి. ఉత్పిత్తిశక్తుల పెరుగుదలకు (ఒక దశ దాటిన తరువాత) పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలే ఆటంకం. దానివల్ల ఉత్పత్తిశక్తుల పెరుగుదల కుంచించుకుపోతుంది. రెండు, చరిత్రలో మొట్టమొదటిసారిగా ఉత్పత్తికి నిజంగానే సామాజిక రూపం ఇచ్చిన పెట్టుబడి, విడివిడిగా జరుగుతున్న ఉత్పత్తి క్రియను

విస్తృత శ్రమవిభజన ద్వారా ఒకటి చేసిన పెట్టుబడి - ఉత్పత్తి ఫలాన్ని మాత్రం సమాజపరం చేయకుండా వ్యక్తుల ఆస్తిగానే ఉంచేసింది.

ఈ వైరుధ్యాలను అధిగమించగల వర్గమే చరిత్రను ముందుకు తీసుకుపోయి నిజమైన మానవచరిత్రకు ప్రాతిపదిక అయిన సమష్టి ఉత్పత్తి వ్యవస్థను నెలకొల్పుతుంది. అది, పెట్టుబడిదారీ ఫ్యాక్టరీలోనే పుట్టిన కార్మిక వర్గం. కార్మిక వర్గం ఉత్పత్తి క్రియనే కాక ఉత్పత్తి ఫలాన్ని కూడా సామాజికం చేస్తుంది. ఆ ప్రాతిపదికన ఉత్పత్తి శక్తుల నిరంతర ఎదుగుదలను సాధిస్తుంది. దీని కోసం కార్మిక వర్గం చేసే పోరాటం ఒక రాజకీయ పోరాటం. అది కార్మికవర్గ పాలన నెలకొనడంతో ఒక కొలిక్కి వస్తుంది. (ఈ పాలన వర్గనియంతృత్వంగా ఉంటుందన్న భావన మేనిఫెస్టోలో లేదు. తరువాత కాలంలో - మార్క్స్ రచనలలోనే - వచ్చింది) ఆపైన జాతి విభేదాలు, ఒక జాతిపైన మరొక జాతి పెత్తనం, స్త్రీ పైన పురుషుడి పెత్తనం (ఇవి మేనిఫెస్టో ప్రత్యక్షంగా పేర్కొనే విషయాలు) మొదలైన అన్ని రకాల అసమానతలూ తొలగిపోవడానికి కావలసిన ప్రాతిపదిక ఏర్పడుతుంది.

మేనిఫెస్టో ఘంటాపథంగా చెప్పే విషయాలలో సందేహాస్పదమైనవి చాలా ఉన్నాయి. ఈ 150 సంవత్సరాల చరిత్ర ఏం చెప్తుందంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ తరచుగా సంక్షుభితంగా ఉన్నప్పటికీ అది ఉత్పత్తి శక్తులను నిరంతరం అభివృద్ధి చేస్తూనే ఉంది. ఎటొచ్చీ అభివృద్ధి అనేక విషయాలలో అమానవీయ రూపం తీసుకోవడమే కాక పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నది. అంటే ఉత్పత్తి శక్తుల అభివృద్ధి నిలిచిపోవటం సమస్య కాలేదు. అది వికృత రూపం తీసుకోవటం సమస్య అయింది. ఇప్పుడు కావలసినది మరింతగా ఉత్పత్తిశక్తులను అభివృద్ధి చేసే వ్యవస్థా లేక ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా నియంత్రించి అభివృద్ధి వేగాన్ని మందగింపచేసి, జరిగిన ఉత్పత్తి అందరికీ అందేటట్లు చూసే వ్యవస్థా అనేది ఈనాటి ప్రశ్న.

రెండవది, పెట్టుబడి సృష్టించిన ఉత్పత్తిశక్తులను సమష్టి ప్రాతిపదికన పునర్నిర్మాణం చేసి నిరంతరాయంగా ముందుకు తీసుకుపోగల వర్గం చేతిలోనే భవిష్యత్తు ఉందనే ఈ సిద్ధాంతం అన్ని పీడిత వర్గాలలోకీ పారిశ్రామిక కార్మిక వర్గానికి పెద్ద పీట వేసింది. రైతాంగం, చేతివృత్తుల వారు గతాన్ని అంటిపెట్టుకున్న తిరోగామి వాదులుగానూ, మతం వంటి భావజాల వ్యాప్తికి అనువయిన సరుకుగానూ కనిపించగా, ఆర్థికేతర పీడన అనుభవించే ప్రజల స్థానం ఏమిటో

అర్థం కాదు. ఆ పీడనలన్నిటినీ పెట్టుబడి ఒక బుల్‌డోజర్ లాగ కూలదోసి ఆస్తిలేని వారినందరినీ వట్టి కార్మికులుగా (జాతిలేని, ప్రాంతంలేని, జెండర్‌లేని, కులంలేని వట్టి శ్రమ విక్రేతలుగా) మారుస్తుందన్న భరోసాతో వాటి గురించి ఆలోచించడం అనవసరం అయిపోయింది.

కానీ నిజానికి పెట్టుబడి అంతటి బుల్‌డోజర్‌గా పనిచేయలేదు. చేయవలసిన అవసరం దానికి లేదు. మరి పారిశ్రామిక కార్మికులు నిర్మించబోయే సమష్టి ఉత్పత్తి వ్యవస్థ అన్ని ఆధిపత్యాలను అంతం చేస్తుందని నమ్మగలమా? నమ్మడానికి హేతుబద్ధమైన కారణాలేవీ లేవు. అది తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదన్న మార్క్స్ ఆలోచన సహేతుకమైనదే. అది ఏ రూపంలో, ఏ విధంగా సాధ్యం అవుతుందన్న ప్రశ్న 20వ శతాబ్దపు కమ్యూనిస్టు ప్రయోగాల వైఫల్యాల నుండి మనకు మిగిలింది. అయితే అది ఏ రూపంలో సాధ్యమైనా దానినుండి మిగిలిన మార్పులన్నీ రావు. రాకపోగా అవి దీనికి ప్రతిబంధకాలవుతాయి. దేనికోసం జరగవలసిన ప్రయత్నం దానికోసం జరగవలసిందే. ఈ ప్రయత్నంలో 'అగ్రగామి' ఏదీ లేదు. ఎవరూ లేరు. ఉందనుకోవడానికి సహేతుకమైన కారణమేదీ లేదు. అన్ని ప్రయత్నాల ప్రజాస్వామిక సమాహారంగా ప్రగతిశీల రాజకీయ కృషి సాగాలి. ఇందులో అగ్రగామి అన్న భావనకు గానీ ఒకరి నియంతృత్వానికి గానీ తావు ఉండదు. ఈ ప్రయత్నం గడచిన చరిత్రలో ముందుకొచ్చిన నాగరికతా విలువలనూ నియమాలనూ 'భావజాలం' అని కొట్టి పారేయకుండా, వాటిలోని ప్రజాస్వామిక అంశాలను స్వీకరిస్తుంది, పెంపొందిస్తుంది. సమాజ పునర్నిర్మాణంలో భాగం చేస్తుంది.

'నూటయాభై సంవత్సరాల కమ్యూనిస్టు ప్రణాళిక' పుస్తకంలో వచ్చిన వ్యాసం

సమీక్ష ప్రచురణలు, ఆగస్టు 1998

V

# కొత్త ఉద్యమాలు - పాత సిద్ధాంతాలు

ఈ మధ్య కాలంలో మన రాష్ట్రంలో కొన్ని కొత్త ఉద్యమాలు ముందు కొచ్చాయి. వాటిని 'అస్తిత్వ ఉద్యమాలు'అనీ, 'గుర్తింపు రాజకీయాలు' అనీ విశ్లేషకులు పిలుస్తున్నారు. ఈ పేర్లు ఆ ఉద్యమాలు తమకు తాము పెట్టుకున్నవి కావు. విశ్లేషకులు పెట్టినవి. Politics of Identity అనే ఇంగ్లీష్ ప్రయోగానికి అనువాదంగా ఈ పేర్లు వచ్చి నట్లున్నాయి. కానీ ఆ ఇంగ్లీష్ ప్రయోగమైనా, ఈ తెలుగు అనువాదమైనా ఆ ఉద్యమాలన్నిటి స్వభావాన్నీ సరిగ్గా వ్యక్తం చేస్తాయా అంటే సందేహమే.

ఒక ప్రత్యేకమైన సాంఘిక సాంస్కృతిక స్వభావంగల ప్రజలు తమ ప్రత్యేకతను కాపాడుకోవడం కోసం చేసే ఉద్యమాలకు ఆ పేరు పెట్టవచ్చును. ఉదాహరణకు బ్రిటన్‌లో ఐరిష్ ప్రజల పోరాటం. ఈశాన్య భారత ప్రాంతంలోని నాగా తదితర జాతుల పోరాటాలకు, కాశ్మీర్ పోరాటానికి కూడా ఈ పేరు చాలావరకు సరిపోతుంది. ఆ అర్థంలో మన దగ్గర కొత్తగా ముందుకొచ్చిన ఉద్యమాలేవీ అస్తిత్వ ఉద్యమాలు - ఐడెంటిటీ స్ట్రగుల్స్ - కావు. వాటికి ప్రాతిపదిక అయిన ప్రజలకు - స్త్రీలు, దళితులు, ఆదివాసులు, మాదిగలు - ఒక ప్రత్యేకమైన సాంఘిక సాంస్కృతిక ఉనికి ఉన్న మాట సత్యం. ఆ ఉనికి వారి ఆకాంక్షలకు మూలం. ఆ ఉనికి అందిచ్చిన గొంతులో ఆ ఆకాంక్షలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఆ ఉనికిని వ్యక్తం

చేయడమే వారి ఆకాంక్ష కాదు. అందులోని అణచివేతనూ అసమానతనూ అధిగమించడం వారి ఆకాంక్ష. ఎటొచ్చీ దానికి కావలసిన శక్తినీ దృష్టినీ ఆ ప్రజలు తమ ఉనికి నుండి పొందుతూ దానిని సిద్ధాంతీకరిస్తున్నారు. ఈ పరిమితమైన అర్థంలో వారి పోరాటాలను 'అస్తిత్వ పోరాటాలు' అని వర్ణించినా వాటిలోని అణచివేత వ్యతిరేక స్వభావాన్నీ, విముక్తి కాంక్షనూ ఆ పేరు స్ఫురింపచేయదు.

కొన్ని పోరాటాలలో తమ ప్రత్యేకమైన ఉనికిని - తమ అస్తిత్వాన్ని నిర్వచించే విశిష్టతను కాపాడుకునే ఆకాంక్ష కొంత ఉన్నమాట వాస్తవమే. ఉదాహరణగా తెలంగాణ ఉద్యమాన్ని తీసుకోవచ్చును. భాషా సంస్కృతులలో తెలంగాణకు ఉన్న విశిష్టత ఉమ్మడి 'తెలుగుతనం' అనే ఆధిపత్య భావనలో మునిగిపోయి తన ప్రత్యేకతను కోల్పోకుండా ఉండాలన్న ఆరాటం తెలంగాణ ఉద్యమంలో ఉంది. కానీ అదొక్కటే దానికి ప్రేరణ కాదు. సాగునీటి నుండి విద్య వరకు వివిధ రంగాలలో తెలంగాణకు జరిగిన అన్యాయం ఉంది. అది తెలంగాణ ఉద్యమానికి ఒక ముఖ్య ప్రేరణ. వీటిలో ఏది అన్నిటికంటె ముఖ్యమైన ప్రేరణ అనే చర్చ ప్రస్తుతానికి అనవసరం గానీ అది కేవలం 'అస్తిత్వ పోరాటం' కాదు, 'గుర్తింపు రాజకీయం' కాదు. ఏజెన్సీ ఆదివాసీల పోరాటంలో కూడా ఆదివాసీల జీవన శైలికి సంబంధించిన ఆరాటం ఉంది. ప్రకృతితో వైరి సంబంధం ఉన్న పెట్టుబడిదారీ జీవనశైలికీ, ప్రకృతితో స్నేహ సంబంధం ఉన్న ఆదివాసీ జీవన శైలికీ మధ్యనున్న వైరుధ్యం ఆ పోరాటంలో ఒక అంశమే. అయితే దానితోబాటు భూమి పరాయీకరణ, సంక్షేమ చట్టాల అమలులోని వైఫల్యం, విద్యావకాశాల లేమి మొదలయిన అంశాలూ ఉన్నాయి. అది పాక్షికంగా మాత్రమే 'అస్తిత్వ పోరాటం'.

తక్కిన కొత్త ఉద్యమాలలో 'అస్తిత్వ పోరాటం' లక్షణం ఈ మాత్రం కూడ లేదు. అన్నీ కూడ సాంఘిక ఆర్థిక రాజకీయ వివక్షకూ, అసమానతకూ, అణచివేతకూ వ్యతిరేకంగా ముందుకొచ్చిన పోరాటాలే. అన్నీ మన సామాజిక వ్యవస్థలోని ఏదో ఒక ప్రత్యేకమైన స్థానం గల ప్రజాసమూహం జీవిత అనుభవం నుండి, ఆకాంక్షల నుండి పుట్టిన పోరాటాలనేది వాస్తవమే. ఆ అనుభవం నుండి పుట్టిన ప్రత్యేక దృక్కోణం కలిగిన పోరాటాలనేది కూడ వాస్తవమే. కానీ వాటి లక్ష్యం ఆ అనుభవ ప్రత్యేకతను వ్యక్తం చేయడం, నిలబెట్టుకోవడం లేక కాపాడుకోవడం మాత్రమే కాదు (తెలంగాణ ఉద్యమంలోనూ, ఆదివాసీల ఏజెన్సీ పోరాటంలోనూ ఆ లక్ష్యం కొంతమేరకు ఉన్నప్పటికీ). ఆ జీవిత అనుభవంలోని అణచివేతనూ అసమానతనూ అధిగమించి

సమానత్వాన్నీ అణచివేత లేని జీవితాన్నీ (కనీసం ఆ మేరకు) సాధించాలనే ఆకాంక్ష వాటి లక్ష్యంలో ఒక ముఖ్య అంశం.

కేవలం తమ చారిత్రక సాంస్కృతిక ప్రత్యేకతనూ, విశిష్టతనూ నిలబెట్టుకోవాలనే ఆకాంక్ష, ఆ కళ్ళతో చూసినప్పుడు కనిపించే సత్యాన్ని వ్యక్తం చేయాలనే ఆరాటం ఉండదనీ, ఉండకూడదనీ నా ఉద్దేశ్యం కాదు. అటువంటి ఆకాంక్షనూ, ఆరాటాన్నీ సానుభూతితో చూడకూడదనీ సమర్థించకూడదనీ అసలే కాదు. కాశ్మీర్ పోరాటం ప్రధానంగా ఆ కోవకు చెందినదే. అది పూర్తిగా సమర్థనీయమైన పోరాటం. అయితే మన రాష్ట్రంలో 'అస్తిత్వ పోరాటాలు', 'గుర్తింపు రాజకీయాలు' అనే పేరుతో పిలువబడుతున్నవేవీ (పూర్తిగా) ఆ కోవకు చెందినవి కావు. సాంఘిక ఆర్థిక అణచివేత కంటే జీవిత అనుభవంలోనూ జీవన విధానంలోనూ ఉన్న విశిష్టతకూ, సత్యాసత్యాల కంటే దృక్కోణంలోని ప్రత్యేకతకూ అన్ని సందర్భాలలోనూ ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలనే వైఖరి పోస్ట్ - మోడరన్ తాత్విక ధోరణి నుండి వచ్చినది. వీటి ప్రాముఖ్యాన్ని బాగా తక్కువ చేసే సంప్రదాయక వామపక్ష ధోరణికి అది అందిచ్చే సవరణ అవసరమే. కానీ దానిని నిర్విమర్శగా స్వీకరించనవసరంలేదు. ఒక్కొక్క ఉద్యమానికి ఉన్న వాస్తవ స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. అన్ని పోరాటాలనూ ఆర్థిక సంబంధాలకు కుదించడం ఎంత తప్పో అన్నిటినీ అస్తిత్వ ప్రత్యేకతకూ అనుభవ విశిష్టతకూ కుదించి వేయడం అంతే తప్పు.

మరి ఆంధ్రప్రదేశ్‌లో ఈ మధ్య కొత్తగా ముందుకొచ్చిన ఉద్యమాలను ఏ విధంగా అర్థం చేసుకోవాలి? వాటికి ఏ పేరు పెట్టాలి? వాటికన్నిటికీ ఏదో ఒకే పేరు పెట్టగలుగుతామని నేను అనుకోను. నెగటివ్‌గా వాటిని 'వర్గేతర' రాజకీయాలు అనవచ్చును. అవి మనకు 'కొత్తవి' గా కనిపించడానికి కారణం ఇక్కడే ఉందేమో. వర్గ రాజకీయాలే శాస్త్రీయమైన రాజకీయాలనీ తక్కినవన్నీ తప్పుడు అవగాహన నుండి (వాటి వెనుక ఉన్న ఆరాటం ఎంత న్యాయమైనదైనా) పుట్టినవనీ దాదాపు మూడు తరాలుగా తెలుగునాట అభ్యుదయవాదులు (మెజార్టీగా) నమ్ముతున్నారు. అది నిజం కానవసరం లేదని మనకు నేర్పడమే (కనీసం సందేహం కల్గించడం) ఈ ఉద్యమాలలోని నవ్యత. అందుకే అవి మనకు 'కొత్తవి'గా కనిపిస్తున్నాయి. లేకపోతే వాటిలో కొత్తదనమేమీ లేదు. ఆదివాసీలు రామాయణ కాలం నుండి మైదాన ప్రాంతాల వారి చొరబాటుకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నారు. ఆ పోరాటం జీలుగుమిల్లిలో మొదలుకాలేదు. శూద్రులు బ్రాహ్మణాధిక్యతకు వ్యతిరేకంగా వర్ణ

వ్యవస్థ పుట్టినప్పటినుండి పోరాటాలు చేస్తున్నారనడానికి చారిత్రక ఆధారాలున్నాయి. స్త్రీలు ప్రతీ యింట్లోనూ మగపెత్తనానికి వ్యతిరేకంగా నాగరికత పుట్టినప్పటినుండి ఘర్షణ పడుతూనే ఉన్నారు. ఈ పోరాటాలన్నీ మనకు ఈరోజు 'కొత్తవి' గా కనిపించడానికి కారణం మనకు అవి నేర్పుతున్న కొత్త సిద్ధాంత దృక్పథం.

దీనిని కొంచెం వివరంగా చూద్దాం.

1985 తరువాత మన రాష్ట్రంలో కొత్త సమస్యలపైన ముందుకొచ్చిన ఉద్యమాలలో అత్యధిక భాగం ఏ రాజకీయపార్టీ నాయకత్వాన (సిపిఐ - ఎంఎల్ పార్టీలతో సహా) రాలేదు. (పాత ఉద్యమాలు కొత్త ప్రాంతాలకు విస్తరించి ఉండవచ్చును గాక). దీనికి రెండు మినహాయింపులు రాయలసీమ జిల్లాల్లో సాయుధ ముఠాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా వచ్చిన ఆందోళన, జైలు ఖైదీల హక్కుల పోరాటం. ఇవి రెండూ మార్క్సిస్ట్-లెనినిస్టుల ప్రేరణతో వచ్చాయి. కాని ఇవి మినహాయింపులు మాత్రమే. 1985లో దళిత మహాసభ ఆవిర్భావంతో మొదలుపెట్టి, సిద్ధాంత తాత్విక రంగాలలో దళిత మేధావులు, ఫెమినిస్టులు చేపట్టిన చర్చ, ప్రచారోద్యమాలు, సారా వ్యతిరేక మహిళా పోరాటం, ఏజెన్సీలో ఆదివాసీల 1 ఆఫ్ 70 పోరాటం, మాదిగ హక్కుల పోరాటం, కోయల తుడుందెబ్బ, తెలంగాణ ఉద్యమం మొదలైనవన్నీ రాజకీయ పార్టీ వ్యవస్థకు వెలుపల వచ్చిన ఉద్యమాలే.

ఇవన్నీ వర్గేతర రాజకీయ సమీకరణలేనన్న 'కొత్తదనం' (అంటే ఇప్పటివరకు ఉన్న రాజకీయ కామన్‌సెన్స్‌కు కొత్తగా తోచే లక్షణం) మాత్రమే కాక, ఈ ఉద్యమాలను ఏ రాజకీయ పార్టీ మొదలుపెట్టలేదనే కొత్తదనం కూడ వీటిలో ఉంది. సమాజాన్ని శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించి, సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత ప్రజలను సమీకరించే శాస్త్రీయ దృక్పథంగల రాజకీయ పార్టీ నాయకత్వాన మాత్రమే ప్రగతి నిర్దుష్టంగా సాధ్యం అవుతుందనేది వామపక్ష రాజకీయాలలో ప్రబలంగా ఉన్న ఆలోచన. ఎక్కడన్నా ఒకటీ అరా ఉద్యమాలు తమంతటతాము ఆవిర్భవించినా, శాస్త్రీయ దృక్పథంగల రాజకీయ పార్టీ వెనువెంటనే స్పందించి దానిని తన చేతిలోకి తీసుకొని దానికి సమగ్రమైన ప్రాపంచిక దృక్పథం నేర్పించి నడిపించాలనీ, నడిపిస్తుందనీ, అది జరిగినప్పుడే ఆ ఉద్యమం నిజమైన అర్థంలో ప్రగతిపథంలోకి వస్తుందనీ వామపక్ష దృక్పథం నమ్ముతూ వచ్చింది. ఉద్యమ పురోగమన క్రమం ఈ విధంగానే ఉంటుందనీ, అంతకంటే భిన్నంగా ఎక్కడయినా జరిగితే ఆ ఉద్యమ క్రమం లోపభూయిష్టమయినదనీ వామపక్షవాదులు నమ్ముతూ వచ్చారు.

ఈ కొత్త ఉద్యమాలు ఒక కొత్త పురోగమన క్రమాన్ని మన ముందుంచాయి. అణచివేత, అసమానత రకరకాల రూపాలలో ఉంటాయి. వాటినన్నిటినీ సైద్ధాంతికంగా ఆకళింపు చేసుకొని అన్నిటికీ వ్యతిరేకంగా ఉద్యమాలను ఒకేతాటిన నిర్మించ గల రాజకీయ పార్టీ ఒకటి ఉండడం కష్టమే. పార్టీలు నమ్మే రాజకీయ సిద్ధాంతాలు తమ దృక్పథాన్ని సార్వజనీన సూత్రాల రూపంలో ప్రకటించవచ్చును గానీ, వాటి వెనకనున్న జీవిత అనుభవం సార్వజనీనం కాదు. అది అప్పటికి చరిత్రలో ముందుకొచ్చిన - అంటే రాజకీయంగా తనను తాను వ్యక్తం చేసుకున్న అనుభవం మాత్రమే. 'కొత్త అనుభవాన్ని ప్రజలనుండి నేర్చుకుంటాం' అని ఆ పార్టీ అనవచ్చును. నిజాయితీగానే నమ్మవచ్చును. కానీ ఆ కొత్త అనుభవం నిజానికి పాత అనుభవానికి కొన్ని కొత్త వివరాలను చేర్చే కొనసాగింపు మాత్రమే అయినప్పుడు తప్ప ఈ 'నేర్చుకోవడం', 'నేర్చుకొని దానికి శాస్త్రీయ రూపం ఇచ్చి ప్రజలకు అందియ్యడం' సులభంగా జరగదు. విభిన్న జీవిత అనుభవాలలోనూ అసమానతలలోనూ నిజంగానే భిన్నత్వం, వైవిధ్యం ఉంటుందని గుర్తించినట్టయితే, 'ప్రజలనుండి నేర్చుకోవడం' అనేది అనివార్యంగా సంఘర్షణాత్మకంగా ఉంటుందని అర్థం అవుతుంది. కొత్త జ్ఞానం పాత జ్ఞానాన్ని సవాలు చేస్తుంది. పాత జ్ఞానం కొత్త జ్ఞానాన్ని సులభంగా ఆకళింపు చేసుకొని ఆ కొత్త ప్రజలతో సులభంగా మమేకమై వారి ఆకాంక్షలకు తన దగ్గరున్న 'శాస్త్రీయ ప్రాపంచిక దృక్పథాన్ని' అందివ్వడం జరగదు. అంటే పైన వివరించిన ఉద్యమ పురోగమనక్రమం సందేహాస్పదమైనది.

మరి ఈ ఉద్యమాలు నేర్పే ప్రత్యామ్నాయం ఏమిటి? ఆయా జీవిత రంగాలలో అణచివేతకూ అసమానతకూ గురయ్యే ప్రజల జీవిత అనుభవం నుండి ఉద్యమాలు పుట్టడం, ఆ ప్రజలను సమీకరించే లక్ష్యంతో ఉద్యమ సంస్థలు పుట్టి పోరాటాలు నిర్వహించడం అత్యంత ప్రాథమికమైన క్రమం. పోరాటాలను ప్రజలతో సమానం చేసి చూడడంలో ఉన్న ఇబ్బందిని పక్కనపెట్టి మామూలుగా అలవాటయిన (అతిశయోక్తితో కూడుకున్న) భాషలో చెప్పాలంటే, ఇవి ఆ ప్రజలు తమకోసం తాము చేసుకునే పోరాటాలు. (అయితే తమ ఉనికిలోని ప్రత్యేకతను నిలబెట్టుకునే పోరాటం - అంటే అస్తిత్వ పోరాటం - కావచ్చును, కాకపోవచ్చును, పాక్షికంగా కావచ్చును). ఇటువంటి భిన్నమైన పోరాటాలు ప్రగతి గురించి, అభ్యుదయాన్ని గురించి కొత్త ఆలోచనలను తీసుకొస్తాయి. పాత సమాజం మీద కొత్త కోణం నుండి విమర్శ పెడతాయి. అంతేకాదు, అప్పటివరకు గుర్తింపు పొంది ఉన్న అభ్యుదయ భావనపైన కూడ విమర్శ పెడతాయి. దానికి సరళంగా 'నేర్పించవు'. అది సరళంగా 'నేర్చుకోదు'.

సంఘర్షణ జరుగుతుంది. సంఘర్షణాత్మకంగానే ఇరుపక్షాలూ నేర్చుకుంటాయి. బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే మరీ ఎక్కువ విధ్వంసం లేకుండా నేర్చుకోవడం జరుగుతుంది. లేకపోయినా నేర్చుకోవడం మాత్రం జరుగుతుంది. ఈ విధంగా ఉద్యమాలలోనూ ఉద్యమ సిద్ధాంతాలలోనూ వచ్చే మార్పుల సమాహారమే ప్రగతి, ప్రగతిశీలక ప్రాపంచిక దృక్పథం. ఇది ఉద్యమాల పురోగమన క్రమమే తప్ప 'ఉద్యమ పురోగమన క్రమం' కాదు. ఉద్యమం అని ఏకవచనంలో అనడం కమ్యూనిస్టు సంప్రదాయంలో ఎంత సహజమో, ఉద్యమాలు అని బహువచనంలో అనడం ఈ కొత్త ఉద్యమాలు నేర్పిస్తున్న దృక్పథంలో అంతే సహజం.

గత దశాబ్దకాలంగా ఆంధ్రప్రదేశ్‌లో ముందుకొచ్చిన కొత్త ఉద్యమాలనూ వాటితో కమ్యూనిస్టు పార్టీలకూ, మేధావులకూ ఉన్న సంబంధాన్నీ పరీక్షిస్తే, ఈ రెండవ పురోగమన క్రమమే సహజం అనే వాదనకు బలం చేకూరుతుంది. (లేదంటే, ప్రస్తుతం నడుస్తున్న చారిత్రక దశే గాడి తప్పిన దశ అనీ-ఉద్యమ చరిత్ర కంటున్న పీడకల అనీ-అది గడిచి చరిత్ర తిరిగి గాడిమీదకి వచ్చేదాకా వేచి వుండాలి తప్ప గాడి తప్పిన చరిత్రను సిద్ధాంతీకరించ కూడదనీ అనుకోవలసి ఉంటుంది). ఎందుకంటే ఈ ఉద్యమాలు ముందుకు తీసుకొచ్చిన సమస్యలు, ఆరాటాలు, ఆకాంక్షలు సమాజంలో ఉన్నాయన్న ఎరుకే కమ్యూనిస్టు పార్టీలకూ మేధావులకూ - అత్యంత క్రియాశీలక స్వభావంగల వారిగా తమ గురించి తాము భావించే మార్క్సిస్టు-లెనినిస్టులతో సహా - ఉండలేదు. ఉదాహరణకు కోస్తా ఆంధ్ర జిల్లాలో ఇప్పట్లో 'ఉద్యమం' రావడం సాధ్యం కాదని ఎం.ఎల్ పార్టీలూ ఆ పార్టీలకు సన్నిహితులయిన మేధావులు (నాతో సహా) కారంచేడు జరిగేదాకా నమ్ముతూ వచ్చారు. తెగించి వ్యాసాలు రాసారు కూడ. ఒక్కొక్క విషయంలోనూ ఆ సమస్యను అనుభవించి దానిని ప్రతిఘటించే చైతన్యం, దానిని అంతమొందించాలన్న ఆరాటం పెంచుకున్న ప్రజలే కళ్ళు తెరిపించవలసి వచ్చింది.

ఆ తరువాత కూడ - సిద్ధాంత ప్రకారం జరుగవలసి ఉన్నట్టు - ఆ ఉద్యమాలను కమ్యూనిస్టులు తమ చేతిలోకి తీసుకొని వాటి 'తప్పుడు చైతన్యాన్ని' సవరించి వాటిని 'సరయిన దారిలో, నడిపించడం జరగలేదు. ఎక్కువ భాగం పరస్పర అనుమానంతోనే గడిచింది. కొంతకాలం తరువాత సంఘీభావం తెలపడం, ఐక్యఉద్యమాలలో భాగం పంచుకోవడం జరుగుతూ వచ్చింది. అయినప్పటికీ సందేహాలూ, విమర్శలూ, విభేదాలూ, కొనసాగుతూనే ఉన్నాయి. విభేదమే ప్రధానంగా ఉండి ఎత్తుగడల మేరకు మాత్రమే ఐక్యత ఉందంటే అతిశయోక్తి కాదు.

వామపక్ష పార్టీలు ఈ కొత్త ఆరాటాలనూ, ఆకాంక్షలనూ చూడలేక పోవడానికి గల ఒక కారణం ఇప్పటికే బాగా చర్చకు వచ్చింది. అదేమిటంటే ఆ పార్టీల నాయకులూ మేధావులూ ఒక పరిమితమైన (అందులోనూ ఆధిపత్య స్వభావం గల) జీవిత అనుభవం నుండి వచ్చిన వారన్న వాస్తవం. తాగివచ్చిన మొగుడి చేతిలో తన్నులు తిన్న అనుభవం ఉన్న స్త్రీ లెవరూ నాయకత్వ స్థానంలో లేని పార్టీలు సారా వ్యతిరేక మహిళా పోరాటాన్ని ఊహించగలవా? వాళ్ళు నిర్మించిన పోరాటం అందుకనే మగ మిలిటెంట్ల మెరుపుదాడుల పోరాటంగానో లేక పార్టీల నిర్మాణంలోని అత్యంత బలహీన విభాగమైన మహిళా సంఘాల ఆందోళనగానో ఉండిపోయింది. అంటరానితనాన్ని తమ జీవితంలో అనుభవించిన వారెవ్వరూ నాయకత్వ స్థానంలో లేని పార్టీలు - ఆ అనుభవం స్వయంగా ఎరుగని మేధావులు- దళితులలో ఆత్మగౌరవ ఆకాంక్ష, సాంఘిక సమానత్వ ఆకాంక్ష ఎంత బలంగా ఉన్నాయో అర్థం చేసుకోగలరా? అందుకే వెట్టిచాకిరీ వంటి మధ్యయుగాల దోపిడీ రూపాలు అంతమైన సర్కార్ జిల్లాల్లో ప్రజాతంత్ర పోరాటాలకు పెద్దగా ఆస్కారం లేదని అనుకున్నాము. ఇవి న్యాయమైన ప్రశ్నలే. సిద్ధాంతం కేవలం తర్కానికి సంబంధించిన విషయం కాదు. సిద్ధాంత అన్వయం కేవలం తార్కిక శక్తికీ, విషయ పరిజ్ఞానాన్ని బయటినుండి స్వీకరించడంలో ఉండే సామర్థ్యానికీ సంబంధించిన విషయం కాదు.

ఆ రెండింటితో బాటు (అవి అనవసరం అని కాదు) జీవిత అనుభవం కూడ ముఖ్యమైన విషయమే. ఏ జీవితానికయితే సిద్ధాంతాన్ని అన్వయిస్తున్నామో ఆ జీవితాన్ని అనుభవించిన వాళ్ళయితేనే ఆ పని సమర్థవంతంగా చేయగలరు. ఇతరులు వాళ్ళు చూపించిన తరువాతే గ్రహించగలుగుతారు. (ఇతరులు గ్రహించనే లేరని గానీ జీవిత అనుభవం నుండి పుట్టిన సిద్ధాంతం తార్కిక విమర్శకూ విషయ నిబద్ధమైన పరిశీలనకూ అతీతం అని గానీ భావించనవసరం లేదు). అందుకే ఉద్యమ నాయకత్వంలోనూ మేధోరంగంలోనూ విభిన్న (ముఖ్యంగా పీడిత) జీవిత అనుభవాల నుండి వచ్చిన వ్యక్తులు ఉండడం అవసరం. అందుకే ఉద్యమ నాయకత్వంలోనూ మేధోరంగం లోనూ కూడా ఎవరు ఉన్నారు అన్న ప్రశ్న వేసుకోవడం-ఏం చేస్తున్నారన్న ప్రశ్నేకాదు - ముఖ్యమైనది, న్యాయమైనది.

వామపక్ష దృక్పథం సిద్ధాంతాన్ని కేవలం తర్కానికి సంబంధించిన విషయంగా భావించిందని కాదు. తర్కంతోబాటు ఆచరణ కూడ ముఖ్యమైనదనే

వామపక్షవాదులు భావించారు. కానీ ఇక్కడ ఆచరణ అనేది కేవలం రాజకీయ ఆచరణ. దానికి ఎంతవారికి పెద్ద పీటవేసినా (తర్కబలంకన్నా, పుస్తక పరిజ్ఞానం కన్నా రాజకీయ ఆచరణే సిద్ధాంత ఆవిష్కరణకు ముఖ్యమన్న అభిప్రాయం కమ్యూనిస్టు సంప్రదాయంలో బలంగా ఉంది. తరచుగా అది పుస్తక పరిజ్ఞానాన్నీ తర్కబద్ధమైన ఆలోచనా రీతినీ తృణీకరించే అతివాద రూపం కూడ తీసుకుంటుంది) అది ఈ ప్రశ్నకు సమాధానం కాదు. ఎందుకంటే రాజకీయ ఆచరణ సిద్ధాంతాన్ని అనుసరించే ఉంటుంది. సిద్ధాంతం చూపించే వెలుగులోనే సాగుతుంది. ఆ వెలుగులో అది సిద్ధాంతాన్ని పరిపుష్టం చేయగలదు గానీ కొత్తదనానికి బాట వేయలేదు. పూర్తిగా సంప్రదాయ విరుద్ధమైన ఆచరణ అయితే తప్ప. సిద్ధాంతంలో కొత్తదనం జీవిత అనుభవం నుండి మాత్రమే రాగలదు. అందువల్ల సిద్ధాంతానికి కొత్తదనం అందివ్వగల జీవిత అనుభవం ఉన్నవారు సిద్ధాంతవేత్తల రంగంలో ఉండాలి. సిద్ధాంతం - ఆచరణ అనే రెండే కాకుండా సిద్ధాంతం - ఆచరణ - జీవిత అనుభవం అనే మూడూ అవసరం. అప్పుడు ఆచరణలో కూడ సిద్ధాంతంలో (అప్పటిదాకా) లేని నవ్యత ఉండగలదు. సిద్ధాంతాన్ని కేవలం రాశిలోనే కాక గుణాత్మకం గానూ పరిపుష్టం చేయగలదు.

కానీ, నాయకత్వ స్థానంలో ఎవరున్నారు అన్న ప్రశ్న దగ్గరే చర్చను ఆపేస్తే ఈ కొత్త ఉద్యమాల నుండి మనం నేర్చుకోగలిగినదంతా నేర్చుకున్నట్టు కాదు. ఇప్పటికి అలవాటయిన వామపక్ష సిద్ధాంత దృక్పథంలోనే కొన్ని సమస్యలున్నాయన్న విషయాన్ని గుర్తించనివాళ్ళం అవుతాం.

ఈ కొత్త ఉద్యమాలలో ఒక్కొక్కటీ సంప్రదాయక అభ్యుదయ రాజకీయ దృక్పథం కళ్ళకు ఎందుకు కనిపించకుండ పోయిందో కొంచెం పరిశీలిద్దాం. నాయకత్వంలో ఉన్నవారి పరిమితులు ఒక కారణం. అయితే సిద్ధాంత దృక్పథంలోనే ఏమైనా లోపాలున్నాయేమో చూద్దాం. సారా వ్యతిరేక మహిళా పోరాటాన్ని మొదట తీసుకుందాం. ఎం.ఎల్.పార్టీలు అంతకు ముందే సారా వ్యతిరేక ఉద్యమాలు నడిపాయి. ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీ వికృత రూపం తీసుకోవడం, సారాయి తాగే అలవాటును ప్రభుత్వమే తన రెవిన్యూ అవసరాల కోసం వ్యాపింపచేయడం, సారా కాంట్రాక్టర్ల లాభాలు పెరిగి అదొక పెద్ద రౌడీ వ్యాపారంగా మారడం, వారు రాజకీయాలలో ప్రముఖ స్థానానికి ఎగబాకడం, పేద కార్మికులు మరింతగా సారాయికి బానిసలు కావడం - ఈ క్రమాన్ని మొదట గుర్తించిందీ, దానికి వ్యతిరేకంగా ఉద్యమించినదీ ఎం-ఎల్ పార్టీలు. మొదట సారాయి ధర

తగ్గింపుకోసం ఆందోళన చేసి ప్రజల చేత తిట్లు తిన్నారు. ఆ తరువాత సారా నిషేధం కోసం ఆందోళన చేసారు. అయితే ఈ కృషి మొత్తం, పెట్టుబడిదారీ శ్రమ దోపిడీనీ కార్మిక పోరాటాలనూ కేంద్రం చేసుకున్న కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రాతిపదికన చేసారు. ఆ సిద్ధాంత దృష్టికి, పెరుగుతున్న సారాయి వ్యాపారం కార్మికుల కష్టార్జితాన్ని కాంట్రాక్టర్లూ, ప్రభుత్వమూ కలిసి దోచుకునే దోపిడీ ప్రక్రియగా కనిపించింది. అసలు బాధితులు ఆ కార్మికుల భార్యాబిడ్డలన్న విషయం గమనంలోకి రాలేదు. గమనంలోకి వచ్చినా అది సానుభూతి స్థాయిలోనే తప్ప రాజకీయ స్థాయిలో కాదు. రాజకీయంగా, తన జీతమంతా తాగి వృధా చేసుకుంటున్న కార్మికుడే ఈ సారాయి ప్రహసనంలో ప్రధాన బాధితుడిగా కనిపించాడు. అందువల్లే సారాయి ధర తగ్గించడం కోసం ఆందోళన చేయడం వారికి సాధ్యం అయింది. 'మా భర్తల చేత ఇంకింత తాగించడమా మీ ఉద్దేశ్యం' అని కార్మికుల భార్యలు నిలదీసేదాకా తాము చేస్తున్న తప్పేమిటో ఆ పార్టీలకు అర్థం కాలేదు. కానీ ఆ తరువాత కూడా వాళ్ళు అసలు బాధితులను ఆర్గనైజ్ చేసుకొని ప్రభుత్వంతోపాటు, సారా కాంట్రాక్టర్‌తోపాటు, సంపాదించినదంతా తాగి తమ జీవితాలను నాశనం చేస్తున్న శ్రామిక పురుషులు కూడ ఈ పోరాటంలో వైరి పక్షమేనని ప్రకటించేదాకా అర్థం కాలేదు.

ఆ పార్టీల నాయకులంతా మగవాళ్ళేనన్న విషయం అటుంచి, ఫ్యాక్టరీలో మిషన్లు తిప్పే మగ (అత్యధికంగా) కార్మికులను 'కార్మిక వర్గం' అనే భావనకు కేంద్రం చేసుకుని, ఆ కార్మికులు లోనయ్యే శ్రమదోపిడీని సమాజంలోని ప్రధాన అణచివేత రూపంగా భావించి, ఆ కార్మికుల రాజకీయ చొరవను ఆర్గనైజ్ చేయడం తన ప్రధాన కర్తవ్యంగా పెట్టుకున్న సిద్ధాంతానికి ఈ దృష్టి సహజంగా రాగలిగేదా?

ఏజెన్సీ గిరిజనుల 1 ఆఫ్ 70 పోరాటం మరొక ఉదాహరణ. అది పశ్చిమ గోదావరి జిల్లాలో ముందుకొచ్చిన తరువాత ఒక్క సిపిఐని మినహాయించి తక్కిన అన్ని వామపక్ష శక్తులు ఏదో ఒక మేరకు దానికి మద్దతుగా స్పందించాయి. కానీ చాలా కాలంగా ఆదివాసులలో పునాది ఉన్న ఏ కమ్యూనిస్టు పార్టీ కూడ '1 ఆఫ్ 70' పోరాటాన్ని అదే స్థాయిలో ఎందుకు చేపట్టలేకపోయిందనేది ప్రశ్న. కమ్యూనిస్టు నాయకులలో ఆదివాసీలు లేకపోవడం దీనికొక కారణం అనేది నిజమే కావచ్చు. కానీ సిద్ధాంతం కూడా ప్రతిబంధకంగా పనిచేసిందా? తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఆదివాసీలు - ఇతరులు అని వర్గీకరించుకొని అడవిభూమి ఆదివాసీలకే చెందాలని

విశ్వసించే దృక్పథానికీ, శ్రామిక రైతాంగాన్ని జాతి, కులం, మతాలకు అతీతంగా ఐక్యపరచి రాజ్యంతో అధికారం కోసం తలపడాలని భావించే దృక్పథానికీ తేడా ఉంటుంది. రెండవ దృక్పథం '1 ఆఫ్ 70' సమస్యను ఒక న్యాయమైన సమస్యగా గుర్తించగలుగుతుంది - కానీ ఒక పరిమితిలోనే. ఆ సమస్య గురించి మరీ ఎక్కువ ఆందోళన చేస్తే అది రైతాంగంలో గిరిజన - గిరిజనేతర విభేదాలను పెంచి అనైక్యతకు దారి తీయగలదు. అందుకు భిన్నంగా రాజ్యం యాజమాన్యంలో ఉన్న అటవీ భూములపైన కమ్యూనిస్టు పార్టీలు - ముఖ్యంగా ఎం-ఎల్ పార్టీలు పెద్ద పోరాటాలు నిర్వహించాయి. వాటి పుణ్యాన ఆదివాసీలు మన రాష్ట్రంలో కనీసం 4 లక్షల ఎకరాల అడవి భూమి అనుభవిస్తున్నారు. కానీ, '1 ఆఫ్ 70' పోరాటం మాత్రం ఆదివాసీలే చేపట్టిన ఉద్యమాలలో ముందుకొచ్చినంత బలంగా ఏ కమ్యూనిస్టు గిరిజన ఉద్యమంలోనూ రాలేదు. రిజర్వ్ ఫారెస్ట్ భూముల కోసం పోరాటం చేసినంత పట్టుదలగా గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్న ఆదివాసీ భూములపైన కూడ పోరాటం చేయడం సాధ్యమవుతుందనీ, దానికి తగిన పోరాట రూపాలు ఆవిష్కరించడం సాధ్యమేననీ ఆదివాసీలే నేర్పవలసి వచ్చింది. సామాజిక మార్పును ఏ విధంగా అర్థం చేసుకుంటామన్నది ఇక్కడ కీలకమైన విషయం. విభిన్న సామాజిక జీవిత రంగాలలో ఎక్కడికక్కడ (అంటే సంబంధం లేకుండా అని కాదు) అభ్యుదయకరమైన మార్పు వస్తుందనీ, ఆ మార్పులను సమన్వయపరచి ముందుకు తీసుకుపోవాలనీ భావించడం ఒక దృక్పథం. అందుకు భిన్నంగా, ఒక ప్రధానమైన పరిణామక్రమాన్ని (ఉదాహరణకు కార్మిక వర్గపోరాటాన్ని) మార్పుకు భూమికగా భావించి, దానిని ప్రాతిపదిక చేసుకుని ఇతర రంగాలలో జరిగే మార్పును అర్థం చేసుకోవాలనుకోవడం, సాధించాలనుకోవడం సంప్రదాయక వామపక్ష దృక్పథం. ఈ రెండవ దృక్పథం తాను భూమికగా భావించే పరిణామక్రమాన్ని సాధించడానికి అవసరమైన వ్యూహాలనూ, విశ్లేషణనూ అభివృద్ధి చేయడంలో నిమగ్నం అయి ఉంటుంది. దాని దృష్టి అక్కడే 'ఫోకస్' అయి ఉంటుంది. ఆ పరిణామక్రమానికి ఆటంకం కలిగించే ఆకాంక్షలు - అవి ఎంత న్యాయమైన ఆకాంక్షలయినా - దాని కళ్ళకు సులభంగా కనిపించవు, కనిపించినా దాని ఆమోదం పొందవు. ఇది సిద్ధాంత సంబంధమైన ప్రతిబంధకం. శ్రమ దోపిడీకి గురయ్యే శ్రామికులంతా ఒకటై ఒక బలమైన ఐక్యశక్తిగా పెట్టుబడిదారీ భూస్వామ్య వర్గాలతోనూ, వారి వర్గ రాజ్యంతోనూ తలపడి తమ రాజ్యాన్ని నెలకొల్పాలన్న వ్యూహానికీ ప్రోగ్రాంకూ ప్రాధాన్యతనిచ్చే వామపక్ష దృక్పథం కళ్ళకు దళిత ఉద్యమం

శ్రామిక ఐక్యతను చీల్చే విచ్ఛిన్నకరవాదంగా కనిపిస్తుంది. స్త్రీలు స్త్రీలుగా అనుభవించే అణచివేత గురించి మాట్లాడడం శ్రామిక వర్గంలో నిలువుగా చీలిక తీసుకొచ్చే వాదనగా కనిపిస్తుంది. అందువల్ల ఆ సిద్ధాంతానికి ఈ సమస్యలు, వాటి పర్యవసానమైన ఆకాంక్షలు - ఆ ప్రజలే వేలెత్తి చూపించేవరకు-కనిపించవు. కనిపించినా వెంటనే ఆదరణ పొందవు. కాలక్రమంలో తొలినాటి ద్వేషభావం తగ్గినప్పటికీ - ఒక మేరకు సంఘీభావం, సమైక్య ఆచరణ పెరిగినప్పటికీ - ఏదో ఒక పరిణామక్రమమే సామాజిక మార్పుకు భూమిక అన్న అభిప్రాయం ఉన్నంతకాలం దానికి అడ్డం వచ్చినట్టు కనిపించే ఇతర పరిణామక్రమాల పట్ల వైరిభావం పోదు. వాటినన్నిటినీ తన నాయకత్వంలో ముందుకు నడిపించడం అటుంచి, వాటితో పూర్తిస్థాయి సంఘీభావం కూడ సాధ్యం కాదు.

దళిత ఉద్యమం ఆవిర్భావంతో కమ్యూనిస్టులు ఎదుర్కొన్న ఈ సమస్యను, ఆ తర్వాత వచ్చినప్పుడు మాదిగ హక్కుల పోరాటం ముందుకు రావడంతో దళిత ఉద్యమం కూడ ఎదుర్కొనింది. ఇక్కడ కూడ దళిత ఉద్యమ నాయకులలో అత్యధికులు ఒక కులానికే (మాల కులానికి) చెందినవారన్నది మాదిగల సమస్యను చూడలేకపోవడానికి ఒక కారణం అని గుర్తించడం ఎంత ముఖ్యమో, దళిత ఉద్యమానికి ఉన్న సిద్ధాంత దృక్పథం నుండి వచ్చిన అవరోధాలను చూడడం కూడా అంతే ముఖ్యం. అఖండమైన, బలమైన దళిత ఐక్యతకు ఈ దృక్పథంలో కేంద్రస్థానం ఉంది. ఒక బలమైన భౌతిక శక్తిగా ఐక్యమైన దళితులు బహుజనకులాలను తమతో కలుపుకొని (కమ్యూనిస్టు సిద్ధాంతంలో ఒక బలమైన భౌతిక శక్తిగా ఐక్యమైన కార్మికులు మధ్యతరగతినీ, రైతాంగాన్నీ తమతో కలుపుకున్నట్టు) అగ్రవర్ణ ఆధిక్యతను సవాలు చేసి దళిత బహుజన సమాజాన్ని (లేక రాజ్యాన్ని) నెలకొల్పాలనే దృక్పథం దళిత రాజకీయాలలో బలంగా ఉంది. ఈ రాజకీయ క్రమం దళిత రాజకీయాల దృష్టిలో పురోగమనానికి ప్రధాన భూమికగా ఉంది. దీనిని 'విచ్ఛిన్నం' చేసే మాదిగల ఆకాంక్ష ఆ సిద్ధాంత దృక్పథానికి సులభంగా కనిపించదు. కనిపించినా వెనువెంటనే ఆదరణ పొందదు. మాదిగల నుండే ఆ ఉద్యమం రావలసి వచ్చింది.

సారాంశంలో, ఏదో ఒక పరిణామక్రమానికి కేంద్రస్థానం ఇచ్చి, దానినే ప్రగతికి భూమికగా భావించే ఏ రాజకీయ దృక్పథమైనా ఇతర పరిణామ క్రమాలకు నాయకత్వం వహించకపోగా (వహించాలని సిద్ధాంతపరంగా భావించినప్పటికీ) వాటిపట్ల అనుమానంతో, సందేహంతో వ్యవహరించటమే జరుగుతుంది. అటువంటప్పుడు

ఆ పరిణామక్రమాలు తమను తాము గుర్తించుకోవలసిందే, తమను తాము ఆవిష్కరించుకోవలసిందే. సమాజంలోని అన్ని సమస్యలకూ మూలమైన భూమిక ఒకటి ఉందనీ, దానిని గుర్తించి ఆ వెలుగులో అన్ని సమస్యల పరిష్కారానికీ బాటవేయగల ఒక పునాది పరిణామక్రమాన్ని ప్రతిపాదించడం, దాని చుట్టూ రాజకీయ వ్యూహాలను రూపొందించడం ప్రగతి కాముకుల కర్తవ్యమని భావించే 'శాస్త్రీయ' దృక్పథాల కళ్ళకు కనిపించని విషయాలు, కనిపించినా ఆదరణ పొందని విషయాలు ఎప్పుడూ ఉంటాయి. అవి అప్రధానమైనవిగా, అశాస్త్రీయమైనవిగా, ఒక్కోసారి రాజకీయ కుట్రలుగా కనిపిస్తాయి. ఈ 'శాస్త్రీయత'ను గుండెకాయగా కలిగి ఉన్న 'ఆధునికత' దృక్పథం మీద 'ఆధునికాంతరవాదం' (పోస్ట్ - మోడర్నిజం) పెట్టే విమర్శ ఈ మేరకు సబబయినదే. సబబయినదనే మనం చర్చిస్తున్న కొత్త ఉద్యమాలతో పాత ఉద్యమాలు, పాత ఉద్యమ సిద్ధాంతాలు ఎదుర్కొన్న సమస్యలు రుజువు చేస్తున్నాయి.

'మూలంలోకి పోయి అంతిమ పరిష్కారానికి బాటవేసే వ్యూహాలను రచించడం' అనే ఈ శాస్త్రీయత అన్ని సమస్యలకూ పరిష్కారం ఇవ్వకపోగా తాను నిర్వచించే బాటలో లేని సమస్యలు మన కళ్ళకు కనిపించకుండ చేస్తుందని గుర్తించిన తరువాత ఒక ఇబ్బంది పెట్టే ప్రశ్న మిగులుతుంది. 'శాస్త్రీయ దృక్పథం' మనకు అన్ని విషయాలూ తెలుపుతుందని అనుకుంటాం. ఒకేసారి అన్నీ తెలిసిపోకపోయినా కాలక్రమంలో తెలుస్తాయని అనుకుంటాం. కానీ 'మూలం' లోకి పోయి 'అంతిమ పరిష్కారాన్ని' ఆవిష్కరించే 'శాస్త్రీయత' స్వభావరీత్యానే అనేక విషయాలు (ఆ మూలానికి చెందనివి) మనకు తెలియకుండ చేస్తుందని గుర్తించడం చాలా ఇబ్బంది పెట్టే విషయం. అప్పుడింక శాస్త్రీయత అనే భావననే వదిలిపెట్టాలా? శాస్త్రీయత అనే భావనే ఒక ఆధిపత్య భావన అనుకోవాలా? పోస్ట్-మోడర్నిస్టులు తరచుగా అదే విధంగా వాదిస్తారు. కానీ అంతటి అతివాదానికి పోవాలా? శాస్త్రీయతకు (సామాజిక విషయాలలో) వేరే అర్థం ఇచ్చుకోలేమా? ఇచ్చుకొని ఆ భావనను రెండు రకాల అతివాదం నుండి కాపాడుకోలేమా? దీనికి జవాబు వెతికే ముందు ఇంకొక రెండు విషయాలు చూద్దాం.

సంప్రదాయక వామపక్ష సిద్ధాంత దృక్పథంలో ప్రజల చైతన్యానికి ముఖ్య స్థానం ఉంది. భౌతిక పరిస్థితులలో రాగల మార్పులను, ఆ మార్పుల వల్ల ప్రయోజనం పొందే ప్రజలు గుర్తించి చైతన్యవంతులయి, దాని సాధనకోసం

పోరాటం చేయాలనీ, చేస్తారనీ ఆ సిద్ధాంతం నమ్ముతుంది. ఇక్కడ 'చైతన్యం' అనే దానిలో ప్రధానమైన విషయం రాజకీయ చైతన్యం. తమ సమస్యలకు మూలమేమిటో గుర్తించడం, శ్రామిక రాజ్యాధికారంలోనే దానికి పరిష్కారం ఉందని గుర్తించడం, ఐక్య శ్రామిక చైతన్యాన్ని పొందడం దీనిలోని ముఖ్య విషయాలు. దానిలో భాగంగా, తమను తాము శ్రామికులుగా గుర్తించుకొని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం అనే అంశం కూడ ఉంటుంది. ఇప్పుడు కొత్తగా ముందుకొస్తున్న స్త్రీల, ఆదివాసీల, శ్రామిక కులాల ఉద్యమాలు చైతన్యం అనేదానికి వేరే అర్థం ఇస్తున్నాయి. భిన్న జీవిత అనుభవాల ప్రాతిపదికన మాదిగ, చాకలి, వడ్డెర, కోయ తదితర ప్రజానీకం వేదికలు, ఉద్యమాలు ముందుకొచ్చాయి. ఈ ఉద్యమాలిచ్చే చైతన్యం అనిర్దిష్టమైన శ్రామిక చైతన్యం కాదు. నిర్దిష్టంగా ఆ కులానికి చెందిన ప్రజల జీవిత అనుభవం నుండి పుట్టి, సామాజిక సంపదను సృష్టించడంలోనూ సామాజిక జీవితాన్ని సాధ్యం చేయడంలోనూ తాము నిర్వహించిన పాత్రను గుర్తింపచేసే నిర్దిష్టమైన చైతన్యం. ఈ స్వీయజ్ఞానం అనిర్దిష్టమైన శ్రామిక వర్గ చైతన్యం కన్నా లోతయినది, నిండయినది. అది ఇచ్చే ఆత్మవిశ్వాసం బలమైనది. అది చైతన్యం దగ్గర ఆగిపోకుండా కొత్త జ్ఞానాన్ని - వారి నిర్దిష్టమైన జీవిత అనుభవం నుండి పుట్టిన జ్ఞానాన్ని సృష్టించగలదు. ఒక కొత్త రాజకీయ సమీకరణకేకాక, కొత్త మేధావి వర్గం ఆవిర్భావానికి కూడా అది దారి తీయగలదు. అందులో రాజ్యాధికార సాధనకు అవసరమైన రాజకీయ చైతన్యం కంటే ఆయా ప్రజల నిర్దిష్ట జీవిత అనుభవం నుండి పుట్టిన విలువల చైతన్యమే ముఖ్యమైనది కావచ్చు. అయితే దానికి ఉన్న నిర్దిష్టత కారణంగా అది వివిధ శ్రామిక ప్రజల మధ్యన ఐక్యతకు వెంటనే దోహదం చేయకపోవచ్చు. అది ప్రత్యేకతల ప్రాతిపదికన జరుగుతున్న సమీకరణ. దానికి ఐక్యత అసాధ్యం కాదు - అనవసరం ఎంతమాత్రం కాదు - కాని అది 'శ్రమ' అనే అనిర్దిష్టమైన భావన ప్రాతిపదికన జరిగే అఖండమైన భౌతిక ఐక్యత కాదు. అది నిర్దిష్టమైన ప్రత్యేక జీవిత అనుభవాలలోని సామాన్య విలువల ప్రాతిపదికన సాధ్యం కాగల సంఘీభావం, సమైక్య ఆచరణ. అది రాజ్యాధికార సాధనకు ఎంత వరకు ఉపయోగపడుతుందో తెలీదు. కానీ నూతన సమాజపు పునర్నిర్మాణానికి అవసరమైన నిండైన విలువలు ఇవ్వగలదు. ప్రకృతికీ మనిషికీ ఉండవలసిన పరస్పరతా సంబంధాన్ని ఆదివాసీల జీవన విలువల నుండి నేర్చుకోగలం. 'శ్రామికులు' అనే అనిర్దిష్టమైన భావన మనకది నేర్పదు. వ్యక్తిగత సంబంధాలలో

పెత్తనాన్నీ ఆధిపత్యాన్నీ తిరస్కరించడం స్త్రీల జీవిత అనుభవం నుండి నేర్చుకోగలం. 'శ్రామికులు' 'శ్రమదోపిడీ' అనే అనిర్దిష్టమైన భావన నుండి కాదు. ఒక్కొక్క పీడిత ప్రజాసమూహం జీవిత అనుభవం నుండి ఇటువంటి ప్రజాస్వామ్య విలువలు - నిర్దిష్టమైనవి - నేర్చుకోగలము, అవి ఇప్పటికే (ఆ ప్రజల జీవిత అనుభవంలో) ఉనికిలో ఉన్నాయని గుర్తించగలము. వాటి వ్యాప్తికోసం కృషి చేసే సాంస్కృతిక రాజకీయ కృషిని చేపట్టగలం. రాజ్యాధికార సాధన కోసం అవసరమైన శ్రామిక ఐక్యతనూ తత్సంబంధమైన శ్రామిక చైతన్యాన్నీ ప్రధానంగా భావించే సంప్రదాయక వామపక్ష సిద్ధాంత ధోరణి ఈ అవసరాన్ని గుర్తించగలదా? దాని సిద్ధాంత దృక్పథమే అడ్డం రాదా? కొంతమేరకు ఈ నిర్దిష్ట జీవిత అనుభవాల వ్యక్తీకరణను సహించినా, అది శ్రామిక ఐక్యతనూ రాజ్యాధికార సాధనకు అవసరం అయిన ఐక్యబలానికీ అవరోధం అవుతుందన్న భయమే ప్రధానం కాదా?

రాజ్యంపట్ల, రాజ్యసార్వభౌమత్వం పట్ల కూడా ఈ కొత్త ఉద్యమాలు ఒక కొత్త వైఖరిని తీసుకొచ్చాయి. రాజ్యాన్ని మొత్తంగా ప్రజల శత్రువుగా భావించడం, దాని సాధికారతను మొత్తంగా తిరస్కరించడం, రాజ్యంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలు, విలువలు బూటకపు సాధికారతను కల్పించే భావజాల సాధనాలు తప్ప వాటి ద్వారా జీవితాలను బాగు చేసుకునే అవకాశంగానీ, అసమానతలను తొలగించుకునే అవకాశంగానీ పీడిత ప్రజలకు లేదని నమ్మడం, అటువంటి అవకాశం ఉందన్న 'అపోహ' ప్రజలలో ఉంటే దానిని తొలగించాలని నమ్మడం సంప్రదాయక వామపక్ష దృక్పథంలో - ముఖ్యంగా ఎం.ఎల్. పార్టీల దృక్పథంలో- ముఖ్యమైన విషయంగా ఉంది. ఈ కొత్త ఉద్యమాలు దీనిని ఆమోదించడం లేదు. తాము అనుభవిస్తున్న ఆధిపత్యానికి రాజ్యం (చట్టం రూపేణా గానీ చట్టబాహ్యమైన ఆచరణ రూపేణా గానీ) వత్తాసుగా నిలిచినప్పుడు మాత్రమే ఈ ఉద్యమాలు రాజ్యాన్ని ప్రశ్నిస్తున్నాయి. నిలదీస్తున్నాయి. అయితే అదే రాజ్యం కల్పించే ప్రజాస్వామిక అవకాశాలను నిజమైన అవకాశాలుగా స్వీకరించి ఆధిపత్యాన్ని ఎదుర్కొనడానికి ఆ అవకాశాలను వాడుకుంటున్నాయి. అవి మొత్తంగా రాజ్యం సాధికారతను తిరస్కరించడం లేదు. విమర్శనాత్మకంగా వ్యవహరిస్తూ ఆ సాధికారతను తమ అవసరాలకు అనుగుణంగా మలచుకుంటున్నాయి.

రాజ్యం సాధికారతను మొత్తంగా తిరస్కరించే వామపక్ష - ప్రత్యేకించి సిపిఐ (ఎంఎల్) - సంప్రదాయం నుండి పుట్టిన పౌరహక్కుల ఉద్యమానికి ఈ కొత్త ఉద్యమాల వైఖరి ఒక సవాలై నిలిచింది. రాజ్యం మొత్తంగా ప్రజల శత్రువే అయితే,

రాజ్యంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలు మొత్తంగా బూటకపు సాధికారత కల్పించే సాధనాలయితే, ఆ రాజ్యంలో భాగమైన చట్టసభలలోనూ, న్యాయవ్యవస్థలోనూ, బ్యూరోక్రసీలోనూ తమకు ప్రవేశం కావాలని కోరుకుంటున్న దళితుల కోరికనూ, స్త్రీల కోరికనూ ఏ విధంగా అర్థం చేసుకోవాలి? ఆ రాజ్యంలో భాగంగానే ప్రత్యేక రాష్ట్రం కావాలన్న తెలంగాణ ఉద్యమకారుల కోరికనూ, ఏజెన్సీ ప్రాంతాలకు స్వయంపాలనా అధికారం కావాలన్న ఆదివాసీ ఉద్యమం కోరికనూ ఏ విధంగా అర్థం చేసుకోవాలి? పాలక వర్గంలో చేరిపోవాలని ఆరాటపడుతున్న 'క్రీమీ లేయర్' ప్రయత్నంగా చూడాలా? లేక రాజ్యం కల్పించే ప్రజాస్వామిక అవకాశాలను వాడుకొని, వాటిని మరింత ప్రజాస్వామికంగా మలచుకొని, తద్వారా సాంఘిక జీవితంలోని అసమానతలనూ ఆధిపత్యాన్నీ ఎదుర్కొనే ఒక న్యాయమైన ప్రయత్నంగా చూడాలా? ఈ చర్చ ఈ రోజు పౌరహక్కుల ఉద్యమంలో జరుగుతూ ఉంది.

నిజానికి పౌరహక్కుల ఉద్యమమే - తన ఆచరణ నుండి సరయిన జ్ఞానాన్ని పెంపొందించి ఉంటే - సంప్రదాయక వామపక్షానికి రాజ్యాన్ని గురించి, ప్రజాస్వామ్యాన్ని గురించి ఉన్న అవగాహనను ప్రశ్నించే 'కొత్త ఉద్యమం' అయి ఉండాలి. రాజ్యానికి-సంప్రదాయక వామపక్ష అవగాహనలో-సాధికారత కల్పించే సాధనాలలో చట్టబద్ధ పాలన, పౌరహక్కులు, న్యాయవ్యవస్థ, స్వతంత్ర ప్రతిపత్తి ముఖ్యమైనవి. మరి వీటి కోసమే ఆందోళన చేసే పౌరహక్కుల ఉద్యమం ఏం చేస్తూ ఉంది? బూటకపు సాధికారతను పెంపొందిస్తూ ఉందా? లేదనుకుంటే, ఆ సాధికారత పూర్తిగా బూటకం కాదనీ, కేవలం భావజాలం కాదనీ, అందులో కొంత సత్యం ఉందనీ పౌరహక్కుల ఉద్యమం చెప్పవలసి ఉంటుంది. పౌరహక్కుల ఉద్యమం ఈ తాత్విక మీమాంసలో కొట్టుమిట్టాడుతున్న సమయంలోనే ఈ కొత్త ఉద్యమాలు దానిని మరింత పెంచాయి. కేవలం చట్టాలు, న్యాయవ్యవస్థే కాక చట్టసభలు, పరిపాలనా వ్యవస్థలు కూడా ప్రజాస్వామ్య ప్రయోజనాలకు పూర్తిగా పనికి రానివేం కావనీ, వాటిని ఉపయోగించుకోవడం, సంస్కరించుకోవడం పూర్తిగా అసాధ్యమేమీ కాదనీ ఈ ఉద్యమాలు తమ ఆచరణ ద్వారా ప్రకటిస్తున్నాయి. రాజ్యాన్ని బద్దలు కొట్టి ప్రత్యామ్నాయ (శ్రామిక) రాజ్యాన్ని నెలకొల్పడం అనే కీలకమైన లక్ష్యాన్ని తన ముందుంచుకొని దానికి అనుగుణ్యమైన బలసమీకరణపైన దృష్టి పెట్టే కమ్యూనిస్టు ఉద్యమానికి ఇది సిద్ధాంతపరమైన సవాలే. ఈ ఉద్యమాలతో దానికి సులభంగా

సయోధ్య కుదరక పోవడానికీ, తరచుగా అసహనంగా వ్యవహరించడానికీ ఇదీ ఒక కారణమే. అంతకంటే ముఖ్యంగా, ఆధునిక రాజ్యం మొత్తంగా అన్ని రకాల ప్రజాప్రయోజనాలకూ అన్ని రకాల ప్రగతికీ శత్రువు కాదనీ, రాజ్యం ద్వారా సాధించుకోగల ప్రగతి కూడ ఉండగలదనీ, రాజ్యం సార్వభౌమత్వాన్ని ఎల్లవేళలా సవాలు చేయవలసిన అవసరం ప్రజలందరికీ లేదనీ ఈ కొత్త ఉద్యమాలు నేర్పుతున్న విషయాన్ని సంప్రదాయక కమ్యూనిస్టు సిద్ధాంతం తన అవగాహనలో ఇముడ్చుకోవడం కష్టమే.

చివరిగా, ఈ కొత్త ఉద్యమాల నుండి వచ్చిన ఆలోచనల నేపథ్యంలో సామాజిక మార్పును ఏ విధంగా సిద్ధాంతీకరించగలుగుతాం? సంప్రదాయక వామపక్ష దృక్పథానికి ఇవి ఎటువంటి ప్రత్యామ్నాయాన్ని ముందుపెడుతున్నాయని భావించగలుగుతాం? సమాజాన్నీ ప్రపంచాన్నీ మొత్తంగా విశ్లేషించి, మొత్తంగా మార్చడానికి అవసరమైన ఆచరణక్రమాన్ని మొత్తమందరికీ ఒకేసారి ఇవ్వగల సిద్ధాంతం ఉండజాలదని భావించవలసి ఉంటుంది. అటువంటి సిద్ధాంతం తాను ఎంత శాస్త్రీయంగా విశ్లేషిస్తున్నానని భావిస్తుందో అంతగా మన దృష్టినుండి అనేక విషయాలను మరుగుపరుస్తుందనీ, ఎంత సమగ్రంగా మార్పుకు బాట వేస్తున్నానని నమ్ముతుందో అంతగా మార్పుకు సంబంధించిన ఇతర అవకాశాలను మరుగు పరుస్తుందనీ, ప్రత్యామ్నాయాన్ని గురించి ఎంత లోతుగా ఆలోచిస్తున్నానని భావిస్తుందో అంతగా ప్రత్యామ్నాయానికి కావలసిన జీవిత విలువల ఎదుగుదలను విస్మరిస్తుందనీ పైన వివరించాము. సామాజిక పరిణామ క్రమం బహుముఖం, బహుళం అనే ప్రాథమిక సత్యాన్ని గుర్తించవలసి ఉంది.

అయితే ప్రపంచాన్ని 'మొత్తం'గా వివరించేయడంలో గల ఇబ్బందులను గుర్తించాము కాబట్టి ఈ ప్రపంచం ఒక 'మొత్తం' అనే భావననే వదిలిపెట్టాలా? దాని బహుముఖత్వాన్ని గుర్తించినంతమాత్రాన ఆ బహుముఖాల మధ్యనున్న పరస్పర సంబంధాలను విస్మరించాలా? అన్నిటినీ ఒక్కసారిగా వివరింపజూసే 'శాస్త్రీయత'ను సందేహించవలసిన అవసరం ఉందని గుర్తించామని చెప్పి అసలు శాస్త్రీయత అనే భావననే సందేహించాలా? నిర్దిష్టతనూ వైవిధ్యాన్నీ అర్థం చేసుకోవలసిన ఆవశ్యకతను అంగీకరించినంతమాత్రాన అసలు సార్వజనీనత, విశ్వజనీనత అనేవే లేవనుకోవాలా? పోస్ట్ - మోడరన్ (ఆధునికానంతరవాద) తాత్విక ధోరణి అవుననే అంటుంది. అయితే మన ముందు ఉన్న కొత్త ఉద్యమాలు మనకిస్తున్న సమాధానం ఇది కాదని నేను భావిస్తున్నాను.

బహుముఖమైన ప్రాపంచిక వాస్తవికత పరస్పర సంబంధాలున్న ఒక మొత్తం. దానిని మొత్తంగా వివరించి ఒక పరిణామ క్రమాన్ని ప్రతిపాదించే విశ్లేషణా సూత్రాలేవీ లేకపోవచ్చుగానీ దానిలో ఏ అంశాన్ని విశ్లేషించేటప్పుడయినా మిగిలిన వాటితో ఉన్న సంబంధాన్ని దృష్టిలో పెట్టుకోవడం అవసరం. పరస్పర ప్రభావాలను దృష్టిలో పెట్టుకోవడం అవసరం. ఆయా రంగాలలో నడుస్తున్న ఉద్యమాలకు కూడ ఇది వర్తిస్తుంది. వాటిలో ఏ ఒక్కటీ ప్రాధాన్యతా క్రమంలో మిగిలిన వాటికంటే ముఖ్యమైనది కాకపోవచ్చు. కానీ అవన్నీ అంతమాత్రం చేత పరస్పర సంబంధం లేని ద్వీపాలు కావు.

ఈ భౌతిక సంబంధమే కాక ఉద్యమాల మధ్య విలువల సారూప్యత కూడా బలంగా ఉంటుంది. ఉద్యమాల మధ్య సంఘీభావానికీ, సమైక్యఆచరణకూ, వైరుధ్యాల పరిష్కారానికీ ఈ విలువల సార్వజనీనత అవకాశాన్ని కల్పిస్తుంది. విభిన్నమైన జీవిత అనుభవాల నుండి పుట్టి విభిన్నమైన అణచివేత రూపాలను ప్రశ్నించే ఉద్యమాలన్నీ తమ ఆకాంక్షలను ఒకే రకమైన విలువల ద్వారా వ్యక్తం చేస్తాయి. సమానత్వం ఇందులో కీలకమైనది. అది సమాన ప్రతిపత్తి రూపంలో ఉండవచ్చు, సమాన గౌరవం రూపంలో ఉండవచ్చు, సమాన అవకాశాల రూపంలో ఉండవచ్చు. నిర్దిష్టంగా అది అనేక రూపాలు తీసుకోవచ్చు. కానీ సమానత్వం అనే సాధారణ విలువ ఈ ఆకాంక్షల మధ్య నైతిక సారూప్యతను తీసుకొస్తుంది. ఏదో ఒక పునాది పరిణామక్రమం సామాజిక మార్పుకు సార్వజనీనతను అందిస్తుందన్న సంప్రదాయక కమ్యూనిస్టు దృక్పథాన్ని తిరస్కరించి నంతమాత్రాన ఇంక మిగిలింది ఎక్కడికక్కడ విడివిడిగా జరిగే మార్పేనని అనుకోనవసరం లేదు. ఆ విడివిడి ప్రయత్నాల మధ్య (అవి ఎదుర్కొనే సమస్యల మధ్య) ఉండే భౌతిక సంబంధం వాటిని ఒక రకంగా కలిపితే, విలువల సారూప్యత వాటిని స్థూలంగా ఒక దిక్కుగా నడిపిస్తుంది. వాటి మధ్య సంఘీభావాన్ని పెంపొందిస్తుంది. సంఘీభావం లోపించినా, వైరుధ్యాలు ముందుకొచ్చినా పరిష్కరించడానికీ, ఆ లోపాన్ని సవరించడానికీ అవసరమైన తాత్విక ప్రాతిపదిక కల్పిస్తుంది.

'చూపు' మాసపత్రిక

జనవరి - ఫిబ్రవరి 1999

(చివరి నాలుగు పేరాలు 'చూపు'లో అచ్చుకాలేదు. ఇటీవలే రాతప్రతి దొరికినందువల్ల 'మనిషి మార్క్సిజం' పునర్ముద్రణలో దానిని చేర్చాము, గమనించగలరు.)

## V

# ‘జనచైనా’ స్వర్ణ ప్రస్థానం

ఆస్తి సంబంధాలను సమూలంగా మార్చి, తద్వారా సమాజాన్ని సమూలంగా మార్చాలన్న లక్ష్యంతో కమ్యూనిస్టు పార్టీలు రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్న ‘విప్లవాల’న్నిటిలోకి అత్యధికంగా ప్రజల మద్దతు ఉన్న ప్రయత్నంగా ‘చైనా విప్లవం’ పేరు పొందింది.

50 సంవత్సరాల తర్వాత ఆ విప్లవంలో ఏకపార్టీ నియంతృత్వం తప్ప వేరే ఏమీ మిగలలేదు. వేరే ఏ ప్రయోజనమూ రాలేదని కాదు. అట్టడుగు ప్రజానీకానికి తిండి, చదువు, ఆరోగ్యం కల్పించి అభివృద్ధి ఫలాలను అందుకోవడానికి కావలసిన బలాన్ని కొంత ఇవ్వగలిగింది చైనా. ఇందులో సగం కూడ సాధించని మనం చైనాను ఈసడించు కోనవసరం లేదు. కానీ మానవ జీవితాన్ని సమూలంగా మార్చాలన్న చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రయత్నం మనకు ఏమైనా మిగిలించిందా అంటే ఆ పని ఏ విధంగా చేయాలన్న దానికంటే ఏ విధంగా చేయకూడదన్న జ్ఞానాన్ని మిగిలించిందని చెప్పుకోవలసి ఉంటుందేమో.

సమష్టి శ్రమకు, సమష్టి జీవన విధానానికీ నిదర్శనంగా నిలిచే ప్రయోగాలనేకం చైనాలో జరిగాయని భావించడం కద్దు. ఒక దశలో చైనా కమ్యూన్ల అనుభవాల గురించి చాలా ప్రచురణలు వచ్చాయి. మనబోటి దేశాలలో చాలామందికి చాలా ఉత్తేజం ఇచ్చాయి. కానీ ఇప్పుడు ఆలోచిస్తే ఆ పుస్తకాల రచయితలంతా తాము ఏమి

చూడదలుచు కున్నారో అదే చూసారేమోనని అనిపించకమానదు. ఈ పుస్తకాల రచయితలంతా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ కల్పించిన జీవితం పట్ల విముఖత పెంచుకొని ప్రత్యామ్నాయం ఏ కొంచెం కనిపించినా దానిని విశ్వసించడానికి సిద్ధంగా ఉన్న పాశ్చాత్యులే తప్ప ఒక్కరూ చైనీయులు కారు. నిజానికి రష్యాలో స్టాలిన్ నియంతృత్వం అత్యంత తీవ్రంగా ఉన్న తరుణంలో సహితం ఆ దేశం నుండి బయటికొచ్చయినా సరే అక్కడి జీవితాన్ని గురించి రాసిన రష్యన్లు ఉన్నారు గానీ, చైనా గురించి చైనీయులు రాసిన పుస్తకాలు (అధికార కమ్యూనిస్టు ప్రచురణలు తప్ప) దాదాపు మృగ్యమనే చెప్పాలి. పైగా, చైనా విప్లవం పట్ల చాలా సానుభూతి గల పరిశీలకులు సహితం, ఆ దేశంలో ఏ దశలోనయినా ప్రభుత్వం ఏం చెప్తుందో ప్రజలంతా అదే చెప్తారు తప్ప భిన్నస్వరాలు వినిపించవని అంటారు.

అందువల్ల 'చైనా విప్లవం' అనే దానిలో నిజంగా ఏం జరిగిందో మనకు స్పష్టంగా తెలుసుననుకోను. తెలిసిన మేరకు సోషలిజం కోసం అనుసరించవలసిన విషయాల కంటె అనుసరించకూడనివే ఎక్కువ ఉన్నాయేమో.

దైనందిన జీవితక్రమంలో తనను తాను ఏ రోజుకారోజు పునస్సృష్టి చేసుకునే దానినే 'వ్యవస్థ' అనగలం. ఆ అర్థంలో ఒక్క చైనాలోనే కాదు, రష్యాతో సహా ఏ దేశంలోనూ ఇప్పటిదాకా సోషలిస్టు వ్యవస్థ అనేది తాత్కాలికంగా కూడ ఏర్పడలేదు. సోషలిజానికి సంబంధించిన ప్రయోగాలు మాత్రమే ఈ దేశాలన్నిటిలోనూ జరిగాయి. రాజ్యాధికార బలంతో నిలిచేది 'వ్యవస్థ' కాదు. ఇంకొకరకంగా చెప్పాలంటే పౌరసమాజంలో భాగమయినదే ఒక సామాజిక వ్యవస్థ అనిపించుకుంటుంది. రాజ్యాన్ని ఆలంబన చేసుకొని బతికే దానికి ఆ పేరు పెట్టలేము. ఇప్పటిదాకా సోషలిజం అనేది రాజ్యాన్ని ఆలంబన చేసుకొని బతికింది. రాజకీయం అగ్రభాగాన ఉండాలనీ, అది రాజ్యాధికారం రూపంలో ఉండాలనీ నమ్మే మావోయిజం దృష్టికి ఇదొక బలహీనతగా కనిపించకపోవచ్చును గానీ ఇది నిజానికి తీవ్రమైన బలహీనత.

పోనీ ఆ రాజ్యాధికారం ప్రజాస్వామ్య రూపంలో ఉండి ఉంటే ఆ మేరకైనా సోషలిజం పౌరసమాజంలో భాగమయిందని అనగలుగుదుమేమో. కానీ చైనా రాజ్యం ప్రజాస్వామ్యానికి చాలా దూరం. కమ్యూనిజానికి సంబంధించిన ప్రయోగాలలో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రజలకు చాలా భాగస్వామ్యం కల్పించినట్టు చెప్పుకునే ఉదంతాలు అనేకం ఉన్నాయి. అది నిజమేననుకున్నా, ఆ పార్టీతో విభేదించే

స్వేచ్ఛ మాత్రం ప్రజలకు లేదు. ఆ పార్టీ విధానాలపట్ల ఆమోద అనామోదాలు తెలిపే స్వేచ్ఛ లేదు.

ప్రజాస్వామ్యం పాశ్చాత్యదేశాల నమూనాలోనే ఉండాలా అని ప్రశ్నిస్తారేమో. ఉండనక్కరలేదు. కానీ ఏదో ఒక నమూనాలోనయితే ఉండాలి. ప్రజలకు విభేదించడానికీ తిరస్కరించడానికీ అవకాశం లేని ఏకపార్టీ నమూనా కలదే ప్రజాస్వామ్యం అనలేము. దిగజారిన పార్టీని తిరస్కరించమనీ, అధిష్ఠానాన్ని బద్దలు కొట్టమనీ మావో పిలుపు ఇచ్చాడు గానీ అది చైనా రాజ్యాంగం కల్పించిన హక్కు కాదు. రాజ్యాంగంలోనే అటువంటి హక్కు కల్పించే ప్రయత్నమేదీ మావో చేయలేదు. పార్టీ గాడి తప్పిందనుకున్నప్పుడు ఆయన ఒక రాజకీయ కార్యక్రమంగా ప్రజలకిచ్చిన పిలుపు అది.

మావో గట్టిగా నమ్మిన కమ్యూనిస్టు ఆదర్శానికే చైనా కమ్యూనిస్టు పార్టీ దూరమయిన తరువాత జరిగిన తియానన్‌మెన్ స్క్వేర్ ఊచకోత గురించి విన్నాము. ఈ మధ్యనే టిబెట్‌లో అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటనను స్థానిక భాషలోనికి అనువదించి కరపత్రంగా అచ్చువేసి పంచుతున్న ఒక మానవహక్కుల కార్యకర్తకు చైనా న్యాయవ్యవస్థ 18 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. అతనొక్కడే కాదు, చైనా రాజ్యాంగం పౌరులకు సాధారణ పౌర రాజకీయహక్కులు కల్పించాలని డిమాండ్ చేసిన మానవహక్కుల కార్యకర్తలందరూ జైలులో ఉన్నారు. ఈ వికారం మావో చనిపోయిన తరువాత పుట్టినది కాదు. మొదటి నుండి ఉన్నదే. టిబెట్ ప్రజలపైన అణచివేత కూడ మొదటి నుండి ఉన్నదే.

సమసమాజాన్ని మించిన సామాజిక రాజకీయ ఆదర్శమేదీ ఉండజాలదు. అయితే దానిని ఏ విధంగా సాధించాలన్న ప్రశ్నకు ఈ రోజు స్పష్టమైన జవాబేదీ లేదు. ఒక శాస్త్రీయమైన జవాబు ఉందన్న విశ్వాసంతో ప్రారంభమైన ఇరవయ్యవ శతాబ్దం ఆ జవాబును ఆచరణలో పెట్టడానికి జరిగిన మహత్తరమైన ప్రయత్నాలను చూసింది. కానీ చివరికి సందేహంతోనే ముగుస్తున్నది.

'చైనా విప్లవం' అందులో భాగమే. రష్యా విప్లవం మిగిలించిన సందేహాలకు సాంస్కృతిక విప్లవం అనే సమాధానాన్ని చైనా - అందులోనూ మావో ఆలోచనా సరళి - ఇచ్చిందని నమ్మేవారున్నారు. సాంస్కృతిక విప్లవం అనే భావనను కొంచెం సేపు పక్కనపెట్టి చైనాలో వాస్తవంగా నడిచిన సాంస్కృతిక విప్లవాన్ని పరిశీలిస్తే, మనకు ఏ సమాధానమూ కనిపించదు. రాజ్యం తన కర్రపెత్తనం ద్వారా మనుషులనూ మానవ సంబంధాలనూ మార్చాలని ప్రయత్నించడం రష్యా విప్లవం

ఎదుర్కొన్న సమస్యలకు మూల కారణమైతే, చైనా సాంస్కృతిక విప్లవం ఆ కర్రపెత్తనాన్ని రాజ్యం చేతినుండి మిలిటెంట్ల చేతిలో (రెడ్ గార్డ్స్ చేతిలో) పెట్టింది. బలప్రయోగం పైన విశ్వాసం రెండు నమూనాలలోనూ ఉన్న సామాన్య లక్షణం. కానీ బల ప్రయోగానికి మానవ సామాజిక ప్రగతిలో ఉండగల పాత్ర స్వల్పమే. పాతవ్యవస్థను ధ్వంసం చేయడంలో కొంత ఉండవచ్చు (అది కూడా మామూలుగా ఊహించుకునేంత కాదు). కానీ నూతన పరిస్థితుల రూపకల్పనలో బల ప్రయోగానికీ నిర్బంధానికీ ఉండగల పాత్ర చాలా చాలా స్వల్పం. 'సాంస్కృతిక విప్లవం' అనేది సంస్కృతిలోనూ సామాజిక సంబంధాలలోనూ మార్పు తీసుకొచ్చే ప్రయత్న మయినట్టయితే ఆ క్రియకూ చైనాలో ఆ పేరు మీద నడచిన పోరాటానికీ పొంతన ఏమీ లేదు.

ఇది 'సాంస్కృతిక విప్లవం' ఎవరో కొందరు అతివాదుల చేతిలోకి పోవడం వల్ల, లేదా కొన్ని అతివాద పొరబాట్లు జరగడం వల్ల వచ్చిన సమస్య కాదు. పాతను వ్యతిరేకించే క్రమంలో జరిగే పోరాటానికీ, కొత్తను నిర్మించడం కోసం జరిగే కృషికీ మధ్య చాలా తేడా ఉంటుందని గుర్తించకుండ రెండింటినీ ఒకే అవిచ్ఛిన్నక్రమంలో దశలుగా లేక ఒకే క్రమానికి పార్శ్వాలుగా చూడడంలోనే లోపం ఉంది. మొదటి దానికి అనుసరించే పద్ధతులే రెండవ కృషికి కూడ తగినవనే ఆలోచనలోనే ఉంది. అసమాన సామాజిక వ్యవస్థను అధిగమించడానికి వర్గపోరాటమే సరయిన మార్గమని అనుకున్నా, సాంస్కృతిక విప్లవం అనే భావన ఏ లక్ష్యాలనయితే తన ముందు పెట్టుకుందో ఆ లక్ష్యాలు కూడ వర్గపోరాటం ద్వారానే సిద్ధిస్తాయన్న మావో ఆలోచనే లోపభూయిష్టమైనది.

అయితే ఈ లోపం కేవలం మావోది కాదు. పోరాటం - పునర్నిర్మాణం అనే క్రియలు స్వాభావికంగానే చాలా భిన్నమైన నైజం గల ప్రక్రియలన్న అవగాహన మార్క్స్‌తో సహా మార్క్సిస్టు సంప్రదాయంలో ఏ ఒక్కరిలోనూ కనిపించదు.

ఈ రోజు పెట్టుబడిదారీ వ్యవస్థను ఎందుకు వ్యతిరేకించాలన్నది ప్రశ్న కాదు. గుత్తపెట్టుబడిదారీ కార్పొరేషన్ల గుప్పిట్లో ఉన్న సమకాలీన పెట్టుబడిదారీ వ్యవస్థ చాలా మందికి చాలా ఆశలు చూపించే మాట వాస్తవమే అయినా, అది తన వికృత స్వభావాన్ని దాచిపెట్టలేదు. అది ఎంత వికృతంగా ఉన్నా దానివల్ల వచ్చే ప్రయోజనాల కోసం దానిని ఆదరించే వాళ్లుంటారు గానీ అదొక అందమైన సమాజం అని దబాయించే వాళ్లెవరూ ఈ రోజు లేరు.

కానీ దానిని (పెట్టుబడిదారీ వ్యవస్థను) ఏ విధంగా అధిగమించాలన్న ప్రశ్నకు ఈ శతాబ్దంలో జరిగిన కమ్యూనిస్టు ప్రయోగాలు కచ్చితమైన జవాబు ఇవ్వలేక పోయాయి. కార్మిక వర్గం తన పోరాటాల ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోస్తుందని నమ్మే పరిస్థితి పోయింది. ఒక వర్గానికే పరిమితం కాని విశాలమైన కృషి అవసరం అని సోషలిస్టు పోరాటాల అనుభవం నుండి అర్థం అవుతున్నది.

అంతకంటె ముఖ్యంగా, మనుషులు శ్రమనూ సంపదనూ బాధ్యతలనూ సమష్టిగా పంచుకునే సమాజాన్ని ఏ విధంగా నిర్మించగలమన్న ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోయింది. చైనాలో మావో చేపట్టిన 'సాంస్కృతిక విప్లవం' అనే రాజకీయ భావనలో ఈ ప్రశ్నకు జవాబు ఉందని పదే పదే అనడం వినడం జరుగుతున్నది గానీ దానిని ఆమోదించడానికి అవసరమైన సైద్ధాంతిక విశ్లేషణ గానీ చారిత్రక వివరణ గానీ లేవు.

అటువంటి విశ్లేషన గానీ వివరణ గానీ ఇవ్వాలంటే సంస్కృతి గురించీ సంస్కృతికీ మానవ వ్యక్తిత్వానికీ మధ్యనున్న సంక్లిష్టమైన సంబంధాన్నీ గురించీ అవగాహన ఉండాలి. వామపక్షవాదులలో సాంస్కృతిక రంగమే తమ కార్యరంగం అని చెప్పుకునే వారికి సహితం ఈ అవగాహన లేదు. అవేమీ లేకుండ సాంస్కృతిక విప్లవాన్ని కమ్యూనిస్టు ప్రయోగంలోని శేషప్రశ్నలకు జవాబుగా ప్రచారం చేయడం, చైనా దానికి ఒక నిదర్శనమని చెప్పుకోవడం ఆనవాయితీ అయిపోయింది. 'చైనా విప్లవం' ఆరంభమైన 50 ఏళ్ల సందర్భంగా ఈ మాటలే మరొక్కసారి వినబోతాము గానీ మన అవగాహన దానివల్ల ఆవగింజంత కూడ మెరుగుపడబోదు.

'వార్త' ఆదివారం అనుబంధం
3 అక్టోబరు 1999

V

# పోస్ట్ మోడర్నిజం-వామపక్ష చైతన్యం

పోస్ట్ మోడర్నిజం (ఆధునికానంతర వాదం) అనే పేరులోనే అనవసరమైన ఆడంబరం ఉంది. ఆ ఆలోచనా రీతి ఆధునికానికి 'అనంతరం' అయితే దానికి అనంతరం ఏమిటి? దానికి అనంతరమేదీ ఉండదా? అదే చరిత్రలో ఆఖరి తాత్వికవైఖరా?

పేరులోనే కాదు, పరిభాషలోనూ పోస్ట్ - మోడర్నిజంలో చాలా ఆడంబరంగ ఉంటుంది. దానివల్ల ఆధునికానంతరవాదుల రచనలు చదవడం, అర్థం చేసుకోవడం కష్టం.

పదజాలంలో ఉన్న అనవసరమైన ఆర్భాటం వల్ల పోస్ట్ - మోడర్నిజం పట్ల సులభంగా వ్యతిరేకత ఏర్పడే ప్రమాదం ఉంది. ఆ కారణంగా ఆధునికానంతర వాద ఆలోచనా రీతిని వ్యతిరేకించే వాళ్లు చాలామంది ఉన్నారు. అది కొంతవరకు సహజమే కావచ్చు. (పైగా ఆధునికానంతర వాదుల స్వయంకృతం కూడ). కానీ ఆ రకమైన వ్యతిరేకత నష్టకరం.

ఎందుకంటే వారి ఆలోచనలలో విలువైనవి, ఉపయోగ కరమైనవి కొన్ని ఉన్నాయి. ప్రధానంగా, 'ఆధునికత' అని దేనినయితే వారు అంటారో ఆ ఆలోచనారీతిలోని స్వాతిశయంపైన, తాత్విక అహంభావంపైన వారు పెట్టే విమర్శ చాలా విలువైనది. ఆధునికుల మని మనల్ని మనం భావించుకునే వాళ్లకు ఈ విమర్శ నేర్పించగల

తాత్త్విక వినమ్రత చాలా మేలు చేస్తుంది. (ఆధునికానంతర వాదులలో ఆ వినయం ఏ కోశానా కనిపించదనేది వేరే సంగతి)

'శాస్త్రీయత' ఆధునికతకు సంబంధించిన అత్యంత కీలకమైన భావన. అది బూర్జువా దృక్పథానికి ఎంత ప్రియమైన భావనో, కమ్యూనిస్టులకు కూడ అంత ప్రియమైనది. ఈ రెండు రకాల శాస్త్రీయతలో ఒకదానిని ఎంచుకోవాలన్న ఒత్తిడి ఈ శతాబ్ద రాజకీయాలను శాసించింది. రెండింటినీ విమర్శించే వారు లేకపోలేదు గానీ వారు సనాతనవాదులుగా గుర్తించబడ్డారు. కాబట్టి శాస్త్రీయతపైన వారు పెట్టే విమర్శకు పెద్దగా విలువ లేకుండా పోయింది. కాని ఈ రెండు రాజకీయ ధోరణులకు సామాన్య తాత్త్విక భూమిక ఉందని గుర్తించి, దానికి 'ఆధునికత' అని పేరు పెట్టి దానిని తీవ్ర విమర్శకు గురిచేసిన ఆధునికానంతర వాదాన్ని ఆ అర్థంలో సనాతన దృక్పథం అని కొట్టిపారేయడం సాధ్యం కాకపోవడం వల్ల, ఆ విమర్శకు జవాబు చెప్పడం ఆధునికతకు తప్పనిసరి అయింది.

ఆ విమర్శలో చాలా వాస్తవం ఉందని ఆధునికవాదులు గుర్తించడం అవసరం. ఆ విమర్శను మించి ఆధునికానంతర వాదంలో వేరే ఏమీ లేదని ఆధునికానంతర వాదులు గుర్తించడమూ అవసరమే. ఎందుకంటే పోస్ట్ - మోడర్నిజాన్నే ఒక ప్రాపంచిక దృక్పథంగా భావించే పోకడ ఒకటి బయలుదేరింది. ప్రాపంచిక దృక్పథానికి అవసరమైన పాజిటివ్ లక్షణాలు అందులో ఉండి ఉంటే అందుకు అభ్యంతరం చెప్పనవసరం లేదు. కాని జ్ఞాన సిద్ధాంత విమర్శకు ఉపయోగపడే తాత్త్విక పరికరాలనే ఒక ప్రాపంచిక దృక్పథంగా భావించడం సబబు కాదు.

విశ్వాసాలలో గాఢత, తీవ్రత ఎప్పుడూ ఉండేవే. మత విశ్వాసాలు బలంగా కలవాళ్లు తమ దగ్గరే సత్యం ఉందని, ఇతరులు చీకటిలో ఉన్నారని నమ్ముతారు. ఇది చాలా క్రూరమైన అసహనానికి దారి తీయగలదని మనకందరికీ తెలుసు. కానీ 'శాస్త్రీయ దృక్పథాల'లోనూ అంతే అసహనం ఉన్నప్పటికీ అది 'శాస్త్రీయం' కాబట్టి దానిని అసహనంగా గుర్తించడం కష్టం.

ఈ అసహనం నిజానికి మత అసహనం కంటే ఎక్కువేమో. ఎందుకంటే ఇతర ఆలోచనా రీతులు ఎందుకు తప్పో వివరించగల విశ్లేషణా పరికరాలు తన దగ్గరున్నాయని శాస్త్రీయత నమ్ముతుంది. శాస్త్రీయత తనను తాను ఒకానొక

దృక్పథంగా భావించదు. అన్ని దృక్పథాలలోని సత్యాసత్యాలను తూకం వేయగల మహా దృక్పథంగా భావించుకుంటుంది. అది కూడ ఒక దృక్పథమేనని చెప్పడం ఆధునికానంతర వాదం చేసే మేలు. మరయితే సత్యాసత్యాల తూకం అసలే సాధ్యం కాదా అనే ప్రశ్నకు జవాబు చెప్పగల తాత్విక పరికరాలు లేకపోవడం ఆధునికానంతర వాద బలహీనత.

'నీది తప్పు, నాది ఒప్పు' అని ప్రతి విశ్వాసమూ అంటుంది. కానీ, 'నీది ఎందుకు తప్పో వివరించగల తప్పొప్పుల ప్రమాణాన్ని నేను' అని సైన్స్ మాత్రమే అంటుంది. హిందువులు ముస్లింలను మూర్ఖులు అంటారు. ముస్లింలు హిందువులను మూర్ఖులు అంటారు. కానీ వీరి మూర్ఖత్వాన్ని వారు వివరించబూనుకోరు. వారి మూర్ఖత్వాన్ని వీరు వివరించబూనుకోరు. (శాపగ్రస్తులనో, సైతాన్ ప్రభావంలో ఉన్నారనో అనుకోవడం తప్ప). కానీ సైన్స్ వీరిద్దరితోన విభేదించడం మాత్రమే కాదు, వీరిద్దరి మూర్ఖత్వాన్ని తాను వివరించగలనని నమ్ముతుంది. అవి రెండూ విశ్వాసాలు కాగా తాను విశ్వాసాలకు అతీతమైన పరమసత్యం అని సైన్స్ అంటుంది.

శాస్త్రీయత అనేది కూడా ఒక దృక్కోణమేనని అన్ని దృక్కోణాలలాగ అదికూడా పాక్షిక దృష్టేనని ఆధునికానంతర వాదం పెట్టే విమర్శ ఆధునిక భావాలను బలంగా తాకుతుంది. రాజకీయంగా చెప్పదలచుకున్నప్పుడు అన్ని దృక్కోణాలలాగ శాస్త్రీయత కూడా కొన్ని ప్రయోజనాలకు ప్రతినిధి అని ఆధునికానంతర వాదులు అంటారు. సైన్స్ అనేది ఎప్పటికప్పుడు అపరిపూర్ణమేనని, ఇంకా తెలుసుకోవలసినవి ఉంటాయని నమ్మడానికీ ఈ విమర్శకూ చాలా తేడా ఉంది. మొదటిది ఆధునిక వాదులు ఒప్పుకోలేని విషయం కాదు. అది సైన్స్‌కు అప్పటి దశలో ఉన్న జ్ఞానానికి సంబంధించిన విషయం. రెండవది శాస్త్రీయత స్వభావానికి (దాని తాత్కాలిక పరిమితులకు కాదు) సంబంధించిన విషయం.

ఆధునిక వాదులలో అంతర్గతంగా ఈ చర్చ ఒక కోణం నుండి జరగలేదని కాదు. బూర్జువా ఆధునికతకూ సోషలిస్టు ఆధునికతకూ మధ్య పెద్ద సంవాదమే నడిచింది. బూర్జువా దృక్పథం 'శాస్త్రీయత' అని పిలుచుకునేది యాంత్రికమనీ పాక్షికమనీ - అంటే నిజమైన శాస్త్రీయత కాదనీ వామపక్షవాదులు విమర్శించారు. అది పెట్టుబడిదారుల వర్గ ప్రయోజనాలనూ, పెట్టుబడిదారీ వ్యవస్థనూ కాపాడే 'భావజాలం' అన్నారు. వామపక్ష సిద్ధాంతాలు శాస్త్రీయతను వక్రీకరించి తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా లోబరుచుకున్నాయని బూర్జువా

విమర్శకులు అన్నారు. అంటే అది నిజమైన శాస్త్రీయత కాదన్నారు. శాస్త్రీయ సోషలిజం కమ్యూనిస్టు పార్టీల నియంతృత్వానికి ఆలంబన ఇచ్చే 'భావజాలం' అన్నారు.

ఆధునికానంతరవాదం పెట్టే చర్చ ఇదికాదు. అది శాస్త్రీయత అనే భావననే తూర్పారబడుతుంది. అది పాక్షిక ప్రయోజనాల ప్రతినిధి అనీ, అది ప్రకటించుకునే సార్వజనీనత అబద్ధమనీ అంటుంది.

నదుల మీద భారీ పెట్టుబడితో పెద్ద ప్రాజెక్టులు కట్టి పెద్ద మొత్తంలో నీరు నిలువ ఉంచి, ఒకేసారి ఎక్కువ సాగుభూమికి నీరు ఇవ్వడం శాస్త్రీయమైన ఆలోచన. దానిని కాదనడం అశాస్త్రీయత, వెనుకబాటుతనం, మూర్ఖత్వం. దాని వలన ముంపుకు గురయి, జీవనం కోల్పోయే వారి గురించి అయ్యో పాపం అనకుండా ఉండము. అంతో యింతో పునరావాసం కల్పించకుండా ఉండము. అంత మాత్రం చేత వారికి ఇబ్బంది కలుగుతుందని చెప్పి శాస్త్రీయ ప్రగతి మార్గాన్ని వదిలిపెట్టగలమా?

ఆలోపతీ వైద్యమొక్కటే శాస్త్రీయ సత్యం మీద ఆధారపడింది. అందువల్ల ప్రభుత్వం వైద్యం మీద పెట్టే ఖర్చంతా అలోపతీ మీదనే పెట్టాలి. ఇతర వైద్య పద్ధతులు అశాస్త్రీయమైనవి, అహేతుకమైనవి. వాటిని విశ్వసించడం మూర్ఖత్వం. అలాంటపుడు ఆ మూర్ఖత్వం మీద ప్రభుత్వం ఖర్చు పెట్టడం అశాస్త్రీయమవుతుంది కదా? అలోపతీ వైద్యం ఖరీదెక్కువ కావడం వల్ల అది పేదలకు అందుబాట్లో లేకపోవచ్చు. ఇతర వైద్య విధానాలు అశాస్త్రీయం కావడం వల్ల ప్రోత్సాహం కరువయి అవి కూడ అందుబాట్లో లేకపోవచ్చు. ఇది దురదృష్టమే కావచ్చును గానీ అంతమాత్రం చేత ప్రభుత్వం అశాస్త్రీయమైన వైద్య విధానాలను ప్రోత్సహించాలనడం సబబు కాదు కదా? ప్రజలు ఏ వైద్యమూ లేకచావడం విచారకరమే, కాని శాస్త్రీయ ప్రమాణాలను కాదని ప్రభుత్వం మూఢత్వాన్ని ప్రోత్సహించవచ్చునా?

చాలా అమాయకంగా చాలామంది ఆమోదించే ఈ శాస్త్రీయ దృక్పథం చాలా క్రూరమైనదని వేరే చెప్పనవసరం లేదు. మతం మార్చుకుంటావా, చంపమంటావా, అంటూ కత్తి పట్టుకొని తలలు కోసే మతవాదుల క్రూరత్వానికి ఇదేమీ తీసిపోదు.

అయితే ఈ ఉదాహరణలు వామపక్షవాదులను పెద్దగా ఇబ్బంది పెట్టవు. వీటిలోని శాస్త్రీయతకు 'బూర్జువా' అన్న విశ్లేషణం తగిలించి తప్పించుకోగలరు. మీరు పరిపాలించినచోట మీ ప్రభుత్వాలు కూడా ఇటువంటి వైఖరే అనుసరించిన ఉదంతాలు లేవా అని అడిగితే, కొన్ని పొరబాట్లు జరిగాయనో, గతితార్కికంగా వ్యవహరించడంలో విఫలమయ్యారనో సర్ది చెప్పగలరు. ఈ విమర్శే ఆధునికానంతర వాదం చెప్పే విషయమయితే అందులో వామపక్షవాదులను మరీ ఎక్కువగా ఇబ్బంది పెట్టే విషయమేమీ లేదు.

కాని సమాజ చారిత్రక క్రమంలో ఉన్న హేతువు (రీజన్) గురించి మార్క్సిజానికి ఉన్న విశ్వాసాన్నే ఆధునికానంతరవాదం ప్రశ్నిస్తుంది. శాస్త్రీయ సోషలిజానికి భూమిక అయిన ఈ చారిత్రక హేతువు కూడ, అలోపతీ వైద్యంలోని శాస్త్రీయతలాగ, చాలా అమాయకంగానే చాలా క్రూరంగా ఉండగలదని విమర్శిస్తుంది. ఈ హేతువు ఒక దృక్కోణం నుండి చేసిన రూపకల్పనే తప్ప అందులో ప్రామాణిక సత్యమేమీ లేదని అంటుంది.

సోవియట్ రష్యాలో శాస్త్రీయ చారిత్రక క్రమానికి వ్యతిరేకంగా, వ్యవసాయ సమిష్టీకరణను తిరస్కరించి, ఇంకా స్వంత ఆస్తిమీద మమకారం పోగొట్టుకోకుండా ఉన్న రైతులతో స్టాలిన్ అతిక్రూరంగా వ్యవహరించాడు. బలత్కారంగా జరిగిన సమిష్టీకరణలో రైతులు లక్షలాదిగా చనిపోయారు. ఇది కేవలం ప్రజల అభీష్టాన్ని ఖాతరు చేయని నియంతృత్వ రాజకీయ ధోరణి మాత్రమే కాదు. సత్యం తమను నడిపిస్తుందన్న శాస్త్రీయ అహంకారం కూడా ఉంది. ప్రాజెక్టు కింద మునిగిపోయే జనావాసాల జీవనాన్ని గురించి అడిగినప్పుడు 'ప్రగతి పథంలో శాస్త్రీయంగా ముందుకు పోవాలంటే ఇటువంటివి అనివార్యం మరి, ఏం చేస్తాం' అని ఇతరత్రా సున్నిత మనస్కులయిన ఆధునికవాదులు సహితం అనగలిగినట్టు, స్టాలిన్ చేసిన బలవంతపు వ్యవసాయ సమిష్టీకరణ గురించి కూడా ఇతరత్రా సున్నిత మనస్కులయిన కమ్యూనిస్టులు 'విప్లవ క్రమంలో తిరోగామి శక్తులపైన పోరాటం అనివార్యం మరి, ఏం చేస్తాం' అంటారు. మామూలుగా వీటిలో మొదటి దానిని 'బూర్జువా అభివృద్ధి'కి స్వాభావికమైన అణచివేత వైఖరిగాను, రెండవ దానిని విప్లవం కోసం పడే ఆరాటంలో జరిగే తొందరపాటు ధోరణిగాను అర్థం చేసుకోవడం జరుగుతుంది. కానీ ఇక్కడున్నది కేవలం అభివృద్ధి, విప్లవం అనే ఆకాంక్షలు మాత్రమే కాదు. ఈ రెండు దృక్పథాలలోనూ అవి కేవలం ఆకాంక్షలు కావు. అవి

శాస్త్రీయ భావనలు. సార్వత్రిక సత్యానికి వాహకమయిన చారిత్రక హేతువు వాటిని నడిపిస్తుంది. శాస్త్రీయ ప్రగతి క్రమాన్ని చారిత్రక హేతువును ఎవరికో నష్టం కలుగుతుందని వదులుకోగలమా అనే సామాన్య వైఖరి ఈ రెండు ధోరణులలోనూ ఉంది. రోగం నయం కావడానికి ఫలాన బాధాకరమైన ఆపరేషన్ తప్పనిసరి అని అమెరికాలో ఎం.ఎస్. చేసివచ్చిన వైద్య శాస్త్రజ్ఞుడు చెప్పిందే తడవుగా, దానివల్ల కలిగే బాధను 'భరించాలి మరి' అని ఇతరత్రా  ఇతరుల బాధను చూసి చలించిపోయేవారు సహితం తేలికగా అనగలుగుతారు. ఆ కోవకు చెందినవే ఈ వ్యాఖ్యలు కూడా. నిజానికి 'చారిత్రక క్రమం'లో కలిగే నష్టాలను ఇరు దృక్పథాలూ తరచుగా ఆపరేషన్‌తో పోలుస్తాయి. ఆపరేషన్‌లోని 'శాస్త్రీయ అనివార్యత' రెండు దృక్పథాల ప్రగతి పథంలోనూ ఉంది.

ఇక్కడ ఆధునికానంతరవాదం పెడుతున్న విమర్శ కేవలం నైతిక మానవతా వాద విమర్శకాదు. శాస్త్రీయమే అనుకొన్నా కొంచెం జాలి చూపించవచ్చును కదా? కొంచెం ఉపశమనం కలిగించవచ్చును కదా? అని మాత్రమే అడగడం లేదు. 'శాస్త్రీయం' 'హేతుబద్ధం' అనేవి అన్ని దృక్కోణాలనూ చీల్చి చెండాడగల ప్రామాణిక సత్యాలు కావనీ, అవి ప్రామాణికమైన మహా దృక్పథాలుగా చలామణి అవుతున్న ప్రత్యామ్నాయ దృక్పథాలు మాత్రమేననీ ఆధునికానంతర వాదం అంటుంది. అన్ని దృక్పథాల లాగ ఇవి కూడా కొందరి - లేక కొన్ని - ప్రయోజనాలను కాపాడి ఇతర ప్రయోజనాలను దెబ్బతీస్తాయనీ, వీటిని సత్యానికి ప్రమాణంగా భావించడం అహంభావానికి దారితీస్తుంది తప్ప అందులో నిజమేమీ లేదని అంటుంది.

ఇది కేవలం హితవు కాదు. 'అతి'ని కొంచెం తగ్గించుకొమ్మని చెప్పే విమర్శ కాదు. ఇది జ్ఞాన సిద్ధాంత విమర్శ. అంటే మనిషికి ప్రపంచాన్ని గురించి ఉండే జ్ఞానం స్వభావం ఏమిటి అని చెప్పే తాత్విక సిద్ధాంత రంగానికి చెందిన విమర్శ. ఆధునికమైన అన్ని దృక్పథాలకూ - బూర్జువా దృక్పథాలకూ మార్క్సిజానికీ కూడా - వర్తిస్తుంది.

దీనికి అనుబంధంగా ఆధునికానంతర వాదంలో కొన్ని విలువైన ఆలోచన లున్నాయి. వెలుగు మనకేమి చూపిస్తుందనే విషయం మీద మాత్రమే మనం ప్రధానంగా దృష్టి పెడతాం. ఇది మానవ సహజమైన వైఖరే గాని ఆధునిక దృక్పథాలు దానిని మరింతగా ప్రోత్సహిస్తాయి. ఇంకా ఎక్కువ వెలుతురు ఇచ్చే దీపాలనూ, ఇంకా ఎక్కువ దూరం వెలుగు ప్రసరింపజేసే దీపాలనూ ఆవిష్కరించుకోవడం

శాస్త్రీయత మనకు నేర్పింది. కానీ ప్రతి దీపమూ చూపించే వెలుగులే కాక దాచిపెట్టే చీకట్లు కూడా ఉంటాయనీ, మొదటిది ఎంతగా ఆ దీపం లక్షణమో, రెండవది కూడా అంతేననీ ఆధునికానంతరవాదం ఉంటుంది.

వెలుతురు - చీకటి లాంటిదే శబ్దం - నిశ్శబ్దం కూడా. 'నిశ్శబ్దం' అనేది ఆధునికానంతరవాద పరిభాషలో ఒక ముఖ్యమైన పదం. శబ్దం మీద దృష్టిపెట్టి, దాని అర్థాన్ని సునిశితంగా విశ్లేషించుకోవడం, తప్పొప్పులను హేతుబద్ధంగా వ్యాఖ్యానించుకోవడం ఆధునికవాద శాస్త్రీయత మనకు నేర్పుతుంది. కాని ఒక్కొక్క సిద్ధాంత చట్రానికి ఉండే నైజం వల్ల కొన్ని విషయాలు ఆ సిద్ధాంత విశ్లేషణలో అసలే కనిపించకుండా పోతాయని గుర్తించి వాటిని వెలికి తీయడం అవసరం అని ఆధునికానంతరవాదం మనకు గుర్తుచేస్తుంది.

దృక్కోణం, వ్యాఖ్య, సిద్ధాంతం అనే వాటిని శాస్త్రీయత - అశాస్త్రీయత అనే ప్రమాణాలతో కొలిచినప్పుడు మనం వాటిని చూసే పద్ధతికి, వాటికి అందని చీకట్లనూ, నిశ్శబ్దాన్నీ వెతికి బయటపెట్టాలనుకున్నప్పుడు మనం వాటిని చూసే పద్ధతికి చాలా తేడా ఉంటుంది. ఈ తేడాను మన దృష్టికి తేవడం ఆధునికానంతరవాదం చేసే గొప్ప మేలు.

కులం, జెండర్ అనే రెండు సమస్యలు వామపక్ష సిద్ధాంతవేత్తలకు కనిపించకుండా ఉండడానికి గల సామాజిక కారణం (ఆ సిద్ధాంతవేత్తలంతా అగ్రకులాల పురుషులు కావడం) ఎంత ముఖ్యమో, శాస్త్రీయత తన ప్రత్యేక గుణమని నమ్మే ఆ సిద్ధాంతం ఆ నమ్మకం కారణంగానే తన తర్క చక్షువులకు కనిపించని విషయాలను మానవ చక్షువులతో నిత్యం చూస్తూ ఉండి కూడా గుర్తించలేకపోవడం అంతే ముఖ్యం.

అయినప్పటికీ ఆధునికానంతరవాదం ఆధునికతను అభావం చేయగల నూతన ప్రాపంచిక దృక్పథమని నేను అనుకోవడం లేదు. అది ఆధునికతలోని లోపాలను సవరించడానికీ, దాని అహంభావాన్నీ, స్వాతిశయాన్నీ తగ్గించి, జ్ఞాన సిద్ధాంత సంబంధమైన వినయాన్ని నేర్పించడానికి మాత్రమే పనికొస్తుంది. అది చిన్న విషయం కాదు. కాని అదే సర్వం కాదు.

దీనికి గల తాత్విక కారణాన్ని సూచించి ముగిస్తాను. ఏ సత్యమూ - సైన్స్‌తో సహా పరమ సత్యం కాదనీ, అన్నీ ఒక దృక్కోణానికీ ఒక పరిస్థితికీ సాపేక్షంగా

మాత్రమే సత్యాలనీ గుర్తించిన తరువాత 'ఎంత సత్యం?' అనే తులనాత్మక పరిశీలన చేపట్టడం అవసరం. అంతా సాపేక్షం అని ప్రకటించిన తరువాత 'ఏది ఎప్పుడు ఎంత సాపేక్షం?' అన్న ప్రశ్న వేసుకోవలసి ఉంటుంది. దానికి కావలసిన తార్కిక పరికరాలు రూపొందించుకోవలసి ఉంటుంది. లేకపోతే సాపేక్షమే సర్వం అయిపోయే ప్రమాదం ఉంటుంది. ఇది ఒక కొత్త పిడివాదం అవుతుంది.

ఈ పరికరాలు ఆధునికానంతర వాదం దగ్గర లేవు. వాటి కోసం తిరిగి ఆధునికవాద నమూనాలోని జ్ఞాన సిద్ధాంతాలనే ఆశ్రయించవలసి ఉంటుంది. 'ఏది ఎంత సత్యం?' అన్న ప్రశ్న వేస్తున్నామంటేనే భిన్న సత్యాలను తూకం వేయగల ప్రమాణం ఉందని అర్థం. ఇది 'ఆధునికవాదం' భావించినట్టు - పూర్తి సత్యాన్ని తెలుసుకోగల ప్రామాణిక దృక్కోణం కానక్కరలేదు. ఏ ఒక్క దృష్టికోణానికీ సత్యమంతా దొరుకుతుందని నమ్మకపోయినా, సత్యం అనేది దృష్టి కోణాలకు ఆవల ఉందని నమ్మడం అవసరం. ఒక్కొక్క దృష్టికోణం దానిని ఒక్కొక్క సందర్భంలో ఎక్కువ తక్కువలుగా గ్రహించగలుగుతుందని అప్పుడు గుర్తించగలుగుతాం. ఆ ఎక్కువ తక్కువలను కొలవగల పరికరాలను రూపొందించుకోగలుగుతాం. ఇదేదీ ఆధునికా నంతరవాద చట్రంలో సాధ్యం కాదు. ఆధునికవాద చట్రంలోనే అవుతుంది. అయితే అది ఆధునికానంతరవాదం పెట్టే విమర్శ నుండి నేర్చుకున్న ఆధునిక వాదమైతేనే ఇప్పటిదాకా శాస్త్రీయత, హేతువు అనే భావనలను అంటిపెట్టుకొని ఉన్న అసహనం, క్రూరత్వాల నుండి బయటపడగలుగుతుంది.

మిసిమి మాసపత్రిక
నవంబరు - డిసెంబరు 1999

V

# సమస్యల్లో పుట్టి...సందేహాల్లో మిగిలి

ఒక చారిత్రక ఘట్టాన్ని మనం ఏ విధంగా చూస్తామనేది మనం దానినుండి ఏం ఆశించామనే దాని మీద ఆధారపడి వుంటుంది. ఈ శతాబ్దపు చరిత్రలో ఒక వెలుగు వెలిగి ప్రస్తుతం ఆరిపోయివున్న కమ్యూనిస్టు ప్రయోగానికి కూడా ఇది వర్తిస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థనూ, అది మానవజాతికి అందిచ్చే జీవన విధానాన్నీ విలువలనూ పట్టుదలగా వ్యతిరేకించిన శక్తిగా కమ్యూనిస్టు ప్రయోగాన్ని అర్థం చేసుకున్నట్టయితే దాని జయాపజయాలు ఒక రకంగా కనిపిస్తాయి. సమత మీద, పరస్పర సహకారం మీద ఆధారపడిన నూతన సమాజాన్ని నిర్మించే ప్రయోగంగా అర్థం చేసుకున్నట్టయితే వేరే రకంగా కనిపిస్తాయి. రెండో కోణం నుండి చూసినప్పుడు కమ్యూనిస్టు ప్రయోగంలో వైఫల్యమే ప్రధాన విషయంగా కనిపిస్తుంది. సమత, సహకారాల ప్రాతిపదికన మానవ జీవితాన్ని పునర్నిర్మించడానికి ఏం చేయాలన్న జ్ఞానం అది కొంత ఇచ్చిందిగానీ అంతకంటే ఎక్కువగా ఏం చేయకూడదన్న జ్ఞానమే ఇచ్చింది. అది కూడా జ్ఞానమే కాబట్టి అందుకు సంతోషిద్దామంటే అభ్యంతరం లేదు. కానీ మొదటి కోణం నుండి చూసినప్పుడు కమ్యూనిస్టు ప్రయోగం గొప్పమేలు చేసిందనే చెప్పుకోవాలి. విపరీతమైన అహంకారంతో ప్రపంచాన్ని మొత్తం తన పెత్తనానికి

లోబరుచుకోవడానికి దూకుడుగా ఈ రోజు ముందుకొస్తున్న అంతర్జాతీయ పెట్టుబడిదారీ విధానానికి అడ్డుకట్ట వేయడానికి ఒక సోవియట్ రష్యా అయినా లేకుండా పోయిందే అని సోషలిజాన్ని కాంక్షించేవాళ్లు అనుకోకుండా ఉండలేరు. కమ్యూనిస్టు ప్రయోగమే జరగకుండా ఉండివుంటే ఈ శతాబ్దంలో కార్మికులు, ఇతర పీడిత ప్రజలు, బడుగు దేశాల పరిస్థితి చాలా దయనీయంగా ఉండేదని గడచిన పది సంవత్సరాల కాలంలో మన కళ్ళముందు రూపం తీసుకున్న పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు ఉద్యమానికి వర్తించే ఈ వ్యాఖ్యలు మన రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రకు కూడా వర్తిస్తాయి. ఒక కోణం నుంచి కొంచెం ఎక్కువే వర్తిస్తాయి. నూతన సమాజ నిర్మాణం ఏ విధంగా జరగ్గలదన్న జ్ఞానాన్ని అందియ్యడంలో మొత్తంగానే కమ్యూనిస్టు ఉద్యమం విఫలమైనా, ఇతర దేశాలలో కొన్ని కొత్త ఆలోచనలను ప్రతిపాదించి ప్రయోగానికి పెట్టిన కమ్యూనిస్టు నాయకులూ, సిద్ధాంతవేత్తలూ ఉన్నారు. బలప్రయోగాన్ని ప్రధాన సాధనంగా భావించినవారిలో లెనిన్, మావోలు; సాంఘిక కృషిని ప్రధాన సాధనంగా ఎంచిన వారిలో గ్రామ్‌సీ ఆ పని చేశారు. కానీ మన రాష్ట్రంలోనే కాదు, మన దేశంలో సహితం కమ్యూనిస్టు ప్రయోగానికి ఒక్క కొత్త ఆలోచన అందిచ్చిన సిద్ధాంతవేత్త గానీ నాయకుడు గానీ లేరు. పార్టీ నాయకులే కాదు, యూనివర్సిటీలోనూ బయటా ఉండే మేధావులలో సహితం, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఎంతో కొంత సమర్థంగా అన్వయించడం చేతనయిన వారుంటే ఉండవచ్చును గానీ ఆ సిద్ధాంతానికి ఒక్క కొత్త ఆలోచనయినా చేర్చినవారు ఒక్కరూ లేరు.

మనకు తెలివితేటలేం తక్కువ లేవు కాబట్టి దీనికి కారణాన్ని తెలివితక్కువ తనంలో కాక మన దేశ తాత్విక సంప్రదాయంలో వెతుక్కోవాలి. బ్రాహ్మణీయ తాత్విక సంప్రదాయం భాష్యకారుల సంప్రదాయం. 'ఇది నేను చెప్తున్నాను' అని ప్రకటించిన బ్రాహ్మణ పండితుడు ఒక్కడూ లేడు. పరిస్థితులు మారుతూ ఉన్నాయి కాబట్టి ఒకసారి కాకపోతే ఒకసారి కొత్తగా మాట్లాడక వారికి కూడా తప్పలేదు గానీ అప్పుడు కూడా 'నేను వేదానికి భాష్యం చెప్తున్నాను' అని మాత్రమే అన్నారు. స్వంత ఆలోచనకు బ్రాహ్మణీయ సంప్రదాయంలో 'లెజిటిమెసీ' లేదు. అది అన్ని ఉద్యమాలలోకీ ప్రవేశించి సిద్ధాంత నిబద్ధత, క్రమశిక్షణ అనే కొత్త పునాదులను వెతుక్కొని గట్టిగా స్థిరపడింది. సమర్థంగా బలప్రయోగం చేయడంలో పీపుల్స్‌వార్

అభివృద్ధి చేసిన అసాధారణమైన నైపుణ్యమొకటి తప్పిస్తే (నూతన సమాజ నిర్మాణానికది ఉపయోగపడుతుందని అనుకుంటే), కమ్యూనిస్టు లక్ష్యసాధన ఏ విధంగా జరగాలన్న విషయంలో సృజనాత్మకమైన చేర్పు ఒక్కటీ మన రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమం చేయలేదు. మన రాష్ట్రమేమిటి, దేశంలోనే చేయలేదు.

దీని అర్థం కమ్యూనిస్టు ఉద్యమం మన రాష్ట్రంలోనయినా, దేశంలోనయినా సాధించింది ఏమీ లేదని కాదు. మన పొరుగు రాష్ట్రాలయిన ఒరిస్సా, మధ్యప్రదేశ్‌లను చూస్తే మన రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమం బలంగా ఉండడం వల్ల ఎంత మేలు జరిగిందో అర్థం అవుతుంది. దోపిడీ, అణచివేత, ప్రతిఘటన, తిరుగుబాటు అనే మాటలు, సమాజాన్ని పాలకవర్గాలు - ప్రజలు అని వర్గీకరించి వీరి భిన్న ప్రయోజ నాలను ప్రాతిపదిక చేసుకుని తర్కించే ఆలోచనారీతి మన సాంఘిక నుడికారంలో భాగం అయిపోయాయి. ఈ నుడికారం ఎరుగని ప్రజలను చూసినప్పుడు తప్ప దీని విలువ ఏమిటో అర్థం కాదు. ఆ నుడికారం తెలిసి వుండి కూడా అణచివేతను అధిగమించలేకపోవడం ఒకెత్తయితే, ఆ భావనలతో పరిచయం లేకపోవడం వల్ల ఏదో అసంతృప్తి అనుభవిస్తూ కూడా అది అణచివేత అని గుర్తించలేక పోవడం వేరొక ఎత్తు. ఇప్పుడీ ఆలోచనలు మన రాష్ట్రంలో అన్ని ఉద్యమాల సామాన్య పరిభాషే  గానీ, వాటిని మొదట ప్రవేశపెట్టింది, చాలా అణచివేతకు ఓర్చి ప్రజలకు అలవాటు చేసింది కమ్యూనిస్టులే.

భాష తెలీకపోతే ఏమయింది, భావం తెలీదా అనుకోవడం పొరబాటవుతుంది. భాషే సత్యం అన్న 'ఆధునికానంతరవాద' తాత్త్విక వైఖరిని ఆమోదించనవసరం లేదు గానీ భాష కేవలం అంతకుముందే మనకు 'తెలిసిన' విషయానికొక వ్యక్తీకరణ సాధనం కాదనీ, బాహ్య వాస్తవికతను వ్యక్తం చేయడంలోనే కాక అది మన ఎరుకలోకి రావడంలో కూడా భాషకు కీలక స్థానం ఉందనీ గుర్తించినట్టయితే అణచివేతను అవ్యక్తమైన అసంతృప్తిగా కాక అణచివేతగానే గుర్తించడంలో కమ్యూనిస్టులు ప్రజలకలవరచిన పరిభాషకు చాలా ప్రాముఖ్యం ఉందని కూడా చూడగలుగుతాం. అయితే కమ్యూనిస్టులు నిర్వహించిన పోరాటాలు భౌతిక ఫలితాలు కూడా చాలా ఇచ్చాయి. ఒక్కొక్క గ్రామంలోనూ ఒక్కొక్క కార్ఖానాలోనూ వచ్చిన ఫలితాలను ఏకరువు పెట్టనక్కరలేదు గానీ ప్రభుత్వ పాలనా విధానాలలో వచ్చిన మార్పులను ప్రస్తావించడం అవసరం.  భారత దేశంలో భూసంస్కరణలు శాసన రూపం తీసుకోవడానికొక ముఖ్య కారణం కమ్యూనిస్టులు

నిర్వహించిన భూమి పోరాటాలు. కాగా, 1970లలో సీలింగ్ చట్టాన్ని సవరించి బాగా తగ్గించడానికి ప్రత్యక్ష కారణం నక్సలైట్ ఉద్యమం. తానే ఇందిరాగాంధీకి సీలింగ్ చట్టాన్ని సవరించమని సలహా ఇచ్చానని పి.వి.నరసింహారావు సగర్వంగా చెప్పుకుంటే చెప్పుకోవచ్చును గాక, అతనికి ఆ ఆలోచన రావడానికి కారణం నక్సలైట్ ఉద్యమం. మన రాష్ట్రంలోనయితే ఆదివాసీలకు ఎంతో కొంత మేలు చేసిన ఐటిడిఎ, గిరిజన సహకార సంఘాల ఏర్పాటు, '1 ఆఫ్ 70' సవరణ శ్రీకాకుళ పోరాటం పర్యవసానంగా వచ్చినవే. ఇటువంటి ఉదాహరణలు ఇంకా కూడా ఇయ్యవచ్చును.

ప్రజల చైతన్యం మీద, ప్రభుత్వ విధానాల మీద కమ్యూనిస్టులకుండిన ప్రభావం కేవలం వారి భౌతిక బలాన్ని బట్టి ఉండలేదు. దానిని మించి ఒక నైతికబలం కమ్యూనిస్టు ఉద్యమానికి ఉండింది. న్యాయానికి నిలబడతారనీ, అవినీతితో రాజీ పడరనీ, త్యాగానికి వెనుకాడరనీ, నిర్బంధానికి భయపడరనీ ఒక అభిప్రాయం ఉండింది. ఈ రోజు ఆ అభిప్రాయం లేనేలేదని అనలేము గాని బాగా బలహీనపడింది. అది బలహీనపడిన మేరకు కమ్యూనిస్టుల ప్రభావం కూడా బలహీనపడింది.

సిపిఐ కాంగ్రెస్‌తో చెలిమి చేసిన నాటి నుండి ఇది మొదలయింది. దానివల్ల భౌతికంగా (అంటే నిర్మాణం పటిష్టతలోనూ, కార్యకర్తల సంఖ్య, నిబద్ధతలలోనూ, ఉద్యమాల బలంలోనూ) సిపిఐ ఏం పొందిందో, ఏం కోల్పోయిందో గానీ నైతికమైన గుర్తింపు, గౌరవం చాలా కోల్పోయింది. తరువాతి కాలంలో ఒక దశాబ్దంపైగా సిపిఐ, సిపిఐ(ఎం)లు రెండూ తెలుగుదేశం పార్టీతో కలగలిసి తిరిగినప్పుడు కూడా ఇదే ఫలితం కలిగింది. కమ్యూనిస్టు సిద్ధాంతంలో నైతికతకు ఒక స్పష్టమైన స్థానం లేకపోవడం వల్ల ఈ విషయాన్ని గుర్తించడం సహితం ఆ పార్టీలకు కష్టమయింది. పాలకవర్గాల దిగజారుడుతనాన్ని నిందించడానికీ, ప్రజలను ఆకర్షించడానికీ అక్కరకొచ్చే సాధనంగా తప్ప నైతికతకు కమ్యూనిస్టులు నమ్మే సిద్ధాంత దృక్పథంలో స్వతంత్రమైన స్థానమేమీ లేదు. 'పోరాట అవసరాలు' దానికంటే ఎందుకు ముఖ్యం కాదో చెప్పగల ప్రమాణమేదీ లేదు. అందువల్ల సిపిఐ, సిపిఐ(ఎం)లు తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవడమే గాక ఆ పార్టీ అంతర్గత సంక్షోభాలలో ఆ పార్టీ అధినాయకుడిని వెనకేసుకొచ్చి, అతనిని వ్యతిరేకించినవారిని తెలుగుదేశం కార్యకర్తలతో సమానంగా దుయ్యబట్టిన సందర్భాలనేకం ఉన్నాయి. ఎన్నికల

పొత్తుకు ఇది ఏ విధంగా అవసరం? అన్న సందేహం సహితం వారికి వచ్చినట్లు కనిపించదు.

1960లలోనే అప్పటికి సిపిఐలో అంకురించిన ఈ లక్షణాల కారణంగానే నక్సలైట్ ఉద్యమం ఆవిర్భావాన్ని రాజకీయంగా ఆహ్వానించిన వాళ్లెందరున్నారో నైతికంగా ఆహ్వానించిన వారూ అందరున్నారు. సిపిఐ ఆ తరువాత కాంగ్రెస్‌తో పూర్తిగా కలిసిపోవడం, 1980లలో మన రాష్ట్రంలో సిపిఐ, సిపిఐ(ఎం)లు తెలుగుదేశం పార్టీతో అంతగానూ ఒకటైపోవడం నక్సలైట్ ఉద్యమానికి ఉండే ఈ ఆకర్షణను పెంచింది.'వాళ్ల సిద్ధాంతాలతో విభేదిస్తాను గానీ వాళ్ల నిజాయితీనీ, విలువలనూ గౌరవిస్తాను' అని 1990 దాకా కూడా తెలంగాణలో నక్సలైట్ల గురించి అనే వాళ్లుండేవారు. ఇప్పుడా పరిస్థితి నక్సలైట్ ఉద్యమానికి కూడా బాగా తగ్గింది. దీనికి దృష్టాంతాలూ, తార్కాణాలూ ఏకరువు పెట్టనవసరం లేదు.

ఈ బలాన్ని అన్ని కమ్యూనిస్టు పార్టీలు తిరిగి పొందడం అవసరం. సిపిఐ, సిపిఐ(ఎం)లు చాలాకాలం తరువాత స్వతంత్రంగా పనిచేస్తున్నాయి. ఇది కేవలం ఒక తాత్కాలికమైన ఎత్తుగడ కాదనీ, సూత్రబద్ధమైన నిర్ణయమనీ ప్రజలను నమ్మించ గలిగితే (అదసలు నిజమైతే) వ్యవస్థను విమర్శించే నైతిక అర్హతను తిరిగి పొందగలుగుతాయి. దానివల్ల రాగల బలం అంతా ఇంతా కాదు. నక్సలైట్ పార్టీలు కూడా డబ్బుల సేకరణలో, బలప్రయోగంలో, సమస్యలను ఎదుర్కొనడానికి వేసే ఎత్తుగడలలో, తమ మధ్య ఉన్న అంతర్గత కలహాలను పరిష్కరించుకోవడానికి అనుసరించే విధానాలలో, ప్రజలలో పనిచేస్తున్న ఇతర ఉద్యమాలతో వ్యవహరించే పద్ధతిలో కొన్ని ప్రామాణికమైన విలువలను పాటించడం నేర్చుకోవాలి. ఆర్థిక పునర్వ్యవస్థీకరణ వల్ల పేద, పీడిత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలలో వారికి అండగా నిలిచే పాత్ర కమ్యూనిస్టులు పోషించాలంటే ఇది కనీస అవసరం. అంతకుమించి కమ్యూనిస్టు ఉద్యమం తన లక్ష్యమైన సమసమాజం వైపు పురోగమించాలంటే ఇది కేవలం ఆచరణకు సంబంధించిన పై మార్పులు సరిపోవు. సిద్ధాంత వివేచన కూడా చాలా అవసరం. కానీ ఈ మధ్యకాలంలో బలంగా చర్చకు వచ్చిన ముఖ్యమైన సైద్ధాంతిక సందేహాలకు సహితం కమ్యూనిస్టు పార్టీలేవీ సంతృప్తికరమైన సమాధానం చెప్పలేకపోయాయి. పార్టీలే కాదు, సిద్ధాంత రంగంలో కృషి చేయడమే తమ ప్రధాన పాత్ర అయిన మేధావులు సహితం చెప్పలేకపోయారు. కులం, జెండర్ అనే రెండింటిని ఉదాహరణగా తీసుకోవచ్చు. వీటిని చారిత్రక

భౌతికవాదం ఏ విధంగా వివరిస్తుందనే ప్రశ్నకు తమ సంతృప్తి కోసం ఏదో ఒక జవాబు చెప్పుకోవడం తప్ప ఇతరులను - అందరినీ కాకపోయినా ఒకరిద్దరినయినా - ఒప్పించగల వివరణ ఏదీ ఇవ్వలేక పోయారు.

ఈ సిద్ధాంత లోపాన్ని కమ్యూనిస్టు ఉద్యమం ఎప్పటికయినా అధిగమించ గలదో లేదో గానీ పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా, పేదలకు అండగా నిలబడే పాత్ర ఏదయితే కమ్యూనిస్టు ఉద్యమం సమర్థంగానే నిర్వహించగలదని ఈ శతాబ్దపు చరిత్ర రుజువు చేసిందో ఆ పాత్రను తిరిగి శక్తివంతంగా నిర్వహించడానికి అవసరమైన భౌతిక బలాన్ని, నైతిక సాధికారతనూ అది తిరిగి పొందుతుందని ఆశిద్దాం. రాబోయే రోజులలో అది చాలా అవసరం అవుతుంది.

వార్త దినపత్రిక
24 డిసెంబర్ 1999

V

# ఎరిక్ ఫ్రామ్ : మనిషిని మనిషిగా స్వీకరించే సోషలిజం

'సామాజిక అస్తిత్వం సామాజిన చైతన్యానికి పునాది' అన్నది మార్క్సిజంలోని ప్రధాన సూత్రాలలో ఒకటి. మార్క్సుకు ముందు ఈ విషయాన్ని ఎవరూ గుర్తించ లేదనడం అవాస్తవమవుతుంది. ఆ విధంగా మార్క్స్ కూడా ఎప్పుడూ అనలేదు. నిజానికి ఈ సూత్రంలోని 'పునాది' అనే మాటను అది సూచించే సంబంధాన్ని ఏ విధంగా అర్థం చేసుకుంటామనే విషయంలో తేడాలుంటాయి గానీ, సామాజిక జీవితాన్ని గురించి మనుషులు చేసే ఆలోచనలను శాస్త్రీయంగా విశ్లేషించే వారెవరైనా సామాజిక అస్తిత్వం మీద మొదట దృష్టి పెట్టక తప్పదు.

అయినప్పటికీ సంప్రదాయక ('భావవాద') సామాజిక తత్వశాస్త్రం మీద ఈ ('భౌతికవాద') సూత్రాన్ని ఆయుధంగా సంధించి ఒక సమగ్రమైన చారిత్రక సిద్ధాంతాన్ని ఆ ప్రాతిపదిక మీద నిర్మించిన ఘనత మార్క్సుకే దక్కుతుంది. ఆలోచనలకు జీవితం పునాది అనే ఈ భౌతికవాద సూత్రం (అందులో ఎన్ని తాత్వికసమస్యలున్నప్పటికీ) ఈ రోజు ఎంతగా మన 'కామన్‌సెన్స్'లో భాగమయిపోయిందంటే 'అదేం పెద్ద గొప్ప సిద్ధాంతమా?' అని ఎవరైనా ఆశ్చర్యంగా అడగొచ్చు. అయితే అది మనుషుల సామాన్య ఆలోచనారీతిలో భాగం కావడం మార్క్సిజం సాధించిన విజయమేనని చెప్పక తప్పదు. సామాన్య మానవ

ఆలోచనారీతిలో భాగమయిపోవడమే ఒక ఆలోచన సాధించగల అతిగొప్ప విజయమనుకుంటే మార్క్సిస్టు భౌతికవాదం ఆ విజయాన్ని సాధించినట్టే.

అంత మాత్రం చేత అందులోని తాత్విక సమస్యలు పరిష్కారమయి పోయినట్టు కాదు. సామాన్య మానవ ఆలోచనా రీతులలో తాత్వికంగా సమస్యాత్మక మైనవి అనేకం ఉంటాయి కాబట్టి ఇక్కడ వైరుధ్యమేం లేదు.

మనుషుల చైతన్యాన్ని వారి భౌతిక అస్తిత్వం నిర్ణయిస్తుందని ఎందుకు భావించాలి? నిర్ణయించే ఆ క్రమం ఏమిటి? ఆ అభిప్రాయానికి రుజువేమిటి? ప్రపంచంలో మనకు కనిపించే విభిన్నమయిన మానవ ఆలోచనా రీతులను అర్థం చేసుకోవడానికది సరిపోతుందా? పూర్తిగా వ్యక్తిగతమైన ఆలోచనా రీతులను ఒక పక్కన పెట్టినా! సామాజిక ఆలోచనా స్రవంతులను అర్థం చేసుకోవడానికి సరిపోతుందా? నాజీ వాదాన్నీ, గాంధీ వాదాన్నీ, మత అసహనాన్నీ, సూఫీ వాదాన్నీ, మదర్ థెరెసాను, అణుయుద్ధ దాహాన్నీ, అన్నిటినీ అర్థం చేసుకోవడానికి సరి పోతుందా?

ఈ ప్రశ్నలు వేసుకోవడానికి సాహసించిన మార్క్సిస్టులలో ఎరిక్ ఫ్రామ్ ఒకరు. బహుశా ఒక్కరేనని కూడా అనవచ్చునేమో. తనకూ తన తరం యూరోపియన్లకూ బాగా పరిచయం ఉన్న నాజీ వాదాన్నీ, యుద్ధోన్మాదాన్నీ, పెట్టుబడిదారీ సరుకుల దాహాన్నీ ఉదాహరణలుగా తీసుకొని అతను ఈ ప్రశ్నలకు జవాబు చెప్పే ప్రయత్నం చేసాడు. విజయం సాధించాడని అనలేము గానీ చాలా విలువయిన విశ్లేషణ చేసాడు.

ఎరిక్ ఫ్రామ్ గొప్ప ఆశావాది. అతనిది తెచ్చిపెట్టుకున్న ఆశావాదం కాదు, స్వచ్ఛమైన ఆశావాదం. అది అవాస్తవికమయినా దానిని గౌరవించవచ్చును. మార్క్స్ ఆలోచనల తాత్విక మూలాలలోనే మానవ అస్తిత్వాన్ని గురించి, నైజాన్ని గురించి బలమైన ఆశావాదం ఉంది. అయితే మార్క్సిస్టులందరూ స్వచ్ఛమైన ఆశావాదులు కాదు. 'బడితె చేతిలో ఉంటే ఈ ప్రపంచం బాగుపడక చస్తుందా' అనుకునే వాళ్లు చాలామంది ఉన్నారు. మార్క్సిస్టులు అధికారానికి దగ్గరయ్యే కొద్దీ వీరి సంఖ్యే మెజారిటీ అవుతూ ఉంటుంది. దీనికి కారణం కూడా మార్క్స్ సిద్ధాంతంలోనే ఉంది గానీ ఆ విశ్లేషణలోకి పోవడానికిది సందర్భం కాదు.

మనుషుల చైతన్యం మెదడుకు సంబంధించినది (ఆలోచనలు తలలో ఉంటాయి) అనుకున్నంత కాలం, చైతన్యాన్ని అస్తిత్వం నిర్ణయిస్తుందన్న సూత్రాన్ని 'రుజువు' చేయడం సులభమే. అయితే దానివల్ల మనకు అర్థం అయ్యేది స్వల్పమే.

ఒక చెట్టు ఏ విధంగా ఉంటుందో, ఆ చెట్టుకు సంబంధించి మన ఆలోచనలలో ఉండే చిత్రం కూడా అదే విధంగా ఉంటుంది కదా. కాబట్టి మన జీవిత నైజం ఎట్టిదో దానిని గురించి మనకుండే చైతన్యమూ అట్టిదే.

దీనిని 'ప్రతిఫలన సిద్ధాంతం' అంటారు. దీనిని మనుషులకు చెట్ల స్వరూపాన్ని గురించి ఉండే జ్ఞానానికే కాక, సామాజిక చైతన్యానికి కూడా అన్వయించడంలో ఉండే ఇబ్బందిని భౌతికవాదులు తొలినాడే గమనించారు. మనుషులలో చాలా మందికి తమ జీవిత ప్రయోజనాలకు వ్యతిరేకమైన ఆలోచనలుంటాయి. కాబట్టి చైతన్యం అస్తిత్వాన్ని ఉన్నదున్నట్టు ప్రతిబింబిస్తుందని నమ్మకూడదని భౌతికవాద తత్వవేత్తలు అనసాగారు. సామాజిక అస్తిత్వమే తన అసలు నైజాన్ని కప్పిపెట్టి తలకిందులుగా కనిపిస్తుందని (ఇది ప్రత్యేకించి పెట్టుబడిదారీ 'సరుకుల మాయ'కు ఉండే లక్షణమని), పాలకవర్గాలకు ఆలోచనల సాధికారతపైన ఉండే ఆధిపత్యం వల్ల వారి ప్రయోజనాలే పాలితవర్గాల ప్రయోజనాలుగా వారు ప్రచారం చేయగలుగు తారని, ఇత్యాది కారణాలవల్ల సామాజిక చైతన్యం సామాజిక అస్తిత్వాన్ని ఉన్నదున్నట్టు ప్రతిబింబించదని అనసాగారు.

ఈ సవరణతో స్వీకరించినా చరిత్రలో కనిపించే అన్ని రకాల చైతన్య రీతులనూ - పైన చెప్పినట్టు నాజీ వాదం నుండి మదర్ థెరిసా దాకా - ఈ సిద్ధాంతం వివరించగలదని నమ్మటం కష్టం. కానీ ఇంతకంటే మెరుగయిన వివరణ ప్రతిఫలన సిద్ధాంతంలో లేదు. దానిని సవరించే హెచ్చరికలలోనూ లేదు.

కానీ మనస్తత్వ శాస్త్రం - ముఖ్యంగా సైకో ఎనాలిసిస్ - అభివృద్ధి చెందిన క్రమంలో చైతన్యం మెదడుకు సంబంధించిన విషయం కాదనీ, వ్యక్తిత్వానికి సంబంధించిన విషయమనీ అర్థమయింది. అప్పుడు చైతన్యాన్ని వివరించడానికి చెట్టు సామ్యం ఎందుకూ కొరగాదు. ఇంకా సరిగ్గా చెప్పాలంటే చైతన్యానికి సంబంధించిన భౌతిక ప్రక్రియ - 'ఆలోచించడం' అనే క్రియ - మెదడులోనే జరిగిన ప్పటికీ చైతన్యానికి సంబంధించిన వస్తువు లేక విషయం మెదడుకు కాక వ్యక్తిత్వానికి చెందినది. చెట్టునో, కుర్చీనో మనం చూడడం అనేది మన వ్యక్తిత్వంతో నిమిత్తం లేని భౌతిక క్రియ కాబట్టి చెట్టు లేక కుర్చీ అనే ఊహ లేక భావన భౌతిక వాస్తవికతకు ప్రతిఫలనం అనడం ఒకెత్తు. సామాజిక చైతన్యాన్ని వివరించడానికి ఇది కనీసం ఒక పోలికగా కూడా పనికిరాదు.

మరి మనిషి వ్యక్తిత్వం ఏ విధంగా రూపం తీసుకుంటుంది? దానిని భౌతిక జీవితమే నిర్ణయిస్తుందని రుజువు చేయగలమా? చేయగలిగినట్టయితేనే మానవ చైతన్యాన్ని మానవ భౌతిక అస్తిత్వం నిర్ణయిస్తుందని చెప్పగలం. ఈ ప్రయత్నం

చేయనంత కాలం మార్క్సిజం - ప్రత్యేకించి, చారిత్రక భౌతికవాదం - అసంపూర్ణంగానే ఉంటుంది.

ఆ ప్రయత్నమే సైకో ఎనాలిసిస్ ప్రాతిపదికగా ఎరిక్ ఫ్రామ్ చేసాడు. కానీ ఫ్రాయిడ్‌ను మౌలికంగానే సవరించి వేసాడు. మానవ లైంగికత (ఫ్రాయిడ్ ఈ మాటను మామూలుగా వాడే అర్థం కంటె విశాలమైన అర్థంలో వాడతాడు) బాల్యంలో వ్యక్తమయ్యే రూపాలకూ కుటుంబ పెద్దల ద్వారా అమలయ్యే సామాజిక నియమాలకూ మధ్య నుండే వైరుధ్యాన్నీ దాని పర్యవసానాలనూ ప్రాతిపదిక చేసుకొని ఫ్రాయిడ్ మనిషి వ్యక్తిత్వం రూపొందే క్రమాన్ని వివరిస్తాడు.

ఎరిక్ ఫ్రామ్ ఫ్రాయిడ్ విశ్లేషణలను అనేక సందర్భాలలో వాడుకుంటాడు గానీ, వ్యక్తిత్వ విశ్లేషణకు వేరే ప్రాతిపదిక ప్రతిపాదిస్తాడు. మానవనైజాన్ని నిర్వచించి దానిని పునాది చేసుకొని తన విశ్లేషణను రూపొందిస్తాడు. మానవ నైజాన్ని నిర్వచించడ మంటే మనుషులు ప్రాథమికంగా మంచివారని గానీ, ప్రాథమికంగా చెడ్డవారని గానీ ప్రకటించడం కాదు. మానవ అస్తిత్వ నైజాన్ని (ఆంటాలజీ - ontology) వివరించడం.

మార్క్సుకు ముందు తత్వవేత్తలందరూ మానవ నైజాన్ని సూత్రీకరించారని, మార్క్స్ ఆ పని చేయలేదని ప్రతీతి. మార్క్సిస్టులలో ఇతరత్రా విభేదాలున్నా వారు కూడా (గ్రామ్‌సీ, లెనిన్, అల్థూజర్‌లను ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు) ఈ మాటే అంటారు. అనడమే కాక దానిని మార్క్స్ విశిష్టతగా భావిస్తారు కూడ. మార్క్స్ అటువంటి సూత్రీకరణ చేయక పోవడానికి ఒక కారణం ఉంది. ఆయన దృష్టిలో ఇప్పటివరకు మనిషి నిండయిన మనిషే కాదు. మనిషి తన సృజనశక్తిని అపరిమితంగా అభివృద్ధి చేసుకోవడానికి అవసరమైన భౌతిక ఉత్పాదన శక్తిని సాధించుకున్న తరువాతే అసలయిన మనిషి ఉద్భవించడం జరుగుతుంది. మనిషి 'ఒకరితో అందరూ అందరిలో ఒకరుగా' తన సృజన శక్తిని వెయ్యి రీతుల ఆవిష్కరించుకునే దశ అప్పుడు మొదలవుతుంది. అదే అసలయిన మానవ చరిత్ర. ఆ లోపల ఉన్న మనిషి ఇంకా అవసరాలకూ, అపరిపక్వమైన ఉత్పాదనా శక్తికీ బానిస. ఈ మనిషినే నిర్వచించి, 'మనిషి ఇది, అది' అంటూ సూత్రీకరించడంలో అర్థం లేదు. చేయవలసింది ఈ మనిషి నిజమైన 'మనిషితనాన్ని' సాధించడానికి అవసరమైన ఉత్పాదనశక్తిని పొందే స్థితికి ఎదిగే చారిత్రక క్రమంలోని వైరుధ్యాలను విశ్లేషించడం, వాటిని ముందుకు నడిపించడం. తరువాత రాగల దశకూ ప్రస్తుతం మనం బతుకుతున్న 'చరిత్ర పూర్వ' దశకూ మధ్య ఒక అగాధం ఉంది. దానికి ఆవలా ఈవలా ఏ విషయమూ ఒకటి కాదు. అందువల్ల ఈవల నిలబడి ఆవల ఆవిర్భవించబోయే మనిషిని నిర్వచించడం నిరర్థకం.

నిర్వచనం అక్కరలేదని భావించే ఈ ధోరణిలోనూ ఒక నిర్వచనం ఉంది. అసలయిన చరిత్ర మొదలయినాక మనిషి ఎప్పటికప్పుడు తనను వినూత్నంగా నిర్వచించుకోవడం జరుగుతుంది. నిరంతర పునర్నిర్వచనమే అసలైన మనిషి నైజం. అప్పటివరకు జరిగే చరిత్ర పూర్వ దశ అంతా ఆ స్థితికి బీజమైన అనంత ఉత్పాదన శక్తిని అందుకునే క్రమమే తప్ప వేరే ఏమీ కాదు కాబట్టి, చరిత్ర పూర్వదశలో మనిషి ప్రధాన లక్షణం ఉత్పాదన క్రియ, లేక సృజనాత్మక శ్రమ. అదే ప్రస్తుతానికి మనిషి నైజం. ఆ తరువాత ఒక స్థిరమైన నైజమంటూ లేకపోవడమే మనిషి నైజం.

ఇది ఎందుకయినా పనికొస్తుందేమో గానీ మనం మొదట్లో వేసుకున్న ప్రశ్నకు - సామాజిక అస్తిత్వం సామాజిక చైతన్యాన్ని నిర్ణయించే క్రమం ఎటువంటిది? అనే ప్రశ్నకు - జవాబు చెప్పడానికి మాత్రం పనికిరాదు.

ఎరిక్ ఫ్రామ్ మానవ నైజాన్ని నిర్వచించడం అవసరమని నమ్మిన ఒకే ఒక మార్క్సిస్టు. అయితే దాని అర్థం స్వభావ రీత్యా మనుషులు ప్రాథమికంగా స్వార్థ పరులనో, నిస్వార్థపరులనో, మంచివాళ్ళనో, చెడ్డవాళ్ళనో ప్రకటించడం కాదు; మానవ అస్తిత్వ నైజాన్ని నిర్వచించడం. ఇతర జంతువుల ప్రవర్తన ప్రధానంగా వాటి జన్యువులలోనే నిర్ణయించబడి ఉంటుంది. మనిషిలో జన్యువులు నిర్ణయించేది కొంచెమే. మనిషి అనివార్యంగా తన చుట్టూ ఉన్న పరిసరాలతో - ఇతర మనుషులతో సహా - ప్రయత్న పూర్వకంగా, సంకల్ప పూర్వకంగా వ్యవహరించాలి. ఇది మానవ అస్తిత్వ నైజంలోనే ప్రాథమిక అంశం.

రెండవది ఏమిటంటే తన పరిసరాలతోనూ ఇతర మనుషులతోనూ మనిషి ఏర్పరచుకునే సంబంధాలు స్థూలంగా రెండు రకాలు. మొదటి రకానికి ప్రేమ అనేది సంకేతం. స్నేహం, సహకారం, సానుభూతి, పరస్పరత మొదలయిన గుణాలు ఈ కోవకు చెందినవి. వీటికి ఒక సూచికగా ఫ్రామ్ 'ప్రేమ' అనే మాటను ప్రయోగిస్తాడు. రెండవ రకానికి చెందిన గుణాలకు ఫ్రామ్ పరిభాషలో 'విధ్వంసం' అనే మాట ఒక సూచిక, లేక సంకేతం. ద్వేషం, ఈర్ష్య, ఆధిపత్యం మొదలయినవి ఈ కోవకు చెందిన గుణాలు.

ఈ రెండు రకాలుగా మనుషులు తమ పరిసరాలతో సంబంధాలు నెలకొల్పుకుంటారు. ఇవి రెండూ మానవ సహజమైనవే, ఈ అర్థంలో 'మానవీయ మైనవే.' మనం అమానుషం, అమానవీయం అనేవి కూడ పూర్తిగా మానవీయమైన గుణాలే. ఇతర జంతువులు ఆత్మరక్షణ కోసము, ఆహారం కోసము క్రూరంగా ప్రవర్తిస్తాయి. ఆనందం కోసం క్రూరంగా ప్రవర్తించగల ఏకైక జంతువు మనిషి. (మన అహంకారం ఎంతటిదంటే దీనిని మనం 'పశుత్వం' అంటాం!)

ఒక్కొక్క సామాజిక వ్యవస్థలో, ఒక్కొక్క సామాజిక వర్గంలో ఎదిగే పిల్లలు, బతికే పెద్దల వ్యక్తిత్వాలలో ఈ రెండు కోవలకు చెందిన ప్రవర్తనా రీతులు, గుణాలు, విలువలు, ఆలోచనలు ఏ విధంగా నెలకొంటాయన్న విషయాన్ని ఎరిక్ ఫ్రామ్ తన రచనలలో సైకో ఎనాలిసిస్‌కు చెందిన విశ్లేషణా పరికరాల సహాయంతో విపులంగా వివరిస్తాడు. తద్వారా సామాజిక అస్తిత్వం వ్యక్తిత్వాలనూ ఆపైన చైతన్యాన్నీ నిర్ణయించే తీరును వివరిస్తాడు. వర్గమే అంతిమ నిర్ణాయకశక్తి అన్న తన రాజకీయ విశ్వాసాన్ని 'రుజువు చేసేయడం' కోసం అనేక సాధారణ జీవిత పరిస్థితులకు వర్గ ప్రత్యేకతను ఆపాదిస్తున్నాడన్న సందేహం తరచుగా వచ్చినప్పటికీ, 'ఆర్థిక పునాది'ని మాత్రం విశ్లేషించి మొత్తం వివరించినట్టు ప్రకటించే సగటు మార్క్సిస్టు సామాజిక విశ్లేషణతో పోలిస్తే ఆయన రచనలు చాలా ఆసక్తికరమైనవి. తన సమకాలీన యూరోపియన్ సమాజంలో విధ్వంసం అనేదే ప్రధాన గుణం కావడం ఫాసిజానికి అనుకూలమైన వ్యక్తిత్వాలను తయారు చేసిందని ఫ్రామ్ చాలా ఆసక్తికరంగా వివరిస్తాడు.

విధ్వంసం ప్రేమలాగ ఎప్పుడూ మానవ ప్రవర్తనా రీతులలో ఉండే గుణమేనని ఒప్పుకుంటూ కూడ, ప్రేమదే పైచేయి అయ్యే సామాజిక పరిస్థితుల రూపకల్పన కోసం కృషి చేద్దాం రమ్మని తన పాఠకులను ఫ్రామ్ ఆహ్వానిస్తాడు. ఇది కేవలం సామాజిక పరిస్థితులకు సంబంధించిన విషయమేనా అన్న సందేహం ఫ్రామ్ రచనల నుండే వస్తుంది. ఆ విషయం అతనే చూడలేకపోవడం అతని ఆశావాదం ఫలితం. ఏమయితేనేం ఇది మార్క్సిజాన్ని మానవ భూమిక మీద నిలబెట్టే ప్రయత్నమని చెప్పవచ్చు. తన రాజకీయ సిద్ధాంతం 'హ్యూమనిస్ట్ సోషలిజం' అని ఎరిక్ ఫ్రామ్ అంటాడు. అంటే మనిషి అస్తిత్వ నైజాన్నీ దాని పర్యవసానాలనూ వాస్తవికంగా స్వీకరించే సోషలిస్టు ఆదర్శమని అర్థం. ఆ పర్యవసానాలను ఫ్రామ్ విశ్లేషించే పద్ధతిలో అతని ఆశావాదం నుండీ వర్గ నిర్ణాయక సిద్ధాంతం అవశేషాలనుండి పుట్టిన కప్పదాట్లు అనేకం ఉన్నాయని గుర్తించినప్పటికీ, మనిషిని మనిషిగా స్వీకరించే సోషలిస్టు ఆదర్శాన్ని మించిన రాజకీయ లక్ష్యం వేరే ఉండజాలదని ఒప్పుకోవలసిందే.

మిసిమి మాసపత్రిక
ఏప్రిల్ 2001

V

# ప్రజాస్వామ్య పునాదులపైనే సోషలిజం!

నేపాల్ రాజకీయ పరిణామాల గురించి చాలా వ్యాఖ్యలు వింటున్నాం. వాటన్నిటినీ సమీక్షించడానికి ఒక వ్యాసం సరిపోదు గానీ, నేపాలీ మావోయిస్టులకు లభించింది ఒక చారిత్రాత్మక అవకాశం అన్న విషయాన్ని - ఆ పార్టీతో సహా - ఎంత మంది గుర్తిస్తున్నారు?

ప్రతి చిన్న సందర్భాన్నీ చరిత్రాత్మకం అనడం జర్నలిజం పుణ్యాన అలవాటయి పోయింది కాబట్టి ఇది నిజమైన అర్థంలో చరిత్రాత్మకం అని వివరించాలి.

ప్రజలకు రాజకీయ ప్రజాస్వామ్యాన్ని నిరాకరించి సోషలిజం నిర్మించాలని చూస్తే అది సాగదన్నది 20వ శతాబ్దపు చరిత్ర నేర్పిన ముఖ్య పాఠాలలో ఒకటి. సోవియట్ రష్యాతో మొదలుపెట్టి యూరప్‌లోని అన్ని కమ్యూనిస్టు పాలిత రాజ్యాలూ పతనం కావడానికి ఏకైక కారణం రాజకీయ ప్రజాస్వామ్యం లోపించడమే కాకపోవచ్చు. అయితే ఆ తరువాత అక్కడ నెలకొన్న పాశ్చాత్య తరహా రాజకీయార్థిక వ్యవస్థలోని పెట్టుబడిదారీ అంశాన్ని ఆ దేశాల ప్రజలు త్వరలోనే నిరసించారు గానీ రాజకీయ ప్రజాస్వామ్యాన్ని నిరసించలేదు. మళ్లీ కమ్యూనిస్టు లేక సోషలిస్టు పార్టీల పాలనే కోరుకున్నప్పుడు కూడ వారికి వోట్లేసి ఎన్నుకున్నారే తప్ప వారికి నియంతలుగా పట్టం గట్టలేదు.

ఇక మీదట సోషలిజం నిర్మించే ప్రయత్నం ఎక్కడ జరిగినా అది ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారానే జరగక తప్పదు. ఒకవేళ ఒక కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటం ద్వారా అధికారానికి వచ్చినా అది సోషలిస్టు సమాజ నిర్మాణానికి సంబంధించిన కృషిని రాజకీయ ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ జరపవలసి ఉంటుంది. ఈ సందేశంతో పాటు, దీనికి అనుసరించవలసిన మార్గమేమిటన్న ప్రశ్నను 20వ శతాబ్దం వదిలి వెళ్ళింది.

దీనికి సంబంధించిన సిద్ధాంత చర్చ యూరప్‌లో ఎప్పటినుండో జరుగుతున్నది గానీ కమ్యూనిస్టు పార్టీలు బలంగా ఉన్న మనబోటి దేశాలలో ఎప్పుడూ జరగలేదు. ఇప్పుడూ జరగడం లేదు. అన్ని వైఫల్యాలకు బయట సామ్రాజ్యవాదం, లోపల రివిజనిజం కారణం అన్న విశ్లేషణ మన దగ్గర కమ్యూనిస్టు మేధావులకు సంతృప్తి నిస్తున్నది.

ఈ చర్చను చేసే అవకాశం, దానిని ఆచరణలో పెట్టి మంచిచెడులు గుర్తించే అవకాశం నేపాల్ మావోయిస్టులకు దక్కింది. దానికి కావలసిన విజ్ఞత వారిలో ఉందా అంటే తెలీదనే చెప్పాలి. వారిలో ఇంగ్లీష్ చదువులో కొంచెం ప్రపంచ చరిత్ర 'సిద్ధాంత విశ్లేషణా అలవడ్డవారు మన మార్క్సిస్టు పార్టీ నేతలైన యేచూరి, కారత్‌ల సహ విద్యార్థులనీ, వారు వీరి వద్ద రాజకీయ సలహాలు తీసుకుంటున్నారనీ వింటున్నాం. వీరి రాజకీయ విజ్ఞత ఏపాటిదో మనం చూస్తూనే ఉన్నాము కాబట్టి వీరి సహాధ్యాయుల నుండి ఆశించగలిగింది కొంచెమే. ఇకపోతే చదువుల కోసం ఢిల్లీకి రాకుండ నేపాల్ కొండలలోనే ఉండిపోయినవారు జీవిత అనుభవం నుండి, ప్రజలలో పనిచేసిన అనుభవం నుండి నేర్చుకున్న విజ్ఞత ఏమైనా ఉంటే అది ఇప్పుడు అక్కరకు రావచ్చు. కానీ దాని గురించి మనకేం తెలీదు.

రాజ్యాంగ పరిషత్‌లో అందరికంటె ఎక్కువ సీట్లు మావోయిస్టులకు దక్కాయి గానీ అది మొత్తంలో మూడవ వంతే. అయితే మరొక పెద్ద పార్టీ అయిన సిపిఎన్ (యుఎంఎల్)కు పాలన విధానాలకు సంబంధించిన చాలా విషయాలలో మావోయిస్టులతో ఏకాభిప్రాయం ఉండే ఉండాలి కాబట్టి, రాజ్యాంగ రచనలో వారితో జట్టుకట్టి మెలకువతో మెలిగినట్టయితే సోషలిజాన్ని పాలనా విలువగా వ్యవస్థీకరించే రాజ్యాంగం రాయవచ్చు. రాజ్యాంగాన్ని ఎప్పుడయినా సవరించిన ఈ మౌలిక విలువలకు విరుద్ధంగా తిరగరాయడానికి వీలు లేదన్న నియమం కూడ రాజ్యాంగంలో రాయవచ్చు. ఒకవేళ నేపాలీ కాంగ్రెస్ పార్టీ సోషలిస్టు నమూనా

రాజ్యాంగాన్ని రచించడానికే అడ్డు నిలుస్తే రెండు కమ్యూనిస్టు పార్టీలు ఆ పాయింటు మీదనే రాజీనామా చేసి రాజ్యాంగ పరిషత్‌కు మళ్లీ ఎన్నికలు జరిగే పరిస్థితి కల్పించవచ్చును.

కానీ నేపాల్ మావోయిస్టులు రాజ్యాంగ రచన కంటె ఎక్కువగా మధ్యంతర ప్రభుత్వం మీదనే దృష్టి పెడుతున్నట్టు కనిపిస్తుంది. దానిలో ఎవరికి ఏ పదవులుండాలన్నది ఒక ముఖ్య వివాదంగా ఉన్నట్టుంది. ఈ అభిప్రాయం నిజం కాకపోవచ్చు. వాస్తవాలు పత్రికలలో వార్తల రూపం తీసుకునే ప్రక్రియ నుండి పుట్టిన భ్రమ కావచ్చు. అయితే ప్రచండ అనే ఆ పార్టీ నాయకుడు ఇస్తున్న ఇంటర్వ్యూలు ఇదే అభిప్రాయం కలిగిస్తున్నాయి.

దానికి తోడు తమ 'ప్రజాసైన్యాన్ని' నిరాయుధీకరించడానికి నిరాకరించడం. అన్ని పార్టీలు ఎన్నికల రంగంలో సమానంగా పోటీ చేయడానికి, రేపు ఆమోదించబోయే రాజ్యాంగ నియమాలకు అనుగుణంగా పరిపాలించడానికి అంగీకరించినప్పుడు ఒకరి దగ్గర మాత్రం సైన్యం ఉండడం ఏ విధంగా సబబు? మొన్నటి ఎన్నికలలో మావోయిస్టులు 'ప్రజాసైన్యం' సహాయంతో వోట్లు పొందారన్న అభియోగం ఎవరూ వేయలేదు గానీ అ అనుమానం ఎప్పుడూ రాకుండ ఉంటుందన్న భరోసా ఏమిటి? ఒకవేళ ప్రస్తుతానికింకా ఇతరులు తమను సమానంగా చూస్తారని, గెలిస్తే పరిపాలించ నిస్తారని నమ్మకం లేనట్టయితే తమ సైన్యం నిరాయుధీకరణకొక గడువయినా సూచించాలి. ఎప్పటికీ ఒక రాజకీయ వ్యవస్థలో ఒక పక్షానికి సాయుధ బలగం ఉండడం ఎట్లా ఆమోదనీయం అవుతుంది? చట్టబద్ధ పాలనకు భరోసా ఏముం టుంది?

నిజానికి రాజ్యాంగ రచన తరువాత మావోయిస్టులు దృష్టి పెట్టవలసింది పరిపాలన పద్ధతుల మీద. సోషలిస్టు రాజ్యాంగాన్ని రాసుకున్నా దానిపట్ల పూర్తి ఏకీభావం లేని పార్టీలు కూడ రాజకీయ రంగంలో ఉంటాయి - సెక్యులర్ రాజ్యాంగం రాసుకున్న భారత రాజకీయ వ్యవస్థలో భారతీయ జనతా పార్టీ ఉన్నట్టు. వారు తమ పద్ధతులలో భ్రమలు కల్పించో భయాలు కల్పించో - ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. రాజకీయ ప్రజాస్వామ్యాన్ని స్వీకరించినప్పుడు వారి స్వేచ్ఛను అంగీకరించక తప్పదు. ప్రజాస్వామ్య పద్ధతులలోనే ప్రజలు వారివైపు ఆకర్షితులు కాకుండా అడ్డుకట్ట వేస్తూ ఉండాలి. మళ్ళీ మళ్ళీ సోషలిజాన్ని నిర్మించే సంకల్పం ఉండే పార్టీనే - ఒంటరిగానైనా ఉమ్మడిగానైనా - గెలిచేటట్టు చూసుకోవాలి.

దీనికి రాజకీయ మెలకువలు చాలా నేర్చుకోవాలి. అధికారం - ఆపైన ఆయుధాలు ఉన్నాయని ప్రజలమీద దాదాగిరీ చేసే బలహీనతకు లోను కాకూడదు. ఇప్పటికే మావోయిస్టు పార్టీకి అనుబంధమైన యువ కమ్యూనిస్టు లీగ్ కార్యకర్తలు దూకుడుగా నడుచుకోవడం మానుకోలేదన్న అభియోగాలు ఇతర పార్టీలు చేస్తున్నాయి. ఆ సంస్థను మావోయిస్టులు రద్దు చేయాలన్న ఇతర పార్టీల డిమాండు న్యాయమైనది కాదు. పార్టీకి యువజన సంఘం ఉండడంలో తప్పేమీ లేదు. అయితే వారు ప్రజాస్వామికంగా నడుచుకోవడం నేర్చుకోవాలి. దీని గురించి కూడ మావోయిస్టుల నుండి స్పందన లేదు.

నిజానికి ఆర్థిక రంగంలో తొలి దశలో అవసరమైన రాజీలకు మావోయిస్టులు ఇప్పటికే సిద్ధపడ్డారు. పెట్టుబడిదార్లపైన చర్యలేవీ తీసుకోమనీ, విదేశీ పెట్టుబడిని కూడ ఆహ్వానిస్తామనీ ప్రకటించారు. పెట్టుబడులు బాగా తక్కువ ఉన్న, సాంకేతికంగా వెనుకబడి ఉన్న దేశం నేపాల్. సాంకేతిక పురోగతి సాధించేంత వరకు విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం తప్పనిసరే కావచ్చు.

ఆర్థిక రంగంలో సోషలిస్టు లక్ష్యానికి భిన్నమైన ఈ రాజీలకు సిద్ధపడే విజ్ఞత ప్రదర్శించిన వారు, రాజకీయ రంగంలో సోషలిస్టు భావనలో భాగం కాక తప్పని రాజకీయ ప్రజాస్వామ్యం విషయంలో అదే విజ్ఞత ప్రదర్శించడం లేదన్న అభిప్రాయం నిజమైతే అది దురదృష్టకరమే. కానీ ఆ సందేహం మాత్రం బలంగా కలుగుతున్నది. పరిపాలించినంత కాలం పోరాట దశలో అలవాటయిన పద్ధతులతో సాగించుకోవడం, మళ్ళీ ఎన్నికలొస్తే అదే పద్ధతులలో గెలిచే ప్రయత్నం చేయడం, అది సాధ్యం కాకపోతే రాజకీయ వ్యవస్థ నుండి వైదొలగి 'మమ్మల్ని కొనసాగ నివ్వలేదు' అన్న నింద వేయడం - ఈ ఎత్తుగడ నేపాల్ మావోయిస్టుల మనస్సులలో ఉందా? అందుకోసమేనా 'ప్రజా సైన్యాన్ని' రద్దు చేయడానికి నిరాకరిస్తున్నారు?

ప్రజాతంత్ర
18 మే 2008

V

# ఫ్రాయిడ్

చాలామందికి మామూలుగా తెలిసిన విషయం ఏమిటంటే మనిషి ప్రవర్తనను, మనిషి స్వభావాన్ని వాటిని నిర్ణయించడంలో ఫ్రాయిడ్ లైంగిక సంతృప్తికి చాలా ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చాడు అని. ఒక అర్థంలో అది నిజం కావచ్చును కాని, ఆ మాత్రమే అర్థం చేసుకుంటే అది పూర్తిగా వక్రీకరణ అవుతుంది. అంతే కాకుండా లైంగిక సంతృప్తికి ఫ్రాయిడ్ ఇచ్చిన ప్రాముఖ్యాన్ని పూర్తిగా పక్కనపెట్టినా, ఆయన ఆలోచనలు చాలా విలువైనవి. ఆయన అన్న ఒక ప్రధానమైన విషయం ఏమిటంటే మనిషి శరీరానికి ఒక నిర్మాణం ఉన్నట్టే, మనసుకు కూడా ఒక నిర్మాణం ఉందని శరీర నిర్మాణాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసినట్లే మనసు నిర్మాణాన్ని కూడా శాస్త్రీయంగా అధ్యయనం చేయవచ్చునని. అన్నప్పుడు మామూలుగా మనం కొన్ని భావాలు, కొంత ఉద్విగ్నత, ద్వేషాలు, మంచీ చెడూ ఇవే అనుకుంటాం అవే కాదు. శరీరంలాగానే మనసు కూడా ఒక నిర్మాణ యుతమైనటువంటి వస్తువు, దానినీ శాస్త్రీయంగా అధ్యయనం చేయవచ్చునని చెప్పాడు. చాలా కీలకమైన అంశం ఏమిటంటే ఆంతరంగిక జీవికి (అంటే మనస్సుకు) బాహ్య పరిస్థితుల నుండి వచ్చేటటువంటి ఒత్తిడులు, విలువలు, ప్రమాణాలు, ఆ రెండింటి మధ్య ఉండే ఘర్షణ, చర్య ప్రతిచర్య - ఇవి మనిషి వ్యక్తిత్వాన్ని రూపొందిస్తాయి. అంటే ఈ చర్య, ప్రతిచర్య, సంఘర్షణ అనేవి

సమతుల్యంగా సాగితే మనిషి నిండుగా ఎదగడం జరుగుతుంది. ఆ చర్య ప్రతిచర్య సంఘర్షణ సంక్షోభంలో పడితే మనిషిలో విధ్వంసకరమైనటువంటి లక్షణాలు పైకి వస్తాయి. లేదా మనము మామూలుగా పిచ్చి, ఉన్మాదం అంటామే. ఆ రూపం కూడా తీసుకోవచ్చును. దాన్నే విపరీత ప్రవర్తన అని కూడా అంటుంటారు.

ఫ్రాయిడ్ ప్రకారం ఆంతరంగిక జీవిని నిర్ణయించేది, నిర్వచించేది లైంగిక సంతృప్తి, ఆ సంతృప్తికి బాహ్య సమాజం ఇచ్చేటటువంటి, ఇవ్వనటువంటి అవకాశం. ఈ అభిప్రాయాన్ని పూర్తిగా పక్కన పెట్టినా - అది కొంత నిజం కావచ్చు, కొంత అతిశయోక్తి కావచ్చు, కొంత సమకాలీన యూరోపియన్ సమాజం యొక్క లక్షణాలను ఆయన సార్వజనీకరించడం కూడా కావచ్చు. కానీ దానిని పూర్తిగా పక్కన పెట్టినా సరే నిర్మాణయుతమైన ఆంతరంగిక జీవికి బాహ్య పరిస్థితుల నుంచి వచ్చే విలువలకు, ప్రమాణాలకు మధ్య వచ్చే ఘర్షణ మనిషి వ్యక్తిత్వాన్ని రూపొందిస్తుందని, ఆ ఘర్షణ లేదా ఆ చర్య - ప్రతిచర్య సఫలం అయినప్పుడు, అంటే అది సమతుల్యంగా సాగినప్పుడు మనుషులు మొత్తం మీద నిండుగా ఉంటారని చెప్పడం విలువైన ఆలోచన. అద్భుతమైన దేవతల్లాగా కాదు, నిండుగా ఉంటారని. ఏ కారణంగానైనా అది సంక్షోభంలో పడితే విధ్వంసం, వైపరీత్యం ముందుకొస్తాయి అనేది చాలా విలువైనటువంటి ఆలోచన. ఇవ్వాళ మనం, ముఖ్యంగా సమకాలీన సమాజంలో చాలా ఎక్కువ విధ్వంసం చూస్తున్నాము. 20వ శతాబ్దపు రెండవ భాగం నుంచి మొదలుపెడితే ఇవ్వాల్టి దాకా చాలా విధ్వంసం చూస్తున్నాము. ఇది ఎక్కడనుంచి వస్తోంది అన్న ప్రశ్న వేసుకుంటే నేను అనుకుంటాను లైంగికత విషయం పూర్తిగా పక్కనబెట్టినా ఫ్రాయిడ్ రూపొందించినటువంటి ఆ ప్రాథమిక మోడల్ ఏదైతే ఉందో అది (ఆ విధ్వంసం మూలాలను తెలుసుకోవడానికి) చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

టీవీ9లో ప్రసారమైంది
6 మే 2006

V

# అనుబంధం

## కె.వి. రమణారెడ్డి లేఖ

Vijayawada
22.1.1997

Dear Sri Balagopal,

Namaste. I hope and trust that this finds you all in good cheer. I owe an explanation to you.

I write this to explain my remark about you as an 'anti-communist' in concluding my speech in the Virasam patasala, held recently during the Pongal vacation. After having dwelt at length on Russian literature I launched a tirade against Stalinist excesses and also against the failures of 'Socialist Realism' to reflect the aberrations of the so-called Dictatorship of the Proletariat which, in practice, came to personal tyranny of Stalin. What should have led to a 'semi-state', Dictatorship of the Proletariat degenerated into a totalitarian State, which was not reflected in socialist realist literature. Lest I be misunderstood by the audience as sharing your explicit views about Marxism in general, I concluded my speech by saying that our philosophical positions regarding the Dictatorship of the Proletariat are identical or similar, I

had to say that I am a firm believer in communism, which you are not any longer. The correspondent of Andhraprabha took this point and gave it a lead saying that KVR called Balagopal an anti-communist. After seeing it the next day, I went up to the dais again and said that our philosophical positions are different and even contradictory, at the same time expressing my utmost regard for you as a remarkable intellectual and a great civil liberties activist. I abhor as much as you do the Naxalite excesses in the name of 'revolutionary violence' even though I continue my commitment to Naxalism and PW.

Please remember me to Mrs. Vasantha Lakshmi and my kisses to your son Prabhatha.

With kind regards

Sincerely,
KVR
(K.V. Ramana Reddy)

v

## అనుబంధం

# బాలగోపాల్ స్పందన

21.2.1997

కె.వి.రమణారెడ్డిగారికి

నమస్తే...మీ ఆరోగ్యం బాగుందా?

మీ ఉత్తరం చదివి నేను మొదట ఆశ్చర్యపోయాను. ఎందుకంటే మీరు నా గురించి ఏదో అన్నట్టు పత్రికలలో వచ్చిన సంగతి నాకు తెలీదు. ఆ తరువాత అడిగి తెలుసుకున్నాను.

నన్ను కమ్యూనిస్టు వ్యతిరేకి అన్నా, మార్క్సిస్టు వ్యతిరేకి అన్నా నాకు చింతా లేదు, సంతోషమూ లేదు. మీరు అనకపోయినా విరసం సభ్యులు చాలామంది అనుకుంటున్నారు. పరవాలేదు. 'మా పక్షాన లేని వాళ్లంతా మా శత్రువులే' అనే తాత్విక వైఖరి ఉన్నవాళ్లకు మూడవ అభిప్రాయం ఒకటి ఉండగలదన్న ఆలోచన సాధ్యం కాదు కాబట్టి వాళ్ల అభిప్రాయాల గురించి బాధపడడం అనవసరం.

నేను పార్లమెంటరీ డెమోక్రసీనీ, పెట్టుబడిదారీ వ్యవస్థనూ సమర్థిస్తున్నానని మీరన్నారని మాత్రం విరసం సభలకు హాజరయిన వారొకరు అన్నారు. నాకు పెట్టుబడిదారీ వ్యవస్థ అంటే అసహ్యం. దానిని మానవ జాతి ఏ విధంగా అధిగమిస్తుందో ఎవ్వరికీ తెలీదని నేను అనుకుంటున్నాను. మార్క్సిజం పెట్టుబడిదారీ వ్యవస్థను విమర్శించడానికి పనికి వచ్చినంతగా దానిని అధిగమించడానికి పనికిరాదని ఈ శతాబ్దం చరిత్ర రుజువు చేసిందని నా అభిప్రాయం. అది ఏ విధంగా జరగగలదో అర్థం చేసుకోవడానికి మూలాల నుండి పునరాలోచించాలని నేను అనుకుంటున్నాను. దీనికి జవాబు దొరుకుతుందని హామీ ఏమీ లేదు. అయినప్పటికీ అన్వేషణ జరపవలసిందే. పెట్టుబడిదారీ వ్యవస్థతో సరిపెట్టుకోవడం అంటే మానవ జీవితాన్ని

అనైతిక స్థాయిలో ఉంచివేయడమే. మనుషుల మధ్య 'ఉపయోగం' అనేది తప్ప వేరే విలువలేవీ లేని జీవితంతో సరిపెట్టుకోవడమే. ఇది తగదని నా అభిప్రాయం.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విషయం వేరు. అందులోని ప్రాతినిధ్య పాలన అనే సూత్రం చాలా విలువైనదనీ, దానంతటదే 'బూర్జువా' లక్షణం కాదనీ నేను నమ్ముతున్నాను. దానిని మెరుగుపరచుకోవడంలోనే భవిష్యత్తు ఉంది తప్ప తిరస్కరించడంలో లేదని నేను నమ్ముతున్నాను. 'కార్మిక నియంతృత్వం' అనేది కూడ నిజంగా కార్మికుల పాలన కావాలంటే కనీసం కార్మికులయినా ఓటువేసి ఆ ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు ఉండాలి. కాకపోతే, ప్రాదేశిక నియోజకవర్గాల బదులు ఉత్పిత్తి చేసే స్థలాన్ని బట్టి లేదా ఉత్పత్తి రంగాన్ని బట్టి నియోజకవర్గాలు ఏర్పాటు చేయవచ్చు. అయినా అటువంటి రాజకీయ వ్యవస్థకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం లక్షణాలు చాలా ఉంటాయి. ఓటుహక్కు ఇచ్చిన తరువాత ఒక పార్టీకి మాత్రమే ఓటు వేయాలనడంలో అర్థం లేదు. అంటే అది ఏదో ఒక రూపంలో బహుళ పార్టీ వ్యవస్థ కావాలి. కమ్యూనిస్టు పార్టీయేకాక ఇతర పార్టీలకు కూడ ఉనికిలో ఉండే హక్కు ఉండాలి. కమ్యూనిజం నిజంగానే కార్మికులు అధికంగా ఆశించే లక్ష్యం అయినట్టయితే ఆ బహుళ పార్టీ వ్యవస్థ కమ్యూనిజానికి భిన్నంగా పోకుండా ఉంటుంది. కానీ కార్మికుల మీద కమ్యూనిస్టులకు ఆ నమ్మకం లేదు కాబట్టే కమ్యూనిస్టేతర పార్టీల ఉనికే లేకుండా చేసారు! ఒక్క పార్టీయే ఉండాలనుకున్నప్పుడు ఓటు హక్కు ఇచ్చి ఏం ప్రయోజనం? కాబట్టి అది కూడ లేకుండ పార్టీ నియంతృత్వం నెలకొల్పారు. బహుళపార్టీ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పి, కమ్యూనిజం పట్ల బలమైన సామాజిక కాంక్షను నిత్యకృషి ద్వారా నిలబెట్టగలిగితేనే సోషలిజం సాధ్యం అవుతుంది. అంతే తప్ప స్టాలినిజం తప్పు గానీ కార్మిక నియంతృత్వం రైటే ననడంలో అర్థం లేదని నా అభిప్రాయం.

ఉంటాను.

మీ
బాలగోపాల్

V

# బాలగోపాల్ రచనలు

## పర్‌స్పెక్టివ్స్

1. Probings in the Political Economy of Agrarian Classes & Conflicts - మే 1988
2. కల్లోల కథా చిత్రాలు - డిసెంబర్ 1997
3. రాజ్యం - సంక్షేమం - అక్టోబర్ 2010
4. దళిత - అక్టోబర్ 2011
5. మనిషి మార్క్సిజం - అక్టోబర్ 2012

## మానవ హక్కుల వేదిక

1. హక్కుల ఉద్యమం - తాత్విక దృక్పథం - అక్టోబర్ 2010
2. ఆ శిక్షే ఒక నేరం - ఏప్రిల్ 2012
3. Of Capital And Other Punishments - అక్టోబర్ 2012

## దేవులపల్లి పబ్లికేషన్స్

1. నిగాహ్ - ఏప్రిల్ 2011

## హైదరాబాద్ బుక్‌ట్రస్ట్

1. ప్రాచీన భారతదేశ చరిత్ర - సెప్టెంబర్ 1986
   డి.డి. కోశాంబి పరిచయం
2. కల్లోల లోయ - జనవరి 2007
   50 ఏళ్ళ కశ్మీర్
3. మతతత్వం పై బాలగోపాల్ - అక్టోబర్ 2010
4. రూపం - సారం - అక్టోబర్ 2011
   సాహిత్యంపై బాలగోపాల్

## మట్టి ముద్రణలు

1. జలపాతాలు - జనవరి 2013

## స్నేహ ప్రచురణలు

1. రూపం - సారం - ఏప్రిల్ 1986

## NAVAYANA

1. EAR TO THE GROUND - 2011
   selected writings on class & caste

---

ఇవి కాక ఇంగ్లిష్ తెలుగు భాషల్లో వివిధ అంశాల మీద బాలగోపాల్ రచనలు కొన్ని బుక్‌లెట్స్‌గా వెలువడ్డాయి.

# పర్‌స్పెక్టివ్స్ ఎందుకోసం

**మా**నవజాతి భవిష్యత్తును గురించి ఇవ్వాళ చాలా చర్చ జరుగుతూ ఉంది. ఏ రకమయిన అసమానతగానీ, అణచివేతగానీ లేని సమాజం కావాలని అభ్యుదయవాదులందరూ కోరుకుంటారు. కానీ ఆ సమాజ స్వరూప స్వభావాలను గురించి ఏకాభిప్రాయం మట్టుకు అభ్యుదయవాదులలో సర్వత్రా లేదు. మార్క్స్ రచనలతో ఒక ప్రామాణికమయిన రూపం తీసుకున్న చర్చ ఈనాటికీ ముగియలేదు. అణచివేతలోనూ అసమానతలోనూ కొత్త కోణాలను చరిత్ర ముందుకు తెచ్చేకొద్దీ చర్చ మరింత వాడిగా సాగుతూ ఉంది. మరింత జటిలం అవుతూ ఉంది. కొత్త కోణాలలో కొన్ని నిజానికి చాలా పాతవే కావడంతో వాటిని ఇన్నాళ్ళూ ఎందుకు చూడలేకపోయామన్న విమర్శ చర్చకు కొంత వేడిని కూడా చేరుస్తూ ఉంది.

ఆ చర్చలో అనేక రకాల దృక్పథాలు గల వ్యక్తులు పాల్గొంటున్నారు. అనేక ఉద్యమాలు పాల్గొంటున్నాయి. అసమానతకూ, అణచివేతకూ కొత్త కోణాలను ఆవిష్కరించేవారు, ఇప్పటికే ఉన్న విప్లవ సిద్ధాంతాలు వాటిని ఆకళింపు చేసుకోలేవనే వారు, అసలు కొత్త కోణాల ఆవిష్కరణే నిరుపయోగ మయిన ప్రయాస అనుకునేవారు, ఇప్పటికి ఉన్న సిద్ధాంతాలే సామాజిక జీవితంలోని అన్ని పార్శ్వాలనూ అవగాహన చేసుకోగలవనుకునే వారు, అసలు 'సిద్ధాంతం', 'నిర్మాణం' అనేవే మానవజాతి వికాసానికి అవరోధం అనుకునే వారు, అభ్యుదయం కోసం ఇప్పటిదాకా జరిగిన ప్రయత్నమంతా వృథా అనుకునేవారు, దాని మంచి చెడుల నుండి గుణపాఠాలు తీసుకోగల మనుకునేవారు, రాజకీయ ఆచరణలో నిమగ్నం అయినవారు, ఆచరణతో నిమ్మిత్తం లేనివారు...ఇంకా అనేకులు ఇవాళ మానవ భవితవ్యాన్ని గురించిన ఈ చర్చలో పాల్గొంటున్నారు.

ఈ చర్చకు సంబంధించి 'పర్‌స్పెక్టివ్స్'కు ఒక దృక్పథం ఉంది. మానవ సమాజం గురించీ దాని భవిష్యత్తు గురించీ బుద్ధుడి నుండి ఈనాటిదాకా అనేకులు ఊహలు చేశారు. సిద్ధాంతాలు చేశారు. ఎవ్వరూ కాదనలేని ఆదర్శాలు మన ముందుంచారు. ఆ ఆదర్శాలను సాధించే మార్గాలను ప్రతిపాదించారు. ఈ అన్వేషణకు శాస్త్రీయ ప్రాతిపదిక కల్పించి నేలమీద నిలబెట్టింది మార్క్సిజం. మార్క్స్ రచనలు చేయడం మొదలు పెట్టిన తరువాత చర్చ యావత్తూ ఆయన

ప్రతిపాదించిన అధ్యయన చట్రం చుట్టూ పరిభ్రమిస్తూ ఉంది. అంగీకరించేవాళ్ళూ, సవరించేవాళ్ళూ, తిరస్కరించే వాళ్ళూ అందరూ దానినే ప్రమాణంగా స్వీకరించారు. ఇవ్వాళ తూర్పు యూరప్, సోవియట్ రష్యా, చైనా దేశాలలో వస్తూన్న మార్పుల ఫలితంగా చెలరేగుతున్న చర్చ స్వభావం కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఇకమీదట ఉండబోతుందని మేము అనుకోవడం లేదు.

ఇప్పటికీ సిద్ధాంతం ఆచరణలకి సంబంధించిన సమస్యలని మార్క్సిజం అధిగమించిందని చెప్పలేం. పాత సమస్యలు పరిష్కరించుకునే క్రమంలో కొత్త సవాళ్ళు మార్క్సిజం ముంగిట కొస్తున్నాయి. కొత్త నిర్వచనాలు, కొత్త ప్రతిపాదనలు, ప్రత్యామ్నాయాలు రూపొందుతున్నాయి. సామాజిక పరివర్తన కోసం జరుగుతున్న మొత్తం చర్చలో భాగమే మార్క్సిజం గురించిన చర్చ కూడా. ఈ చర్చలో అన్ని కోణాలకూ అన్ని పోకడలకూ వేదిక కల్పించాలని 'ప ర్ స్పె క్టి వ్స్' భావిస్తూ ఉంది. ఆర్థిక పరిమితుల వల్ల అన్ని పుస్తకాలు ప్రచురించ వీలుకాకున్నా, ఆ దిశగా చర్చను ప్రతిపాదించే పుస్తకాలను ప్రచురించాలనుకుంటున్నాం.

అణచివేతనూ, అసమానతనూ వ్యతిరేకించేది ఏదయినా ప్రజాస్వామిక దృక్పథమే. మౌలికంగా అభ్యుదయ దృక్పథమే. ఆపైన ఎన్ని తేడాలున్నా వినదగినదే, చర్చించదగినదే, అధ్యయనం చేయదగినదే. ***'నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ'*** అని మావో ఒక చారిత్రక సందర్భంలో ఇచ్చిన పిలుపుకు ఈ నిర్దిష్టమయిన అర్థంలో సార్వత్రిక ప్రాతిపదిక ఉందని 'ప ర్ స్పె క్టి వ్స్' భావిస్తూ ఉంది. ఆ అవగాహనతో ప్రచురణలు చేపడుతోంది. ప్రజాస్వామిక స్వభావం కలిగిన సమర్థవంత మయిన రచనలను ఎక్కువగా తెలుగులో, వీలున్నప్పుడు ఇంగ్లీషు, హిందీలో కూడా ప్రచురించడం ద్వారా కొనసాగుతున్న 'గ్రేట్ డిబేట్'కు దోహదం చేయాలని మా సంకల్పం.

మే
1999

**కె. బాలగోపాల్**
ప ర్ స్పె క్టి వ్స్
సామాజిక శాస్త్రం / సాహిత్యం
హైదరాబాదు

# 1988 నుంచి 2012

# ప ర్ స్పె క్టి వ్స్ ప్రచురణలు

| | | | |
|---|---|---|---|
| O | 1. Probings in the Political Economy of Agrarian classes and Conflicts - | May 1988 | by K. Balagopal<br>Ed. G. Haragopal |
| O | 2. సహచరులు - | జూలై 1989 | వరవరరావు |
| O | 3. పతంజలి భాష్యం - | జూలై 1989 | కె.ఎన్.వై. పతంజలి |
| O | 4. సృజన సంపాదకీయాలు | జనవరి 1990 | వరవరరావు/సాహితీ మిత్రులు |
| O | 5. అభివృద్ధి వెలుగునీడలు | మే 1990 | ఆర్.ఎస్.రావు |
| O | 6. కఠోర షడ్జమాలు - | తొలి ముద్రణ 1990<br>మలి ముద్రణ 1996 | వసంత కన్నబిరాన్ |
| O | 7. మతవర్గ తత్వం - | ఫిబ్రవరి 1991 | ఎడిటర్స్ : హరి, జి. హరగోపాల్ |
| O | 8. ఇలా మిగిలేం - | తొలి ముద్రణ 1991<br>మలి ముద్రణ 1993 | చలసాని ప్రసాదరావు |
| O | 9. పరాధీన భారతం | తొలి ముద్రణ 1992<br>మలి ముద్రణ 1993 | ఎ.బి.కె. ప్రసాద్ |
| O | 10. డంకెల్ దుశ్శాసనం | జూన్ 1993 | నూర్ భాషా |
| O | 11. దినదినగండం | సెప్టెంబర్ 1993 | అనువాదం :<br>కోదండ రామిరెడ్డి |
| O | 12. మన చలం - | మే 1994 | ఎడిటర్ : కృష్ణాబాయి |
| | 13. Towards Understanding Semi Feudal Semi Colonial Society | Jan 1995 | by R.S. Rao<br>Ed. D. Narasimha Reddy |
| O | 14. ఏడోసారా కథ | జూలై 1995 | బుర్ర రాములు |
| O | 15. శాక్కో - వాంజెట్టి | నవంబర్ 1995 | బి. చంద్రశేఖర్ |
| O | 16. బంగారమ్మ కథ | జనవరి 1996 | అనువాదం - కృష్ణాబాయి |

| | | | |
|---|---|---|---|
| O | 17. కార్టూన్ కబుర్లు - | సెప్టెంబరు 1996 | మోహన్ |
| | 18. నాకో పిస్తోల్ కావాలి - | అక్టోబర్ 1996 | అనువాదం : చలసాని ప్రసాదరావు |
| | 19. సాహిత్యంలో వస్తు శిల్పాలు | మార్చ్ 1997 | త్రిపురనేని మధుసూదనరావు |
| O | 20. కల్లోల కథా చిత్రాలు | డిసెంబర్ 1997 | కె. బాలగోపాల్<br>ఎడిటర్ : చలసాని ప్రసాద్ |
| O | 21. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంస్కరణలు/ ప్రపంచబ్యాంక్ ఎజెండా | మార్చ్ 1998 | ఎడిటర్ : డి. నరసింహారెడ్డి |
| O | 22. మూడు దశాబ్దాల నక్సల్బరీ గమ్యం-గమనం | తొలి ముద్రణ ఆగస్ట్ 98<br>మలి ముద్రణ అక్టోబర్ 98 | ఎడిటర్స్ : ఎస్. సుధాకర్, ఎం. కోదండరామిరెడ్డి |
| O | 23. పరాధీన భారతంలో దారితప్పిన రూపాయి | డిసెంబర్ 98 | ఎ.బి.కె. ప్రసాద్ |
| O | 24. శారద నవలలు (ఏది సత్యం, మంచీ-చెడు, అపస్వరాలు) | ఆగస్ట్ 99 | శారద (ఎస్. నటరాజన్) |
| O | 25. సింగరేణి | నవంబర్ 2000 | ఎం.డి. మునీర్ , ఎం.డి. అన్వర్ |
| O | 26. ఖాదర్ లేడు | మే 2001 | మహమ్మద్ ఖదీర్ బాబు |
| O | 27. ప్రమాదంలో ప్రజారోగ్యం | ఫిబ్రవరి 2002 | డా॥ ఎస్. తిరుపతయ్య<br>డా॥ పి. జగదీశ్వర్ |
| O | 28. ఎన్జీవోల కథ | జనవరి 2003 | బి. చంద్రశేఖర్ |
| O | 29. జాగ్తే రహో | జూన్ 2003 | చలసాని ప్రసాదరావు<br>ఎడిటర్ : డి. వెంకట్రామయ్య |
| O | 30. ఉదయగీతిక (రెండవ కూర్పు తొలిముద్రణ) | డిసెంబర్ 2003 | రచన - యాంగ్ మో<br>అనువాదం : ఎన్. వేణుగోపాల్ |
| O | 31. వరల్డ్ సోషల్ ఫోరం | జనవరి | **RUPE (MUMBAI)** |

| | | |
|---|---|---|
| ఆర్థిక రాజకీయాలు | 2004 | అనువాదం : బి. చంద్రశేఖర్ |
| O 32. ఎర్రమందారాలు | మే | రచన-లోకువాంగ్-పిన్ |
| (రెండవ కూర్పు | 2005 | యాంగ్ యీ-యెన్ |
| తొలి ముద్రణ) | | అనువాదం : డా॥ టి.నళిని |
| O 33. నూరేళ్ళ తెలుగు | ఆగస్ట్ | సహవాసి |
| నవల (1878-1977) | 2007 | సంపాదకులు- డి. వెంకట్రామయ్య |
| 34. అల్లంరాజయ్య | జనవరి | అల్లం రాజయ్య |
| సాహిత్యం -1 | 2008 | సంపాదకులు-వరవరరావు |
| మూడు నవలలు- | | |
| 35. విభిన్న | ఆగష్టు 2008 | హరిపురుషోత్తమరావు |
| 36. పతంజలి భాష్యం | మార్చ్ 2009 | కె.ఎన్.వై.పతంజలి |
| 37. మృగన | ఏప్రిల్ 2009 | విమల |
| 38. రాజ్యం - సంక్షేమం | అక్టోబర్ 2010 | కె. బాలగోపాల్ |
| 39. అల్లం రాజయ్య | ఏప్రిల్ 2011 | అల్లం రాజయ్య |
| సాహిత్యం-2 | | సంపాదకులు-వరవరరావు |
| సృష్టికర్తలు (కథలు) | | |
| 40. సంభాషణ | జులై 2011 | కె. శ్రీనివాస్ |
| 41. దళిత | అక్టోబర్ 2011 | కె. బాలగోపాల్ |
| 42. జాజిమల్లి (మొదటి ముద్రణ) | డిసెంబర్ 2011 | మల్లీశ్వరి |
| (రెండవ ముద్రణ) | ఏప్రిల్ 2012 | |
| 43. త్రిపుర (కథలు) | డిసెంబర్ 2011 | త్రిపుర |
| 44. ప్రాణహిత (మొదటి ముద్రణ) | జులై 2012 | అల్లం నారాయణ |
| (రెండవ ముద్రణ) | సెప్టెంబర్ 2012 | |
| 45. మనిషి మార్క్సిజం | | కె. బాలగోపాల్ |
| (మొదటి ముద్రణ) | అక్టోబర్ 2012 | |
| (రెండవ ముద్రణ) | డిసెంబర్ 2012 | |

**Perspectives**
***Social Sciences / Literature***
**Publishing *for* Change**




**manishi marxism**
essays in telugu
reflections on human agency,
social movements & marxism *by* k. balagopal

నాకు పెట్టుబడిదారీ వ్యవస్థ అంటే అసహ్యం. దానిని మానవ జాతి ఏ విధంగా అధిగమిస్తుందో ఎవ్వరికీ తెలీదని నేను అనుకుంటున్నాను. మార్క్సిజం పెట్టుబడిదారీ వ్యవస్థను విమర్శించడానికి పనికి వచ్చినంతగా దానిని అధిగమించడానికి పనికి రాదని ఈ శతాబ్దం చరిత్ర రుజువు చేసిందని నా అభిప్రాయం. అది ఏ విధంగా జరగగలదో అర్థం చేసుకోవడానికి మూలాల నుండి పునరాలోచించాలని నేను అనుకుంటున్నాను. దీనికి జవాబు దొరుకుతుందని హామీ ఏమీ లేదు. అయినప్పటికీ అన్వేషణ జరపవలసిందే.

పెట్టుబడిదారీ వ్యవస్థతో సరిపెట్టుకోవడం అంటే మానవ జీవితాన్ని అనైతిక స్థాయిలో ఉంచి వేయడమే. మనుషుల మధ్య 'ఉపయోగం' అనేది తప్ప వేరే విలువలేవీ లేని జీవితంతో సరిపెట్టుకోవడమే. ఇది తగదని నా అభిప్రాయం.

కె. బాలగోపాల్



**Perspectives**
Social Sciences/Literature
Publishing *for* Change

₹ 100/-

ISBN 978-93-81172-02-5